# కథా కౌముది

2018 - Part 1





శ్రీ కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 202



కౌముది మాసపత్రికలో

2018 జనవరి నుంచి జూన్ 2018

వరకూ

వచ్చిన కథలు

| క్రమసంఖ్య | కథపేరు | రచయిత(త్రి)పేరు | పేజి |
|---|---|---|---|
| 1 | హితుడా? వ్యామోహితుడా? | మోచర్ల అనంతపద్మనాభరావు | 4 |
| 2 | పరిష్కారం | సి.యమున | 8 |
| 3 | ఓ మూగమనసా! | వారణాసి నాగలక్ష్మి | 11 |
| 4 | దిష్టి | విద్యార్థి | 14 |
| 5 | శిశుపాలిక | తుమ్మూరి రామ్మోహనరావు | 23 |
| 6 | ఒక నాన్నకి ఒక అమ్మ బహుమతి | పిడపర్తి భారతి | 28 |
| 7 | పాతాళం | రవి కొప్పరపు | 34 |
| 8 | నిచ్చెన మెట్లు | ఎలక్ట్రాన్ | 37 |
| 9 | ఉభయకుశలోపరి | ఇంద్రగంటి శ్రీనివాస శాస్త్రి | 41 |
| 10 | గౌరవం | ఫణీంద్ర కామిరెడ్డి | 46 |
| 11 | అంతర్మధనం | మొలుగు కమలాకాంత్ | 49 |
| 12 | ఐస్ బాక్స్ బతుకులు | అనురాధ (సుజల గంటి) | 52 |
| 13 | సంఘం శరణం గచ్ఛామి | పద్మజ కుందుర్తి | 56 |
| 14 | ద్వితీయ వలయం | డా. కొండపల్లి రామారావు | 61 |
| 15 | అంతర్మధనం | తాళ్ళూరి చంద్రశేఖర్ | 67 |
| 16 | చిత్తశుద్ధి | సునీల్ ధవళ | 70 |
| 17 | ఉపకారికి అపకారం | అగస్త్యప్రగడ హేమంత | 75 |
| 18 | పురస్కారం | సింహప్రసాద్ | 80 |
| 19 | ఈష | విద్యార్థి | 82 |
| 20 | ఒకే కథ - ఎన్నో ముఖాలు | గొల్లపూడి మారుతీరావు | 89 |

# హితుడా?వ్యామోహితుడా? మోచర్ల అనంతపద్మనాభరావు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

"ఒరేయ్..." స్నేహపూర్వకమైన ఆప్యాయితతో పిలిచిన ఆ కంఠస్వరం నాకు బాగా అలవాటైనది. ఎన్నో ఏళ్ల తర్వాత వినబడిన ఆ గొంతు నన్నొకింత విస్మయానికి గురిచేసింది. విద్యార్థిగా ఉన్నపుడు నాటకరంగాన్ని ఒక ఊపు ఊపిన ఆ కంఠం తాలూకా వ్యక్తికోసం చూసాను. రామ్మూర్తి కొడుకు పెళ్ళికి అతిధులను రిసీవ్ చేసుకునే డ్యూటీ నాకప్పగించాడు. స్నేహితులతో, చుట్టాలతో ఫంక్షన్ హాలు చాలా సందడిగా ఉంది.

నేను వెదుకుతున్న వ్యక్తి నా ఎదురుగా....వాడే వర్మ.!! గతం సినిమా రీలులా గిర్రున వెనక్కి తిరిగింది.....

"లతా! నిన్ను చూస్తూంటే నాకు జాలేస్తోంది, నీ అందాన్ని చూస్తూంటే ఆకలేస్తోంది. శృంగారభరితమైన నీ శరీరంలోని అణువణువును స్పృశిస్తూ వర్ణించాలనుంది, ఆనందంగా అనుభవించాలనుంది. నిను వర్ణించడానికి నేనో షేక్స్పియర్నో, షెల్లీనో అవ్వాలి. కానీ, ఐ యాం పూర్ ఇన్ ఇంగ్లిష్...బట్...యూ నో! ఐ యాం రిచ్ ఇన్ రొమాన్స్. హా..హా..." వికటాట్ట హాసం చేస్తూ, "అందుకే నిన్ననుభవించాలనుకున్నా. కానీ...నువ్వు...నువ్వు.. శీల మంటున్నావ్, సమాజ మంటున్నావ్, స్త్రీ పురుషుల కలియిక పవిత్రమంటున్నావ్...శీలాన్ని పోగొట్టుకోడానికి సిద్ధంగా లేనంటున్నావ్. ఇంకా ఏవేవో పెద్ద పెద్ద మాటలు చెబ్తున్నావ్. ఓకే లతా! ఒకటడుగుతాను చెప్పు? నువ్వంటున్న శీలం మన శరీరాల్లో ఎక్కడుంటుందో చెప్పు? అదేమైనా అవయవమా? వస్తువా? పోగొట్టుకోడానికి? ఆకలితో అలమటిస్తూ అనాధవైన నిన్ను ఎవరు ఆదుకున్నారు? నీ శీలమా? సమాజమా? ఎవరు....? నేను కాదా? ఆరోజు నీ క్షుద్బాధను తీర్చిన నేను ఈరోజు నా బాధను తీర్చమని అడిగినందుకు నీతి వాక్యాలు వల్లిస్తున్నావు. ఒక స్త్రీ, ఒక పురుషుడు ఏ బంధం లేకుండా కలిస్తే అపవిత్రం. బంధంతో కలిస్తే పవిత్రమా? ఆ పవిత్రబంధం వాళ్ళ జీవితాంతం కొనసాగడానికి కావాల్సిన భరోసా ఈ సమాజ మిస్తుందా? చెప్పు లతా. నువ్వు చెప్పలేవు. నువ్వే కాదు ఎవరూ చెప్పలేరు. కానీ, నే చెబ్తున్నా విను. ఆ పవిత్రబంధం లేకపోయినా నా తుది శ్వాస వరకు నీకు భద్రత కల్పిస్తానని ఓ హితుడిగా నేనిస్తాను భరోసా. సమ్మతమేనా?" వర్మ తన నటనాప్రతిభతో నాటకాన్ని రక్తి కట్టించాడు. ప్రేక్షకుల హర్షధ్వానాలు మారుమోగాయి.

తన నటనతో ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసిన వర్మ. నలభై ఏళ్ల క్రితం ఇంటినుంచి పారిపోయి ఏమయ్యాడో తెలీని వర్మ. ఈరోజు ఎదురుగా. నా కళ్ళలో నీళ్ళు. అంతరాంతరాల్లో సంతోషం.

"అనంత్ కదూ!" అన్నాడు.

"వర్మవి కదూ!.... ఎన్నాళ్ళయ్యిందిరా నిన్ను చూసి?" ఆప్యాయంగా హత్తుకున్నా. ఇన్నాళ్ళు ఎక్కడున్నావు?ఏం చేసావు? ఎన్నో ప్రశ్నలు నోట్లోనే ఉండిపోయాయి.

వర్మ వెనకాలే ఓ నడి వయసు స్త్రీ, చేతిలో ఎయిర్ బ్యాగుతో బెరుగ్గా, భయంగా చూస్తోంది. ఆమె వాలకం ఏదోలా ఉంది. చవకరకం పాత సిల్కుచీర, ముఖానికి సరిగ్గా అంటని పౌడరు, దువ్వుకున్నా రేగినట్టున్న జుట్టు, బక్కగా ఉండి కొంచెం దైన్యంనిండిన కళ్ళతో వాడిపోయినట్టుంది.

వర్మ జ్ఞాపకాలు నన్ను మళ్ళీ చుట్టేసాయి.....

నర్సాపురం టేలర్ హైస్కూల్లో ఎనిమిదో తరగతి నుంచి మా స్నేహం. వాళ్ళ అమ్మానాన్న ఎక్సిడెంటులో పోయారు. మేనమామ చేరదీసాడు. హైస్కూల్ చదువైన తర్వాత వై ఎన్ కాలేజీలో చేరాం. అక్కడ మాకు రామ్మూర్తి ఫ్రెండయ్యాడు. ముగ్గురం మంచి మిత్రులై పోయాం. రామ్మూర్తి రూము తీసుకుని ఉండేవాడు. కాలేజీలోకి రాంగానే మా వేషభాషల్లోనే కాదు ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. లాగుల్లోంచి ఫ్యాంటుల్లోకి వచ్చేసరికి పెద్దవాళ్ళమైపోయిన ఫీలింగ్. వర్మ పెర్సనాలిటి, మాట తీరు నలుగురిలో వాడికో గుర్తింపు తెచ్చాయి. అందగాడైన వర్మ కాలేజీ నాటకాల్లో హీరో. కాలెజి ఉత్తమనటుడుగా వర్మ ప్రతీ సంవత్సరం బహుమతి అందుకునే వాడు.

మా ఊళ్ళో డ్రామా ట్రూపులో చేరి చదువుని నిర్లక్ష్యం చేసే స్థితి కొచ్చాడు. నాటకపోటీలంటూ రాష్ట్రమంతా తిరిగాడు. మంచి రంగస్థలనటుడిగా పేరొచ్చింది. అక్కడితో ఆగితే బాగుండేది. కానీ, సవ్యంగా నడుస్తున్న వాడి జీవితం అడ్డదారిలో పడింది. వనజ.... వర్మతో కల్సి నాటకాలు ఆడే పిల్ల. ఆమె మోజులో పడ్డాడు. వనజకు తండ్రి లేడు, తల్లి గురించి రకరకాలుగా పుకార్లు ఊళ్ళో. నిజమెంతో తెలీదు. వీడి బాగోగులు పట్టించుకోడానికి తల్లిదండ్రి లేరు. కట్టడి చేసే వాళ్ళు లేకపోతే కట్లు తెంచుకున్న కోడెదూడలా తిరిగుతుంది వయసు. వనజతో వర్మ స్నేహం గతి తప్పి, మోహం వైపు దారితీసింది.

ఓ రోజు రాత్రి పదింటికి రామ్మూర్తి రూము కొచ్చాడు వర్మ. ఆ టైములో వాడలా రావడం మాకు కొత్త కాకపోయినా, వాడి వాలకం కొత్తగా అనిపించింది. డ్రామా డైలాగులు మొదలెట్టాడు.

“ఫ్రెండంటే ఎవర్రా?మనసుతో మాట్లాడేవాడే ఫ్రెండంటే. హృదయంలో ఉన్నది దాచుకోకుండా బయటపెట్టాలి. అది బాధైన, బంధమైన, భయమైనా, బాధ్యతైనా, ఆలోచనైనా, ఆవేదనైనా, ప్రేమైనా ద్వేషమైన దాచుకో కూడదురా....పంచుకోవాలి...అలా చేసినోడే ఫ్రెండ్...నేను లక్కీరా. మీలాంటి వాళ్లు ఫ్రెండ్స్ గా దొరకడం నా అదృష్టం. అందుకే నేను మీతో అన్నీ పంచుకుంటా. ఇప్పటివరకూ నా గురించి అంతా చెప్పాను.ఇప్పుడో ముఖ్యమైన విషయం చెబ్తున్నా..నేను ...నేను వనజని ప్రేమిస్తున్నారా....!” తడబడుతో అన్నాడు.

అదే మొదటిసారి వాడ్నలా చూడ్డం. వర్మ తాగాడు.....!! ప్రేమంటున్నాడు. అదీ వనజతో....!!

వాడి పరిస్థితి చూసి జాలేసింది. నేనూ, రామ్మూర్తి ఏంతో చెప్పాం. ముందు చదువుకుని పైకొస్తే, తర్వాత తనిష్టమొచ్చినట్లు జీవితాన్ని మలుచుకోవచ్చని. మా మాట వినలేదు.

★★★

జ్ఞాపకాల్లోంచి బయటపడి రామ్మూర్తిని పిలిచా. వర్మని చూసి ముందు ఆశ్చర్యపోయి తర్వాత చాలా ఆనంద పడి భార్య సరస్వతికి పరిచయం చేశాడు. “చాలా అలసటగా కనిపిస్తున్నావు. లోపలికి నడు. రూముకెళ్ళి రిఫ్రెష్ అయిరా! తర్వాత తీరుబడిగా మాట్లాడుకుందాం.” రూముకి తీసుకెళ్ళాడు.

“కాస్త ఫ్రెషప్ అయ్యివస్తారా...”అని వెళ్ళాడు. వెనకాలే వర్మతో వచ్చినామె వెళ్ళింది.

“వర్మ వాళ్ళావిడ.. సూటుకేసు రైల్లో పోయిందిట. వర్మ పర్సుకూడా అందులోనే ఉందిట. ఆవిడ కట్టుకోడానికి బట్టలేమీ లేవట.” వర్మ చెప్పాడని రామ్మూర్తి తన భార్య సరస్వతితో చెబ్తోంటే నేను విన్నాను. సరస్వతి పెట్టుబడి బట్టల్లోంచి ఓ మూడు కొత్తచీరలు తీసి, రెడీమేడ్ బ్లౌజులు తెప్పించి ఇచ్చింది.

అసలు ఇన్నాళ్ళు వర్మ ఎక్కడున్నాడు? వాడితో వచ్చింది పెళ్ళమేనా? నాలో ముసురుకుంటున్న అనుమానాలు. మళ్ళీ సినిమా రీలు గిర్రున తిరిగింది.

ఇంకోరోజు రాత్రి తొమ్మిదింటి కొచ్చాడు. ఈసారి తాగలేదు. వస్తూనే డ్రామా డైలాగులు. “ నేను అమితంగా ప్రేమించే నా స్నేహితులారా! ప్రేమరాహిత్య జీవితానికి స్వస్తి చెప్పండి. మీకో ప్రేమకావ్యం చూసే అవకాశమిస్తున్నా. వైజయంతి టాకీసులో రాజేష్ ఖన్నా, షర్మీలాటాగోర్ సినిమా ఆరాధన. ఇవిగో టిక్కెట్లు. అదిగో నా సైకిల్. బయల్దేరండి. మీ రూంకి కుక్కలా నేను కాపలా. మీరెళ్ళి రండి.” తాగినప్పుడే నయం కాసేపు వాగి పడుకునేవాడు. వాడిగోల భరించలేక బయల్దేరిన మాకు రూం దగ్గరలో తచ్చాడుతూ...ఓ ఆడమనిషి. మసకచీకట్లో ఆ మనిషెవరో గుర్తు పట్టలేకపోయా.

మర్నాడు వర్మ ఘనకార్యం బయటపడింది. తన శరీర సుఖంకోసం నాటకమాడి మమ్మల్ని మోసం చేసాడు. ఫలితం రామ్మూర్తి రూం ఖాళీ చెయ్యాల్సొచ్చింది. ఆ మనిషి వనజని తర్వాత తెల్సింది. డిగ్రీ మూడో ఏడులోకి వచ్చాం. వర్మ మేనమామ కాలధర్మం చేసాడు. వర్మ చదువుని పూర్తిగా నిర్లక్ష్యం చేసాడు. ట్రూపులోకి కొత్త అమ్మాయి వచ్చింది. వనజతో వ్యవహారం చెడింది. కొత్త అమ్మాయి వలలో పడ్డాడు. కొత్తమ్మాయి పరిచయం కొత్త ఆలోచనలకి దారితీసింది. సినిమా పిచ్చితలకెక్కింది మద్రాసెళ్లి సినిమాల్లో ట్రై చెయ్యాలని అంటూండే వాడు.

ఓ శుభమూర్తాన ఆ కొత్తమ్మాయితో లేచిపోయాడు. ఇంట్లోంచి కొంత డబ్బు, నగలు పట్టుకునిపోయాడు. ఎక్కడికెళ్ళాడో తెలీదు. మద్రాసు వెళ్ళుంటాడు, మోజు తీరాకా వచ్చేస్తాడనుకున్నారు అందరూ. కానీ అలా జరగలేదు. వర్మ రాలేదు. నేనూ,రామ్మూర్తి చాలా బాధపడ్డాం. జీవనయానంలో వాడ్ని మర్చిపోక తప్పలేదు. వాడితో మా బంధం తెగిపోయింది. దాదాపు నలభై ఏళ్ళయ్యింది. మళ్ళీ ఇప్పుడు ఇలా.

★★★

రాత్రి పదయింది. రిసెప్షన్ కొచ్చినవాళ్లు చాలా మంది వెళ్ళిపోయారు. హాలు పలచబడింది. నేనూ, రామ్మూర్తి వర్మకోసం ఎదురుచూస్తున్నాం. రెండు గంటలయింది, ఇంకా రాలేదిమిటా ననుకుంటూంటే వచ్చాడు వర్మ. తెల్లలాల్చీ, పువ్వుల లుంగీతో పూలరంగడులా ఉన్నాడు. "ఏంట్రా? అలా ఉన్నారు?" కుర్చీ లాక్కుని కూర్చున్నాడు నిర్లిప్తంగా. ఇన్నేళ్ళ తర్వాత కల్సుకున్నామనే ఆనందం ఎక్కడా కనబళ్ళేదు వాడి ముఖంలో.

"ఒరేయ్...చిన్నతనంలో కలిసిమెలిసి తిరిగాం. కలిసి చదివాం. నీ గురించి బాధ పడ్డాం. అటువంటిది మాకెవరికి చెప్పకుండా మాయమై పోయావు. ఎక్కడున్నావో, ఏం చేస్తున్నావో తెలీక ఎంత వ్యధకు గురయ్యామో ఆ భగవంతుడికే తెలియాలి. నువ్వసలు బతికున్నావో లేవోనని అనుకున్న రోజులు కూడా ఉన్నాయి. ఒక్క మాట చెప్పరా ఎందుకలా చేసావ్? ఇన్నాళ్ళు ఎక్కడున్నావు, ఏం చేసావు? ఒక్కసారైనా మన ఊరు, మన స్నేహం గుర్తు రాలేదా? ఇప్పుడు కూడా నువ్వొచ్చి రెండు గంటలయ్యింది. నీకోసం ఎదురుచూస్తూ భోజనం కూడా చెయ్యకుండా కూర్చున్నాం. నీకోసం మేమంతా ఎదురుచుస్తూంటే, నువ్వేమో హాయిగా రూములో కూర్చుంటావా? ఆసలెందుకొచ్చావురా ఇక్కడికి....?" దుఃఖాన్ని ఆపుకుంటూ వర్మని కౌగలించుకున్నాను. రామ్మూర్తి మాట్లాడలేదు, నా మాటల్లోని భావంతో ఏకీభవిస్తూన్నట్లుగా వాడి కళ్ళల్లో నీళ్ళు.

జేబులోంచి సిగరెట్టు తీసి అంటిస్తూ నాకేసి చూసాడు. ఆ చూపుల్లో భావం కనపడకుండా కళ్ళముందు పొగ.

"అదేం లేదురా. ప్రయాణ బడలిక. వేడివేడినీళ్ళు పోసుకునేసరికి చిన్న కునుకు పట్టింది. పడుకుండిపోయాను. పదండి భోంచేద్దాం." చెప్పడానికేం లేదన్నట్టుగా చూసాడు. భోజనం కూడా సరిగ్గా చేయలేదు. ఆవిడ మాత్రం తిండికి మొహం వాచినట్టు తింది. భోజనాలయ్యాక "చాలా అలసటగా ఉందిరా. పడుకోవాలి. ముహూర్తం తెల్లవారుజామున అయిదు గంటలకి కదూ ? సరే అప్పుడు వస్తాను. గుడ్ నైట్." లుంగీ సవరించుకుంటూ పైకెళ్ళి పోయాడు. తెల్లబోయాం నేనూ, రామ్మూర్తి.

ముహూర్తానికి వాడు రాలేదు. తెల్లారి పదిగంటలకి హడావిడిపడ్తూ వొచ్చి, "సారీరా! తనకి ఒంట్లో బాలేదు. వెళ్ళిపోవాలంటోంది. మరి మేం బయల్దేరతాం." అన్నాడు.

"అదేంట్రా? అలా అంటావు. ఒంట్లో బావుండకపోతే డాక్టరుకి చూపిద్దాం. ఇప్పటికిప్పుడు బైల్దేరతానంటే ట్రైను గాని, బస్సుగాని ఉండాలిగా. బ్రేక్ఫాస్ట్ కూడా చెయ్యలేదు. ఉండండి." సరస్వతిని పిలిచి, "సాయంత్రం వరకు ఉండి, రాత్రి బస్సులో వెళ్ళమని ఆవిడికి చెప్పు." అన్నాడు.

వర్మ అడ్డుబడుతూ, "తను చాలా కొత్తగా ఫీలవుతోంది. నేనెంతో చెప్పాను. కాని వినడం లేదు. ఇక బలవంతం పెట్టకండి. అంతేకాదు మా కంపెనీ వేసిన టెండర్లో ఏదో ప్రోబ్లం వచ్చిందిట. ఇందాకనే ఫోన్ వచ్చింది. నన్ను వెంటనే బయల్దేరి రమ్మని. నేను వెళ్ళకపోతే బావుండదు. ఒంటిగంటకు ఏదో ఫ్లైట్ ఉందిట. దాంట్లో వెళ్తాం. కానీ మీరు చిన్న హెల్ప్ చెయ్యాలి. ఓ ఇరవైవేలు సర్దితే నేను నాగపూర్ వెళ్ళిన వెంటనే పంపిస్తాను. దయచేసి ఆ సహాయం చెయ్యండి. ఆవిడ స్యూట్ కేసులో పెట్టిన నా పర్సు, బ్యాంకు కార్డులు పోయాయికనుక మిమ్మల్ని ఇలా అడుగుతున్నా. క్షమించండి, నా గురించి మీకేం చెప్పకుండా వెళ్ళిపోతున్నా. నా గురించి చెప్పాలంటే ఒక్కరోజు సరిపోదు. త్వరలోనే మీకన్నీ చెబ్తాను. ఇప్పటికింక నన్నేం అడక్కండి." రెండు చేతులు జోడించి నమస్కారం చేసాడు. మరో నాటకానికి తెర తీసినట్లైంది. నా మొబైల్ నెంబర్, అడ్రస్ తీసుకున్నాడు. వర్మభార్య కొత్తచీరలో చూడ్డానికి బాగుంది. నిన్న కనిపించిన లోటు ఇప్పుడు ఆమెలో కనిపించడంలేదు. మిగిలిన చీరలు తిరిగి ఇచ్చేయబోతోంటే సరస్వతి వారించి బొట్టు పెట్టి

ఆమె చేతిలో తిరిగి పెట్టింది. నాకూ, రామ్మూర్తికి వాడడిగిన ఇరవైవేలు ఇవ్వక తప్పలేదు. ఎలా వచ్చాడో అలాగే వెళ్ళిపోయాడు వర్మ, చేదు జ్ఞాపకాలు మిగిల్చి. ఒక నల్లని మేఘం వర్షించి తన బరువుని తీర్చుకుంది గాని, నేల గుండె చెరువయ్యిందని తెల్సుకోలేక పోయింది...

వాడి ప్రవర్తన చాలా కృతకంగా అనిపించింది. వాడిలో మహానటుడు చావలేదనిపించింది. గుండెల్నిండా బాధ. డబ్బు కోసం నాటకం ఆడాడు. స్నేహం పేరుతొ మోసం చేసాడు. వాణ్నిమరచిపోవాలి. ఓ నిర్ణయానికొచ్చాను.

నెల తర్వాత .... నా నిర్ణయాన్ని వెక్కిరిస్తూ...వర్మనుంచి ఉత్తరం.

ప్రియమైన అనంత్,

మీ మనస్సుల్లో, మీ జ్ఞాపకాల్లో ఎప్పుడో చచ్చిపోయిన నేను, ఉరుములేని పిడుగులా ఊడిపడేసరికి మీలో ఉప్పొంగిన ఆనందంచూసి చచ్చిపోవాలనిపించింది. వ్యామోహాలకి దగ్గరై, స్నేహానికి దూరమైన నేను జీవితంలో మిమ్మల్ని మళ్ళీ కలుస్తాననుకోలేదు. మిమ్మల్ని చూడాలనే ఆశ, నే పోగొట్టుకున్న స్నేహాన్ని తిరిగిపొందాలనే ఆశ. నా ఆశ ఫలించింది. మీరిద్దరూ హైదరాబాదులో ఉన్నారని, రామ్మూర్తి కొడుకు పెళ్ళని తెల్సింది. కాలంతో కరిగిపోయిందేది తిరిగిరాదనుకున్న నేను, ఎప్పటికి కరిగిపోని మీ స్నేహం నాకోసం కళ్ళల్లో ఒత్తులేసుకుని మరీ చూస్తోందని, దశాబ్దాలపాటు దూరమైపోయిన స్నేహితుణ్ణి అక్కున చేర్చుకుని ఆదరిస్తుందని ఊహించలేదు. నా మౌనం, నా ప్రవర్తన మీకు బాధ కల్గించిందని నాకు తెల్సు. నన్ను గురించి తెల్సుకోవలనుకున్నారు. నేను అబద్ధాన్ని.....కాదు.... ముసుగేసుకున్ననిజాన్ని.

స్త్రీ నా మొదటి వ్యామోహం. సాలెగూడులో చిక్కుకున్న పురుగులా ఆ వ్యామోహంలో పడి సర్వం కోల్పోయాను. నాదనుకున్నదేది నాకు మిగల్లేదు, ఆకలి తప్ప. దాన్ని ఎదిరించే శక్తి లేక ప్రాణాన్ని, మానాన్ని అమ్ముకుని బతుకు మీద ఆశతో ఎన్నో చేశాను. నామీద నాకే అసహ్యం పుట్టేలా ప్రవర్తించాను. ఎక్కడెక్కడో తిరిగాను. చివరిగా మిమ్మల్ని కలవాలని బయల్దేరాను. స్టేషన్ దగ్గర తారసిల్లింది మంజుల. మళ్ళీ కోరిక చెలరేగింది. నాకు సుఖం కావాలి. ఆమెకు ఆకలి తీరాలి. రెండిటికి డబ్బు కావాలి. లాడ్జి ఖర్చు, పోలీసుల భయం లేకుండా ఇద్దరి అవసరాలు తీరాలి. అందుకే పెళ్ళాంగా ఆమెను పెళ్లి మండపానికి తీసుకొచ్చాను. నేనంటే అసహ్యమేస్తోంది కదూ? బలహీనతలకు లొంగి జీవితాన్ని నాశనం చేసుకున్నవాణ్ని. అంతకన్నా మంచి ఆలోచనలు ఎలా వస్తాయి? మంజుల నా దృష్టిలో ఓ బజారు స్త్రీ. కట్టుకోడానికి వంటి మీదున్న బట్ట తప్ప ఇంకో బట్టలేక, ఆకలితో అలమటిస్తూ, నా ఆకలి తీర్చడానికి సిద్ధపడ్డ స్త్రీ. అలాంటి నిర్భాగురాలు ఆ రాత్రి నా దృక్పథాన్ని మార్చేసింది. ఊహించని గౌరవం, ఆదరణ, కొత్త చీరలు, కడుపు నిండా విందుభోజనం మీద్వారా లభించేసరికి ఉద్వేగం ఆపుకోలేక, అందుకు కారణమైన నన్ను తన కన్నీటితో అభిషేకించి, తన దీనగాథను వినిపించింది. చేనేత కార్మికుడైన భర్త అప్పులతో ఆత్మహత్య చేసుకుంటే, కన్నకొడుకును వెట్టిచాకిరి కోసం అప్పిచ్చిన షావుకారు తీసుకుపోతే, ఏమీ చేయలేని అశక్తత... పదమూడేళ్ళ కొడుకును విముక్తి చేయడానికి ఇరవైవేలు కావాలి. ఆదుకునే ఆపన్న హస్తం ఎదురుపడక, ఆకలిబాధని తాళలేక పడుపువృత్తిలోకి నెట్టబడింది. ఆమె కన్నీటిగాథ కామం కూరుకుపోయిన నా కళ్ళను తెరిపించింది. ఆరాత్రి జీవితంలో మొదటిసారి మనసుతో ఆలోచించాను. ఆమె కొడుకుని వెట్టిచాకిరి నుంచి విడిపించాలి. ఎలాగైనా ఇరవైవేలు సంపాదించాలి. ఎలా...? తాను దూర కంత లేదు మెడకో డోలన్నట్టు, ఏ ఆలంబనా లేని నేను అంత సొమ్ము ఎక్కడ్నించి తేవాలి? రాత్రంతా నన్ను వేధించిన సమస్య. పరిష్కారంగా మీ బలమైన స్నేహబంధం నేనున్నానంటూ నా ముందు నిలిచింది. ఆ బంధంతో ఒక జీవితాన్ని నిలబెట్టగలననే ఆశ చిగురించింది. అందుకే మిమ్మల్ని మోసం చేయడానికి కూడా వెనకాడలేదు. మీ దగ్గర తీసుకున్న డబ్బుతో ఆమె కొడుకుని విడిపించినప్పుడు ఆమె కళ్ళల్లో కనిపించిన కృతజ్ఞతాభావానికి నా కళ్ళల్లో జలజలా నీరు. అంతవరకూ నే చేసిన పాపపు పనులకు ప్రక్షాళన జరిగిన అనుభవం. పాపపంకిలమైన నా జీవితానికి అదో అనిర్వచనీయమైన అనుభూతి. నేను ఒక నాటకంలో శీలం గురించి చులకనగా మాట్లాడుతాను. కానీ శీలమంటే సినిమా డైలాగు కాదని, అదొక ఔన్నత్యమని తెల్సుకున్నాను. విధివంచితురాలై తన ఔన్నత్యాన్ని కోల్పోయిన స్త్రీకి దాన్ని తిరిగి ఇవ్వలేనన్న నిజాన్ని పక్కకు పెడ్తే, మళ్ళీ ఆమె ఆ రొంపిలోకి వెళ్ళకుండా ఆపగలిగే స్థితిని కల్పించాలను కున్నాను. తోడూనీడ నేనై ఆమె జీవితానికి భరోసాగా నిలవాలనుకున్నాను. నా ఆశయం ఉన్నతమైనదో కాదో తెలీదు గానీ మీరు చేసిన ధన సహాయం మాత్రం నన్ను ఓ ఉన్నతుడుగా నిలబెట్టింది. జీవితం చాలా చిన్నది. కానీ దాన్ని ఎలా ఉపయోగించుకోవాలో తెలిస్తే చాలా నిడివైందన్న నిజం తెల్సుకున్నా. నేను చెడిపోయినా, జీవితంలో ఓడిపోయినా, మీ డబ్బును తిరిగి ఇవ్వలేక పోయినా, ఒక మంచి పని చేసాననే తృప్తి మిగిలింది. నన్ను మీరేమనుకున్నా పర్వాలేదు. నువ్వన్నావు

జ్ఞాపకముందా నువ్వసలు బతికున్నవో లేవోనని అనుకున్న రోజులు కూడా ఉన్నాయని. ఆ భావనని అలాగే ఉండనీయండి. నేను లేననే అనుకోండి. కానీ...మన స్నేహం ఎప్పటికీ అలానే ఉంటుందన్న నమ్మకంతో మీ బాల్య స్నేహితుడుగా శెలవు తీసుకుంటున్న... మీ వర్మ.

స్థాణువునైపోయాను. నేననుకున్నట్టు వర్మ నటించలేదు. నేనే సామాన్యప్రేక్షకుడి స్థాయిని మించి ప్రతిస్పందించా నేమో? అర్థమయ్యింది. మరి నాకర్థం కాని విషయం.....??

వాడు హితుడా.....? వ్యామోహితుడా......?

ఆలోచనలకందని ఎత్తులో వర్మ....ఏదీ తేల్చుకోలేని సందిగ్ధంతో కిందకి జారిపోతూ.... నేను...!!!

# పరిష్కారం సి.యమున

## కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

సూర్యుడు ఛాయను పొదివి పట్టుకుని ఇంకా నిద్రిస్తూనే ఉన్నాడు. ఉష, తలుపు తెరిస్తే తొంగి చూద్దామని ఆశగా ఎదురు చూస్తోంది. బ్రాహ్మీ ముహూర్తం. భక్తులు సుప్రభాత సేవతో స్వామికి మేలుకొలుపు పాడుతున్నారు. శ్లోకాలు, గీతాలు, ధూప దీప నైవేద్యాలు, హారతులు ....ఎన్నిరకాలుగా కొలవగలరో అన్ని రకాలుగా కొలుస్తున్నారు. అది తమ ఆనందంకోసమో లేక అవసరాలకోసమో.....మరేమో అదేమో ఆ దైవానికే తెలియాలి. ఆ నాటి సుప్రభాత సేవలో దైవానికి ఏదో వెలితి కనపడుతోంది.

దైవానికి సహజ సుప్రభాతాలు మహా ఇష్టం. తమ సువాసనలతో చేసే పూలబాలల అర్చనలు, గోవుల అంబారావాలు, పక్షుల కువ కువలు, తరువులు తమ తనువుతో ఊపే వింజామరలు, కోకిల రాగాలు...అవే ఆయనకు అత్యంత ఇష్టమైన స్తుతి స్తోత్రాలు. యుగ యుగాలుగా అలవాటైన అవి ఏవీ ఆ రోజు కానరాకపోవటం ఏదో అపశృతిగా,లోటుగా అనిపించింది ఆయనకు .

మానవులు చేసే స్తుతులు, మంగళాశాసనాలు, అష్టోత్తరాలు ...ఏదీ ఆయన ఎద చేరటం లేదు. కళ్ళు తెరవ బుద్ధి కావటంలేదు స్వామికి.

మానవులని ఉద్ధరించటానికి తన లోకాన్ని వీడి భూలోకంలో ఎన్నో అవతారాలెత్తాడు. ఇక్కట్లు పడ్డాడు. కాని ఆ ప్రకృతి సహచర్యంలో మైత్రీ భావన పొంది, స్థైర్యం నిండి కదూ అవన్నీ నెట్టు కొచ్చాడు పాపం ఆ దైవం.ఆకాశం, సముద్రం, అడవి, వెన్నెల, వృక్షాలు , పూలు, పళ్ళు ...మూగ జీవాలు వీటిలో కనీసం ఒక్కదాని గురించైనా ప్రస్తావించకుండా ముగిసిన అవతారము ఉన్నదా? సింహాసనాలు వదులుకుని అరణ్యవాసానికి అనాయాసంగా వెళ్ళింది ఆ ప్రకృతిని చూసుకుని కలిగిన ధైర్యమే కారణం. 'గోవిందా' అంటే కరిగిపోతాడు. గోవులతో ముడిపడి ఉందని ఆ పిలుపంటే మహా ఇష్టం ఆయనకు. పిల్లన గ్రోవి అంటే మహా ప్రాణం ఆయనకు ఎందుకంటె అది చెట్టునుండి జనించిందని.

"గాలితో జత కట్టి 'దైవమా , మేలుకో. 'మురళీధరా' నామాన్ని సార్థకం చెయ్యవయ్యా' అని గుస గుస లాడే ఆ పిల్లన గ్రోవి కూడా మూగపోయిందే ఈ వేళ" అన్న ఆలోచనతో దైవానికి మరింత బాధగా ఉంది. ఎందుకంటే ఆయనకూ మనసు ఉందిగా.

అంతలో సుప్రభాతాలని, స్తోత్రాలని అధిగమిస్తూ ఆయనకు ఆర్తిగా , దీనంగా విలపిస్తున్న అనేక గొంతులు వినపడ్డాయి ఆ దైవానికి. దిగ్గున లేచి కూర్చున్నాడు స్వామి. పొగడ్తలకన్నా వేదనకి కరిగేవాడే దైవం కదూ|

‘చదువు రావాలి, ఉద్యోగం పొందాలి, పెళ్లి కావాలి, పిల్లలు కలగాలి....మరల వాళ్లకి చదువులు, ఆస్తులు, అంతస్తులు కావాలి.... దొంగ లెక్కలు పట్టుపడకూడదు ....లెక్కపెట్టలేనంత సంపద సమకూరాలి..’ అలా అనేక విధాలుగా విన్నవించుకునే గొంతులు ఆయనకు అలవాటే. అడిగిన వాళ్ళు ఎటువంటి వాళ్లైన కాని, చూసీ చూడనట్లు పోయి వాళ్ళ కోరికలు తీరుస్తూ ఉంటాడు. బిడ్డల మీద ఆయనకున్న ప్రేమ అలాంటిది. కాని ఆ గొంతులు ఈ గొంతుల్లో లేవు.

మరి ఈ విలాపాలు, ఆర్తనాదాలు ఎవరివి? ఆయనకు ఏమీ అర్ధం కాలేదు, అప్పుడే తెరిచిన కన్నులు అలాగే ఉంచి దివ్య దృష్టితో పరికించాడు. ఆ దృశ్యం చూసి ఉలిక్కిపడ్డాడు. తను ఎప్పుడూ చూసి మురిసిపోయే ప్రకృతి హృదయ విదారకంగా ఆక్రోశిస్తోంది.

నదులు, సముద్రం, అడవులు...గోవులు, పక్షులు, పువ్వులు...అన్నీ కరిగి పోతున్న వెన్నెలతో జత కూడి విలపిస్తున్నాయి. అది చూసి ఆయన ఓర్చుకోలేక పోయాడు.

లక్ష్మీ దేవిని, స్వర్గాన్ని అన్నిటినీ విడిచి, శంఖు చక్రాలు..కనీస ఆయుధాలను కూడా చేతబూనకుండా అన్నీ మరిచి గజేంద్రుని రక్షించటానికి ఆనాడు ఎలా భువికి బయలుదేరాడో ఈనాడు కూడా అంతకన్నా ఆత్రుతగా వేగంగా పరుగు పరుగున భూలోకానికి వెళ్ళాడు.

దైవమిచ్చిన ప్రవృత్తితో ఆయన ఆజ్ఞాపించినట్లుగా జీవిస్తున్న జీవులు అవి. అందుకనే దైవం ఉనికిని ఇట్టే పసిగట్టగలిగాయి. ఎదురుగా ఉన్న ఆ దైవాన్ని చూసి విలపిస్తున్న ఆ జీవాలన్నీ తమ దుఃఖాన్ని మరిచి ఒక్కసారిగా హృదయాంజలిని సమర్పించాయి. ఆయన మనసు వాటి వేదనమీదే కాని మర్యాదల మీద కాదు.

“ప్రతి రోజూ సుమధుర గళాలతో, అంబారావాలతో, సుగంధ సువాసనలతో...అలా ఆహ్లాదంగా అత్యంత ‘నిష్కల్మషమైన ఆరాధనతో’ నన్ను మేల్కొలిపే మీరు ఇలా రోదిస్తున్నారే ....ఏమయ్యింది మీకు?” ఆప్యాయంగా అడిగాడు దైవం.

“గోపాలుడివి . గోవుల బాధ తెలీదా నీకు?” నీరు నిండిన నల్లని కన్నులతో నిలదీసింది గోమాత.

‘ ఏడుకొండల మీద అడుగుపెట్టినపుడు కన్నతల్లి లా క్షీర ధారలతో కడుపు నింపింది ఆ గోమాతేగా’ జ్ఞాపకం స్వామి మది లో కదలాడి మనసు కలుక్కుమంది.

“పుష్పాలంకరణలతో నిత్యమూ అలరారే స్వామికి మా కష్టాలు మేమే చెప్పుకోవాలా?” అలకగా అడిగింది పూబాల.

“మా గొంతులు రోజు రోజుకు ఎందుకు మూగ పోతున్నాయో అర్ధం కావటంలేదా లేక అర్ధం చేసుకోవటం లేదా స్వామీ?“ ఆర్తిగా అడిగాయి కోకిలమ్మ సారధ్యంలో అక్కడ కూడుకున్న రక రకాల పక్షులు.

“నీపాదాలను స్పర్శించటానికి మేము ఎందుకు వెనుకాడుతున్నామో తెలుసా స్వామీ?” బలహీనమైన గొంతుకులతో ప్రశ్నించాయి నదులు, సముద్రాలు.

ఆర్తితో అక్కడ చేరిన అనేక జంతు జాలాన్ని, పక్షుల్ని, వృక్షజాతిని...చూసి స్వామి మనసంతా నీలి నీడలు కమ్ము కున్నాయి.

“మీరు బాధ పడకండి. నా దివ్య దృష్టి తో మీ ఈ దీన పరిస్థితికి కారణం తెలుసుకుని, అర్ధం చేసుకుని మీకు పరిష్కారం చూపుతాను” అన్నాడు దైవం స్థిరంగా.

“మాకొద్దు” ముక్త కంఠంతో పలికాయి అక్కడ చేరిన ఆ జీవరాశి.

ఉలిక్కి పడ్డాడు స్వామి. అయ్యోమయ్యంగా చూసాడు. ఆయన మోము చూసి మనసు కరిగింది పూబాలకు. ఎంతైనా సుకుమార సుమం కదూ. తండ్రి మీద ఉన్న బలమైన ప్రేమ కూడా తోడయ్యింది . అందుకని గొంతువిప్పి

“మీ దివ్య దృష్టితో చూస్తే మీకు కేవలం దృశ్యం మాత్రమే కనపడుతుంది. కష్టం, సుఖం, ఆనందం, దుఖం ఆ కాసేపే. పైపైనే అర్ధమవుతుంది. ఆ తరువాత మరుస్తారు...”

“మరి నేనేమి చెయ్యాలి “ పూబాల మాటకు సమస్త లోకాలని తన కడుపులో దాచుకున్న దైవం వాటి కడుపులోని మాట గ్రహించుకోలేక అడ్డంపడుతూ అడిగాడు.

"భూమాతను రక్షించటానికి వరాహంగా అవతరించావు. వేదాలను సంరక్షించటానికి మత్స్యంగా మరో రూపు ధరించావు. అన్ని చేసినవాడివి మరి మాకోసం ఏం చెయ్యాలో నీ మనసుకు తట్టటం లేదా?" అడిగింది గోమాత తడి కన్నుల్లోనే కాస్తంత కోపం పొడచూపగా.

"మానవుల మనుగడ కోసం, వారి మంచి కోసం రామునిగా , కృష్ణునిగా అవతారాలెత్తావు. అనేక కష్టాలకు కూడా ఓర్చుకుని వారికి జీవిత ధర్మాలను, సత్యాలను కూడా నెలకొల్పావు. కష్టాలు , సౌఖ్యాలు, కోరికలు వారికేనా మాకు లేవా? మేమూ మీ బిడ్డలమేగా " గాండ్రించింది అప్పటిదాకా మౌన శ్రోతగా ఉన్న పులి.

"మీ ఆవేదనకు నా మనసంతా కల్లోల కడలే అయ్యింది. నేను సృష్టించిన మీరందరూ సంతోషంగా ఉండాలనేదే నా ఆరాటం. అందుకోసం మీరు ఏమి చెప్పినా చెయ్యటానికి సిద్ధం" అంటూ తప్పు చేసిన బిడ్డ తండ్రి ముందు చేతులు కట్టుకుని నిలబడ్డట్లు దైవం ఆ జీవరాసులముందు నిలబడ్డాడు.

"మీరు మా స్థానం లో ఉండి, మా జీవితాన్ని గడిపి అనుభవిస్తే మా అంతరాళాలలోని బాధ మీ అంతరాత్మకు సంపూర్ణంగా అర్ధమవుతుంది . దానికి సిద్ధమా" సవాలు విసిరాయి ఆ జీవరాశి.

"ఓ పూబాల, ఓ గోమాత , మరో పక్షిరాజం... తర తరాలుగా ఆయా జాతులన్నీ తమ జన్మతః లభించిన నైజంతో , తమ పరిధిలో వేరే ఆలోచన లేనట్లే జీవనం సాగిస్తున్నాయి. రాజ్యాలకోసమో, సంపదలకోసమో....మరింకా వేటి కోసమో అర్రులు చాస్తూ తపస్సు చేసినది లేదు, ఎప్పుడూ ఏదీ కోరినది లేదు. అలాంటి ఆ పుణ్య జీవులు ఇన్నాళ్ళకు ఆర్ద్రంగా అడిగినది తను చెయ్యలేడా? అది తన భాద్యత కూడా కదూ . వీటి వ్యధకి పరిష్కారం చూపటం తన కర్తవ్యం కూడా" అంతర్మధనంతో సతమతమయ్యి చివరకు ఆ జీవులు చెప్పినవాటికి సంసిద్ధుడయ్యాడు స్వామి.

★★★★

దైవం మొదట గోవుగా మారాడు. గోపూజలు అందుకుని మానవులు తన కిచ్చే గౌరవానికి, విలువకు పరమానందం చెందాడు. 'పూజలతో ఇంత గౌరవాన్ని అందుకుంటూ ఎందుకు ఆ గోమాత అంత దుఃఖించింది" అని ఆశ్చర్యపోయాడు అసలు సంగతి తెలియని అనంతుడు. గోమాతకు వయసు మీరింది. అవసరం తీరింది. వధ శాలకు తరలించారు. మిషన్ లోకి ఎక్కించారు.....తల తెగి నేల రాలింది. ఆ వధకు ఆయనలో వర్ణింపరాని వ్యధ. గోవుల ఆర్తనాదాలతో హోరెత్తిన ఆ వాతావరణం చూసి ఆయనలో దుఃఖం వరదలయ్యింది. ఆయన జగత్ ప్రభువు. ప్రభువే కన్నీరు కారిస్తే ఎలా ?

నది 'కన్నీరు' కూడా నీరుగా కనపడుతుందిగా అందుకని తన కన్నీరు ఎవర కంటా పడకుండా, బేలతనాన్ని దాచుకోవటానికి క్షణంలో నదిగా మారాడు. ఆ దైవం కాసేపటికి దుఃఖం నుండి తేరుకున్నాడు. తనను హారతులతో అర్చిస్తున్న జనావళి భక్తికి నదీ రూపం లో ఉన్న దైవం పరవశం చెంది పరవళ్ళు తొక్కాడు.

"ఇటువంటి మర్యాద, మన్నన పొందుతున్న నది కూడా ఆనాడు ఎందుకు విచారం వ్యక్తం చేసింది " అని గోమాత రూపంలో అయిన అనుభవంతో ఆలోచన మొదలెట్టాడు.ఆయన ఆలోచన తెగకముందే తనలోకి తన్నుకు వస్తున్న భయంకర వ్యర్ధ పదార్ధాలను ,అసంపూర్ణంగా కాలిన మానవ కళేబరాలను చూసి అవాక్కయ్యాడు.ఆ వ్యర్ధాలను, దుర్వాసనలను భరించే శక్తి లేక విల విల్లాడాడు విస్వవ్యాపకుడు . తక్షణమే అక్కడనుండి అదృశ్యమయ్యి తన లోకానికి చేరుకోవాలనుకున్నాడు. మరుక్షణం తన రూపు ధరించి ఆకాశా మార్గాన పయనమయ్యాడు.

అంతలోనే తన ప్రక్కనుండి ఎగురుకుంటూ వెడుతున్న పక్షులను చూసాడు. "అయ్యో, ఇలా తొందరపడి పారిపోతున్నానేంటి?

ఈ పక్షులకు, వృక్షాలకు ....ఇంకా అనేక జీవులకు 'వాటి వాటి రూపాలనెత్తి , వారి కష్టాలను అనుభవించి అర్ధం చేసుకుంటానని మాట ఇచ్చాను. ఆ మాటని కూడా నిలపెట్టుకోవాలి" అని తీర్మానించుకుని తక్షణమే పక్షి రూపు ఎత్తాడు.

చెట్టుపై గూడు నిర్మించుకున్నాడు.పచ్చని చెట్ల మధ్య విహరిస్తూ, పండ్లను తింటూ , పూలను ఆఘ్రాణిస్తూ , రాగాలు తీస్తూ పాత వ్యధలను మర్చిపోయాడు. తాను ఉంటున్న చెట్టుకన్నా ఎత్తుగా , కొత్తగా ఉన్న స్తంభాన్ని చూసి ఉత్సుకతతో తనను తానే మరిచిపోయాడు. వెళ్లి దానిపై

వాలాడు.....శరీరంలో ఏదో అలజడి. యేవో ప్రకంపనలు ఊపేస్తున్నాయి.ఎలాగో చెట్టు మీద గూడు చేరి, గువ్వలాగా ముడుచుకుని పడుకున్నాడు. అంతలో చెట్టు ఊగిపోతోంది. ఏంజరుగుతోందో అర్ధమయ్యేలోపే చెట్టు నేల కూలింది.గూడు చెదిరిపోయింది. పక్షి రూపంలో ఉన్న దైవం నేల చేరాడు.

'కారణం లేకుండా ఎందుకు కత్తితో నన్ను ఇలా చిద్రం చేసారు" రోదిస్తూ చెట్టు. చెట్టుకు జతగా విలపిస్తూ పక్షి రూపంలో ఉన్న దైవం. కంటితో కని ఓ దుఖం, శరీరంతో అనుభవించి మరో దుఃఖం. ఇరు జీవుల శోకాన్ని ఆ క్షణంలో అనుభవించాడు కన్నయ్య.

మరికొన్ని రూపాలు ధరించి , ఆ కడగళ్ళ ను అనుభవించి ...చివరకు వేదనా భరిత హృదయంతో తన లోకానికి పయనమయ్యాడు స్వామి. యెంత ఎత్తుకు వెళ్ళినా నిర్మలాకాశమే లేదు. నిర్మలత్వాన్ని మింగేస్తూ దట్టమైన కలుషిత వాయువులు. ఎలాగో తన లోకం చేరాడు.

★★★★

ఆనాడు తమ ఆర్తిని విన్నవించుకున్న జీవజాలాన్ని సమావేశపరిచాడు దైవం. ఆ జీవజాలం దైవం ఏమి చెపుతాడా అని ఒళ్ళంతా చెవులు చేసుకుని శ్రద్ధగా ఆలకించటానికి సంసిద్ధమై ఉన్నాయి.

“నేను మీకు మాట ఇచ్చినట్లే కొన్ని రూపాలను ధరించాను. గోవుగా వధలో వ్యధని, నదిగా దుర్వాసన దుస్థితిని, ఏనుగుగా దంతాల పెరికి వేత వెతని, పులిగా గోళ్ళను, చర్మాన్ని చీల్చిచిద్రమైన శరీర బాధని .....” గుండె ఆర్ద్రమయ్యి, గొంతు గద్గధమవ్వగా మాటరాని వాడే అయ్యాడు మాధవుడు.

“అయ్యో, స్వామీ మా కష్టాలకోసం నిన్ను కష్టాల పాలుచేసాము . మమ్మల్ని క్షమించు” ఆర్తిగా వేడుకున్నాయి ఆ జీవాలు. భక్తుల ఆర్తాగ్నికి వెన్నలా కరిగిపోయాడు ఆ స్వామి.

“ఇన్నాళ్ళు మీ కష్టాలని అర్ధం చేసుకోలేని నన్ను మీరే క్షమించాలి “ వినమ్రంగా క్షమ అడిగాడు దైవం.

“అయ్యో, యెంత మాట తండ్రి “ కళ వళ పడ్డాయి మూగ జీవాలు.

“దైవమైనా , ఎవరైనా కాని తప్పు తప్పే. అది ఒప్పుకోవటం ధర్మం. మీ సృష్టికి , సంతోషానికే కాదు మీ ఈ దురావస్థకి కూడా ఓ విధంగా నేనే కారణం”

ఆ మాటకు అవన్నీ దిగ్భ్రాంతిగా చూసాయి. మౌన ముద్రని దాల్చాయి.

'కారణం నేను అయినపుడు పరిష్కారము నేనే చూపాలి కదా” నిశ్చలంగా చెప్పాడు దైవం.

“పరిష్కారం ఉందా స్వామీ? అదేంటో చెప్పండి” పరిష్కారమనే మాట కలిగించిన ఆశతో మౌనం వీడి ఆత్రుతగా అడిగాయి.

“ప్రకృతితో మమేకమై జీవిస్తూ, అవసరమైనపుడు ఆదుకుంటూ 'నా ప్రతి రూపంగా ఉండమని' నేను మనిషిని సృష్టించాను. మీ నుండి సమస్త సుఖాలను పొందుతూ మితి మీరిన అహంకారంతో , 'తానే గొప్ప' అనే అహంభావంతో మిమ్మల్ని నాశనం చేస్తున్నాడు మనిషి. అందుకే ఆ మనిషినే ఈ భూమి మీద నుండి మాయం చేస్తున్నాను. నా సృష్టి నుండి తొలగిస్తున్నాను. మీరు సుఖంగా జీవించండి” తీర్మానం చేసాడు దైవం.

“నమో, దైవమా “ అంటూ మోదంతో ఆ జీవులన్నీ మోకరిల్లాయి.

# ఓ మూగ మనసా! వారణాసి నాగలక్ష్మి

కొత్తవాళ్లూ, పాతవాళ్లూ, కాస్త పరిచయస్థులూ ఎప్పట్లాగే ఉంది ఆదివారం నాటి వాకర్స్ పార్క్.

పరుగెడుతూ ఉన్నా. పరుగు కాదు, జాగింగ్ అనాలిట. సరే. ఏదైతే ఏమిటి? ఏదో ఒక శారీరక వ్యాయామం. శనాదివారాల్లో కాస్త ఎక్కువసేపూ, మిగిలినరోజుల్లో ఒక అరగంటా చేసే ఈ శారీరక శ్రమ లేకపోతే నేనూ మంచాన పడేదాన్నేమో.

నడివయసుకి చేరిన శరీరం. బాధ్యతలు పెరుగుతున్న ఉద్యోగపు దశ. ఎన్నని పట్టించుకోను? ఇంత చేసినా ఒరిగిపడింది ఏముంది, ఎవర్ని సంతృప్తి పరచగలుగుతున్నాను? కంచిగరుడసేవ. యంత్రంలా తెల్లారిందగ్గర్నుంచి రాత్రి పది దాకా పనిచేసేవాళ్ళని చూస్తే, మంచంమీద హాయిగా విశ్రాంతి తీసుకునే వాళ్లకి ఏదో ఒకటి అనకుండా తోచదు. ఆ మాటలు చెవిన పడ్డప్పుడు మనసు కుతకుత ఉడికిపోతుంది.

పార్కులో జాగింగ్ చేస్తున్నా ఆలోచనలు జోరీగల్లా చికాకుపెడుతున్నాయి. మనసు ప్రశాంతంగా ఉంచుకోవాలనీ, రోజులో కాసేపైనా ఇష్టమైన పనిలో గడపాలనీ సైకియాట్రిస్ట్ సూచన. ఆయన దగ్గరకి వెళ్తున్నట్టు ఎవరికీ చెప్పడం నాకిష్టం లేదు. క్లినిక్ బయట పేషంట్స్ నిరీక్షించే చోట కూర్చుని, నా వంతు ఎపుడొస్తుందా అని ఎదురుచూస్తున్నపుడు నా మనసులో ఒకటే భయం, తెలిసిన వాళ్లు ఎవరైనా అక్కడ నన్ను చూస్తారేమో అని. కాలు నెప్పో, వేలు నెప్పో, గుండెనెప్పో... ఏదైనా గౌరవంగానే ఉంటుంది చెప్పుకుందుకు. మానసిక సమస్య అనగానే వినే వాళ్ల కళ్లలో కనపడే చులకన భావం ఊహిస్తే అసలు ఈ సెషన్స్ కి వెళ్లాలనిపించదు.

పరుగెడుతూ ఆలోచిస్తున్నా. పార్కులో నడుస్తున్నపుడో, పరిగెడుతున్నపుడో ఎవరైనా మనని చూస్తే గౌరవంగానే ఉంటుంది. వీళ్లు ఆరోగ్యం మీద శ్రద్ధపెడతారని, బరువుని నియంత్రణలో ఉంచుకుంటారనీ, ఆరోగ్యకరమైన తిండి తింటారనీ, మన గురించి ఇతరులు అనుకుంటే గొప్పగా ఉంటుంది. కానీ మానసిక ఆరోగ్యం దెబ్బతిన్నపుడు, మనం స్వస్థంగా లేమని మనకే తెలిసిపోతున్నపుడు, దానికి సంబంధించిన డాక్టర్ దగ్గరకి వెళ్లడం విషయంలో ఇంత సంకోచం ఎందుకు అంటే మాత్రం నేనేమీ చెప్పలేను.

రెండు రౌండ్ల వాకింగ్, ఒక రౌండ్ జాగింగ్ అయిపోయాక చెట్ల కిందున్న బెంచీల్లో ఒకదాని మీద కూర్చున్నా. ఆయాసం తగ్గి మెల్లిగా మామూలు స్థితికి వస్తున్నా. వెనకనించి 'హాయ్' అన్న పలకరింపు వినపడింది. వెనక్కి తిరిగి చూస్తే చెట్టు వెనక వెడల్పాటి రాయి మీద ఒకావిడ అటువైపు తిరిగి కూర్చుని కనిపించింది. ఆవిడ వేసుకున్న పసుపు పూల కుర్తీ అ పక్కనున్న కెన్నా పూలలో కలిసిపోయింది. పలకరించినావిడ దగ్గరికి రాగానే ఈవిడ జరిగి చోటిచ్చింది.

నేను మామూలుగా తిరిగి కూర్చున్నాను.

వాళ్లు ఒకళ్లనొకళ్లు పలకరించుకోవడం, చిన్నగా నవ్వుకోవడం వినిపించాయి.

మెల్లగానే మాట్లాడుకుంటున్నా వాళ్ల మాటలు నాకు స్పష్టంగా వినిపిస్తున్నాయి. ఇద్దరూ పార్క్ ని ఆనుకుని ఉన్న కాలనీలోనే ఉంటారని అర్ధమయింది.

నా ప్రయత్నం లేకుండానే చెవిలో పడుతున్న మాటల మీదికి నా ధ్యాస మళ్లింది. దీర్ఘంగా శ్వాస తీసుకుంటూ వదులుతూ ఆ మాటల్లో దొర్లుతున్న విషయాలు వింటున్నా.

ముందు ఇద్దరూ పిల్లల చదువుల గురించి మాట్లాడుకున్నారు. పెరిగిపోతున్న ఫీజుల మాట రాగానే పసుపు పూల కుర్తీతో రెండో ఆవిడ అంది "మీకేం మాధవీ, రెండు జీతాలు."

అపుడు మాధవి అంది "ఆ, రెండు జీతాలే కాదు రెండు గాడిద చాకిరీలు కూడా రూపా. ఇంటికొచ్చి మళ్లీ ఇంటెడు పన్లూ చక్కపెట్టుకోవాలి. జీవితం యాంత్రికమైపోయింది."

అనుకోకుండా ఇక్కడ నేను కనెక్టయిపోయా. మాధవి నాకు సన్నిహితురాలైపోయింది.

కాసేపు వాళ్లకి తెలిసిన వాళ్ల గురించి కబుర్లు సాగాయి. తర్వాత రూప అడిగింది. "ఈ మచ్చ ఏమిటీ చేతి మీద? నూనె పడిందా?"

"నూనె కాదు రూపా. సోరియాసిస్"

నేను ఉలిక్కిపడ్డా. అలా ఎవరైనా చెప్తారా? ఆశ్చర్యపోయా.

రూప కూడా ఒక్క క్షణం మౌనంగా ఉండిపోయింది. నాలాగే ఉలికిపడిందేమో.

"డాక్టర్ని కన్సల్ట్ చేశావా?"

"ఆ..."

"ఏమన్నారు?"

"స్ట్రెస్ తల్లీ. తగ్గించుకోమంటారు. మందులిస్తున్నారు"

"మరి తగ్గించుకోవచ్చుగా. మీవారు బానే సంపాదిస్తున్నారు కదా. నువ్వు జాబ్ చెయ్యాలా?"

"తగ్గించుకోలేని ఒత్తిళ్లు కూడా ఉంటాయి కదా!"

"అంటే ఎలాంటివి?"

"అలా అడిగితే ఏం చెప్పను? అత్తయ్యగారు ఇపుడు పూర్తిగా మంచానికే పరిమితమైపోయారు కదా"

"అవునూ.... ఎవరో హెల్ప్ ని పెట్టుకున్నావుగా!"

"అదేలే. కానీ సెలవురోజొస్తే చాలు రోజంతా నవీన్ ఆవిడతోనే ఉండాలని ఆవిడకి ఉంటుంది. చాలామటుకు అలాగే ఉంటాడు. ఎప్పుడేనా ఒక్కరోజు ఏదైనా సినిమాకో పార్టీకో వెళ్లాలనుకున్నామా, ఇక అంతే. ఆవిడకి ఇన్సెక్యూరిటీ వచ్చేస్తుంది"

"అవునా? అయ్యో... అలా ఉంటే బలే కష్టం. అప్పుడెలా మరి?"

"ఏం చేస్తాం? నిన్న రాత్రి ఆవిడకి తోడు మా అబ్బాయి ఉన్నాడు కదా అని ఇద్దరం సినిమాకి వెళ్దామనుకున్నాం. చాలా చాలా బావుందని మంచి రివ్యూలు వచ్చిన మూవీ. వీలు కుదిరితే వెళ్లాలని ఎప్పట్నించో అనుకుంటున్నా. శనివారమైతే సెకండ్షో కి వెళ్లినా, ఆదివారం కాస్త తీరిగ్గా లేవచ్చుఅనుకుంటుంటే, ఆన్లైన్లో బాబీ బుక్ చేసి పెట్టాడు మాఇద్దరికీ. పనులన్నీ పూర్తి చేసేసి, భోజనాలు వడ్డించా. 'అమ్మా ఇలా సెకండ్ షో కి వెళ్తున్నాం, బాబీ ఇంట్లో ఉన్నాడు కదా. పన్నెండింటికల్లా వచ్చేస్తాం' అని చెప్పాడు నవీన్. అలా వీల్ చెయిర్లో కూర్చుని తింటున్నావిడ కాస్తా ఒక్కసారి కళ్లనీళ్ల పర్యంతం అయిపోయారు. 'ఎందుకు వాడు మాత్రం? ఇల్లు తాళం పడేసి వెళ్లిపొండి. ఉంటే ఉంటాను.... పోతే పోతాను.... పోతే పీడా విరగడైపోతుంది. అసలు పెద్దవాళ్లు బతికి ఉండకూడదు. డెబ్బై రాగానే టపా కట్టెయ్యాలి" అంటూ ఏమిటేమిటో...ఒక్క పది నిముషాల్లో వాతావరణం అంతా తారుమారైపోయింది"

"అయ్యో మరి వెళ్లారా లేదా?"

'ఇంకేం వెళతాం? నవీన్ ఆవిణ్ని సముదాయించి పడుకోబెట్టేసరికి పదకొండైంది'

"మరీ అలా ఉండకూడదు పెద్దవాళ్లు. అయినా మీరు ఇంత బాగా చూసుకుంటారు కదా. ఆవిడకి కాస్తైనా ఆలోచన ఉండద్దూ? వారమంతా పనితో అలసిపోయి ఉంటారు, కాస్త మార్పు కావాలని తోచద్దూ? కొడుకూ కోడలూ సరదాగా బయటికి వెళ్తామంటే అంత కుళ్లిపోవాలా?"

"ఇందులో ఎవరిదీ తప్పు కాదులే రూపా. ఆవిడ నిజానికి అలాంటి మనిషి కాదసలు. పరిస్థితిని అనాలి. చాలా కాలం ఆవిడ సరదాగా తిరుగుతూ జోకులేస్తూ ఇంట్లో అన్నిటికీ సాయం చేస్తూ ఉన్న మనిషే"

"నువ్వు మరీను. భర్త ఉన్నప్పుడు సరే. ఒంటరిగా అవగానే ఇలా విసిగించేస్తే కష్టమే. తను కదల్లేరు కదా అని మీరూ సన్యాసం పుచ్చుకోవాలంటే ఎంత అన్యాయం?"

"అయ్యో అలా కాదులే రూపా. నిజానికి నవీన్ వాళ్ల నాన్నగారు పోయి చాలాకాలమయింది. నా పెళ్లి నాటికే ఆయన లేరు. ఆవిడ మొదట్నించి ఇలాగే లేరు. నాతో ప్రేమగానే ఉండేవారు. మేం హాయిగా సినిమాలకీ షికార్లకీ వెళ్లేవాళ్లం. అప్పుడప్పుడు ఆవిడా మాతో వచ్చేవారు. ఇంగ్లీష్ సినిమాలకి కూడా తీసుకుపోయేవాళ్లం. కిందటేడు వీల్ చెయిర్లోనే ఒక సినిమాకి తీసుకెళ్లాం. ఇప్పుడు మాత్రం అస్సలు బయటికి రాలేని స్థితి. కొద్దిసేపు కూడా కూర్చోలేరు. ఇన్ సెక్యూరిటీ. ఎవరూ తీసేయలేని దిగులు పాపం"

రూప, మాధవి మాటలకి ఆశ్చర్యపోయి ఉంటుంది. నేనే ఆశ్చర్యపోయాను.

"నువ్వు బలే ఉన్నావే. అసలు ఈ రోజుల్లో దగ్గర ఉంచుకోవడమే విశేషం అంటే, ఇంత పాజిటివ్ గా ఎలా ఉండగలుగుతున్నావ్?"

"అంత మరీ ఆశ్చర్యపోకులే. నేనూ మనిషినేగా. మేమే చూడాలా ఎప్పుడూ అని ఒకోసారి నాకూ విసుగొస్తుంది. కొద్దిరోజులు కూతురింట్లో ఉంటే తప్పేముంది అనిపిస్తుంది. కానీ పాపం మా ఆడపడుచు బాగా చూసినా హఠాత్తుగా ఆస్పత్రికి వెళ్లాల్సొస్తుందేమో అని ఈవిడ భయం. అలా అవసరమయితే కూతురు తీసుకెళ్లలేదని బెంగ. పెద్ద దూరమేం కాదు. ఫోన్ చేస్తే చాలు అర్ధ గంటలో వెళ్లగలం. అయినా అక్కడుండరు. రెండు రోజులుండి మూడోరోజుకల్లా వెనక్కి తీసుకొచ్చేయమంటారు. కొడుకు మీద నమ్మకం, ప్రేమా! వారమంతా పనిలో మునిగి ఉంటాం కదా, సెలవొస్తే ఆయనతో సరదాగా గడపాలని నాకూ ఉంటుంది కదా"

"ఎందుకుండదూ? అసలు నీ అంత బాగా మంచానపడ్డ అత్తగార్ని చూసేవాళ్లు ఎక్కడా కనపడరు"

"మరీ అంతేం లేదులే. ఆవిడా నన్ను కూతురికన్నా ఎక్కువగా చూసిన మనిషే"

"అయ్యబాబోయ్. నువ్వు మామూలు మనిషివి కాదు!"

"అంత గొప్పదాన్నేం కాదులే. నిన్న కుళ్లుకుని కాసేపు ఏడ్చాను కూడా"

"ఆహా... మరి ఇప్పుడీ కబుర్లేమిటి? నిన్ను చూసి నేను ఆశ్చర్యపోవాలనా?"

"అది కాదు రూపా, మనిషిని కదా భావోద్వాగాలుంటాయి. నాకైనా ఆవిడకైనా అవి సహజమే. అలా దుఃఖ పడ్డాక ఆవిడా సద్దుకున్నారు. కాసేపు ఏడ్చుకున్నాక నేనూ సర్దుకున్నాను"

"మరి మీ ఆయన ఏమన్నారు?"

"ఏమీ అనలేదులే పెద్దగా. ఆవిడ స్థితి ఎవరికైనా అర్థమయ్యేదే కదా"

"నేనడిగేదీ.. నీ సంగతి"

"నా సంగతా.. ఏముంది? కాసేపు నవీన్ బతిమాలి సముదాయిస్తే నాకూ బాధ తగ్గి పోయింది"

"అబ్బా... బలే! ఇంట్లోనే సినిమా..ఇంకేం కావాలి?" ఏదేదో ఊహిస్తున్నట్టు చిలిపిగా నవ్వు.

"చాల్లే ఎప్పుడూ నువ్వు. ఇదిగో పులి అంటే అదిగో తోక అంటావ్"

"నేనలా అనలా. ఇదిగో పార్కు అంటే అదుగో డ్యూయెట్ అన్నా" మళ్లీ కిలకిలా నవ్వు. "మరి నిన్న మీరు సినిమా వదిలేసి ఇంట్లోనే ఉండిపోయారు కదా. ఇవాళ పొద్దున్న ఆవిడేం అనలేదా?"

"లోలోపల ఎలా ఫీలయ్యారో. చిన్న పిల్లలా కొడుకూ కోడలూ సినిమాకి వెళ్తానంటే అడ్డుపడ్డానని సిగ్గుపడి ఉంటారు. మొహం చెల్లలేదు ఇవాళ. నన్ను తిన్నగా చూడలేకపోయారు. నాకే జాలేసింది. నేనే కల్పించుకుని మాట్లాడా, కాఫీ ఇచ్చినపుడు"

"బాబోయ్! నువ్వు ఈ గ్రహానికి చెందిందానివి కాదు తల్లీ! నేనింక వెళ్తా!"

"వెళ్లు. అదిగో రన్నింగ్ అయిపోయినట్టుంది, నవీన్ చెయ్యూపుతున్నాడు. నేనూ వెళ్లాలి"

పార్కుకొచ్చి చాలాసేపయిందని గుర్తొచ్చింది. అంతరంగం మరుగుజ్జులా కనిపిస్తుంటే, నేనూ లేచాను, సిగ్గు పడుతూ.

# దిష్టి విద్యార్థి

"అడిగో, అడిగో, అడిగో ట్రంపొచేస్తున్నాడు. ట్రంపు. హమ్మో!!! ట్రంపు, ట్రంపు, ఇంకా ఏమన్నా ఉందా? ఈ ముద్ద తిను, తొందరగా, తొందరగా..., లేకపోతే నిన్ను ట్రంపు పట్టుకెళ్లి పోతాడు, హమ్మో!!! అడిగో, అడిగో వచ్చేస్తున్నాడు ట్రంపు, హమ్మో", అని టివిలో నడుస్తున్న

బొమ్మను  చూపెడుతూ ఎత్తుకున్న చిన్ని పాపకు తినిపిస్తున్నారు పెద్దావిడ. ముద్ద నోటి దగ్గర పెట్టబోతే ఒక్కసారిగా విరుచుకుని మొహం అడ్డంగా తిప్పింది ఆ పాప. మొహమంతా, రింగు రింగుల వత్తు జుట్టుకంతా అన్నం ముద్ద తుడుచుకుపోయింది. ఇంకొక రెండు వారాల్లో సంవత్సరం నిండుతాయి.

"అబ్బబ్బ, చచ్చిపోతున్నాను బాబూ దీనితో, ఇదే రాక్షసి. దీనికే ట్రంపు భయపడాలి, వట్టి గడుగ్గాయ" అన్నారు పెద్దావిడ.

"బేబీ, చంటి పిల్లలను మరిపించి, మురిపించి, తినిపించాలి. అలా భయపెట్టమాకు. పైగా వాళ్ల దేశ నాయుకుడు కూడానూ, అలా అనటం తప్పు బేబీ" సలహా ఇచ్చారు పెద్దాయన.

"బేబీ బేబీ అని మాటి మాటికీ పిలుస్తారేంటి, నా పెళ్లికి ముందు మా వాళ్లు పిలిచేవారని, మనవరాలొచ్చినా ఇంకా పిలుస్తారేం, మీకు ఎన్ని సార్లు చెప్పాలి నన్ను బేబి అనటం మానేయమని".

"ఇంకా అలా పిలవనులే బేబీ, అలా అంతగా ఖస్సురుకోమాకు".

"ఆ, ఎన్నయినా చెబుతారు, తీరిగ్గా వాలు కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ, పేపరు తిరగేస్తూ. సలహాలిచ్చే బదులు, మీరే పెంచరాదు మనవరాలినీ? లేకపోతే చంటి పిల్లల పెంపకం ఎలా అని పుస్తకం రాయండి. తెల్లారి లెగిస్తే అన్నీ జేరెయ్యాలి, ఈ పిల్లని పెంచాలి, బాబోయ్, మోకాళ్లు పడిపోతన్నాయి."

"బేబీ, ఇంకొక రెండు రోజుల్లో అమెరికా బయలుదేరుతున్నావు, ఈ ఆరు నెల్ల నుంచి పాప అరుపులు అల్లర్లతో ఆనందంగా గడిచింది. మీరిద్దరూ అమెరికా వెళ్లటం తలుచుకుంటూంటే నాకు కాళ్లూ చేతులూ ఆడడంలేదు".

"ఏం, మీరూ రావచ్చుగా, అమ్మాయీ అల్లుడూ మీకు కూడా టికెట్టు పంపిస్తానన్నారుగా? వాళ్ల పిల్లను వాళ్లకప్పగించవద్దూ? ఎంత జాగ్రత్తగా చూసుకుంటున్నామూ? పాపకు ఏ చిన్నదయినా వస్తే ఎంత భయం? ఎంత ఆందోళన? అప్పగించి నేను భాద్యత తీర్చుకోవాలి. అయినా ఇక్కడ మీకు ఎస్టేట్ ఏముందనీ? ఎస్టేట్ వ్యవహారులు మీరుక్కడుండి నడపటానికీ?"

"అలా అనమాకు బేబీ, వచ్చే నెలలో పెన్షన్ సంతకం పడాలి, పిల్లలకి భారమవ్వకుండా మన జాగ్రత్తలో మనం వుండాలి కదా".

"అబబబ్బా, ఎత్తుకు తిప్పలేకపోతున్నా. కిందకి దించితే ఒకటే పరుగు, దేనికి కొట్టుకుని దెబ్బలు తగులుతాయో! పరిగెత్తి కాపాడలేకపోతున్నా, మోకాళ్లు పడిపోతున్నాయి బాబూ, హమ్మో, ఇదిగో కాసేపు వళ్లో పెట్టుకోండి, కొంచెం పెరుగన్నం కలుపుకొస్తాను", అంటూ పాపని తాతగారి వళ్లో కుదేసి వంటింటిలోకి వెళ్లింది బేబి.

తాతగారి జేబులోనుంచి పెన్ను లాక్కుని అదే పెన్నుని తిరగేసి తాతగారిని రెండు సార్లు పొడిచింది పాప గడుగ్గాయ. తాతగారు చదువుతున్న దినపత్రికని అదే పెన్నుతో నాలుగు సార్లు పొడిచి చింపింది. తాతగారు ముచ్చటగా చూసుకుంటున్నారు. పెద్దావిడ పెరుగన్నం కలుపుకొొచ్చి తినిపించసాగారు.

"బేబీ, పాప పెన్నుతో ఏదో రాస్తానంటున్నది. మొల్ల లాగా గొప్ప రచయిత్రవుతుందోమో?"

"ఫెమినిస్టు రచయిత్రయ్యి మీలాగా తీరికగా కూర్చుని కబుర్లు చెప్పేవాళ్లని యేకి యెండేస్తుందిలేండి. పసి పిల్ల ఏదో పెన్నుతో ఆడుతుంటే మీకు బడాయి బాగానే పొంగుతున్నది."

"బేబీ, రేపుకాక ఎల్లుండే నీ ప్రయాణం. ప్రయాణం జాగ్రత్త, ఇప్పుడు దాకా చక్కగా పెంచావు, మనకి మనవరాలయినా, తల్లి తల్లేకదా. జాగ్రత్తగా మనమ్మాయికి అప్పగించాలి. పత్రికల్లో ఎన్ని చదువుతున్నాం? టీవీలో ఏమిటేమిటో చెబుతున్నారు. ఎవర్నీ నమ్మలేకపోతున్నాం. లోకం తీరు అంతా భయం భయంగా ఉంది. కాలం బాగుండలేదు. ఫ్లయిట్లోనూ, ఎయిర్‌పోర్టుల్లోనూ ఎవరినీ నమ్మబాకు. ఎప్పుడు వీలయితే అప్పుడు పాపకి దిష్టి తీసెయ్యి. ఇంకా రెండు వారాల్లో పాప పుట్టిన రోజు. వాళ్లు చేసుకునే పార్టీకి పాప నవ్వుతూ ఉండాలి కదా! నీ కోసం ప్రయాణమంతా ఎయిర్ పోర్టులలో వీల్ చెయిర్ కూడా బుక్ చేసామని చెప్పారు అల్లుడుగారు".

"నా కోసం ఏం కాదులెండి వీల్ చెయిరు, ఆ జాగ్రత్తలు వాళ్ల అమ్మాయి కోసం. ఇక్కడ దీని వెనకాల పరిగెత్తగలదాన్ని, ఎయిర్ పోర్టుల్లోనూ నడవగలను. హవ్వ, నేను వీల్ చెయిర్లో వెళ్లటమేంటి? సిగ్గు వేస్తోంది".

✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈

ఫ్లైట్ బయలుదేరడం ఆలశ్యమయ్యింది. దుబాయిలో మారాలి, ఆ ఫ్లైట్ అందుతుందో లేదో? వీల్ చెయిర్ ఉందిగా, కొంచెం కుదుట పడింది బేబి.

పిల్లలున్న వాళ్లనీ, వీల్ చెయిర్ వాళ్లనీ ముందు పిలుస్తున్నారు. తను రెండూనూ. సీట్లో కూర్చునేటప్పటికి తెల్లవారు ఝాము నాల్గయ్యింది. పాప నిదురబోతోంది. ఫ్లైట్ పైకి లేస్తే కానీ క్రిబ్ పెట్టనన్నది ఎయిర్ హోస్టేస్. ఇల్లంతా సర్దుకుని రావటం, క్రితం రోజు రైలు ప్రయాణం, రాత్రంతా నిద్ర లేదు. వళ్లు పులిసనట్టనిపిస్తోంది. నిద్ర పోతున్న పాపను చూస్తే మాత్రం హాయిగా అనిపించింది. కానీ ఏదో ఒక భాధ్యత తీర్చుకుంటునట్లుంది.

కాసేపటికి ఎవరో ఒక అమ్మాయి వచ్చి బేబి ప్రక్కన కూర్చుంది. బేబి ఎందుకో కొంచెం వెగడ్పాటుతో ఆ అమ్మాయిని చూసి, పాపను ఇటు ప్రక్కకి తిప్పి పడుకోబెట్టుకుని ఆలోచనలో పడింది, 'ఏమిటీ ఈ ఎముకల గూడు, వంకర పళ్లు? నల్లగా అశోక వనంలో సీతమ్మకు కాపలా పెట్టిన కటికదానికి లాగా ఉన్నది. పిడకల కొట్టుకునే మొఖం ఫ్లైయిటెక్కిందేమిటీ? అమెరికాలో అమ్మాయి ఇంటికి వెళ్లగానే పాపకి దిష్టి తియ్యాలి'.

ఫ్లైట్ లేచి గాలిలోకి ఎగిరేటప్పటికి కునుకు పట్టబోయింది. పాప లేచింది. అరుపులు కేకలతో ఆటలు మొదలు పెట్టింది. ఓపిక లేదు, అయినా ఏదో కబుర్లు గుసగుసలాడుతూ మభ్య పెట్టబోయింది. పాప గడుగ్గాయ నిగడదన్ని వళ్లో గంతులేయటం మొదలు పెట్టింది. అసలే పులిసిన వళ్లు, పాప గడుగ్గాయ తన్నులకు వళ్లు హూనమవుతోంది.

ఒక్కసారిగా ప్రక్కన కూర్చున్న ఆ అమ్మాయి పాపనందుకుంది. "ఇటీయండమ్మా, నాల్గేళ్లగా దుబాయిలో పిల్లల్ని పెంచే ఆయాగా సేత్తుండా, పిల్లాన్లంటే బోల్డె మురిపెం". తనకి అర్ధమయ్యే లోపల పాప ఆ అమ్మాయి ఒళ్లోకి చేరుకుంది. పాప గడుగ్గాయ ఆ అమ్మాయి మొఖమంతా తన వేళ్లతో పోడిచింది. పెదాలు బిగించి "టుర్ర్ర్ర్ , బ్ర్ర్ర్ర్" అంటూ ఉమ్మంతా ఆ అమ్మాయిమొఖాన చిందించింది. ఉన్నట్టుండి పాప ఏడవడం మొదలుపెట్టింది. బేబి పాపని తీసుకోబోయింది.

గభాలున ఆ ఆ అమ్మాయి పాపను పైకెత్తి వెనక్కి తిప్పి వాసన చూసింది. "మడ్డెట్టింది" అంటూ లేచి పాపని బాత్రూముల దగ్గరికి తీసుకువెళ్లింది. బేబికి ఉన్నట్టుండి భయమేసింది. పాపను ఏం చేస్తుందో. వెళ్లి చూసే సరికి పాపను చక్కగా డయాపార్ టేబుల్ మీద పడుకోబెట్టి కబుర్లు చెపుతూ, పొట్ట మీద చిన్నగా చక్కిలిగిలి పెడుతూ, నవ్విస్తూ డయాపర్ మారుస్తోంది. బేబి ఆశ్చర్యపోయింది, 'అయినా ఈ పాప ఏమిటీ? తన చేతుల్లో ఎప్పుడూ కుదురుగా కూర్చోదు, ఈ కటికదాని దగ్గర అంత కుదురుగా పొడుకుంది?'

పాపని తీసుకుని మళ్లీ వచ్చి సీటులో కూర్చున్నారు. ఎయిర్ హోస్టేస్ క్రిబ్ ఎదురుగా గోడకు తగిలించింది. "బిడ్డకు బాటిలట్టుకొచ్చారా అమ్మా?" అడిగింది ఆ అమ్మాయి. బాగ్ లోనుంచి పాల సీసా తీసి తనే పాలుబట్టబోయింది బేబి. ఒక్కసారిగా మొఖం తిప్పుకుంది పాప గడుగ్గాయ. "బాటిలిటివ్వండమ్మా" అని తీసుకుని గబ గబా వెనక్కి వెళ్లింది ఆ అమ్మాయి. కాసేపటికి వచ్చి "యేణ్ణీళ్లల్లో యెట్టి యేడి సేయించుకోచ్చినా" అంటూ పాపని తీసుకుని పాలు పట్టించింది. బేబి ఆలోచనలో పడింది. 'నిజమే, తనకి డిగ్రీ ఉంది. పైగా ఉద్యోగం కూడా చేసింది. తనకి లేని ఒడుపు ఈ కటికదానికి ఉంది'.

పాప పాలు తాగి కేరింతలు కొట్టటం మొదలు పెట్టింది. బేబికి అప్పుడు అనుమానమొచ్చింది, 'ఈ కటిక మనిషి పాలల్లో ఏమన్నా కలుపుకొచ్చిందేమో? హమ్మో, హమ్మో ఇంకా ఏమన్నా ఉందా?'ఆందోళన, కణతలు అదురుతున్నాయి. పాపను ఆ అమ్మాయి దగ్గర నుండి లాక్కోబోయింది. పాప గడుగ్గాయ రానంది. ఆ అమ్మాయి తన చవక రకం సిల్కు చీర పైటతో పాపతో దోబూచి ఆడుతున్నది. పాప గడుగ్గాయ ఎగిరెగిరి కేరింతలు పెడుతోంది.

క్రిబ్ వేశారు కదా, మళ్లీ పొడుకోబెడదాము అని పాపనందుకొని బలవంతంగా జో కొట్టబోయింది బేబి. పాప గడుగ్గాయ విరుచుకుని, అఘాటున క్రిబ్ అంచును పట్టుకు లేచి నిలబడింది. కాళ్లాడిస్తూ ఎగిరి దూకబోయి కింద పడబోయింది. ఆ అమ్మాయి గభాలున పాప పడిపోకుండా అందుకుంది. "యేటో నమ్మా, మా పోర్లందరికీ గుడ్డ ఉయ్యాలే, ఒదిగొదిగి బొబ్బుంట్రు, యీ క్రిబ్బులేటో?" అని పాపని ఒళ్లో పెట్టుకుని జోకొట్టటం

మొదలు పెట్టింది. పాప నిద్రపోయింది. ఇప్పుడయినా క్రిబ్బులో పడుకోపెడదామనుకుంటే ఎయిర్ హోస్టేస్ ఫ్లైట్ దుబాయిలో దిగబోతున్నది అని క్రిబ్ తీసేసింది. పాప ఆ అమ్మాయి వళ్లో అమాయకంగా నిద్ర పోతున్నది. ఆ అమ్మాయి తన చిటికెన వేలుతో తన కళ్ల కాటుకుని తుడిచి పాప బుగ్గన చుక్క పెట్టింది.

"నువ్వు ప్రక్కన కూర్చోబట్టి, ఈ కాస్త ప్రయాణం తేలికగా సాగిందమ్మా, లేకపోతే నేనొక్కటే పాపను ఎలా చూసుకునేదాన్నో?"

"ఏటమ్మా అలాగంట్రు, పోర్లు సుఖూనుంటే మనకి దిల్‌కుశ్ అవుద్ది", అన్నది ఆ అమ్మాయి.

బేబి మొదటిసారిగా ఆ ఆ అమ్మాయి కళ్లల్లోకి సూటిగా చూసింది.

"ఏటోనమ్మ మీ లాంటోళ్లక మల్లే మా పోర్లను సదివించుకోవాలని ఈ తిప్పలు, నా బిడ్డల్ని వదిలేసొచ్చినా. మళ్లీ ఏడాదిక్కాన్నీ సూసుకోలేను, ఏ బిడ్డని సూసినా నా బిడ్డలే అగుపడ్తరు", పైటతో కళ్లు తుడుచుకుంది ఆ అమ్మాయి.

✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈

దుబాయిలో దిగేసరికి న్యూయార్క్ వెళ్లే వాళ్లనందరిని పక్కన పెడుతున్నారు. తను వచ్చిన ఫ్లైట్ ఆలశ్యమవ్వటంతో కనెక్షనికి ఇంకా పది నిమిషాలే ఉంది. బేబికి పులిసిన వళ్లు జ్వరం వళ్లు లాగా మారతున్నట్టనిపించింది. లేని ఓపిక తెచ్చుకుని తన బాగు, పాప డయపర్ బాగు, గేటు దగ్గరిచ్చిన స్ట్రోలర్ అన్నీ పోగేసుకుని, పాపతో పాటు వీల్ చెయిర్ కోసం అటూ ఇటూ చూసింది. తనలాగే ఇంకా బోలెడు మంది పెద్దవాళ్లు చంటి పిల్లలని తీసుకువెళ్తున్నారు. ఉన్న వీల్‌చెయిర్స్ చాల లేదు. కొంత మందిని పంపించారు, తనని ఆగమన్నారు.

ఆందోళన. ఫ్లైట్ తప్పిపోతుంది. పాపను వాళ్ల అమ్మా నాన్నకి అప్పగించాలి. ఆశగా వీల్ చెయిర్ వస్తుందేమోనని రెండు మూడు నిమిషాలు అన్ని వైపులకీ తిరిగి చూసింది. స్ట్రోలర్ అటువైపు తిప్పబోతే, బరువులేదు.

బేబి చుట్టూ చూసింది, పాప ఎక్కడా కనిపించలేదు. పాప ఏదీ?. గుండె వేగంతో కూలబోయి, వెనక వున్న కుర్చీ మీద అధాటుగా పడిపోయింది. ఆలోచనలు పరిపరి విధాలుగా పరుగెత్తాయి 'పాప ఏమయ్యిందీ? ఈ పాప గడుగ్గాయ నడక రాకముందే పరుగు నేర్చింది. ఎటు పోయిందో ఏమో? హమ్మో, హమ్మో ఎక్కడ పడుతుందో, ఏది తగులుతుందో, ఊరు కాని ఊరు. ఏం చెయ్యటం? లేకపోతే ఎవరన్నా తీసుకువెళ్లారా?' ఆందోళన.

కళ్లు తేలిపోతున్నాయి. లీలగా ఒక పిల్లి గడ్డం వాడు పాపని ఒక రెక్క పట్టుకుని మగవాళ్ల బాత్రూంలోనుంచి వస్తున్నాడు. బేబికి గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి, 'హమ్మో, హమ్మో, పాపని ఎవడో ఎత్తుకుపోతున్నాడు, హమ్మో, హమ్మో. తన వైపే వస్తున్నాడే?'

పాపను ఒక చేత్తో వేలాడదీసుకుంటూ మోస్తూ, రెండో చేత్తో తన చేతిలో ఉన్న బోర్డింగ్ పాసుని లాక్కున్నాడు.

"అమ్మీజాన్, న్యూ యార్క్? మై శాన్ ఫ్రాన్సిస్కో జానా, దోనోం ఫ్లైట్స్ ఏక్ తరఫ్, ఆవ్" అని తన రెండు బ్యాగులను భుజానికి తగిలించుకున్నాడు. పాపని భుజాన వేసుకుని, తనతో రమ్మని వడి వడిగా నడవడం మొదలుపెట్టాడు. బేబికి తప్పలేదు, జ్వరం వళ్లు. అయినా ఆ కుర్రాడి వెనక పాప కోసం పరిగెత్తింది. "నన్ను పట్టుకో, చూద్దాం" అన్నట్టు కేరింతలు పెడుతూ పాప గడుగ్గాయఆ కుర్రాడి వీపును చేతులతో చరుస్తోంది. ఆ పిల్లి గడ్డం కుర్రాడే గబా గబా సెక్యూరిటీ లైన్ ముందుకి తీసుకువెళ్లి "ఛిల్డ్రెన్ ఎండ్ సీనియర్ సిటిజన్" అని చెప్పి మళ్లీ బ్యాగ్లు తీసుకుని పరుగు నడకతో న్యూయార్క్ ఫ్లైట్ గేట్ దగ్గర దిగబెట్టాడు.

గేట్ ఏజెంట్ బోర్డింగ్ పాస్ తీసుకుని ఆఖరి పాసింజర్ కూడా వచ్చింది అని ఫ్లైట్ క్రూ కి వయిర్‌లెస్లో చెప్పింది. ఫ్లైట్ గేట్లోకి వెళ్లబోతూ ఒకసారి ఆ పిల్లి గడ్డం కుర్రాడిని సరిగ్గా చూద్దామని వెనక్కి తిరిగిచూస్తే ఎక్కడా కనిపించలేదు.

✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈

బేబికి రెండు రోజులుగా నిద్ర లేదు. కానీ పాప జాగ్రత్తతో మగతగా కళ్లు మూసుకుంది. పాప గుర్తొచ్చి ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచింది. క్రిబ్లో పాప గడుగ్గాయ అమాయకంగా నిద్రబోతున్నది. ప్రక్కన తనలాగా ఇంకొక బిడ్డను తీసుకు వెళుతున్న పెద్దావిడ కూర్చుంది.

బేబికి ఒక్కసారిగా ఆకలివేసింది. తను ఏమన్నా తిని ఒక రోజు అయ్యినట్టుంది. పాప లేచేలోపల కొంచెం తిందామనిపించి అటు వెళుతున్న ఎయిర్ హోస్టెస్‌ని "ఫుడ్" అని అడిగింది. ఫుడ్ సర్వీస్ అయ్యిపోయింది, వెజిటేరియన్ అయితే ఏమన్నా మిగిలిందో లేదో, వెతికి తీసుకువస్తానని వెళ్లింది. ఎంతసేపటికి రాలేదు. 'ఫర్వాలేదు, ఇంకెంత? ఆరేడు గంటలలో న్యూయార్క్ చేరిపోతాంకదా!. అమ్మాయి ఇంటికి వెళ్లి తినవచ్చు. అయినా ముందు పాపను అప్పచెప్పి బాధ్యత తీర్చుకోవాలి కదా!', అనుకుంది బేబి.

ఉన్నట్టుండి పైలట్ ఎనౌన్స్‌మెంట్. అందరూ గుసగుసలు. హమ్మో హమ్మో ఏం జరుగుతన్నదో? ఒక్కసారిగా బేబికి వెన్ను జివ్వుమన్నది. తేరుకుని అమాంతం నిద్ర పోతున్న పాపను క్రిబ్బులోనుంచి లాక్కుని కావులించుకున్నది.

ఎయిర్ హోస్టెస్సులు ఒక్కొక్కరి దగ్గరికీ వచ్చి భయంలేదని చెపుతున్నారు. కొంత సేపటికి కానీ అర్థంకాలేదు, న్యూయార్క్‌లో మంచు తుఫాను. అక్కడకి వెళ్లే ఫ్లైట్సన్నిటినీ దారిలో అక్కడక్కడా ఎమర్జెన్సీగా దించేస్తున్నారని.

ఉన్నట్టుండి పెద్ద దిగులు కమ్మింది బేబికి, 'ఇంకా ఐదారుగంటలే అనుకుంటే ఈ అవాంతరమేమిటి?'

ఐస్ లాండ్ లో ఫ్లైట్ దిగింది. రైక్యావిక్ అన్నారెవరో. ఇంకా అలా దిగిన విమానాలు రెండు ఉన్నాయి. కిటికీలోనుంచి చూస్తేనే ఒక్కసారిగా చలి వణుకులు పుట్టాయి. ఎయిర్ పోర్టులోనే పడి ఉండాలన్నారందరినీ. రైల్వే ప్లాట్‌ఫారం లాగా ఎంతోమంది అడ్డదిడ్డంగా పడుకుని ఉన్నారు. ఇంతలో పిల్లలున్న వాళ్లకి మాత్రం హోటల్లో ఏర్పాటు చేసామన్నారు.

❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄ ❄

హోటల్ రూం బాగానే ఉంది. అయితేనేం, పాపను అప్పగించే బాధ్యత ఉండిపోయింది. ప్రపంచంలో ఎక్కడ ఉన్నామో తెలియటంలేదు. ఎటు చూసినా ఒక కొత్త ప్రపంచం, వింత ప్రపంచం. కిటికీలోనుంచి చూస్తే దూరంగా మంచు పర్వతాలూ, చలికి గడ్డ కట్టుకున్న జలపాతాలూ. 'ఇదేమిటి? ఇంత చలి ప్రపంచంలో దిగిన విమానం న్యూ యార్కులో దిగలేదా? ఇదేం అవాంతరం? ఆందోళన. పాపను భద్రంగా అప్పగించాలి'.

పాప లేచి ఆడుకోవటం మొదలు పెట్టింది. కాసేపటికి ఏడవటం మొదలు పెట్టింది. పాపకు ఆకలి. తనకు కూడా ఆకలి. నిజమే, తను ఏమన్నా తిని రోజున్నర పైన అవుతున్నట్టుంది. అయితేనేం పాపకు ముందు ఏమన్నా తినిపించాలి. ఏమని అడగడం, ఎవరిని అడగడం. ఏం చెయ్యాలో ఏమీ అర్థం కాలేదు. పాప గొంతు పెంచి ఏడవటం మొదలు పెట్టింది.

ఉన్నట్టుండి తలుపు కొట్టిన చప్పుడు. బేబీకి భయంవేసింది. "రూం సర్వీస్, బేబీ ఫుడ్" అన్నట్టు అర్థమయ్యింది. తలుపు కొంచెం తీసి చూడబోయింది. బయట ఎవరో ఒక పెద్ద గుండు తల, ఆరున్నర అడుగల తెల్లని మనిషి, కండలు తిరిగిన పెద్ద శరీరం. బేబికి ఒక్కసారిగా గుండె దడ పెరిగింది. 'హమ్మో, హమ్మో, ఎవడో తెల్ల గజాసురుడల్లే ఉన్నాడు' అనుకుంటూ వెనకకి గభాలున పరిగెత్తి, పాపను గట్టిగా కావులించుకుని, ఉలుకూ పలుకూ లేకుండా భయంతో అలాగే నిలబడిపోయింది. ఆ భారీ మనిషి తలుపు తోసుకుని ఒక ట్రేలో ఏవో తీసుకు వచ్చాడు. ఒక బేబీ చెయిర్ కూడా తీసుకు వచ్చాడు.

తనతో ఏదో మాట్లాడతున్నాడు, ఏమీ అర్థంకాలేదు, అర్థం చేసుకునే స్థితిలో కూడా లేదు. అంత ఎత్తున తన దగ్గరకు వస్తున్నాడు, 'అమ్మో, అమ్మో'. పాపను ఇంకా గట్టిగా బంధించి కావులించుకుంది. మోకాళ్లు పట్టు తప్పి కూలబడబోయింది.'అమ్మో, అమ్మో'. బేబికి ఊపిరి ఆడటంలేదు.

పాప గడుగ్గాయ ఒక్కసారిగా నిగ్గదీసుకుని నిగడతన్ని, గట్టిగా వళ్లు విరుచుకుంది. బేబి చేతులలో పాప పట్టు తప్పి క్రిందకి జారి పడిపోబోయింది.

ఆ భారీ మనిషి ఒక్క ఉదుటున దూకి పాప క్రింద పడే లోపల పట్టుకున్నాడు. బేబి మోకాళ్ల వణుకుతో కుప్పకూలబోయింది. ఆ భారీ మనిషి తనకి కూడా ఊతం ఇచ్చి కుర్చీలో కూర్చోబెట్టాడు.

బేబి భీతితో తలెత్తి చూసింది. ఆశ్చర్యం!!! 'అదేమిటీ, పాప ఏడుపు ఆపేసింది? తెల్ల గజాసురుడి భుజం మీద పిచ్చిక పిల్లంతలేదు, వాడి ముక్కుని పట్టుకుని పీకి, వాడి గుండు తలని తప తపా కొడుతూ కేరింతలు కొడుతున్నది? ఇది నిజంగానే గడుగ్గాయ పిల్లే!'

ఆ భారీ మనిషి పాప గడుగ్గాయని బేబి చెయిర్లో కూర్చోబెట్టి, సీటు బెల్ట్ పెట్టి బంధించాడు. "మాల్ట్ సీరియల్" అని చెప్పి ఒక ప్యాకెట్ లోనుంచి బౌల్ లోకి వంపి, తనతో తీసుకొచ్చిన వేడి పాలతో కలిపి, పాపకి ఒక స్పూన్ తినిపించాడు. స్పూన్ పాప చేతికిచ్చి, తన మొద్దు వేళ్లతో పాప వేళ్లనీ, స్పూనునీ పట్టుకుని ఎలా తినాలో పాపకి రెండు సార్లు చూపించాడు. పాప తనే తినటం మొదలుపెట్టింది. ఉన్నట్టుండి ఎచ్చు ఎక్కువ అయ్యి ఒక స్పూనుతో సీరియాల్ తీసి ఆ భారీ మనిషి యూనిఫార్మ్ కేసి కొట్టింది. ఆ భారీ మనిషి తెరలు, తెరలుగా పగలబడుతూ, అట్టహాసము చేశాడు. పాప గడుగ్గాయకి ఇంకా ఎచ్చు ఎక్కువయ్యి నోట్లో సీరియల్ పెట్టుకుని "టుర్ర్ర్ర్ర్ర్ర్, బుర్ర్ర్ర్ర్ర్ర్" అంటూ పెదాలు బిగించి ఆ భారీ మనిషి మొహమ్మీదికి ఉమ్మేసింది. వాడు మళ్లీ అట్టహాసము చేసి, పాప తిన్న తరవాత వస్తానని వెళ్లాడు. పాప ఆకలిమీద ఉందేమో తనంతట తానే స్పూనుతో తినటం మొదలుపెట్టింది. తిన్నంత తిని, తన చుట్టూతా చిందించి నానా రభస చేసింది.

బేబికి ఆశ్చర్యం పెరిగింది, 'అయినా ఈ పాప గడుగ్గాయ ఏమిటీ? ఒక చోట కూర్చుని ఉన్నదేమిటీ? తనేమో నడుము పడిపోయేటట్టు ఎత్తుకుని తిప్పి తినిపిస్తుంది, మరి ఇదేమిటో? ఇది నిజంగానే గడుగ్గాయ పిల్లే, అందుకనే ఆ తెల్ల గజాసురుడు చెప్పినట్టు హుషారుగా తింటున్నది. అస్సలు భయమే లేదు!!!'

ఆ భారీ మనిషి మళ్లీ వచ్చాడు. పాప దగ్గరవన్నీ తీసేసి, కింద పడినదంతా శుభ్రం చేసాడు. పాపని కూడా వేణ్ణీలో తడి చేసిన టవుల్‌తో తుడిచి శుభ్రం చేశాడు. 'ఏమిటి వీడు ఆడంగి గజాసురుడు లాగా ఉన్నాడు? మన ఊళ్లో మగవాళ్లు ఈ పనులు చేయటం ఎప్పుడూ చూడలేదే?'

బేబికి ఇంతలో కిటికీలోనుంచి ఆకాశం వింత వింత కాంతులతో మెరుస్తూ కనిపినించింది. "హమ్మో, హమ్మో, ఇదేమిటి కొత్త ఉపద్రవం!!" అనుకొంటూ గుండె పట్టుకుంది.

ఆ భారీ మనిషి పాప గడుగ్గాయని భుజం మీద వేసుకుని, పాపకు కిటికీలోనుంచి మెరుస్తున్న ఆకాశాన్ని చూపిస్తూ గర గరలాడే గొంతుతో "నోర్దుల్యోస్, అరోరా బొరెయాలిస్" అన్నాడు. పాప గడుగ్గాయ కూడా కొత్త అద్భుతాన్ని చూస్తూ తన చిన్ని చిన్ని చేతులతో అర్థం కాని మాటలు చెబుతూ అరోరాను అందుకోబోయి, చప్పట్లు కొట్టింది.

మెల్లగా లాలి పాటలాగా పాడడం మొదలుపెట్టాడు.

"సోవ్వ్ ఉంగా ఆస్తిన్ మిన్
ఊటీ రెగ్నిరె గ్రాయ్ఘోర్
..
నిదురపో నా చిట్టితల్లి
చక్కగా నీ డోలికలో
చలి ఉలుకుల పోటుగాలి
వెచ్చగా ఉత్తరపు వెలుగులలో
పదిలంగా నా ఒడిలో
పదిలంగా నా రక్షలో

పాప గడుగ్గాయ అమాయకంగా నిద్రపోయింది. పరుపు మీద పడుకో బెట్టాడు. ఆ భారీ మనిషి కళ్లలోనుంచి రెండు చుక్కల నీళ్లు కారి పాప మీద పడ్డాయి. వాడు ఇంగ్లీషులో చెప్పేది ఏదో కొంత అర్థమయ్యింది. వాడికి పిల్లలు పుట్టే అదృష్టం లేదట. అందుకని ఏ పసి పిల్లలని చూసినా గుండె నిండుతుందట. అందుకని ఈ ఉద్యోగం మానేసి పిల్లల ఆసుపత్రిలో నర్సుగా చేరటానికి చదువుకుంటున్నాడట. ఎప్పటికైనా, తనకూ, తన భార్యకు ఒక పసి పాపను ఎత్తుకోవాలని ఉందట.

ఆ భారీ మనిషి కళ్లు తుడుచుకుని వెళ్లాడు. మళ్లీ తనకోసం ఒక ఫుడ్ ట్రే తెచ్చిపెట్టాడు. ఆకలి వేస్తోంది. వాడు వెళ్లిన తరువాత ప్లేట్ మీద ఉన్న మూత తీసి చూస్తే ఒక కాల్చిన చేప, నాలుగు ఉడకబెట్టిన బంగాళ దుంపలు. బేబికి అంత ఆకలి లోనూ వాంతి వచ్చినంత పనయ్యింది. బేబి నెమ్మదిగా తేరుకుని, పాప కోసం తెచ్చిన పాలు మిగిలినవి త్రాగింది.

పాప గడుగ్గాయ నోట్లో వేలు వేసుకుని అమాయకంగా నిదురబోతున్నది.

✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈ ✈

రెండు రోజులుగా సరిగ్గా నిద్ర లేదు. జ్వరం వళ్లు. అయినా మగత నిద్ర. ఎప్పటికి బయలుదేరతామో? ముందు పాపని భద్రంగా అమ్మాయికీ అల్లుడుకీ అప్పగించి బాధ్యత తీర్చుకోవాలి.

ఎక్కడో "నూ ఆర్క్" "నూ ఆర్క్" అంటూ అరుపులు వినపడ్డాయి. బేబి ఒక్క ఉదుటున లేచింది. గుండె దడ. తలుపు కొంచెంగా తీస్తే ఎవరో "నూ ఆర్క్?" అని ప్రశ్నిస్తున్నాడు. ఆలోచనలేదు, తొందర ఎక్కువయ్యింది. పాపను వాళ్ల తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించాలి. గుండె దడ పెరిగింది, 'మళ్లీ ఫ్లైట్ తప్పిపోతానేమో? హమ్మో!!!' పాపను అధాటున ఎత్తుకుని, బ్యాగులు తీసుకుని నిద్ర మొహంతోనే బయటకు వచ్చింది.



షెకేరే

అందరినీ బస్సులో ఎక్కించుకుని ఫ్లైట్ ఎక్కించారు. ఇదివరకటి ప్లైట్లో మొఖాలేవీ కనబడవే? పక్కనెవడో ఆఫ్రికావాడు కూర్చున్నాడు. బేబి ఆలోచనలో పడింది 'ఆ జుట్టూ, ఆ అవతరం చూస్తే జాంబవంతుడిలాగా ఉన్నాడు. ఏదైతేనేం ఇంకొక ఆరు గంటలు ఓపికపడితే భాధ్యత తీరిపోతుంది'.

విమానం పైకి లేచింది. పాప మళ్లీ ఆటలు మొదలుపెట్టింది. ఈ సారి తనే వైమానిక భామను అడిగి పాలు, సీరియల్ తీసుకుంది. పాప పనులు అయ్యిపోయాయి. ఇంకో నాలుగైదు గంటలు. బేబికి నెలల లెఖ్ఖ, వారాల లెఖ్ఖ, రోజుల లెఖ్ఖ. ఇప్పుడు గంటల లెఖ్ఖలోకి మారింది.

పాప నిద్ర మొఖం పెట్టి యేడవటం మొదలుపెట్టింది. ప్రక్కన కూర్చున్న ఆఫ్రికా మనిషి "నో బేబీ, నో క్రయ్యింగ్" అంటూ సణగటం మొదలుపెట్టాడు. వళ్లంతా జలదరించింది బేబికి, 'ఈ జాంబవంతుడు తనని బేబీ అని పిలవటమేమిటి?' ఒక క్షణం తరువాత సర్దుకుంది, పాపను బేబీ అంటున్నాడని. తనకు బేబీ అని పెట్టినందుకు తన వాళ్ల మీద చిర్రెత్తుకొచ్చింది.

ఆఫ్రికా మనిషి అధాటున పాపను తీసుకున్నాడు. ఎదుటి సీటు కింద తోసిన తన బ్యాగ్ లోనుంచి పూసలు అద్దిన ఒక పెద్ద గిలక తీసాడు. "షెకేరే బేబీ, షెకేరే" అంటు పాపకి ఇచ్చాడు. పాప గడుగ్గాయ ఆ గిలకను రెండు సార్లు ఊపి ఆఫ్రికా వాడు తలకేసి, మొఖానికి వేసి నాలుగు సార్లు బాదింది. ఆఫ్రికా మనిషి నీలుగుతూ పాప చేతిలోనుంచి ఆ గిలకను తీసుకుని, సంచిలోనుంచి "కషాక బేబీ, కషాకా" అంటూ పెద్ద పెద్ద గోళీలంతటి డొల్ల కాయలను జంట కట్టినవి తీసి పాపకి ఇచ్చాడు. పాప గడుగ్గాయ వాటిని అవతలకు విసిరికొట్టి, ఆఫ్రికా మనిషి జుట్టు పట్టుకుని గట్టిగా ఝూడించటం మొదలుపెట్టింది. ఆఫ్రికా మనిషి తన జుట్టు వదిలించుకుని, కషాక వెదికి, ఏరి మళ్లీ పాప గడుగ్గాయకి ఇచ్చాడు. పాప ఒక రెండు నిమిషాలు ఆడుకుని ఆవులించింది.



కషాక

ఆఫ్రికా మనిషి, "ఓ థాంక్ హెవన్స్! స్లీప్ టైం!!" అంటూ తన వళ్లో పాప గడుగ్గాయని బోర్లల పడేసుకుని ఒక డప్పు మీద దరువు వేసినట్టు గట్టిగా జో కొట్టటం మొదలుపెట్టాడు. "మాలింకే డిజెంబే" అంటూ

గున్ దున్ గొ డొ ప త గొ డొ
గున్ దున్ ప త గొ డొ ప త
గుంగున్ గొ డొ గుందున్ గొ డొ గుంగున్ గొడొ

గుంగున్ గొ డొ గుండున్ గొ డొ గుంగున్ గొడొ



అంటూ తాళం ప్రకారం తబలా వాయిస్తున్నట్టు పాప మీద దరువు వేసాడు. పాప గడుగ్గాయ అమాయకంగా నిద్రలోకి జారుకుంది. ఆఫ్రికా మనిషి పాపని క్రిబ్బులో పడుకోపెట్టాడు. తనవైపు తిరిగి "శివమణి తెలుసా, వచ్చే శనివారం నేను అతనూ కలసి కార్నజీ మెల్లన్ హాలులో ప్రదర్శన ఇస్తున్నాము. మాది మాలి దేశం, మాలింకే డ్రమ్స్, డిజెంబె ట్రూప్ తనద"ని చెప్పాడు. గభాలున జేబులోనుంచి ఫొటో తీసి చూపాడు, ఒక గర్భిణీ యువతి. ఆ ఫొటోలోనే, ఆమె పొట్టపైన చిన్నగా దరువు వేసి, ఫొటోలోని అమ్మాయినీ, ఆ అమ్మాయి పొట్టనీ మోత చేసుకుంటూ గట్టిగా ముద్దు పెట్టుకుని, గర గరా నవ్వుతూ మళ్లీ జేబులో పెట్టుకున్నాడు.

బేబి తిని రెండు రోజులవ్వుతున్నది. బేబికి కూడా నీరసంతో కళ్లు మూసుకు పోయాయి. కానీ మగత నిద్ర. పాపను అప్పగించాలి. బాధ్యత తీర్చుకోవాలి.

పాప గడుగ్గాయ అమాయకంగా నోట్లో వేలు వేసుకుని బోర్ల పడుకుని ఉంది. బేబి సీటు ఎదురుగా ఉన్న టివిలో ఫ్లైట్ మాప్ చూస్తూ క్షణాలు లెక్క పెట్టుకుంటున్నది. ఉన్నట్టుండి మాప్ ప్రక్కనే ఉన్న దిక్సూచి గిలగిలా కొట్టుకోవటం మొదలుపెట్టింది. బేబికి కూడా తల తిరిగుతున్నట్లనిపించింది, 'హమ్మో, హమ్మో మళ్లీ ఇదేదో కొత్త అవాంతరం, విమానం మళ్లీ చిక్కుల్లో పడిందేమో? పాపను అప్పగించాలి. హమ్మో, హమ్మో!!!' గుండె దడ, ఆందోళన. నిద్రపోతున్న పాపను క్రిబ్‌లోనుంచి లాక్కుని కావిలించుకోబోయింది.

అటుగా వెళుతున్న వైమానిక భామ బేబి ఖంగారుని గమనించి "వెజిటేరేన్ ఫుడ్ యేమీ లేదు, ఇంకా యేమన్నా కావలా "అని అడిగింది. బేబి అప్రయత్నంగానే ఫ్లైట్ మాప్ ప్రక్కన కొట్టుకుంటున్న దిక్సూచిని చూపించింది. వైమానికి భామ నవ్వి, "మనం ఇప్పుడు ఉత్తర ధ్రువం మీద ఉన్నాము, అందుకే అలా కంపాస్ కొట్టుకుంటున్నది. ఇంకొక ఐదు నిమిషాలలో ఫ్లైట్ దక్షిణంగా వెళుతున్నట్టు చూపిస్తుంది" అని చెప్పింది. బేబికి కొంత కుదుటపడిన తరువాత సిగ్గేసింది. ఇదివరకు తను పిల్లలకు హోం వర్క్ చేయించేటప్పుడు తను వేసిన చిక్కు ప్రశ్నలలో ఇది ఒకటి. 'ఏమయ్యింది తన చదువు?'

ఎయిర్ హోస్టెస్ తట్టి లేపి, ఫ్లైట్ లాండవ్వుతున్నది, క్రిబ్ తీసి వెయ్యాలని చెప్పింది. బేబి పాపను వళ్లోకి తీసుకుంది. ఎనౌన్స్మెంట్లో "నెవార్క్, న్యూ జర్సీ లో ఫ్లైట్ 30 నిమిషాలలో ల్యాండ్ అవుతునంది, బయట మైనస్ ఐదు డిగ్రీలు" అని వినబడింది.

బేబి ఒక్క సారిగా అధిరిపడింది. గుండె దడ ఎక్కువయ్యింది, 'నెవార్క్, న్యూ జర్సీ అంటారేమిటి? తను వెళ్లవలసినది న్యూ యార్క్, న్యూ యార్క్ కదా???' నెమ్మదిగా అర్థమయ్యింది బేబికి, ఐస్‌లాండులో తను వినీ వినకుండా తొందర పడింది. ఆందోళన పెరిగింది బేబికి., 'హమ్మో, హమ్మో, పాపని వాళ్ల అమ్మానాన్నలకి అప్పచెప్పాలి. అయినా ఎయిర్‌లైన్స్ వాళ్లు జాగ్రత్తపడవద్దూ?'

USUSUSUSUSUSUSUS

విమానం దిగింది. బేబిని అందరూ దిగేదాకా ఆగమంది ఎయిర్ హోస్టెస్. ఒక లావుపాటి ముసాలావిడ వచ్చి "వీల్ చెయిర్?" అని ప్రశ్నించింది. ఓపిక లేదు, తప్పదు, బేబికి వీల్ చెయిరే మెరుగనిపించింది, 'అయినా యీ హిడింబి ఏమిటీ? ఇంత ముసలి హిడింబి తనను వీల్ చెయిర్లో తోయగలదా?' ఆలోచన సరిగా రావటంలేదు. అన్నీ అనుమానాలే. ముందు పాపను అప్పగించాలి. ఆందోళన. పాపను వళ్లో గట్టిగా హత్తుకుంది బేబి.

లగేజ్ తీసుకునే దగ్గర వీల్ చెయిర్ ఆగింది. ఎంత ఎదురు చూసినా లగేజ్ రావటంలేదు. పాప నిద్ర లేచింది. పాప ఒక్కసారిగా వళ్లు విరుచుకిని, వళ్లో నుంచి జారి, అడ్డదిడ్డంగా పరుగు తీయబోయింది. బేబికి వళ్లు ఝుల్లుమంది. పెద్ద పెద్ద సూట్‌కేసులున్న కార్టుకి అడ్డంగా పాప పరిగెడుతోంది. బేబి ఒక్క ఉదుటున వీల్ చెయిర్లోనుంచి దూకి పాపను అందుకోబోయింది. బేబికి నీరసమో, తొందరపాటో, చీర అడ్డంపడి ముందుకి పడింది. నుదుటికి దెబ్బ గట్టిగానే తగిలింది. కళ్ల జోడు విరిగింది. అయినా తల ఎత్తి చూస్తే ఎవరో వింత మనిషి అధాటున పాప రెక్కను పట్టుకుని లాగి ఎత్తుకోవటం లీలగా కనిపించింది. ఇంతలో లావుపాటి ముసాలావిడ వచ్చి తనను లేవదీసి "ఓ బేబీ, నీకు దెబ్బ తగిలిందా" అంటూ సపర్యలు చేయ్యటం మొదలు పెట్టింది.

పాపను ఎవరో ఎత్తుకున్నారు, 'ఎవరు? ఆడ వాడా? మగదా? ఎవరూ కాదు, వింత అవతారం, ముక్కుకీ చెవులకీ రింగులు, తలకి వింత వింత రంగులు. బృహన్నల లాగా ఉంది, బృహన్నలపాపని ఎత్తుకుని వుందేమిటి?'.బేబికి చూస్తే జుగుప్సతో వళ్లు జలదరించినట్టయింది. పాప గడుగ్గాయ ఉత్సాహంగా కేరింతలు కొడుతోంది. ఉన్నట్టుండి పాప గడుగ్గాయ ఆ కొత్త మనిషిముక్కుకు ఉన్న రింగును పట్టుకుని లాగింది. ఆ కొత్త మనిషి కెవ్వుమంది, కానీ పాపను వదిలిపెట్టలేదు. కొంచెం తేరుకున్న తరువాత ఆ కొత్త మనిషి బేబితో "మీ వాళ్లు వచ్చేదాకా నేను సహాయం చేస్తాను, ఖంగారు పడవద్దు '" అని ధైర్యం చెప్పి, అల్లుడు గారి ఫోన్ నంబర్ తీసుకుని మాట్లాడి, బేబికి ఫోన్ అందించింది.

బేబి కొంత ఏవగింపుతోనే ఫోన్ అందుకుంది. "ఎయిర్లైన్స్ వాళ్లు మాకు మూడు గంటలు క్రితమే ఫోన్ చేసి మీరు నెవార్క్ వస్తున్నారని చెప్పారు. మంచులో డ్రైవ్ చెయ్యటం కష్టంగా వుంది. ఫర్వాలేదు, దగ్గరకు వచ్చేసాం, ఇంకా ఐదు నిమిషాల్లో వచ్చేస్తున్నాం. బేబీ బాగుందా?" అని ప్రశ్నించారు అల్లుడుగారు. బేబికి చిర్రెత్తుకొచ్చింది, 'అసహ్యంగా అల్లుడు తనను పేరు పెట్టి బేబి అని పిలుస్తాడేమిటీ?'

ఇంకా ఐదు నిమిషాలు. నిమిషాల లెఖ్ఖ. పాపను వాళ్ల అమ్మా నాన్నకు అప్పగించాలి. ఇంకా ఏమవుతుందో? బేబికి ఆందోళన. ప్రక్కనే లావుపాటి ముసలావిడ, ఆ కొత్త మనిషి ధైర్యం చెబుతున్నారు. ఇంతలోనే "అమ్మా" అని వినిపించింది. తన కూతురే. గభాలున వచ్చి పాపను ఎత్తుకుంది. పాప ఝుడుసుకుని ఏడవడం మొదలుపెట్టింది. బేబికి ఒక్కసారిగా తన మీద నుండి భూగోళమంత బరువు దిగినట్లనిపించింది.

అందరూ వాను ఎక్కారు. పాపని తప్పనిసరిగా కార్ సీట్లో బంధించాల్సిందే అంటూ పట్టుబట్టారు అల్లుడు గారు. బేబి వెనక సీటులో పాప గడుగ్గాయ ప్రక్కన కూర్చుని పాప ఏడుపును ఓదార్చబోయింది. ఇంతలో అమ్మాయి ఇండియా ఫోన్ చేసి పాప, "నాన్నగారూ, పాప అమ్మా ఇద్దరూ బాగానే చేరారు" అని చెప్పి బేబికి ఫోన్ మాట్లాడమని ఇచ్చింది.

పెద్దాయన "బేబీ, పాప యేమిటి అంత గుక్క తిప్పుకోకుండా యేడుస్తోంది? బాగానే ఉందా? ఇంటికి వెళ్లగానే దిష్టి తియ్యి" అని ఇంకా ఏదో చెబుతున్నారు. బేబికి ఒక్కసారిగా జరిగింది కళ్ల ముందు తిరిగింది. 'కటికది, పిల్లి గడ్డం, గజాసురుడు, జాంబవంతుడు, హిడింబి, బృహన్నల. తను వీళ్లందిరికీ ఈ పేర్లు పెట్టటమేమిటి? ఎంత తప్పు? నావి మంచి కళ్లు కాదు. వాళ్లందరూ ఎంత మంచి వాళ్లు? పాపను ఎంత ముచ్చటపడ్డారు? ఎంత రక్షించారు? వాళ్లు లేకపోతే పాపను తను కూతురుకీ, అల్లుడికీ అప్పగించగలిగేదా? బయట వాళ్లది దిష్టి కాదు, తన చూపులలోనే దిష్టి ఉంది. వాళ్లందరికీ ఇంటికి వెళ్లగానే దిష్టి తియ్యాలి. కాదు, పూజ చెయ్యాలి. మనస్సుని శుభ్రం చేసుకోవాలి.'

బేబి ఫోన్లో ఒక్కసారిగా అరవడం మొదలుపెట్టింది "దిష్టి, దిష్టి, దిష్టి అంటారేంటి? వేరే వాళ్ల కళ్లు మనకి దిష్టి అని మనం అనుకుంటుంటే, మన అనుమానపు చూపులు వాళ్లందరికీ దిష్టి కాదా? ఎంత సేపూ ఆ పిచ్చి టీవీ చూస్తూ, పిచ్చి వార్తలు చదువుతూ అందరినీ అనుమానించడమేనా? కాస్త కాలు బయటపెట్టి ప్రపంచాన్ని చూడండి. మంచితనం కనబడుతుంది. మన కళ్లు ప్రపంచానికి దిష్టి పెడుతున్నాయేమో ఆలోచించండి".

పెద్దాయన ఏమాత్రం కోపం తెచ్చుకోలేదు. నెమ్మదస్తుడూ, పెద్దమనిషి కూడానూ. "బేబీ, ఇంకొకచోటకి వెళ్లినప్పుడు ఆచి తూచి, మెప్పించి ఒప్పించి మాట్లాడాలి. నామీద అరిచినట్టు అక్కడ అరవమాకే!"

బేబికి ఒళ్లు మండింది. "వాలు కుర్చీలో కూర్చుని నీతులు చెప్పటం కాదు, కాలు బయటపెట్టి ఇంకొకరికి ఎంత ఉపయోగపడతున్నామో ఆలోచించండి. దిష్టి, దిష్టి అని ఇంకొకసారి అంటే ఊరుకోను. మన పిల్లలని ఎవరో దిష్టి పెడుతున్నారని మనం అందరినీ అనుమానం దృష్టితో చూడాల్సిన అవసరం లేదు" అని చెప్పి గభాలున ఫోను పెట్టేసింది.

అల్లుడుగారు డ్రైవ్ చేస్తూ ఆలోచనలో పడ్డారు. అత్తగారు వంటలో చెయ్యితిరిగినావిడ. కానీ ఈ అరుపులు కేకలు భరించగలనా? ఆలోచన తెగలేదు. పరధ్యానంలో ఎగ్జిట్ తీసుకోవటం మర్చిపోయి, న్యూయార్క్లో తన ఇంటికి వెళ్లబోయి పెన్సిల్వేనియా దారి పట్టారు.

పాప ఏడ్చి ఏడ్చి అలసిపోయి నిద్రపోయింది.

బేబి పాప మీద చేయి వేసి నిశ్చింతగా తల వాల్చి నిద్రపోయింది.

# శిశుపాలిక తుమ్మూరి రామ్మోహన రావు

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రయాణీకులతో రద్దీగా వుంది. ఉదయం పదిన్నర కావస్తోంది. కొద్దిసేపట్లో సిర్పూర్ – కాగజ్ నగర్ నుండి సికింద్రాబాద్ వచ్చే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రాబోతుంది. ఒకటవ నంబర్ ప్లాట్‌ఫాం పై భార్గవ ఆ రైల్లో రాబోయే తన శ్రీమతి కోసం ఎదురుచూస్తున్నాడు. ఇంతలో చంకలో మూటతో నడివయస్సు గల ఆడమనిషి పల్లెటూరి వేషభాషల్లో భార్గవ దగ్గరగా వెళ్లి,

“అయ్యా! బతుకుదెరువు కోసమచ్చిన, ఏదైనా పని చేసుకొని బతుకుదామని. మా అసుమంటోల్లుండడానికి యాడైనా నీడుంటె జర చెప్పు బాబు. నాకీ పట్నం కొత్త. నాకు నా అనెటోల్లెవరూ లేరు. జరంత దయజూపు బాపు. నీ పిల్ల జెల్లా సల్లగుంటరు” అని దీనంగా అడుగుతున్న ఆ మధ్య వయస్కురాలి వైపు పరిశీలనగా చూస్తూ,

“ఏ ఊరినుండొస్తున్నావు?" అన్నాడు.

“మనకు పనికి రానూరు ఏ ఊరైతేంది బాపు, మాది ఓరంగల్ దగ్గర ఓ సిన్న పల్లెటూరు. ఆడ ఉండలేక యీడికొచ్చిన?” అంది. అలాగా అంటూ ఆలోచనల్లో మునిగిపోయాడు.

‘ఇక్కడ ఎవరూ దొరకలేదండీ, మా నాన్న ఇక్కడ రెండు మూడు వూళ్లలో ఎంక్వైరీ చేయించారు. కానీ లాభం లేక పోయింది. నేను రేపు ‘భాగ్యనగర్’ కి వస్తున్నా’ అని నందిని నిన్న ఫోన్లో చెప్పిన విషయం గుర్తుకు వచ్చింది. ‘ఏమైంది బాపు, ఏదన్న నాలాంటోల్లకి వుండడానికి ధరమశాల ఉంటే జెప్పుమన్నగద బాపూ, ఏమీ మాట్లాడుతలేరు". అంది.

ఆమె మాటలకి ఈ లోకంలోకి వచ్చిన భార్గవ, “అవ్వా నీ పేరేంటి?”

"యీరమ్మ".

క్షణంలోనే ఏదో నిర్ణయించుకున్నట్లుగా ‘మా యింట్లో పన్జేస్తావా?”

“ఏంది బాపు మీ ఇంట్లో పనిచెయ్యాల్న – మంచిది బాపు, చేస్తగని మరి నా కుండేటందుకు యాడన్నా చోటు దొరకద్దా?” అమాయకంగా అడిగింది యీరవ్వ.

"ఉండడం, పని, తిండి, బట్టా అన్నీ మా ఇంట్లోనే నీ కిష్టమైతే యిప్పుడే తీసుకువెళ్తా."

“ఇదేందో ఇచిత్రంలాగా వుంది. నమ్మాల్నో లేదో తెలుస్తలేదు... నిజంగనా బాపు... ముసలిదాన్తో పరాచికాలాడ్తంరా..?”

“లేదమ్మా... నిజంగానే అడుగుతున్నా ఇప్పుడు వచ్చే ట్రెయిన్లో మా ఇంటామె వస్తుంది. ఆమె రాగానే మా ఇంటికి వెళ్దాం. ఆలోచించుకో.”

“నాకు నోట మాటస్తలేదు బాపు, పల్లెటూరి దాన్ని మీరు చెప్పిన పని జేస్త. నా పొట్ట కింతగడిస్తే చాలు. అంతకంటే నాకింకేమి వద్దు, అయితే ఇప్పుడు అమ్మ బండిల దిగుతదా? యాడ్నుంచొస్తంది”... కుతూహలంగా అడిగింది.

‘సిర్‌పూర్ నుండి’

“సిరిపురమా, అబ్బో శాన దూరం. ఆడెవలుంటరు, మీ అత్తగారా?”

"అవును” అంటూ మాట కట్ చేస్తూ "నువ్విక్కడే ఉండు ట్రయిన్ వస్తుంది. ఆమెను తీసుకొని వస్తా, ఇక్కడ కూచో". అంటూ వస్తున్న ట్రెయిన్ వైపు కదిలాడు.

కాగల కార్యం గంధర్వులు తీర్చడం అంటే ఇదే కావచ్చు. నందినికి చెప్తే సర్‌ప్రైజవుతుంది. అనుకుంటు ఆగుతున్నరైలు ఒక్కొక్క పెట్టెనే చూస్తున్నాడు. నందిని వున్నపెట్టె కన్పించింది. గబగబా నడుస్తూ పెట్టె దగ్గరికి చేరుకుని భార్యచేతిలో సూట్‌కేస్ అందుకున్నాడు.

"ఎంతసేపైంది స్టేషన్‌కొచ్చి?'" ప్రశ్నించింది నందిని.

"జస్ట్ ఫిఫ్టీన్ మినిట్స్, అది సరేకాని నీకో సర్‌ప్రైజ్ న్యూస్."

“ఏమిటి?” ... నవ్వుతూ అడిగింది.

"చూద్దువుగాని పద." అంటూ యీరవ్వకూర్చున్న దగ్గరికి తీసుకువెళ్లాడు.

"యీరమ్మా! ఇదిగో మీ అమ్మగారు" అన్నాడు నందినిని చూపిస్తూ.

"దండాలమ్మా దండాలు” కళ్లలో సంతోషం కదలివస్తుంటే కదలి పోతూ అంది.

కొంచెం అర్థం అయినా ఏమనాలో తోచక “ఏంటి?” అని ప్రశ్నించింది.

"ఏమిటేమిటి, మనకు పనికో మనిషికావాలి. గడవడానికి ఆమెకో పని కావాలి. పద వీరమ్మా” అంటూ స్టేషన్ బయటికి దారి తీశాడు.

"ఎవరీమె?” ఆశ్చర్యంగా అడిగింది నందిని.

“నువ్వు సిర్‌పూర్‌కు వెళ్లిన పని నేను సికింద్రాబాద్‌లోనే సాధించా?.” కవ్విస్తూ అన్నాడు.

ఆటో స్టాండుకి వెళ్లే దారిలో అడిగింది, “పిల్లల్ని చూసుకోవడం వచ్చా?' అని.

తననే అడుగుతుందని గమనించి "ఏంటమ్మా! పిలల్ని చూసుకోవడమా, ఎందుకు తెల్వదమ్మ మా జూసుకుంట ఇంటి పనులు కూడా చేస్తనమ్మా" అంది.

★★★

యీరమ్మకు గతం గుర్తుకొచ్చింది.

“పల్లెటూరి మనిషివి. పిల్లల్ని చూడడం నీకేం తెలుసు. నువ్వు పిల్లవాడికి ఏమీ చెయ్యక్కరలేదు. అన్నీ నేను చూసుకుంటాను. వాడిని తాకే ప్రయత్నం చేయవద్దింకోసారి”

కోడలు గద్దింపుతో బిత్తర పోయింది.

“ఆ పల్లెటూళ్ళో ఉంటే సరి పోయేదిగదా! నీక్కావల్సిన డబ్బులు పంపిస్తామని చెప్పినా వినకుండా ఇక్కడికి వచ్చావు. ఇంటికి పెద్దపెద్ద వాళ్లు వస్తారు. ఆయన స్నేహితుల ముందు ఇలా దిష్టిబొమ్మలా కూచోకు. నీకిచ్చిన రూం ఉంది కదా, అందులో ఉండు. కొడుకు దగ్గర ఉండడమే కదా నీక్కావల్సింది. అలాగే వేళకింత తిని నీగదిలో పడుండు. ఆయన మాట తీసెయ్యలేక ఒప్పుకున్నాను కానీ, నాకస్సలు ఇష్టం లేదు, నిన్నిక్కడికి తీసుకురావడం, అర్థమయ్యిందా! ఇంకోసారి ఈ పని చేస్తాను, ఆపని చేస్తాను పిల్లాడికి స్నానం పోస్తాను, తిండి పెడతాను, అంటూ నన్ను విసిగించకు” కోడలి కరుకు మాటలు వీరమ్మ గుండెల్ని తూట్లు చేసాయి. కోడలితో ఎదురు మాట్లాడితే కొడుకెక్కడ బాధపడతాడో, పైగా చదువుకున్న పిల్ల అని బాధను దిగమింగుకుని తన గదిలోకి వెళ్ళిపోయింది.

“.శ.శ. మా వూల్లె ఉంటేనే బాగుంటుండె. ఈడ కొడుకు పెద్ద నౌకరి చేస్తడు. పెద్ద ఊరు, పెద్ద బంగ్ల మంచిగవుండచ్చుననుకుంటే కోడలుకు తనంటే ఇష్టం లేదాయే. తనేమన్నా చదువుకున్నది గనుకనా, ఎక్కడన్నా పెద్ద పెద్ద వూర్లు చూసింది కనుకనా, ఏదో గాపల్లెటూర్లో పనీ పాటా చేసుకుని బతికేదాన్ని వీనయ్య వీని చిన్నప్పుడే పైకివాయె. గప్పటినుండి వీన్ని సాది సదివిత్తి. నీ పిల్లగాడు మంచిగ చదువుతుండు వీన్ని ఆస్టల్ల చేర్పించుమని గా పెద్దసారు చెప్పితె గట్లనే అని ఆస్టల్ల జేర్పిత్తి. అట్ల ఆడు చదువుకుంటు, చదువుకుంటు పట్నంలనే పెరిగి ఆడనే మంచి నౌకరి జూసుకున్నడు. ఎప్పుడన్నా సెలవులకు రెండు రోజులొచ్చెటోడు. పట్నంల గీ పిల్లతో దోస్తయింది. పెళ్లి చేస్కుంటమంటె ఈనత్తగారోల్లు లొల్లి పెట్టిన ఇనకుండా ఎదిరిచ్చి పెండ్లి జేస్కున్నరు. పెండ్లి గదేందో ఆఫీసుల జేస్కున్నరట. పెండ్లి గాంగనే ఒక్కసారి ఊరికొచ్చి ఒక్క గంటుండి పోయిండ్రు. ఆ తరువాత రెండు మూడుసార్లు ఆడే అచ్చిపోయిండు. ఇన్ని పైసలిచ్చి పోతుండె. “బిడ్డా, నాకీదెవరున్నర. నేను నీకాడికే అస్త అని అచ్చినప్పడల్లా మొత్తుకున్నా వస్తువు గానీ లే అని దాటేసిండు.

ఆనికి కొడుకు పుట్టినప్పుడు కోడలు దవాకాన్ల ఉంటే ఒకసారి వచ్చి తీసకపోయి చూపిచ్చి మళ్లీ ఈడనే వదిలి పెట్టిండు. పైసలిస్తడు, పనికి పోవద్దంటడు. తన దగ్గరికి తీస్కపోడు. వూరోల్లంతా ఏంది, ఈరమ్మా! కొడుకు దగ్గరికి పోవా అని ఎద్దేవా చేసినట్లడిగేటోలు. మొత్తుకోంగ, మొత్తుకోంగ మొన్నమొన్న తీస్కచ్చిండు. వాడెందుకద్దన్నడో ఇప్పడర్థమయితాంది. ఆడున్నా బాగుంటుండె. అందరూ తెలిసినోళ్లు పనీ పాట జేసుకుంటుండస్తుండె ఇప్పడేం చేయాల్లో అర్థంగాకపాయె" తనలో తాను గతాన్ని తల్చుకుంటూ తన గదిలో ముడుచుకు పడుకున్నది.

"అవ్వా! ఏంటి పడుకున్నవ్ లే! అన్నం తిందువు గాని" కొడుకు మాటలకి ఉలిక్కిపడి లేచింది.

"దా! అన్నం తిందువుగాని" శంకర్ సానునయంగా పలికాడు.

"నువ్వు దినుబిడ్డా నేనటెంకదింట"

"ఏమైంది ఎట్లనో వున్నవు. ఇక్కడ మనసున పడుత లేదా? మనూరికి పోతవా?" ఆమె పరిస్థితిని గమనించి ప్రశ్నించాడు.

'ఏం లేదు బిడ్డా, వూరికెనే, చేసేటందుకీడ పనేం లేకపాయె. అందుకే పండుకున్న సరేగని నువ్వు దినుపో బిడ్డా! ఎప్పుడు తిన్నవో ఏందో".. నీతో తినుడు నీ భార్య కిష్టం ఉండదు. అని అనలేకపోయింది.

"నీ ఇష్టం," అని అక్కడ్నుంచి కదిలాడు.

మనూరికి బోతవా అని అడుగుతుండు నా కొడుకు. ఈడ ఉండేటట్టులేదు. ఆని ముందట బయట పడ్తలేదు కోడలు, ఆడేమంటడోనని. ఆనికి అనుమానం రాకుండా మెదుల్తుంది. నేను మా వూరంటే బెంగటీలిన్ననుకొంటండు, మావోడు. కోడలు కిష్టం లేకుండా తనీడ ఉండుడు కష్టం. వూరికి పోదామంటే, వూర్లె అందరేమనుకుంటరొ. ఒక్కడే కొడుకు మంచిగ సంపాయిత్తండు. తల్లి బరువైందా అని ఆడిపోసుకుంటరు. ఏం చేయాల్నో అర్థం కాదాయే. ఆడమాత్రం ఏం పాడైందని, చేనా చెల్కనా?

"ఇగో అన్నం తిందురా!" కోడలి కేకతో లేచి వెళ్లింది.

★★★

"ఏంటి వీరమ్మా! ఏదో ఆలోచనలో పడ్డావు. ఇల్లు వచ్చింది, దిగు." భార్గవ్ మాటలతో ఈ లోకంలోకి వచ్చింది. ఇల్లు చక్కగా ఉంది. ఇంటి ముందు ఖాళీ స్థలం. పూలచెట్ల పచ్చటి గడ్డి చూడముచ్చటగా ఉంది. ఇంటి ముందటి భాగంలో పెద్ద వరండాలాంటి రేకుల షెడ్డు. షెడ్డుకి ఇనుప గ్రిల్స్ బిగించి ఉన్నాయి. చాలా విశాలంగా ఉన్న ఆ వరండా నిండా పిల్లలాడుకునే బొమ్మలు, కొయ్య గుర్రాలు, వాకర్లు, బాల్సు, బ్యాట్స్ అన్నీ చిందర వందరగా ఉన్నాయి. కింద పత్రంజ్ పర్చి ఉంది. గోడలకి చిన్న పిల్లల ఫోటో ఫ్రేములు తగిలించి ఉన్నాయి. కాంపౌండ్ గోడ దగ్గరగా రోడ్ వైపుకి 'భార్గవ్ బేబీ కేర్ సెంటర్' అనే సైన్ బోర్డు ఇనుపరాడ్స్ కి తగిలించి ఉంది.

"వీరమ్మా ఇదే మా ఇల్లు, ఇక్కడ మేం చిన్నపిల్లల్ని చూసుకుంటాం. అంటే ఉద్యోగాలకు వెళ్లే ఆడవాళ్లు తమ పిల్లల్ని ఇక్కడ దింపి వెళ్తారు. అంతసేపూ మనం వాళ్లని చూసుకోవాలి. ఇదివరకున్న ఆయమ్మకు ఒంట్లో బాగా లేక వెళ్లిపోయింది. కొత్త ఆయమ్మ కోసం మా ఊరువెళ్తే అక్కడ ఎవరూ దొరకలేదు. అదే సమయంలో నువ్వు స్టేషన్లో కనిపించావు. ఇవాళ ఆదివారం కదా! అందుకే పిల్లలెవ్వరూ లేరు. రేప్రొద్దున్నే అందరూ తమ పిల్లల్ని దింపి పోతారు. మీ అమ్మకు తోడుగా ఉండి పిల్లల్ని జాగ్రత్తగా చూసుకోవాలి. అందుకే నిన్ను తీసుకొచ్చాం, అర్థం అయిందా? 'నందినీ' వీరమ్మకు తనగది అదీ చూపించి, ఆమె ఏం చేయాలో ఎలా ఉండాలో అన్నీ వివరంగా చెప్పు. నేనట్లా వెళ్లివస్తాను."

★★★

"అమ్మా నాకు సిగ్గేత్తందమ్మా! ఇంత మంచి చీర నేనెప్పుడూ కట్టలేదమ్మా. ఇట్టా కొప్పు వేసుకోవడం కూడా నాకు కొత్త కొత్తగున్నది." మెలికలు తిరిగిపోతూ అంది వీరమ్మ.

"వీరమ్మా! నిన్ను పెద్దగా మార్చిందేమీలేదు. ఇక్కడికి పెద్ద పెద్ద వాళ్ల పిల్లలు వస్తారు. అందుకోసం నిన్ను కొంచెం మార్చాను. రెండ్రోజులు పోతే నీకే అలవాటవుతుంది. ఇంకో విషయం. పిల్లల విషయంలో ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలి. ఏమాత్రం నిర్లక్ష్యం చెయ్యకూడదు. అన్నింటికంటే ముఖ్యంగా ఈ

రోజు నుంచి నువ్వు మా ఇంట్లో మనిషిగా మసలుకోవాలి. నీకు ఏం కావాలన్నా అడుగు. నీకేదైనా తెలియకపోతే అడిగి తెలుసుకో. ఆ!... పిల్లల్ని దింపే వేళయ్యింది. ఒక్కొక్కళ్ళే వస్తారు. అదిగో రమామేడం రానే వచ్చింది హల్లో “అనుష్' కమాన్" అంటూ ఆప్యాయంగా రిసీవ్ చేసుకుంది.

"ఇదిగో ఆయమ్మా! ఈ అబ్బాయి అనుష్." అంటూ పరిచయ కార్యక్రమం మొదలు పెట్టింది నందిని.

★★★

"నందినీ. ఏమంటోంది ఆయమ్మ? ఇక్కడి వాతావరణానికి అలవాటు పడ్డట్టేనా?”

"చాలా మంచిమనిషండీ! పల్లెటూరి మనిషైనా చాలా తొందరగా ఇక్కడి విషయాలను అర్థం చేసుకుంది. ముఖ్యంగా పిల్లల్ని ఎంతో చక్కగా చూసుకుంటుంది. పిల్లలు కూడా ఆమెకు బాగా మచ్చికయ్యారు. కొంచెం మాటలోనే పల్లెటూరి యాస, అది పిల్లలకి కొంచెం కొత్తగా ఉంది."

"అవుననుకో, కానీ నందినీ ఆ యాసలో ఎంత అందం ఉందో చూసావా! నాకైతే అలా మాట్లాడే వాళ్లుంటే అలాగే వినాలని పిస్తుంది. ఆ... అది సరేగాని మా బ్యాంకులో కొత్తగా ఆఫీసర్ వచ్చాడు. ఆయన మిసెస్ కూడా ఏదో ఆఫీసులో పనిచేస్తుందట. ఇద్దరూ ఒకేసారి ట్రాన్స్ఫర్ అయి ఇక్కడకు వచ్చారు. వాళ్లకు ఒకబాబు ఉన్నాడట. మనక్రెష్ గురించి మా వాళ్ళెవరో చెప్పారట. ఈ రోజు టీ టైంలో అడిగాడు. మన కేర్ సెంటర్లో చేరుస్తారట."

"అలాగా!... ఎక్కడి నుంచి వచ్చారు?” అడిగింది నందిని, వరంగల్ నుంచి, చెప్పాడు భార్గవ్.

"అబ్బాయి కెన్నేళ్లుంటాయట?”

"రెండేళ్లనుకుంటా...."

"ఎప్పుడు వస్తామన్నారు.?"

"రేపుదయమే వస్తామన్నారు. వాళ్లు వచ్చేదాకా నేనుంటాను."

★★★

ఉదయం తొమ్మిదిన్నర ప్రాంతంలో బైక్ మీద వచ్చారు శంకర్ అతని భార్యా బాబుని తీసుకొని.

వాళ్లకోసమే ఎదురుచూస్తున్న భార్గవ్ వాళ్లను గేట్ వద్ద చూడగానే లేచి 'వెల్కమ్' అంటూ ఆహ్వానించాడు. అప్పటికే ఇద్దరు ముగ్గురు పిల్లలు వచ్చారు. వాళ్లని నందిని అటెండ్ చేస్తోంది. వీరమ్మ లోపల ఏదో పనిలో ఉంది. దంపతుల ద్వయం ఒకర్నొకరు పరిచయం చేసుకున్నారు.

"బాబు పేరేమిటి.?" అడిగింది నందిని.

“సందీప్' చెప్పింది ఆమె.

"పిల్లల్ని మీరొక్కరే చూసుకుంటారా?" అడిగింది ఆఫీసర్ భార్య మందిర,

"లేదండీ! ఆయా వుంది. ఒక్కదాన్ని చూసుకోవడం చాలా కష్టంగదా!"

"అఫ్కోర్స్!"

"మీ అబ్బాయి అలవాట్లు అంటే పాలు తాగించడం ఎన్నింటికి పాలల్లో ఏం కలపాలి. హార్లిక్స్, కాంప్లాన్, ఎన్ని గంటలకు నిద్ర పోతాడు.... అన్నీ కొంచెం వివరంగా చెప్పండి. నోట్ చేసుకుంటాను."

అలాగే అంటూ వివరాలు చెబుతూ క్రష్ ని పరిశీలనగా చూస్తుంది. ఆయా వస్తుందేమోనని లోపలి వైపు ఓ కన్నుంచింది.

"మేం ఏమైనా మెటీరియల్ తెచ్చివ్వాలా!?" అడిగింది మందిర.

"అవసరం లేదండీ మేం అన్నీ చూసుకుంటాం. కాకపోతే దుస్తులు మాత్రం ఓరెండుంచండి మా వద్ద,”

"అలాగే.. ఏదీ మీ ఆయా కనిపించదేం.!?"

“లోపల ఏదో పనిలో వున్నట్టుంది. పిలవనా?”

“వద్దులెండి ఈసారెప్పుడైనా కలుద్దాం. వస్తాం మరి ఆఫీసుకి టైమవుతోంది.”

"ఉండండి, కాఫీ తెస్తాను."

"ప్లీజ్ వద్దండి. ఇంకెప్పుడైనా తీసుకుంటాం. అంటూ బాబువైపు చూశారు. అప్పుడే పిల్లలతో కలిసి బొమ్మలతో ఆడుకుంటున్నాడు." బాబుకి బై చెప్పి వస్తామంటూ వెళ్లిపోయారు.

"నేను కూడా వెళ్తా నందినీ, టైమవుతోంది."

"అలాగే.." అంటూ పిల్లల వైపు నడిచింది నందిని.

"ఎవరచ్చిన్రమ్మా?" అంటూ లోపల్నుండి వచ్చింది, వీరమ్మ

"ఇదిగో, ఈ కొత్త బాబు వాళ్ల అమ్మా నాన్నా."

"ఎవరూ ఈ బాబా... "అని బాబు దగ్గరికి వెళ్లి ఎత్తుగుంది.

అచ్చం తన మనవడి లాగే ఉన్నాడు. అనుకుంది, లోపల, పైకి మాత్రం ఆ విషయం తెలియనీయకుండా "ఎక్కడ్నించొచ్చిన్రటమ్మా ఈల్లు?" అడిగింది.

"వరంగల్ నుంచట' చెప్పింది, నందిని.

"వరంగల్లు నుంచా?" ఒక్క క్షణం తత్తరపడబోయి తమాయించుకుంది. ఈరమ్మ.

"బాబు పేరేంటమ్మా?" కుతూహలంగా అడిగింది, బాబు దగ్గరికి వెళ్లి పరిశీలనగా చూస్తూ.

"సందీప్' అని చెప్పి అతనికి సంబంధించిన వివరాలు జాగ్రత్తగా చూస్తుంది నందిని వీరమ్మకు వివరించడానికి, "ఆఁ వీరమ్మా, ఈ బాబు వాళ్ల నాన్న అయ్యగారి ఆఫీసుకు బదిలీ మీద వచ్చారు. బాబును జాగ్రత్తగా చూసుకోవాలి. మీ అయ్యగారికి మాట రాకూడదు. తెలిసిందా!"

"అలాగే నమ్మా" అంటూ జవాబిచ్చింది. పిల్లవాడిని తన దగ్గరికి రమ్మని బుజ్జగిస్తూనే....

ఎత్తుకో అన్నట్లు బాబు రెండు చేతులూ అందించాడు. ఎత్తుకో బోయినదల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది, వీరమ్మ.

★★★

"ఏయ్ ఏంటది బాబును ఎవరెత్తుకోమన్నారు నిన్ను. వాణ్ణి తాకొద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు. బుద్ధిలేదా?" అంటూ విసురుగా వీరమ్మ చేతిలోంచి లాక్కుంది. కోడలు.

"అదిగాదు బిడ్డా! బుడ్డోడు కిందపడి ఏడత్తంటే ఎత్తుకుని ఆడిత్తన్నా!"

" ఏడ్చినా సరే వాడ్ని ముట్టుకోవద్దని చెప్పాను కదా! డర్టీ ఉమన్... ఛీ ఛీ మనుషులైతే ఒకసారి చెబితే వినాలి. ఆ కంపు అవతారంతో వాణ్ణి తాకొద్దని లక్షసార్లు చెప్పాను. ఎందుకు నన్నిలా విసిగిస్తావు. నీకెంతకావాలో చెప్పు నీకొడుకుతో చెప్పి ఇప్పిస్తాను. వెంటనే మీ ఊరికి వెళ్లిపో కోడలు పొమ్మందని చెప్పకు. నీకే ఇక్కడ ఏం తోచటం లేదని చెప్పు. మళ్లీ ఎన్నడూ ఇక్కడకు రాకు. నువ్వు పోయిన్నాడు ఆయన వచ్చి నీకు దినవారాలు చేస్తాడు. పీడా విరగడై పోతుంది."

ముడుచుకు పోయిన మొగంతో కడుపులోంచి వచ్చే వెతను ఆపుకుంటూ తనగది లోకి వెళ్ళిపోయింది.

"ఇంక యీడొక్క సెణం వుండొద్దు. కడుపు తీపికి యీడికొస్తే కుక్కకన్నా యీనంగా సూత్తంది, కోడలు. ఇంటికచ్చినోళ్లతోటి, తన మొగుడితోటి మంచిగనే ఉంటుంది. తనను జూడంగానే అగ్గిల వడతది. ఏం చెయ్యాల దేవుడా! నా బతుకు గిట్లయిపాయె. ఊరికి పోబుద్దయితలేదు. ఊరోళ్లందరు ఏమంటారు, కొడుకు కోడలెల్లగొట్టినార. ఎందుకొచ్చినవ్ మల్ల ఆడనే మంచిగుండక అని దెప్పి పొడుత్తరు. ఈడ మాత్రం ఇగ ఉండుడు మంచిదికాదు. ఏమన్నంటె కొడుకును కట్టపెట్టాలె. అయినా ఆని కేమని చెప్పాలె. బిడ్డా నీబారియ నన్ను మంచిగ సూత్తలేదు, నీ పిల్లగాన్ని ముట్టనిత్తలేదు. అంటే ఆడేమనుకుంటాడో. ఊరికే పోతనని చెప్పి ఇంకేదన్నా ఊరికిపోత. యాదనన్న కట్టం జేసుకొని బతుకుత, యియ్యాల్లేమైనా సరే ఎల్లిపోతనని చెప్త సక్కంగ టేషనుకు బొయ్యి. పట్నంబోత ఆడనే బతుకుత." మనసులో తనకు తనే సర్దిచెప్పకున్నది.

"ఏంటి వీరమ్మా! ఉన్నట్టుండి ఒక్కసారే ఆలోచనల్లో పడ్డావ్?" నందిని మాటలతో ఈలోకంలోకి వచ్చింది, వీరమ్మ.

"ఏం లేదమ్మా" అని సద్దుకుంది.

"నేను లోపలికి వెళ్తున్నా పిల్లల్ని చూసుకో, ఆ బాబు జాగ్రత్త మిగతా పిల్లల్తో కలిపి ఆడుకునేట్లు చూడు." అంటూ లోపలికి వెళ్ళిపోయింది నందిని.

"అలాగే నమ్మా!" అంటూ పిల్లవాడిని ఎత్తుకుని ముద్దాడింది. మిగతా పిల్లలందరితో కలిపి ఆడించసాగింది.

★★★

"ఏంటివ్వాళ మీ ఇద్దరి ఆఫీసులు ఒకేసారి వొదిలి పెట్టాయి మిమ్మల్ని, రోజూ మీరొక్కరే వచ్చి బాబును తీసుకెళ్తున్నారు కదా మందిరగారు. మీవారి కెలాకుదిరింది ఈరోజు" అంటూ నవ్వుతూ అడిగింది నందిని.

"అవునండీ మీరన్నది నిజమే మావారికి చాలా రోజుల తర్వాత ఈ రోజు కొంచెం తీరిక దొరికిందట. అందుకే ఇద్దరమూ కలిసి వచ్చాం."

"ఏమంటుందీ మీ ఆవిడ.? మీ బాబును బాగా చూస్తున్నామటనా లేక ఏమైనా కంప్లైంటు చేస్తున్నారా?" పలకరించింది వాళ్ళాయన్ని నందిని. కలుపుగోలుగా మాట్లాడడం నందినికి అలవాటు.

"అబ్బే, కంప్లయింటేం లేదండీ, చాలా బాగా చూస్తున్నారట, మీరూ మీ ఆయా కూడా."

'అవునూ, ఆయా అంటే గుర్తుకు వచ్చింది, నందినిగారూ, నేను ఎప్పుడు వచ్చినా మీ ఆయా కనిపించదేమిటి. ఆయా ఉందన్నారు గాని. ఇంతవరకు ఆవిడ్ని చూడటం పడలేదు."

"అబ్బే ఏం లేదండీ ఇక్కడికి దగ్గర్లోనే దయరీ ఉంది రోజూ సరిగ్గా మీరు వచ్చేముందే పాలకు వెళ్తుంది. ఆయా దగ్గరుండి పాలు పిండించుకుని తెస్తుంది. పొద్దున్నేమో మీరొచ్చేటైముకి పెరట్లో అంట్లగిన్నెల దగ్గరుంటుంది. ఇదివరకు ఓ పనిమనిషుండేది. కానీ ఈ ఆయమ్మ వచ్చిన తర్వాత నేనుండగా వేరే పనిమనిషెందుకమ్మా అని బలవంతంగా మానిపించింది. అందుకే మీరామెను చూసే అవకాశం రాలేదు. ఎలాగూ ఇద్దరూ వచ్చారు కదా, కాస్సేపు కూర్చొని వెళ్ళండి. మా వారుకూడా వచ్చే టైమయ్యింది. కాఫీ తాగి వెళురుగాని. ఇంతలో ఆయమ్మ కూడా వస్తుంది చూద్దురుగాని."

ఇద్దరూ చిరునవ్వుతో నందిని మాట కాదనలేక కూర్చొని కబుర్లలో పడ్డారు. ఇంతలో భార్గవ్ కూడా వచ్చి వారితో కలిసి పోయాడు. "ఉండండి నేను కాఫీ తెస్తాను." అంటూ లోపలికి వెళ్ళింది నందిని మిగతా పిల్లల తల్లిదండ్రులు ఎవరి పిల్లల్ని వారు తీసుకెళ్ళారు.

ఇంతలో గేటు తీసుకొని పాల క్యాన్తో లోపలికొచ్చింది వీరమ్మ. వరండాలో ఎవరో ఉండడం చూసి షెడ్డు పక్కనే ఉన్న పెరటి గుమ్మంలోంచి లోపలికి వెళ్ళింది. అటు తిరిగి కూచోవటంతో వరండాలోని వాళ్ళకు ఆయమ్మ కన్పించలేదు. లోపల్నుండి కాఫీ కప్పుతో వచ్చిన నందిని "ఆయమ్మా! ఇలారా నిన్ను చూద్దామని వీళ్ళిక్కడ కూర్చున్నారు." అంటూ పిలిచింది.

"వస్తున్నానమ్మా!" అంటూ లోపలినుండి మాట వినిపించింది. ఆ మాట వినగానే అక్కడ కూర్చున్న వాళ్ళిద్దరి ముఖాలు ప్రశ్నార్థకంగా మారి ఒకరి చూపులు మరొకరి చూపుల్ని ప్రశ్నించాయి. ఇదేదీ గమనించని నందిని కాఫీ తీసుకోండి అంటూ కాఫీ కప్పుల్ని వాళ్ల కందించింది.

కాఫీ కప్పుల్ని తీసుకొని సిప్ చేయబోతుండగా "పిలిచిరా అమ్మా?" అంటూ వచ్చిన వీరమ్మ ఒక్కసారిగా బిత్తర పోయింది.

శంకర్ మందిరల చేతుల్లోని కాఫీ కప్పులు కదిలి ఒంటి మీద కాఫీ ఒలికి పడింది.

## ఒక నాన్నకి ఒక అమ్మ బహుమతి

పిడపర్తి భారతి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**"నాన్నా! అమ్మ** పిలుస్తోంది" అంది కాంతి. గదిలోంచి బయటకి వస్తూ.

హాల్లో పడక్కుర్చీలో కూర్చుని, ఏదో ఆలోచిస్తున్న శివరావు కూతురివైపు చూసాడు బేలగా.

కాంతికి తండ్రిని చూస్తే ఒక్కసారిగా జాలేసింది. ఎలా వుండే మనిషి ఎలా అయిపోయారు? నాన్న అంటే అందరం ఎంత భయపడేవాళ్ళం. ఆఖరికి అమ్మకూడా. అన్నయ్యలిద్దరూ కాని, తను కాని ఎప్పుడూ నాన్నని ఏమీ అడిగే వాళ్ళంకాదు. ఏది కావల్సినా అమ్మని అడగడమే. అలాంటిది ఇప్పుడు అమ్మకి బాగోలేకపోతే నాన్న ఎలా అయిపోయారు.

నెమ్మదిగా లేచి గదిలోకి వెళ్ళాడు, శివరావు. లోపల గదిలో నీరసంగా మంచం మీద పడుకునుంది పార్వతి. శివరావు లోపలికి వచ్చిన అలికిడి విని కళ్ళు తెరిచి ఆయన వైపు చూసింది. దగ్గరకి వచ్చి మంచం మీద ఆమె కాళ్ళదగ్గర కూర్చున్నాడు శివరావు. చెయ్యి జాచి, అతని చేయి అందుకుని ఏదో చెప్పబోయింది. ఇంతలో తలుపు తోసుకుని కొడుకులిద్దరూ లోపలికి వచ్చారు. తల్లిని చూసి కళ్ళనీళ్ళు పెట్టుకున్నారు. ఆ రాత్రి ఇద్దరు కొడుకులు, కూతురుతో కలసి భోజనం అయిందనిపించాడు శివరావు. అల్లుడు, కోడళ్ళు రాలేదు. పిల్లలు ముగ్గుర్నీ మనసారా చూసుకుంది పార్వతి. రాత్రి రెండుగంటలకి ఆయాసం మొదలయింది పార్వతికి. పిల్లలని పిలవడానికి వెళ్ళబోతున్న శివరావుని ఆపి నెమ్మదిగా "అలమారులో వున్న నల్లబాగ్ మీ కోసమే.. జాగ్రత్త" అంది పార్వతి.

"సరే.. అది తర్వాత" అంటూ పిల్లల్ని పిలిచాడు.

పిల్లలు ముగ్గురూ, భర్త తన పక్కనుండగా శాశ్వతంగా కళ్ళుమూసింది, పార్వతి. అందరూ "పార్వతమ్మ అదృష్టవంతురాలు." అని పొగిడారు. రోజులు అయ్యాయి. పిల్లలు అడిగినంతా చెక్ రాసి ఇచ్చేస్తే, పిల్లలే అన్ని పనులూ చూసుకున్నారు. సామాన్లు సర్దారు. తండ్రిని పెద్దకొడుకు తనతో తీసుకెళ్ళాడు. ఊళ్ళో వాళ్ళంతా అది చూసి సంతోషించారు.

శివరావు కూడా చాలా సంతోషించాడు. ఐదు నెలల తర్వాత రెండో కొడుకు వచ్చి తీసుకెళ్ళాడు. ఆ తర్వాత ఐదునెలలకి అక్కడికి కూతురు, పెద్దకొడుకు వచ్చారు. ముగ్గురూ కలసి, తండ్రిని ముందు వాళ్ళ ఊరువెళ్ళి తల్లి సంవత్సరీకాలకి ఏర్పాట్లు చూడమన్నారు.

రెండోరోజే శివరావు ఊరు వెళ్ళాడు. ఇంట్లోకి అడుగుపెట్టగానే ఒక్కసారిగా నీరసం వచ్చేసింది. ఈ పదినెలలో తన భార్య గుర్తురాని క్షణం లేదు. మనసంతా ఏదో అయిపోయింది. "ఎలా వెళ్ళిపోయింది నన్ను వదిలి?"

ఈ ప్రశ్నని తనకి తను ఎన్నిసార్లు వేసుకుంటాడు? ఆలోచనలు అలా తిరుగుతునే ఉన్నాయి, పనులు మొదలయ్యాయి. నెల్లాళ్ళు గడిచాయి. ఒకరోజు పొద్దున్నే బయట ఏదో హడావిడిగా ఎవరో మాట్లాడుకోవడం విని బైటికి వచ్చాడు. ఎవరో నలుగురు ఇంటి చుట్టూ కొలతలు తీసుకుంటున్నారు. వెళ్ళి ఏమిటి సంగతని వాళ్ళని అడిగాడు. "ఇల్లు అమ్మేస్తున్నారు కదా సార్! కొలుచుకోవాలికదా" అన్నాడు ఒకడు.

శివరావుకి అర్ధమైంది. తను ఊహించినదే తన పిల్లలు... నిజమే... పద్ధతిగా ఉండాలని చిన్నప్పుడు వాళ్ళతో కొంచెం కఠినంగానే ఉన్నాడు. ఎక్కువగా వాళ్ళతో మాట్లాడేవాడే కాదు. పార్వతితో కూడా ఏ రోజూ నెమ్మదిగాకాని, ప్రేమగాకాని మాట్లాడలేదు. తనది ప్రైవేట్ జాబ్. అందుకే ఎలాగైనా చిన్న ఇల్లు కట్టుకోవాలని చాలా ఖర్చులు తనవైనా, పిల్లలవైనా తగ్గించేసేవాడు. ఈ విషయంలో తనకీ, పార్వతికీ ఎప్పుడూ వాగ్వివాదమే. తను ఎంతో చెప్పడానికి ప్రయత్నించేది. తను మాత్రం ఎప్పుడూ పార్వతి మాటల్ని పట్టించుకునేవాడేకాదు. ఎప్పుడు డబ్బులు అడిగినా గంటసేపు తనతో వాదించి, అడిగినదాంట్లో సగమే ఇచ్చేవాడు. "నీకు ఎన్ని డబ్బులు ఇచ్చినా సరిపోద"ని విసుక్కునేవాడు. కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుంటే అలానే తనతో వాదించి, తన తిట్లన్నీ భరించి, తను ఇచ్చిన డబ్బులు తీసుకుని ఇల్లు ఎలా గడిపేదో ఇప్పుడు అర్ధమవుతోంది తనకి. "పోనీ నేనూ ఏదైనా ఉద్యోగం చేస్తానని" తను అంటే, "నువ్వు చదివిన వానాకాలం చదువుకి నీకు ఉద్యోగం ఎవరిస్తార"ని వేళాకోళం చేసేవాడు. అయినా ఏదో ఒకటి ఎప్పుడూ చేస్తూ ఉండేది. కూరగాయల మొక్కలు పూలమొక్కలు, పండ్ల చెట్లు వేసి, తోటపని చేసేది. కుట్లు, అల్లికలు చేసేది. ఏరోజైనా కూర చెయ్యకపోతే ఆమెమీద అరిచేవాడు తను.

పైగా కూతురికి నగలు కొనాలనేది. పెళ్ళి సమయానికి ఒకేసారి కొనాలంటే కష్టమని తన దగ్గరనుంచి అంతో ఇంతో తీసుకుని, కూతురి పెళ్ళి సమయానికి తనకి ఎక్కువ కష్టం లేకుండా చేసింది. అప్పుడైనా తను అది గుర్తించకుండా పెళ్ళికి ఇన్ని ఖర్చులేమిటని తన మీద అరిచాడు. ప్రతి శ్రావణ మాసంలో వచ్చే వరలక్ష్మీవ్రతానికి తప్పకుండా ఎంతో కొంత బంగారం కొనాలనేది. విసుక్కుంటూనే తను అడిగిన దానికన్నా చాలా తక్కువ ఇచ్చేవాడు తను. పైగా "నేను ఎలాగూ నువ్వు అడిగినదానికన్నా తక్కువ ఇస్తానని, నీకు కావలసినదానికన్నా ఎక్కువ అడుగుతున్నావా?" అంటూ అడిగేవాడు. తన మాటలకి బాధ పడినా పైకి కనిపించకుండా తనతో వాదనకు దిగేది. తనకి ఇంకా కోపమొచ్చి నానామాటలు అనేవాడు. "అలా గట్టిగా అరవకండి. చుట్టుపక్కల నలుగురూ ఏమనుకుంటారు?" అనేది.

"ఎవరేమనుకుంటే నీకేమిటి? ఆయన ఊరికే పెళ్ళామ్మీద అరుస్తాడని నాకు పేరు తెచ్చావుగా. నలుగురి దృష్టిలో నన్నొక వెధవని చేస్తున్నావు. నీకు ఆనందమేగా. నలుగురికీ నా గొంతే వినపడుతోంది. వాళ్ళ దృష్టిలో నేనేగా చెడ్డవాడిని" అంటూ ఇంకొంచెం గట్టిగా అరిచి బైటకి వెళ్ళిపోయేవాడు. అలాగే మొత్తమ్మీద రెండువందల గజాలు ఆ రోజుల్లో ఊరికి దూరంగా కొని, నెమ్మదిగా ముందూ వెనకా కాస్త స్థలం వదిలి, నాలుగు గదుల ఇల్లు కట్టుకున్నాడు. అదే ఇల్లు ఇప్పుడు మంచి సెంటర్‌లోకి వచ్చింది. ఇప్పుడు పిల్లలకి దీనిమీద కన్నుపడింది. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి, శివరావుకి. పెద్దకొడుకింట్లో ఉన్న ఐదు నెలల అనుభవం గుర్తుకొచ్చింది. కోడలు ఎప్పుడూ తనతో మాట్లాడనేలేదు. కొడుకు ఆఫీస్ దూరం వలన పొద్దున్నే తొమ్మిది గంటలకంతా బయల్దేరాలి. ఇద్దరు పిల్లల్ని ఎనిమిదింటికి స్కూల్లో దింపి వచ్చి, గబగబా అన్నం తినేసి, బాక్స్‌లో పెళ్ళాం పెట్టిచ్చినదేదో తీసుకుని హడావుడిగా కొడుకు వెళ్ళిపోయేవాడు. తనని కూడా తనతోబాటు తినేసి కూర్చోమనేవాడు.

తను "నీ హడావుడి కానీరా.. నేను నెమ్మదిగా తింటాలే" అన్నా వినేవాడు కాదు.

ముందు "తండ్రి మీద ఎంత ప్రేమో" అనుకున్నాడు. నెమ్మదిగా తెలిసింది అసలు సంగతి. కోడలు మటుకు నోరు విప్పేదేకాదు. కొడుకు గబగబా తింటుంటే తను అంత తొందరగా తినలేకపోయేవాడు. కొడుకు తినేసి షూ వేసుకుని రెడీ అయ్యేలోగా కోడలు టేబుల్ సర్దేసేది. తనది పూర్తి అయ్యిందా లేదా అని కూడా చూడకుండా గిన్నెలు తీసేసేది. తను "మజ్జిగ" అంటే, తన మాట వినపడనట్లు అక్కడ్నించి వెళ్ళిపోయేది. కొడుకు వెళ్ళగానే ముందు వరండాలో ఉన్న పడక కుర్చీలో పడుకుని, ఆ రోజు పేపరు చదువుతుండగానే కోడలు తలుపేసుకుని లోపల ఉండేది. తను మటుకు అక్కడే ఉండేవాడు. కటకటాల్లోంచి ఎండపడుతుంటే కుర్చీని అటూ ఇటూ జరుపుకుంటూ అక్కడే ఉండేవాడు. అదృష్టం కొద్దీ ఆ వరండా చివర ఒక బాత్రూం ఉండేది. పిల్లలు నాలుగన్నరకి ఇంటికి వచ్చేవారు. ఐదుగంటలకి టీ పిల్లలచేత పంపించేది. ఆరుగంటలకి కొడుకు రాగానే "ఎలా వుంది నాన్నా?" అంటూ లోపలికి వెళ్ళిపోయేవాడు. కనీసం తన ప్రశ్నకి సమాధానం కూడా వినే ఓపిక లేదతనికి. సెలవు రోజు ఎప్పుడైనా వాళ్ళు బైటికి వెళ్ళినప్పుడు కూడా తనకి కటకటాలే గతి.

"నాన్నా! మేం తొందరగానే వచ్చేస్తాము" అంటూ అన్నం తిని వెళ్ళేవారు. ఒక్కొక్కసారి తనకి అన్నం బాక్స్‌లో పెట్టేసి వెళ్ళిపోయేవారు. తొందరగా వస్తే టీ ఉండేది, లేకపోతే అదీ ఉండేది కాదు. ఆ మర్నాడు కొడుకు ఎంత రాద్ధాంతం చేసాడో ఇప్పటికీ బాగా గుర్తుంది. ఆ రోజునుంచి ఎవరు ఏమిచ్చినా తీసుకునేవాడేకాదు.

ఇంక అక్కడనుంచి రెండో కొడుకింటికి వచ్చాడు. అక్కడ వేరే రకం. ఈ కోడలు ముందు పిల్లిమీదా, ఎలకమీదా పెట్టి కొడుకు లేనప్పుడు అంటూ ఉండేది. తను అక్కడ ఉండడం ఆమెకి ఇష్టం లేదని చాలా స్పష్టంగా తెలిసేలా అనేది. కొన్నాళ్ళకి కొడుకు ఎదురుగుండా కూడా అనడం మొదలుపెట్టింది. ఇరుగూ పొరుగుతో ఇంటికొచ్చిన వాళ్ళతో తన మామగారి వలన తన మొగుడు ఎంత కష్టపడ్డాడో వర్ణించి మరీ చెప్పడం మొదలుపెట్టింది. తన మామగారి వలనే వాళ్ళ ఆయన పెద్ద చదువులు చదవలేకపోయాడుట. డబ్బు చిన్నప్పటినుండీ తను మా ఇంట్లో ఉండి జరిగినదంతా చూసినట్లు వర్ణించేది. ఆ వెధవ సరిగ్గా చదవక వాళ్ళ అమ్మని ఎంత

ఏడిపించేవాడో తనకు తెలుసు. వాడు ఏడిపించడం ఒకటైతే, దానికి తను కూడా పార్వతిని ఎన్నో మాటలు అనేవాడు. ఆఖరివాడని బాగా గారాం చేసి వాడ్ని పాడుచేసిందని అస్తమానం తను ఆమె మీద అరుస్తూవుండేవాడు పెళ్ళాం అలా చెపుతుంటే, వాడూ ఒక్కసారి కూడా ఆమెని ఆపలేదు. ఒకసారి వాడి చిన్నప్పటి స్నేహితుడు, మావాడితో "నీ భార్యని ఆపరా బాబూ! అంకుల్ ఇక్కడే ఉన్నారు. అన్నీ వింటున్నారు బావుండదు" అంటే దానికి వాడు, "అబ్బ, వదిలేయరా బాబూ! తనంతే ఎవరం ఆపలేం. ఎందుకొచ్చిన గొడవ. నడు మనం పక్క రూంలోకెళ్ళి మాట్లాడుకుందాం" అంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. అలాగే అక్కడున్నవాళ్ళూ నోరు మూసుకుని కోడలు పెట్టింది తిని ఊరుకున్నాడు.

కూతురు అక్కడికి వచ్చాక తన గురించి ఏమైనా అడుగుతుందేమోనని చూసాడు. కానీ తనేమో చెప్పబోతున్నా కూడా "కొంచెం సర్దుకోవాలి, నాన్నా! అమ్మలాగా ఎవరూ నీకు చేయరు. నువ్వు ఏ రోజైనా మమ్మల్ని దగ్గరకి తీసావా... మంచిగా మాట్లాడావా..? అయినా చిన్నప్పుడు చాలా బాగా చూసిన అమ్మా, నాన్నలనే ఈ రోజుల్లో కొడుకులు వదిలి వెళ్ళిపోతున్నారు." అంటూ ఇదేదో చాలా సాధారణ విషయమన్నట్లుగా అక్కడినుండి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత పిల్లలు ముగ్గురూ వాళ్ళ వాటాల విషయం మాట్లాడుకోవడం కూడా వినపడింది. ముందునుంచీ కూడా స్నేహితులూ, చుట్టాలూ అంటూ ఎవరినీ దగ్గరగా రానివ్వలేదు తను. కారణం ఒక్కటే. తనది చాలా చిన్న ఉద్యోగం జీతమూ తక్కువే. తనది చిన్న ఉద్యోగమని అందరూ తనని చిన్నచూపు చూస్తారేమోనని అసలు ఎవరినీ కలిసేవాడే కాదు. తక్కువ జీతం కాబట్టి ఎంతసేపూ ప్రతీదానికి లెక్కలు వేయడమే సరిపోయేది. ఎక్కడికి వెళ్ళాలన్నా ఆఖరికి ఏ పెళ్ళి పేరంటానికైనా సరే బయల్దేరేవాడేకాదు. ఇప్పుడు తన పిల్లల కాపరాలు చూస్తుంటే పార్వతి ఎంత సహనంతో ఉండేదో అర్థమవుతోంది. ఇంతకు ముందు తెలుసు. కానీ ఏ రోజూ తన దగ్గర ఒప్పుకోలేదు. ఆఖరికి పార్వతి చనిపోయే రోజున కూడా తనవైపు బేలగా చూసాడే తప్ప ఏమీ చెప్పలేకపోయాడు. పిల్లలు స్వభావాలు తెలిసిన తర్వాత తన ఇంటికి ఎప్పుడు వెళ్తానా అన్నట్లుగా ఉన్నాడు.

ఆఖరికి చిన్న కొడుకు ఇంటినుండి తన ఊరికి, తన ఇంటికి వచ్చేసరికి కాస్త ఊపిరి పీల్చుకున్నాడు. శివరాం వచ్చినట్లు తెలియగానే పొద్దున్నే పనివాళ్ళు చంద్రమ్మ, సాయిలూ పరిగెత్తుతున్నట్లుగా వచ్చారు. గబగబా ఇల్లంతా శుభ్రం చేసారు. ముందు వంటిల్లు కడిగి, కాఫీ పెట్టి ఇచ్చింది చంద్రమ్మ. పడక కుర్చీని శుభ్రం చేసి పెట్టాడు, సాయిలు. వాళ్ళు వచ్చేటప్పుడే పేపర్ కొనుక్కుని వచ్చి, శివరాంకి ఇచ్చారు. కాఫీ తాగుతూ పేపర్ చదువుతూ కూర్చున్నాడు శివరాం. చంద్రమ్మ స్నానానికి వేణ్ణీళ్ళు పెట్టి, వంటకూడా చేసి పెట్టింది. "మళ్ళీ వస్తామ"ని చెప్పి వెళ్ళారిద్దరూ. చంద్రమ్మకి వంట పార్వతి నేర్పించిందో, ఏమో అచ్చు పార్వతి చేసినట్లే వుంది. ఆరోజు నుంచి వాళ్ళిద్దరూ అన్ని పనులూ చూసుకుంటూ తనని కంటికి రెప్పలాగా చూసుకుంటున్నారు. ప్రాణం హాయిగా ఉంది శివరావుకి యిక్కడ. ఇప్పుడు ఈ కొలతలు అవీ చూస్తే, ఒక్కసారిగా భయం పట్టుకుంది శివరావుకి.

ఏం చేయాలి? ఎక్కడ ఉండాలి? ప్రైవేట్ ఉద్యోగమేమో పెన్షన్ లేదు. కొంచెం ప్రావిడెంట్ ఫండ్ వస్తే, అందులో కొంచెం పార్వతి ట్రీట్మెంట్‌కి అయిపోయింది. మిగిలినది ఎన్నాళ్ళకి వస్తుందో తెలియదు. అందుకే తనతో తన ఆఫీస్‌లో పనిచేసిన సూర్యారావు రిటైర్ అయ్యాక వేరే చోట ఎక్కడో చేస్తుంటే తనకి కూడా ఏదైనా ఉంటే చూడమని మొన్ననే వాళ్ళింటికి వెళ్ళి చెప్పి వచ్చాడు.

ఆలోచిస్తుండగానే తలనెప్పి వచ్చేసింది, శివరావుకి. వంటింట్లో వంట చేస్తున్న చంద్రమ్మ, మనుషుల హడావుడి మాటలకి బైటకి వచ్చి చూస్తే, శివరావు తల గట్టిగా పట్టుకుని కుర్చీలో కూర్చుని, బాధపడడం చూసి, కంగారు పడుతూ, "అయ్యగారు! ఏమయింది? తలనొప్పా? పొద్దున్న బి.పి మాత్ర వేసుకున్నారా?" అంటూ దగ్గర వచ్చి అడిగింది.

"ఆ వేసుకున్నాను. కొంచెం పడుకుంటాను. చంద్రమ్మా!" అంటూ లోపలికి వెళ్ళాడు శివరావు.

వెంటనే వంటింట్లోకి వెళ్ళి తన సెల్‌ఫోన్ తీసి, మొగుడికి ఫోన్ చేసింది, చంద్రమ్మ.

సాయిలు వెంటనే వచ్చాడు. "అయ్యగారూ! డాక్టర్‌గారి దగ్గరికి వెల్దామాండీ" అంటూ హడావుడి చేసాడు.

ఆ రోజు పనికి వెళ్ళనన్నాడు. శివరావు అతనికి నచ్చచెప్పి పనికి పంపించాడు. కాసేపు కళ్ళు మూసుకుని పడుకున్నాడు. అనుకున్న రోజు వచ్చింది. పిల్లలు అందరూ వచ్చారు. వాళ్ళు రాగానే మళ్ళీ చెక్ సైన్ చేసి ఇచ్చేసాడు. శివరావు ఉత్సవ విగ్రహంలాగా ఉండిపోయాడు. ఎందులోనూ కల్పించుకోలేదు. ఎక్కువ హడావుడి లేకుండా చాలా తక్కువ ఖర్చుతో కార్యక్రమం అయిందనిపించారు, పిల్లలు. తక్కువ ఖర్చుతో కార్యక్రమం చేయడం మంచిదే కానీ, వాళ్ళు మాట్లాడిన తీరు ఎంత మాత్రం నచ్చలేదు.

శివరావుకి ప్రతిదానికి "ఇది ఏమిటి దీనికి ఇంత ఖర్చు ఎందుకు? చెయ్యకపోతే ఏమవుతుంది? మాకు అంత టైము లేదు. టూకీగా కానిచ్చెయ్యకూడదా అయినా మన ఈ పద్ధతులన్నీ ట్రాష్. ఇన్నిన్ని రోజులు ఇవన్నీ చేస్తూ ఇక్కడ కూర్చుని ఉంటే మా ఉద్యోగాలేం కాను? పిల్లలకి కూడా ఒక్క రోజు సెలవిమ్మంటే పది నీతులు చెబుతుంది వాళ్ళ హెచ్.ఎం ఇవ్వన్నీ చేయడానికి మాకెక్కడ కుదురుతుంది?" అంటూ ఏదో చేసారు. అంతమాత్రం చెయ్యడమే గొప్ప అనుకున్నాడు శివరావు. ఇల్లు అమ్మేసారు. శివరావుని ఒక్కమాట కూడా అడగలేదు. ఆఖరిరోజు, సాయంత్రం వాళ్ళ ప్రయాణమనగా, పెద్దకొడుకు తన చెల్లెల్ని పిలిచి "నాన్నగారిని తొందరగా రెడీ అవమను. రిజిస్ట్రేషన్ ఆఫీసుకి వెళ్ళాల"ని తొందరపెట్టాడు. పెళ్ళాన్నీ, పిల్లల్నీ ఖాతరు చేయకుండా మొగ మహారాజులా బతికిన శివరావు ఎందుకు, ఏమిటి అని అడగకుండా వాళ్ళు చెప్పినట్లుగా తయారయి వెళ్ళి, సంతకం పెట్టి వచ్చాడు.

పిల్లలు ముగ్గురూ కలిసి, ఇంట్లో ఉన్న సామానంతా ఎవరికి కావాల్సినవి వారు సర్దుకున్నారు. ఎవరూ చెప్పకుండానే, తనే స్వతంత్రంగా శివరావు వస్తువులన్నీ ఒక పెద్దపెట్టెలో సర్దింది చంద్రమ్మ. ఆటోలని పిలిచారు. సామాన్లన్నీ బైటపెట్టి, ఇల్లు తాళం వేసి, తాళం చెవిని ఆ ఇల్లు కొనుక్కున్న వాళ్ళ మనిషికి, ఇచ్చారు. సాయిలు, చంద్రమ్మ కళ్ళల్లో నీరు నింపుకుని, చూస్తూ ఉండిపోయారు.

పెద్దకొడుకు, "నాన్నా! ఆటో ఎక్కు" అన్నాడు.

శివరావు పిచ్చి చూపులు చూసాడు.

చిన్న కొడుకు దగ్గరగా వచ్చి, "నాన్నా! నిన్నే, ఎక్కు" అన్నాడు.

శివరావు ఇంటి మెట్ల మీద చతికిలపడ్డాడు. పిల్లలు ముగ్గురూ దగ్గరికి వచ్చారు. శివరావు తల ఎత్తి వాళ్ళకేసి చూస్తూ, "నేను రాను, మీరు వెళ్ళండి." అన్నాడు స్థిరంగా.

ముగ్గురు పిల్లలూ మూడు విధాలుగా గొంతు పెంచి అరిచారు. ఆఖరికి విసుక్కుంటూ వెళ్ళిపోయారు. శివరావు, పిల్లలు వెళ్ళగానే అక్కడే చేతులు కట్టుకుని నిలబడ్డ సాయిలు, చంద్రమ్మలను చూసి, "నాలుగు రోజులు నన్ను మీ ఇంట్లో ఉండనిస్తారా?" అన్నాడు. చంద్రమ్మ ఘొల్లుమంది.

అప్పటికి బాగా చీకటిపడింది. సాయిలు ఇల్లు చిన్న కుటీరంలాగా ఉంది. ముందు అరుగు మీద చివరగా ఉన్న గదిలోకి తీసుకెళ్ళాడు, సాయిలు. గది నీట్‌గా సర్ది ఉంది. అక్కడ ఉన్న మంచం మీద ఒరిగిపోయాడు శివరావు. తలుపు దగ్గరగా పెట్టి వెళ్ళిపోయారు సాయిలు, చంద్రమ్మ. ఎన్నో రోజుల భారం పోయినట్లుగా, హాయిగా నిద్రపోయాడు, శివరావు.

పక్షుల కిలకిలలతో మెలకువ వచ్చింది శివరావుకి. కళ్ళు తెరిచి చూస్తే, కాసేపటి దాకా ఎక్కడ ఉన్నదీ అర్థం కాలేదు. అంతా గుర్తుకొచ్చింది. "నన్ను వదిలి ఎందుకు వెళ్ళిపోయావు, పార్వతీ!" అని అనుకుంటుండగానే కళ్ళల్లో నీళ్ళూరాయి.

మళ్ళీ గతం గుర్తొచ్చింది. ఈ చంద్రమ్మ వాళ్ళింట్లో పన్లో చేరేసరికి పదహారేళ్ళ పిల్ల. పొట్టిగా, నల్లగా, సన్నగా, ఎత్తుపళ్ళతో, మొహంలో కళా, కాంతీ లేకుండా ఉండేది. దాన్ని, దాని చింపిరి జుట్టుని చూస్తేనే, శివరావుకి విసుగొచ్చేది. గ్లాసు సరిగ్గా కడగలేదనో, సరిగ్గా ఊడవలేదనో ఏదో ఒకటి అంటూనే ఉండేవాడు. "దాన్ని కొంచెం జుట్టుకి నూనె రాసుకోమను" అనేవాడు.

ఇంకోరోజు "నా బట్టలు దాని చేత ఉతికించకు, నువ్వే ఉతుకు." అని అనేవాడు పార్వతితో. చంద్రమ్మకి శివరావుని చూస్తేనే ఒణుకు వచ్చేసేది. అతను అనడానికి సరిగ్గా అతని ఎదురుగుండా ఏదో ఒకటి పారబోయడమో చేసేది. "దాన్ని పనిమానిపిస్తావా? లేదా?" అంటూ రోజూ పార్వతితో గొడవపెట్టుకునేవాడు. మధ్యలో పార్వతి సతమతమయ్యేది. చంద్రమ్మ తల్లి, శివరావు ఇలా అనడం చూసి, పిల్లని నాలుగుకొట్టి, ఏడ్చేది. పార్వతి మటుకు చంద్రమ్మని కొట్టనిచ్చేదికాదు. ఓపిగ్గా చంద్రమ్మకి పని నేర్పించేది. "దానికి పని నేర్పించడానికి నువ్వు దానికి డబ్బులిస్తున్నావా? " అంటూ అరిచేవాడు శివరావు. ఇద్దరి మధ్య నలిగిపోయేది కానీ చంద్రమ్మని మాత్రం ఒదలలేదు పార్వతి. దానికి చదువు కూడా చెప్పేది. కొన్ని రోజులు చూసి చంద్రమ్మ "అయ్యకి ఎందుకమ్మా అంత కోపం?" అంది పార్వతితో.

"మగవాళ్ళు బైటికి వెళ్ళి పనిచేసి వస్తారు. వాళ్ళకి ఎన్నో చికాకులుంటాయి. మనమే సర్దుకోవాలి" అనేది పార్వతి.

ఒకరోజు శివరావు ఎందుకో పార్వతిని గట్టిగా కేకలు వేసాడు. పార్వతి కళ్ళనీళ్ళు పెట్టుకోవడం కూడా చంద్రమ్మ చూసింది. శివరావు వెళ్ళిపోగానే పార్వతి దగ్గరకి వచ్చి "ఎందుకమ్మా అందర్నీ అలా తిడుతూ ఉంటారు. మీరైతే అలా ఊరికే తిడుతున్నా ఊరుకుంటారు. పిల్లలు తప్పు చేసినా, నేను తప్పుచేసినా, మిమ్మల్నే తిడతారు. మళ్ళీ తిప్పి తిప్పి మిమ్మల్నీ తిడతారు. నాకందుకే సారున్నప్పుడు రాబుద్ధికాదమ్మా. ఆయన వెళ్ళిపోయాక వస్తాను." అంది.

వెంటనే పార్వతి చంద్రమ్మ వైపు తిరిగి, "ఏమన్నారే, ఆయన? నిన్ను పని సరిగ్గా చెయ్యమన్నారు. నన్ను నీచేత పని సరిగ్గా చేయించమన్నారు. అంతేగా కొంతమంది నెమ్మదిగా చెప్తారు. కొంతమంది గట్టిగా చెప్తారు. అయినా మొగవాళ్ళు బైటకి పనికి వెళ్ళినప్పుడు ఎన్నో సవాళ్ళు ఎదుర్కోవాల్సి వస్తుంది. వాళ్ళకి ఎన్నో చికాకుకుంటాయి. దాంతో నామీద ఆయన కొంచెం విసుక్కుంటే ఏమవుతుంది? నా అనుకున్న వాళ్ళమీదే విసుక్కుంటారు. నీమీద కాని, పిల్లల మీద కానీ ఆయనకి కొంచెం కూడా కోపంలేదు. నువ్వు ఎక్కువ వాగకుండా నీ పని జాగ్రత్తగా చెయ్యి" అంటూ సన్నసన్నగా విసుక్కుంది. ఆఫీస్ ఫైల్ మర్చిపోయి, వెనక్కి వచ్చిన తను ఆ మాటలు విని, ఏమీ తెలియనట్లుగానే వెళ్ళిపోయాడు. అలా ఇంట్లో చేరిన చంద్రమ్మ ఇప్పుడు తనకి దిక్కయ్యింది. చంద్రమ్మ పెళ్ళికూడా పార్వతి చేతులమీదుగా అయింది. నెమ్మదిగా గది బైటకి వచ్చాడు. అతన్ని చూసి సాయిలు గబగబా వచ్చి, అటాచ్డ్ బాత్రూం చూపించి, లోపలికి వెళ్ళాడు, కాఫీ తేవడానికి.

స్నానం చేసి వచ్చి, అరుగుమీద పడక్కుర్చీలో తాపీగా కూర్చుని ఆలోచించడం మొదలుపెట్టాడు. శివరావు. నెమ్మదిగా వచ్చి, కింద నేలమీద కూర్చున్నారు సాయిలూ, చంద్రమ్మ. "ఎంతోకాలం ఇక్కడ ఉండను సాయిలూ నెమ్మదిగా ఎక్కడైనా ఇల్లు చూసుకుని వెళ్ళిపోతాను." అన్నాడు, శివరావు. సాయిలు, చంద్రమ్మా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. సాయిలు నెమ్మదిగా, "అయ్యా! అమ్మగారు మీకేమీ చెప్పలేదా?" అన్నాడు.

"ఏమిటి చెప్పేది?" అంటూ ఆశ్చర్యంగా చూసాడు, శివరావు

"అదే మీకు ఏదైనా పేపర్ ఇవ్వలేదా? " అప్పుడు గుర్తొచ్చింది, శివరావుకి పార్వతి చనిపోయేముందు ఏదో "నల్ల బాగ్" అంది.

"సాయిలూ నా పెట్టె తీసుకురా చూద్దాం" అన్నాడు కొంచెం ముందుకు వంగి. అతని సామాను సర్దుతూ ఆ బాగ్కూడా పెట్టెలో పెట్టింది చంద్రమ్మ. ఏడాది దాటిపోయినా ఆ బాగ్ గుర్తేరాలేదు శివరావుకి.

సాయిలు తెచ్చిన పెట్టెలో చూస్తే ఆ నల్ల బాగ్ ఉంది. ఆత్రుతగా తీసి చూసాడు శివరావు. ఏవో కొన్ని పేపర్స్ కనపడ్డాయి ఆ బాగ్‌లో. అందులో పార్వతి రాసిన ఉత్తరం తీసి చదవడం మొదలుపెట్టాడు అతను. "నాకు తెలుసు మీకు ఇలాంటి అనుభవం ఎదురవుతుందని. మాతో మీరెంత కటువుగా వున్నా మీలోపల ఉన్న మనసు నాకు తెలుసు. సొంత ఇల్లు కట్టుకోవాలని, మీ మిగిలిన కోరికలన్నీ ఒదులుకుని ఎంతో కష్టపడి, ఈ ఇల్లు సంపాదించుకున్నారు. మీకు ఇంకో ధ్యాసలేకపోయింది. కానీ మారుతున్న కాలాన్ని గమనిస్తున్న నేను ఏదో ఒకరోజుకి ఈ పరిస్థితి రావచ్చని చాలా ముందుగానే ఊహించాను. అందుకే మీతోపాటు నేను కూడా కష్టపడి, మీకు తెలియకుండా, ఊరికి కొంచెం దూరంగా ఈ వంద గజాల స్థలం కొని, రెండుగదులు వేసి మీకోసం పెట్టాను. జీవితమంతా ఈ సంసారం కోసం కష్టపడి, కోపిష్టివాడని నలుగురుతోను, నాన్న చెడ్డవాడని పిల్లలచేతా అనిపించుకుని కూడా, రిటైర్ అయ్యాక హాయిగా జీవితం గడపాలనుకున్న మీకోరిక చాలా సహజమైనది. అందుకే ఈ ఏర్పాటు. ఈ విషయంలో సాయిలు, చంద్రమ్మ నాకెంతో సహాయం చేసారు. ఈ జన్మకి వాళ్ళ ఋణం తీర్చుకోలేను. మీరు ఎప్పటికీ సంతోషంగా ఉండాలని కోరుకుంటూ మీ... పార్వతి. "

శివరావు శిలావిగ్రహంలా ఉండిపోయాడు. సాయిలు దగ్గరకి వచ్చి, శివరావుని పట్టుకున్నాడు.

# పాతాళం రవి కొప్పరపు

భూమి మీద అత్యంత లోతైన ప్రదేశం పసిఫిక్ మహాసముద్రంలో ఉండే 'మరీనారా ట్రెంచ్ ' . సముద్రం ఉపరితలం నుంచి, సముద్రగర్భం వరకు దాదాపు పది మైళ్ళ లోతు ఉంటుంది.. ఇది ఎవరెస్టు పర్వతం కన్నా ఎత్తు. అంటే, ఎవరెస్టు పర్వతాన్ని మరినారాలో ముంచితే, పూర్తిగా మునిగి ఇంకా ఎన్నో మైళ్ళ నీరు పైన ఉంటుంది. ఇది ప్రకృతి సహజంగా ఏర్పడిన అగాధం.

ఆయిల్ డ్రిల్లింగ్ కోసం మనుషులు ఎన్నో గోతులు తవ్వారు. అసలు డైనోసార్లు చనిపోవాడినికి కారణమైన ఉల్క ఒకటి భూమిని కోట్ల సంవత్సారాల క్రితం ఢీకొట్టినపుడు ఏర్పడిన పెద్ద గొయ్యి (180 మైళ్ళ వ్యాసం) ఆయిల్ డ్రిల్లింగ్ చేస్తున్నప్పుడు మెక్సికోలో కనుగొన్నారు. అప్పుడే మనకి డైనోసార్లు ఎలా అంతరించి పోయాయో తెలిసింది. ప్రపంచలో అన్నిటకన్నా లోతున్న గోయ్యి రష్యాలో ఉన్న 'కోలా సూపర్ డీప్ బోర్ హోల్ '. ఏడున్నర మైళ్ళ లోతు, కాని కేవలం తొమ్మిది అంగుళాల వ్యాసం. 1970 లో ప్రారంభించి, అంత లోతు తవ్వడానికి 20 ఏళ్ళు పట్టింది. ఇంకా లోతు తవ్వారని వార్తలొచ్చినా, 2008 సంవత్సరం లో ఆ ప్రాజెక్టుని అర్థాంతరంగా ఆపేసారు. ఎందుకు ఆపేసారని స్పష్టంగా ఎవరికీ తెలియకపోయినా, దానికవసరమయ్యే నిధులు ఆగిపోయాయని గాలి వార్త. ఆ ప్రదేశానికి ఎవ్వరినీ వెళ్ళకుండా ఖచ్చితమైన ఆదేశాలిచ్చి, మిలటరీ పహారా పెట్టి, గొయ్యిని పూడ్చేసారు ఏదీ లోపల వెళ్ళకుండా...............లేదా బయటకు రాకుండా ఉండేదుకు..

★★★★★★★★★★★★★★★★

" ఈ రిపోర్టు చూసావా? " ఒక ఫైలుని నా ముందు పడేసి అడిగాడు నా కొలీగు. అసహనంగా కదిలాను. నా పనేదో నేను చేసుంటుంటే మధ్యలో ఈ డిస్టర్బెన్సేంటి? అప్పటికీ డివిజను మార్చమని హెడ్డాఫీసుకి రెక్వెస్టు చేసా. ఇంకా ఏమీ తేలలేదు. మధ్యలో వీడి గొడవొకటి.

నెమ్మదిగా ఆ ఫైలు తీసి, చూస్తూ "ఏంటిది?" అనడిగా.

"ఇది మన డివిజను హెడ్డు నాకిచ్చాడు, మనిద్దరనీ చూడమని. చూసి, దాని మీద రిపోర్టు ఇవ్వాలి ఏంచెయ్యాలని. ఆ రిపోర్టు ఆయనకి నచ్చితే, సూపర్ బాసు దగ్గరికి వెళ్ళి, అక్కడి నుంచి డెఫెన్సు మినిస్టరు గారి దగ్గరికి వెళ్తుంది. ఇంక ఏక్షను ఏంతీసుకోవాలనేది పై వాళ్ళు చూసుకుంటారు".

డిఫెన్సు మినిస్టరు అనేసరికి నాలో కదలిక వచ్చింది. ఇదేదో అత్యంత ముఖ్యమైన విషయమయ్యుంటుంది. ఇంక సరిగ్గా కూర్చుని ఫైలు ఓపెన్ చేశా. ఎవరో మెద్వేవ్ అనే సైంటిస్టు, సైన్సు మినిస్టరు గారికి ఎక్కడో తవ్విన లోతైన గొయ్యి గురించి రాసిన రిపోర్టు. మా కంప్యూటర్ దానిని తర్జుమా చేసింది. చదవడం మొదలు పెట్టా.

★★★★★★★★★★★

"గౌరవనీయులైన డెఫెన్సు మినిస్టరు గారికి,

నేను కోలా బోర్ హోల్ ప్రాజెక్టుకి చీఫ్ సైంటిస్టుని. ఈ ప్రాజెక్టు గురుంచి మీకు తెలిసే వుంటుంది. మనముండే భూమి పై పొర లోపల ఎలా ఉందో, అందులో ఎలాంటి ఖనిజాలున్నాయో తెలుసుకోవాడానికి చేసే ప్రయత్నం. కనీసం ఉపరితలం నుంచి10 మైళ్ళు లోతు తవ్వితే గాని తరువాత పొర తాకలేము. వివిధ దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి. వారి నుంచి నిధులు మాత్రమే కాకుండా, మానవ వనరులు కూడా అందాయి. ఇది ప్రపంచానికి ఉపయోగపడే ప్రయత్నం. నాతో పాటు, ఇండియా, చైనా, అమెరికా ఇంకా వేరే దేశాల సైంటిస్టులు కూడా పని చేస్తున్నారు. ప్రాజెక్టు అనుకున్న విధంగా సాగింది ఇప్పటివరకు. కాని ఒక నెల క్రితం మా సైంటిస్టులు ఒక భయానక మైన విషయాన్ని కనుక్కున్నారు. మీకు రాస్తున్న ఈ రిపోర్టు దాని గురించే. ఈ రిపోర్టుని మీరు అత్యవసరంగా అన్ని దేశాధ్యక్షుల దృష్టికి వెంటనే తీసుకెళ్ళాలని మిమ్మల్ని కోరుతున్నాను"

"ప్రపంచానికి తెలిసినంతవరకు మేము ఏడు మైళ్ళ కంటే ఎక్కువ లోతు తవ్వలేదు. ఆ ఏడు మైళ్ళ లోను, మేము చాలా విషయాలు తెలుసుకున్నాము. తవ్వేకొద్దీ వేడి పెరుగుతుంది. దాని వల్ల మా మషీన్లు లోతు వెళ్ళే కొద్దీ పని చెయ్యడం మానేసాయి. క్రితం సంవత్సరం కనుక్కున్న ఒక కొత్త టెక్నాలజి సాయంతో మేము 25 మైళ్ళ వరకు తవ్వగలిగాము. అప్పటివరకు తవ్విన తరువాత, ఒక చిన్న రోబోట్టుకి కెమెరా పెట్టి ఆ తవ్విన గుంత లోకి దింపాము, లోపల ఏముందో తెలుసుకోవడానికి. ఆ కెమెరా లోపల వెళ్ళేకొద్దీ ఏమేమున్నాయో చూపిస్తోంది. నేను చెప్తే నమ్మరు గాని, అక్కడ దొరికే ఖనిజాలు, డైమండ్లు ముందు మనకున్నవి కాలి గోటికి కూడా సరిపోవు. 12 నుంచి 15 మైళ్ళ మధ్య లోతులో అయితే దాదాపు వంద అడుగుల పొడవున్న వేల, వేల డైమండ్లున్నాయి. దాన్ని బట్టే మీరూహించుకోవచ్చు ఎలాంటి సంపద వుందో. మా కెమెరా 20 మైళ్ళ లోతుకొచ్చేసరికి ఏదో చారలు లాంటివి కనబడ్డాయి. అవి చక్కగా చెస్సులోని గళ్ళగా పేర్చబడి వున్నాయి. అదేంటో మాకర్థం కాలేదుగాని, ఏదో కొత్త రకమైన ఖనిజమయ్యుంటుందని అనుకున్నాము. మాకు చాలా ఆనందమేసింది. ఇలాంటి కొత్త పదార్థాల వల్ల మనకు ఇంతకు మునుపు లేని వస్తువులు తయారు చేసుకోవచ్చు. ఆ చారలు ఇంకా దగ్గర నుంచి చూడాలని ఆ రోబోట్టుని కెమెరా తో సహా ఇంకా లోతుకి పంపించాము. "

" 25 మైళ్ళ లోతు వచ్చేసరికి, ఆ చారలు స్పష్టంగా కనిపించాయి....అవి రోడ్డులు, హైవేలు.  మాకు సంభ్రమాశ్చర్యాలు...భూమికి 25 మైళ్ళ లోపల రోడ్డులేంటి? కెమెరా పనిచేస్తోందో లేదోనని టెస్టు చేసాక, కెమెరా లో ఏదీ ప్రాబ్లెం లేదని నిర్ధారణకొచ్చాము. మరి కళ్ళ ముందు కనబడేది? కాని మన రోడ్డ్ల లాగ లేవు. ఏదో గాజులాంటి పదార్థంతో తయారు చేసినట్టు వుంది. బాగా మెరుస్తున్నాయి.  చాలా సేపటివరకు మాకు అర్థం అవ్వలేదు అవెందుకు మెరుస్తున్నాయో? వాటిపక్కన ఇళ్ళ లాంటివి కనబడ్డాయి. అవికూడా మెరుస్తున్నాయి. కాని ఒక్కొక్కటి ఒకొక్క రంగుతో... ఆక్కడ వేడి కూడా 350 డిగ్రీలుంది. కాబట్టి జీవం అసంభవం.......అని మేమనుకునే లోపలే మాకు జీవులు కనబడ్డాయి.."

"వాళ్ళ రూపం స్పష్టంగా కనపడలేదుగాని, వాళ్ళు మనలాగ లేరు, వాళ్ళు నడిచే విధానం కూడా, తేలుతున్నట్టుందిగాని, నడుస్తున్నట్లు లేదు.  దానికి సంబంధించిన వీడియో ఈ రిపోర్టు కి జత చేస్తున్నాను.  వాళ్ళ రోడ్డులు, ఇళ్ళు అన్నీ ఎందుకు మెరుస్తున్నాయో కూడా ఒక అవగాహనికి వచ్చాము. అవన్నీ రకరకాల వజ్రాలతో కట్టారు కాబట్టి.  అక్కడ ఎక్కువగా దొరికే ఖనిజం అదే. మీకు తెలిసే వుంటుంది, వజ్రం ప్రపంచంలోకెల్లా అత్యంత కఠినమైన వస్తువని. ఇంకో వజ్రమే దాన్నేమైనా చెయ్యగలదు. ఈ విషయాన్ని మరీ నొక్కి ఎందుకు చెప్తున్నానంటే, వాళ్ళు వజ్రాలతో ఆయుధాలు తయారు చేసుంటే వాటిని మనమేమి చెయ్యలేము. ఇది మీరు సైన్యాధిపతుల దృష్టికి తీసుకెళ్తారని ఆశిస్తున్నాను."

"అసలు ఆ జీవులు అంత లోపల ఎలా వచ్చాయో తెలియదు. అక్కడే పుట్టి వుండడం అసాధ్యం. వేడి అనే కాకుండా, జీవం తయారవ్వడానికి అవసరమయ్యే పదార్థాలు తక్కువ అంత లోతులో. మా సైంటుస్టులందరి అభిప్రాయం ప్రకారం, వాళ్ళు ఎన్నో వేల (లేదా లక్షల) సంవత్సరాల కింద మన లాగానే భూమి మీద వుండేవాళ్ళేమో. ఏదో బలమైన కారణం వుంటేగాని అంత నివాసయోగ్యంకాని ప్రదేశంలోకి వెళ్ళివుండేవారు కాదు. ఆ కారణం ఏమిటో మనకు తెలియదు. అసలు వాళ్ళు ఇంతకు ముందు భూమి ఉపరితలం మీద వున్నట్టు ఆధారాలు కూడా కనపడలేదు. "

"ఇంకో విషయం. మనమున్నట్టు వాళ్ళకి తెలిసినట్టు లేదు. లేకపోతే ముందే భూపైభాగంలోకి వచ్చేవాళ్ళు. కాబట్టి, వాళ్ళకి తెలియకుండా ఉండేందుకు సర్వవిధాల ప్రయత్నించండి.  ఎందుకంటే, నా ఉద్దేశ్యం ప్రకారం, వాళ్ళు వస్తే మనముండము.  వాళ్ళు లోపల ఉండడమే మనకుత్తమం. మన ప్రాబ్లెంస్ మనకున్నాయి, కొత్తగా తెచ్చి పెట్టుకోవద్దు. కాబట్టి, నా రికమండేషనేమిటంటే, ఈ కోలా బోర్ హోల్ ని వెంటనే మూసివేసి, బాగా సెక్యూరిటి పెట్టండి. ఎవ్వరినీ వెళ్ళనీయద్దు. ఎలాంటి వార్తా రిలీజు చెయ్యద్దు. సాంకేతిక కారణాల వల్ల ఆగిపోయిందని మాత్రం చెప్పండి.   ఒక సైంటుస్టునైన నేను, ఒక అద్భుత సంపద కనుక్కొని, మానవాళికి ఉపయోగపడే ఖనిజాలు ఉన్నాయని తెలిసికూడ ఇలా చెప్పడం నా సైన్సు వృత్తికే విరుద్ధం. కాని ఎన్నో వందల కోట్ల మన మానవాళి భవిష్యత్తు ముందు నా వృత్తి ధర్మం అసందర్భం. కాబట్టి, మీరు నేను, నా కొలీగ్సైన ఇతర దేశాల సైంటిస్టులు రాసిన ఈ రిపోర్టుని చూసి, అతి త్వరగా ఒక డెసిషన్ తీసుకుంటారని భావిస్తున్నను.

మీ భవదీయుడు

మెద్వెవ్

❦❦❦

రిపోర్టులోంచి తల పైకెత్తి మెల్లగా నా కొలీగు వైపు చూసాను.

"ఇంటరెస్టింగ్..." అన్నా..

"కదా.." అన్నాడు నవ్వుతూ.

ఫైలు మూసి నిశ్శబ్దంగా కూర్చున్నా..

"మనకు వాళ్ళ గురుంచి తెలిసిందని, వాళ్ళకు తెలియదు"...కొంతసేపయిన తరువాత నెమ్మదిగా నా వైపు చూస్తు అన్నాడు నా కొలీగు.

తలూపాను.

"అంతే కాదు, మనం ఇంత లోతు ఎందుకు వచ్చామో కూడా వాళ్ళకు తెలియదు"

"దేవగణ జాతితో యుద్ధం చేసి మనం ఓడిపోయిన తరువాత ఇక్కడ దాక్కోవాల్సి వచ్చింది. ఇంతకాలం వాళ్ళు పైనే వున్నారని అనుకున్నాము. వాళ్ళు లేరు ఇప్పుడు"

"ఎక్కడికి వెళ్ళుంటారు?"

"ఏమో? గెలిచిన తరువాత వెళ్ళిపోయుంటారు."

"వాళ్ళు మళ్ళీ వస్తే?"

మళ్ళీ నిశ్శబ్దం మా మధ్య.

"నీ రికమండేషనేమిటి?" అడిగాడు నా కొలీగు.

గట్టిగా నిట్టూర్చి అన్నా:

"మన అసురులు పైకొచ్చే సమయమైయ్యింది"

## నిచ్చెన మెట్లు — ఎలక్ట్రాన్

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

ఏకగర్భజనితులై, ఒకే కుటుంబ సంప్రదాయ వాతావరణంలో పెరిగినా మనస్తత్త్వాలు ఒకేలా ఉండాలని ఎక్కడా లేదు. అలాంటప్పుడు విభిన్న వ్యక్తుల భావజాలాలు ఒకే రీతిన ఉండవనుకోవడం కూడా సమంజసమే. కుర్చీలో కూర్చున్న అధికారికి ఆఫీసులో ఉన్నవారందరూ ఒకే గతిన పనిచేస్తే అంతకన్నా హాయిలేదు. కానీ అలా జరగదు. వ్యక్తిగతమైన ఎదుగుదల కోసం, తదనుగుణమైన గుర్తింపు కోసం ఆశలు, ఉండడం సహజమేకాని, వివిధ ఉద్యోగుల మనస్తత్త్వాలు, వారివారి అనుసరించే విధానాలు అనేకమైన సమస్యల్ని సృష్టిస్తాయి. గుర్తెరిగిన అధికారి యొక్క పాలనాదక్షత ఉద్యోగుల అంతరంగాలని తెలుసుకోవడంతో ముడిపడి ఉంటుంది. వారికి తనిచ్చే స్ఫూర్తి, ప్రేరణలపై ఆధారపడి ఉంటుంది.

శ్రీపతి ఒక కేంద్రీయ వైజ్ఞానిక, సాంకేతిక సంస్థ తాలుకు ఓ ప్రాంతీయ కేంద్రానికి అధిపతి. ఏ విధమైన సందేహమూ లేకుండా, శ్రమించి పైకొచ్చినవాడే. అన్ని విభాగాల విషయాలు వేళ్ళచివరన ఉంచుకొని, అవకాశమొస్తేచాలు, ‘మీ విభాగంలో ఏం జరుగుతుందో మీకే తెలియనప్పుడు ఎలాగసార్?’ అని కిందివారిని వ్యంగ్యధోరణిలో హెచ్చరించేవాడు.

ఆ రోజున రసాయన శాఖాధిపతి శ్యామలతను పిలిచాడు. "ఆదిత్య కెమికల్స్ వారు డెలివరీడేట్ ని పొడిగించమని అడిగారు కదా? ఆ సంగతి ఏమైంది?" అని ప్రశ్నించాడు.

''నేను భువనేశ్వర్ సమావేశంనుంచి తిరిగివచ్చింది నిన్నసాయంత్రమే కదా? ఆ సంగతిని గురించి ఇప్పుడే ఉపలతను అడుగుదామనుకొంటే, ఆమె ఈ రోజు సెలవు పెట్టిందని తెలిసింది. చిట్టిలతని అడిగితే తనకు తెలియదంది."

" మీ అందరితో వచ్చిన చికాకే ఇది! మీరు పొరుగూరు ఏ కారణం మీద వెళ్ళినా ఎప్పటికప్పుడు ముఖ్యమైన విషయాల గురించి వారికి చెప్పి, అక్కణ్ణుంచి ఆరాలు తీస్తూ ఉండాలి."

" వాళ్ళ ఫ్యాక్టరీలో కార్మికుల సమ్మె కారణంగా వ్యవధి చాలదని, సమయం పొడిగించమని అభ్యర్థన చేశారు. మన స్టోర్స్ అండ్ పర్చేస్ సెక్షన్ ఆ ఉత్తరాన్నినాకు మార్క్ చేస్తూ ఆలశ్యంగా డెలివర్ చెయ్యడం మూలాన మనకి నష్టమేమీ ఉండదని హామీ నేనివ్వాలని రాశారు. వారి ఫ్యాక్టరీలోనే కాకుండా పలు పరిశ్రమలలో కార్మికులు సమ్మె మీద వెళ్లారు. ఆ మాట వాస్తవం. అదీకాక ఇంతవరకూ, అధిక ఉష్ణోగ్రతల వద్ద పనిచేసే లూబ్రికెంట్ ని మనం జర్మనీ నుంచి దిగుమతి చేసుకొంటున్నాం. ప్రయోగాత్మకంగా ఈ కంపెనీ తయారుచేసిన లూబ్రికెంట్ ని మనం అప్రూవ్ చేసి, స్థిరంగా పనిచేస్తే బల్క్ ఆర్డర్ వేయొచ్చుననే ఉద్దేశ్యంతో ముందస్తుగా చిన్న తరహా ఆర్డర్ వేశాం. పెనాల్టీ క్లాజ్ తో అనుమతి యిస్తే వాళ్ళు ఇకముందు హై టెంపరేచర్ లూబ్రికెంట్ ని మనకి సరఫరా చెయ్యకపోవచ్చు. ఆ పక్షంలో మనం విదేశాలమీదే ఆధారపడి ఉండాలి. విదేశం నుంచి దిగుమతి చేసుకొన్నది ఇంకా స్టాక్ లో ఉంది కాబట్టి, మన కార్యక్రమాలకి ఆటంకం ఉండదనీ, వ్యవస్థకి నష్టం ఉండదని నా అభిప్రాయం వెల్లడి చేశాను. ఈ విషయాలన్నీ రాస్తూ వారడిగిన ప్రకారం అనుమతి ఇవ్వడం సబవే అని మీ అనుమతి కోసం ఫైల్ పుటప్ చేశాను. ఈ విషయాలన్నీ స్టోర్స్ అండ్ పర్చేస్ వారికి తెలియదని కాదు. వారు సంతకం చేసే ముందు మేము హామీ ఇవ్వాలి. మా భుజాల మీద వారి తుపాకీలు!" శ్యామలత దీటుగానే సమాధానమిచ్చింది.

"మనం ఆర్డర్ వేసిన ఉత్తరం తేదీ తర్వాత సరఫరాకీ ఎంత గడువిచ్చామో అంత గడువూ సమ్మె విరమణ తేదీ తర్వాత ఇస్తామంటూ ఉత్తరం రాయమని నేను ఆదేశమిచ్చి స్టోర్స్ అండ్ పర్చేస్ వాళ్ళకి మార్క్ చేశాను. స్టోర్స్ వాళ్ళు రాసిన ఉత్తరం మీకు మార్క్ చేయలేదా?" శ్రీపతి అడిగాడు. ఆ అడగడంలో తను ఇచ్చిన నిర్ణయం ఎంత అర్థవంతమైనదో గ్రహించాలన్న తాపత్రయాన్ని గ్రహించలేనంత మూర్ఖురాలు కాదు శ్యామలత.

"సర్! అద్భుతమైన ఆదేశమిచ్చారు. నా గదికి వెళ్ళగానే స్టోర్స్ అండ్ పర్చేస్ వాళ్ళు ఆ కంపెనీకి రాసిన ఉత్తరం తాలూకు కాపీని నాకు మార్క్ చేశారో లేదో చూస్తాను."

"ఇంకోసంగతి. వచ్చే సోమవారం నుంచి నేను అహ్మదాబాద్ లోని ప్రఖ్యాత బిజినెస్ మేనేజ్ మెంట్ స్కూల్ లో నెలరోజుల అతిప్రత్యేక శిక్షణ కోసం వెళ్తున్నాను. దేశంలోని చాలా ఇతర సంస్థలనుంచి కూడా అభ్యర్థులు వస్తున్నారు. మన సంస్థనుంచి కేవలం ఇద్దరం వెళ్తున్నాం. మీరు ప్రతిరోజూ ఏం జరుగుతున్నదీ నాకు చెప్పాలి. ఏ సమస్యవచ్చినా, ఏ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినా సమయాసమయాలు చూడకుండా నిస్సంకోచంగా ఫోన్ చేయండి."

"అలాగే సర్! మీరు ఫ్లైయింగ్ కలర్స్ తో తిరిగి రావాలి! అల్ ది బెస్ట్ సర్!" శ్యామలత శ్రీపతికి శుభాకాంక్షలు తెలిపి గది వీడింది. ఆ సాయంత్రానికల్లా శ్రీపతి నెలరోజులపాటు ఉన్నత శిక్షణకోసం అహ్మదాబాద్ పోతున్నట్లు తెలియడమే కాకుండా , ఆయన ఇచ్చిన ఆదేశాలు కూడా పరోక్షంగా తెలిసాయి. శుక్రవారం సాయంత్రం ఆఫీసులోని శాఖాధిపతులందరూ అధికమైన అల్పాహారవిందు చేసి, ముఖస్తుతులు చేసి,

శుభాకాంక్షలు గుప్పించి, శ్రీపతికి వీడ్కోలు పలికారు. శ్రీపతి సతికి ఆఫీసులో జరిగిన హడావుడి గురించి ఓ చెంచా చారుడిద్వారా సమాచారం అందేటట్లు చూసుకొన్నాడు. ఇల్లు చేరిన శ్రీపతి సతి తననికూడా అహ్మాబాద్ తీసుకుపోకూడదా అని గారాలు పోయింది.

“ శిక్షణమీద పూర్తిగా ధ్యాసపెట్టాలి. అందునా, నియమాల ప్రకారం కుటుంబాల్ని కూడా తీసుకు వెళ్లకూడదు. క్రికెట్ క్రీడాకారులు తమతమ భార్యల్ని వెంటతీసుకొని వెళ్లినప్పుడు, ధ్యాస చెడి, ఆటల్ని ఓడిన సందర్భాలు నీకు తెలియంది కాదు. తర్వాత ఎప్పుడైనా అహ్మాబాద్ సెలవుమీద పోయి చూద్దాం, “ అని అనునయించబోయాడు.

“ఇంతకాలమై చూస్తున్నాను, మీరు సెలవు పెడ్తే ఆఫీసు చతికిలపడిపోతుందని ఒక్కసారికూడా సెలవుపెట్టి ఎక్కడికైనా వెళ్ళామా? మీనాన్నగారు పోయినప్పుడు తప్పని సరిగా పక్షం రోజులూ, మా అమ్మ పోయినప్పుడు మొక్కుబడిగా మూడు రోజులూ సెలవు పెట్టారు! సరే లెండి అమ్మాయిలిద్దరికి అహ్మాబాద్ నుంచి ఏ వైనా బహుమతులు కొని పట్టుకు రండి. అదే పది వేలు!” అంది శ్రీపతి సతి.

ఆదివారం సాయంత్రానికల్లా దేశం నలుమూలలనుంచి వివిధ సంస్థలనుంచి అధికస్థాయి అధికారులు రెక్కలు కట్టుకొని వాలారు. సంస్థ ప్రాంగణంలోనే అందరికీ చక్కటి వసతి సదుపాయాలు చేయబడ్డాయి. ఆదివారం రాత్రి ఆనవాయితీ ప్రకారం పరిచయ కార్యక్రమాలు కొనసాగిన తర్వాత, శిక్షణా కేంద్రం ఉద్యానవనంలో విందు ఏర్పాట్లు ఘనంగా సాగాయి. చేతుల్లో పళ్లేలు పట్టుకొని ఒకరితో ఒకరు సంభాషించుకొంటూ, విజిటింగ్ కార్డులు బదలాయింపు చేసుకొంటూ ఓ గంటన్నరసేపు గడిచిపోయింది. ఆ గంటన్నరలోను శ్రీపతి యితరులతో మాట్లాడుతున్నప్పుడు పదికి పైగా ఫోన్ కాల్స్ వచ్చాయి. శ్రీపతి ప్రతిసారి క్షమార్పణలు చెప్పుకొంటూ ఓ పక్కకి పోయి, రెండు మూడు నిముషాలు మాట్లాడి తిరిగి మాటల గుంపులో కలిసిపోవడం చేశాడు. చాలామంది తన ప్రత్యేకతను గమనించారని శ్రీపతి గ్రహించాడు.

శ్రీపతి ఆ మర్నాడుదయం నియమిత సమయానికి కాస్త ముందుగానే వచ్చి, ముందు వరసలో హాలు ద్వారానికి దగ్గరగా ఉన్న మొదటి సీటు ఎంపిక చేసుకొని కూర్చున్నాడు. బిజినెస్ కళాశాల ప్రధానాచార్యుడు ఠంచనుగా పదింటికి ప్రారంభ సంప్రదాయ ఉపన్యాసాన్నిచ్చాడు. పది నిముషాలు గడిచేలోగా శ్రీపతి సెల్ బజర్ జేబులో గుర్రుమంది. శ్రీపతి చిన్నగా ఓ క్షమాపణ గొణిగి, బయటకు వెళ్ళి రెండు నిముషాల తర్వాత వచ్చాడు. ఉపన్యాసం పూర్తి చేసి, ప్రధానాచార్యుడు అందరికీ శుభాకాంక్షలు తెలిపి నిష్క్రమించాడు. ఆ తర్వాత ఎందరో ఆచార్యులు ఆర్థిక, విత్త, పాలనా నియమావళులు, వాటికి కలిగే అవరోధాలు, అవరోధాల అధిరోహణలు, కార్మిక సమస్యలు, ప్రాంతీయ రాజకీయనేతల అడ్డుపుల్లలు, గొంతెమ్మ కోరికలు– ఇత్యాది అనేక విషయాలపై శ్రోతల భాగస్వామ్యసహితంగా, చర్చారూపకంగా శిక్షణాతరగతులు నెల పొడుగునా నిర్వహించబడ్డాయి. అయితే ప్రతి క్లాసులోనూ శ్రీపతి ఉన్నట్టుండి సెల్ ఫోన్ చెవికి అంటించుకొని బయటకి పోయి, రావడం జరుగుతోనే ఉంది.

శిక్షణ మధ్యస్థ కాలంలో నలుగురైదుగురు సహాధ్యాయులూ, ఇద్దరు ముగ్గురు ఉపన్యాసకులూ శ్రీపతిని తీరిక వేళల్లో ప్రశ్నించారు కూడా. ” ఏం చేసేది? మా సంస్థ ప్రత్యేకత అటువంటిది. ఓ పక్క సైన్సూ, మరోపక్క టెక్నాలజీ సమపాళల్లో నడిచే సంస్థ. ఇరువర్గాల మధ్యా నిత్య ఘర్షణలు జరుగుతోనే ఉంటాయి. అయితే టెక్నాలజీ ద్వారా ప్రాజెక్టు లక్ష్యసాధన జరుగుతుంది కాబట్టి ఎప్పటికప్పుడు సమస్యల్ని తీర్చవలసి ఉంటుంది. చివరికి లక్ష్య సాధన నా బాధ్యత కాబట్టి చిన్నా, పెద్దా సమస్యల్ని నా మీదకు నెట్టివేయడానికే ఈ ఫోన్ కాల్సన్నీ! ప్రాణం విసుగెత్తి పోతోంది!” అని నాటకీయంగా తన బాధలు వెళ్లబోసుకొన్నాడు.

ఆఖరి మూడు రోజుల్లోనూ కొన్ని పరీక్షలు పెట్టబోతే కొందరు అభ్యంతరాలు దీశారు. ఎందుకంటే వారి దృష్టిలో ఇలాంటి శిక్షణా శిబిరాలు నిత్యవిధులనుంచి కాస్తంత విరామ,కాలక్షేపాలకి మార్గాలు. తమతమ సంస్థల నిత్యవ్యవహారాలతో,సమస్యలతో విసుగెత్తిపోయి వచ్చినవారికి ఇక్కడా పరీక్షలంటే నచ్చదు.

"ఈ పరీక్షల ఫలితాలు వ్యక్తిగతమైన మీ,మీ పరిశీలనలకే గాని, ఫలితాలని ప్రకటించడం కానీ, మీ సంస్థలకి తెలపడం కానీ ఉండదు. వచ్చిన వందమందిలోను మీకొచ్చిన ర్యాంక్ ఎంతో, మీకు తప్ప ఇంకెవరికీ తెలియదు. అయితే మీకు తెలియని కొన్ని విషయాల్ని మీ దృష్టికి తీసుకొచ్చామన్న సంతృప్తి మాకు నమ్మకంగా కుదిరింది. శిక్షణలో విజయవంతంగా పాల్గొన్నారన్న ధ్రువపత్రంలో, ఆ విషయం తప్పించి ఏ విధమైన వివరాలు ఉండవు!"అని ఆ సంస్థ భరోసా ఇచ్చిన తర్వాత, అందరూ పరీక్షలకి సిద్ధమైయ్యారు. ముఖ్యంగా శ్రీపతి పరీక్ష ఉండాలని పట్టు బట్టాడు. రెండు రోజులు పరీక్షలు నిర్వహించారు. అన్నీ ఆబ్జెక్టివ్ టైప్ లోనే జరిగాయికాబట్టి కంప్యూటర్ మూల్యాంకనం ఎప్పటికప్పుడు జరిగి పోయింది.

ఆఖరిరోజున మొదటి గంటలో సీలు వేసిన కవర్లలో ఫలితాలివ్వబడ్డాయి. ఎవరిమట్టుకు వారు పక్కవాడికి కనబడకుండా తమతమ ర్యాంకులను చూసుకొన్నారు. కొంతమంది కవర్లను తెరవకుండా నిర్లక్ష్యంగా తమ బ్యాగ్ ల లో పడేసుకొన్నారు. శ్రీపతికి మొదటి ర్యాంక్ వచ్చింది. శ్రీపతి మొహంలో వెయ్యి పూర్ణచంద్రుల వెన్నెలకాంతుల్లా ఆనందం వెల్లి విరిసింది. మధ్యాహ్నం లంచ్ సమయంలో శ్రీపతి తన కాయితాల్ని కావాలనే ఉపన్యాసమందిరంలో బల్లమీద వదిలేశాడు. కొంతమంది ఆ సంగతి గమనించి, ఒక వెనకడుగు వేసి, శ్రీపతి కాయితాల్ని చూశారు. వార్త వ్యాపించి, లంచ్ సమయంలో పలువురి లోగొంతు అభినందనల్ని శ్రీపతి చిరునవ్వుతో స్వీకరించాడు.

ఆ మధ్యాహ్నం ముగింపు సందర్భంగా ఉపన్యాస వేదిక తయారైంది. ప్రధానాచార్యుడూ, ఇతర ఆచార్యులూ వేదిక నలకరించారు. ప్రధానాచార్యుడు శిక్షణాకార్యక్రమం విజయవంతంగా ఏ విధమైన ఆటంకమూ లేకుండా కొనసాగినందుకు ఇరుపక్షాలవారినీ ప్రశంసించాడు. "మేము చెప్పినవన్నీ మీకు తెలియవని కాదు. మీరు కొంతకాలం వరకూ వేరువేరు వృత్తపరిధుల్లో పని చేసి, ప్రాజెక్టు అధికారులుగా పైకి వచ్చారు. మేము చేసిందల్లా ఆ వృత్తపరిధుల్ని ఒకదానితో మరొకటి కలిసే మార్గాలు చూపించడమే. ఇప్పుడు మా బిజినెస్ స్కూల్లో ఆఖరి సంవత్సరం చదువుతోన్న ఓ విద్యార్థిని నాయకుడి లక్షణాలు ఎలా ఉండాలో సమీకరణ చేస్తుంది. విని, సమన్వయం చేసుకోండి."

దీపిక అనే ఆ విద్యార్థిని వేదికనెక్కి అమితమైన విశ్వాసంతో మాట్లాడసాగింది.

" లింగ వివక్షలేకుండా నాయకత్వం అనే పదానికి కొన్ని లక్షణాలు చెప్పుకోవచ్చు. ఇదమిత్థంగా ఇదీ అని కాకుండా, వేరు వేరు పరిస్థితుల్లో వేరు వేరు నాయకత్వ లక్షణాలు సమీకృతమౌతాయి. అలాగని తీవ్రవాద, ఉగ్రవాద, అథోజగతి నాయకుల లక్షణాలూ అవే నిర్వచనాలకి లోబడ్డా వారూ, మీరూ వేరు. సైనికుల నాయకులు వేరు. రాజకీయనాయకులు వేరు.

" పరిశ్రమలకీ, కర్మాగారాలకి, ఉత్పత్తికేంద్రాలకీ వార్షికమైన లక్ష్యాలు నిర్దేశింపబద్తాయి. ఈ లక్ష్యసాధనలో అనేకానేకమైన అవరోధాలు కలుగుతూ ఉంటాయి. వాటిని అధిగమించి లక్ష్యసాధన చేసేవారి ప్రయత్నాలు పలు విధాలుగా ఉంటాయి. లక్ష్యనిర్ధారణ చేసి, సంస్థ సత్సంప్రదాయాల్ని పాటిస్తోనే, ఏకాగ్రతతో నూతన విధానాలననుసరించి బృందంచేత లక్ష్యాన్ని సాధింప చేసేవాడు నాయకుడు. లక్ష్యం దరిదాపుల్లో ఉందని సంతృప్తి చెందకుండా, పూర్తి లక్ష్యం సాధించడమే నాయకుడి లక్షణం. ఎదుటివారు ఇంకా ఆలోచనల తాత్సారంలోనే ఉండగా, రంగంలోకి దుమికి, లక్ష్యసాధనలో ముందు పరుగులు తీసేవాడు నాయకుడు. తనకింద పనిచేసే బృందాన్ని పర్యవేక్షించడమే తప్ప వారి విధుల్లో జోక్యం చేసుకొనివాడు నాయకుడు. ఒకసారి ఉన్నతపదవి చేరుకొన్నతర్వాత అక్కడ్నుంచి పతనం కానివాడు నాయకుడు. అసాధ్యాల్ని సాధ్యం చేస్తూ గత లక్ష్యాల్ని అధిగమించేవాడు నాయకుడు. చేసే పనిని ఆరాధించేవాడు, తీసుకొనే నిర్ణయాల్ని ధైర్యసాహసాలతో అమలుపరిచేవాడు నాయకుడు. కార్యనిర్వహణలో తను ముందంజవేసి, మిగిలినవారికి మార్గదర్శి అయ్యేవాడు నాయకుడు. అన్నింటికంటే ముఖ్యమైన లక్షణమేమిటంటే తన బృందంలో స్ఫూర్తిని కలిగిస్తూ, ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ మరింతమంది నాయకుల్ని సృష్టించేవాడు నాయకుడు. ఏ సంస్థ కాని, ఏ దేశంకాని ఏ ఒక్కరితో ఆగిపోకూడదు." దీపిక కరతాళధ్వనులమధ్య వేదిక దిగింది.

చాలామంది ఆ విద్యార్థిని చెప్పిన లక్షణాలన్నీ తమలో ఉన్నాయనుకొని సంతృప్తికరంగా తమ జబ్బలు తామే చరుచుకొన్నారు. తమ వెన్నులు తామే తట్టుకొన్నారు

"ఉపాధ్యాయుడు తరగతి గదిలో, లేదా మేము ఈ సంస్థలో ఎన్నో పాఠాలు చెప్పవచ్చు, ఉపన్యాసాలు దంచవచ్చు. మేము వచ్చి మీ కుర్చీలలో కూర్చుంటే ఏదో వెలగబెట్టేస్తామని కాదు! మీకున్న కష్టాలు  మీ కుంటాయి. ఒకేరకమైన సమస్యకి పరిస్థితులనుబట్టి పరిష్కార మార్గాలు వేరుగా ఉంటాయి. అనేకానేకమైన ఒత్తిడులకు లోబడి మీరు నాయకత్వం వహించాల్సి ఉంటుంది. అయితే మీరు కోతులకు పిల్లి పాదాలు కాకుండా ఉన్నంతకాలం, కాస్త ఆలశ్యమైనా జయం మీ వెనకనే ఉంటుంది.  తర్కానికీ, ఇంగితానికీ మధ్యన ఉన్న అంతరం తెలుసుకోండి.  పైమెట్లు అధిరోహించినకొద్దీ మీ గుర్తింపు పెరుగుతుంది. అందరూ మీ వైపే చూడాలన్నదే మీ లక్ష్యం అయితే సాధించడం కష్టం కాదు. కానీ మీరు పై మెట్లు ఎక్కుతోన్నకొలదీ విశాల విహంగవీక్షణకి అలవాటుపడకపోతే ఉత్తరోత్రా సంస్థ దెబ్బతింటుంది. మీ మిగిలిన ఉద్యోగకాలం శుభప్రదం కావాలని ఆశిస్తున్నాను. మీ సంస్థలనుండి మరి కొందరితో మా జ్ఞానాన్నివారూ, వారి జ్ఞానం మేమూ పంచుకోవాలని ఆశిస్తూ, సెలవా మరి?" ప్రధానాచార్యుడు శిక్షణాతరగతులకు స్వస్తి పలికాడు.

ప్రధానాచార్యుడి తాపత్రయం మరుచటి శిక్షణాతరగతుల లక్ష్యసాధన, సంస్థకి జీతభత్యాల సేకరణ.  ఎవరి లక్ష్యం వారిది.

తన సంస్థలో పదోన్నతుల ఎంపిక జరిగినప్పుడు శ్రీపతికి చుక్కెదురైంది. అహ్మదాబాద్ బిజినెస్ స్కూలు పంపించిన రహస్య నివేదికలో శ్రీపతిని గురించి రాసిన ఒకే ఒక వాక్యం. 'శ్రీపతి ఓ మర్రిచెట్టు. ఆతని నీడలో ఏ మొక్కా మొలవలేదు!"

# ఉభయకుశలోపరి

## ఇంద్రగంటి శ్రీనివాస శాస్త్రి

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో బహుమతి పొందిన కథ

**పాత ఉత్తరాల** కట్ట తిరగేస్తున్న స్రవంతి నవ్వు ఆపుకోలేకపోయింది.

"ఏమైందే అలా నవ్వుతున్నావు?" అని అడిగింది కంప్యూటర్ ముందు కూర్చుని ఈ మెయిల్స్ చూసుకుంటున్న రాజేశ్వరి.

"అమ్మా! ఇన్నాళ్ళూ నువ్వు దాచుకున్న ఖజానా తీసి చూసాను. ఈ ఉత్తరాల కట్టలో 'ఉభయకుశలోపరి, ఇంతే సంగతులు' తప్ప ఇంకేమీ లేదు" అంది స్రవంతి.

స్రవంతి, ఆమె భర్త సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు. అమెరికాలో స్థిరపడ్డారు. సెలవుల్లో ఐదేళ్ళ కూతురితో కలిసి విశాఖపట్నం పుట్టింటికి వచ్చింది.

తను జాగ్రత్తగా దాచిన ఉత్తరాల కట్టకేసి చూసింది రాజేశ్వరి. అవన్నీ తనూ అమ్మా వ్రాసుకున్న ఉత్తరాలు. అన్నింట్లోనూ సారాంశం ఒకటే - 'ఉభయకుశలోపరి, ఇంతేసంగతులు'. అయినా అవి నిజంగా తన ఖజానాయే. వాటిల్లో అంతకన్నా ఏమీ లేకపోయినా, ఆ ఖజానా ముట్టుకుంటే చాలు. ఏ అంతర్జాలం (ఇంటర్‌నెట్) దాచలేనన్ని జ్ఞాపకాలు ఒక్క తృటిలో మనసుపొరలనుండి బయట పడతాయి.

రాజేశ్వరి కూతురికేసి చూసి నవ్వి, "అవి నా పెళ్ళి తరవాత నేనూ అమ్మమ్మా వ్రాసుకున్న ఉత్తరాలు. అది నాకు ఖజానాయే. వాటి విలువ నీకేం తెలుసు?" అంటూ తన పెళ్ళినాటి కబుర్లు మెదలెట్టింది.

కబుర్లు పూస గుచ్చి కథల్లా చెప్పడం అమ్మలకే వచ్చు కాబోలు.

కాకినాడ రాజేశ్వరికి విశాఖపట్నం శంకరంతో పెళ్ళయింది.

కొన్నాళ్ళ తరవాత, ఒకరోజు శంకరం కాకినాడ వచ్చాడు, రాజేశ్వరిని తనతో తీసుకెళ్ళడానికి. అమ్మ దిగులుగా ఉంది. కూతురి కబురు ఎలా తెలుస్తుందని?

ఫోను అందని స్వప్నం. అక్కడా లేదు. ఇక్కడా లేదు.

"జానకీ! అది ఎంత దూరం వెడుతోందని? బస్సెక్కితే నాలుగ్గంటల్లో చేరతాము. ఇవాళ ఓ  కార్డు ముక్క వ్రాసి పోస్టులో పడేస్తే, రెండోరోజు అందుతుంది" అని నాన్న ధైర్యం చెప్పారు.

రాజేశ్వరి పుట్టింటి జ్ఞాపకాలు మూట కట్టి రిక్షాలో కూర్చుని వెనక్కి చూసింది.

గుమ్మంలో నిలబడి తల్లి కళ్ళొత్తుకుంటోంది.

తమ్ముడు రిక్షా పక్కన నిలబడ్డాడు, బిక్క మొహంతో.

ఇంటిముందు తను పెంచిన మందారం మొక్క మొహం వేలాడేసింది. రిక్షా కదిలింది. నాన్న బస్సు స్టాండుకు వచ్చి బస్సెక్కించి వెళ్ళారు.

రాజేశ్వరి భర్తతో కలిసి విశాఖపట్నం వెళ్ళిపోయింది.

అక్కడ్నుంచి మొదలైంది తల్లీ కూతుళ్ళ లేఖాపర్వం.

రాజేశ్వరి ఆదివారం వ్రాసేది. ఆ కార్డు సోమవారం ఆఫీసుకెడుతూ ఆమె భర్త పోస్టులో వేసేవాడు. మూడురోజుల తరవాత కాకినాడ చేరేది. ఆలస్యం అయినా, శుక్రవారానికల్లా కార్డు అమ్మ చేతిలో ఉండేది.

పెరట్లో చెట్టు మీద కాకి అరుస్తుంటే, కార్డు వస్తున్న సంగతి ముందే తెలిసిపోయేది అమ్మకు.

ఇంక, అమ్మ దృష్టి అంతా వీధి వైపే – 'పోస్ట్' అన్న కేక కోసం. ఆ మాట వినగానే అమ్మ ఒక్క ఉదుటున వెళ్ళి తీసుకునేది.

ఆ కార్డు చూసిన వెంటనే అమ్మ మొహం పున్నమి చంద్రుడిలా వెలిగిపోయేది.

అటునుండి అమ్మ కార్డు కూడా కూతురుకు చేరిపోయేది.

మధ్య మధ్య ఇన్‌లాండ్ కవర్లు, పేరుకుపోయిన కబుర్లతో.

ఇక్కడి కబుర్లతో అక్కడకు, అక్కడి కబుర్లతో ఇక్కడకు ఉత్తరాలు పావురాలై వాలుతున్నాయి. ఇలా నాలుగు నెలలు జరిగాక, ఓ శుక్రవారం వచ్చింది. పెరట్లో చెట్టు మీద కాకి అరవలేదు.

కార్డు అందలేదు.

అమ్మ వీధిలోనే నిలబడిపోయింది, పోస్ట్‌మేన్ కోసం. అతను సైకిల్ మీద వెడుతుంటే "బాబూ! మాకేవన్నా ఉత్తరాలున్నాయా?" అని అడిగింది కంగారుగా.

"లేదమ్మా! మీరేదో ఉత్తరం కోసం ఎదురు చూస్తున్నట్టున్నారు" అన్నాడు.

"విశాఖపట్నం నుండి అమ్మాయి కార్డు రాలేదు" అంది.

"మీరేం కంగారుపడకండమ్మా! కార్డు వస్తే, ముందు మీ దగ్గరకే వస్తా" ఆత్మీయుడులాంటి ఓదార్పు. పోస్ట్‌మేన్ అందరికీ సైకిలు మీద పరిగెత్తే ఇంటర్‌నెట్.

శనివారం వచ్చింది. ఆదివారం వెళ్ళింది. ఇక్కడా ఫోను లేదు. అక్కడా ఫోను లేదు. నాన్నగారిని వెంటనే బయలుదేరి విశాఖపట్నం వెళ్ళమని అమ్మ గొడవ చేసింది.

"ఎందుకంత కంగారు? అది బద్ధకించి ఉంటుంది. రేపు చూద్దాం. ఇప్పుడు వెళ్ళడానికి నాకు ఆఫీసులో కుదరదు" అన్నారు నాన్న.

ఇంట్లో కూర మాడింది. అన్నం సరిగ్గా ఉడకలేదు.

ఇంకో రోజు గడిచింది. కార్డు రాలేదు.

సాయంత్రం నాన్న ఇంటికి వచ్చేటప్పటికి, అమ్మ గుమ్మంలో చేతిలో బట్టల సంచితో కూర్చుని "ఇప్పుడు నన్ను తీసుకెళ్ళి విశాఖపట్నం బస్సెక్కించండి" అంది.

"ఇప్పుడు వెడితే రాత్రికి చేరతావు? పొద్దున్న పాసింజెరులో వెళ్ళు" అన్నారు నాన్న.

రాత్రి ఇంట్లో జాగారం. అమ్మ పొద్దున్నే నాలుగ్గంటల పాసింజరు బండి ఎక్కింది.

అమ్మ అలా రైలు బండెక్కింది. ఇక్కడ పెరట్లో చెట్టు మీద కాకి అరవడం మొదలెట్టింది.

పదిగంటలు కాకుండానే, సైకిలు మీద ఎగురుకుంటూ వచ్చి గుమ్మంలో పడ్డాడు పోస్ట్‌మన్.

"అమ్మా! ఇదిగో మీ విశాఖపట్నం కార్డు" అంటూ కేక పెట్టాడు. కూతురు నుండి వచ్చిన కార్డు చూసి నవ్వుకున్నారు నాన్న.

అమ్మ మర్నాడు ఉదయం తిరిగొచ్చింది.

"నీ కంగారు నీదే నేను చెప్పానా? నువ్వే వినకుండా వెళ్ళావు అనవసరంగా" అన్నారు నాన్న.

"పోనీ ఈ వంకతో దాన్నోసారి చూడ్డం అయింది" అంది అమ్మ, మొహం చాటంత చేసుకుని, తగ సంబరపడిపోతూ.

తరువాత కూతురు సంసారం పెరిగింది.

ఐనా తల్లి కూతుళ్ళ లేఖాపర్వం నిరాటంకంగా సాగింది.

తల్లి నడుం వంగింది.

మనుషుల్లో ఉరుకులు పరుగులు ఎక్కువయ్యాయి.

ఫోనులు వచ్చాయి. ఎస్.టి.డి బూత్‌ల దగ్గర రాత్రి బారులు పెరిగాయి.

మాటలు వాయువేగంతో గాలిలో దూసుకుపోతున్నాయి.

కార్డులు తగ్గాయి. కబుర్లు పెరిగాయి.

జానకమ్మతో పాటే 'ఉత్తరకాండ' ముగిసింది.

పాత జ్ఞాపకాలు కూతురుతో పంచుకున్న రాజేశ్వరి కళ్ళు చెమ్మగిల్లాయి. అయినా మొహంలో ఏదో మెరుపుతో కూడిన చిరునవ్వు.

"బావుంది. అయితే, ఇక్కడ్నుంచీ నేను 'ఉభయకుశలోపరి' అని ఎస్.ఎమ్.ఎస్ చేస్తుంటాను. సరిపోతుంది" అంది స్రవంతి.

"పిచ్చిదానా! ఎస్.ఎమ్.ఎస్ చూస్తే ఉత్తరం చూసినట్టు ఉంటుందా?" అంది రాజేశ్వరి.

''ఏం? ఎందుకుండదు? ఉత్తరంలో ఏముంది? ఇప్పుడు మనం ఫోనులో హాయిగా మాట్లాడుకుంటున్నాం కదా? పైగా, రోజూ వాట్సప్, ఈ మెయిల్స్. అంతేకాదు ఇంటర్‌నెట్‌లో వీడియోలో ఒకళ్ళనొకళ్ళు చూసుకుంటూ బాతాఖానీ కొడుతున్నాం కదా! ఇదంతా ఉత్తరాల్లో ఎక్కడ వస్తుంది? నా కసలు మీ నుండి దూరంగా ఉన్నట్టే అనిపించదు. ఎప్పుడూ మీతోటే ఉన్నట్టనిపిస్తుంది'' అంది స్రవంతి.

''ఎన్నైయినా చెప్పు, నాకు మాత్రం చేత్తో వ్రాసిన ఉత్తరం చదివినప్పుడు కలిగే అనుభూతి కంప్యూటర్ స్క్రీను మీద చదివితే రాదు''

''ఏం? ఎందుకు రాదు. నాకైతే ఇదే బావుంది. నాకు మొబైల్ చేతిలో ఉంటే చాలు. ప్రపంచం అంతా గుప్పిట్లో ఇమిడిపోయినట్టే. ఒక్క క్షణం మొబైల్ చేతిలో లేకపోతే. అమ్మో! ప్రపంచం నుండి వేరయిపోయినట్టనిపిస్తుంది. ఇక ఇంటర్‌నెట్ లేకపోతే పనులన్నీ ఆగిపోతాయి. అంతెందుకు? నీ మనవరాల్ని చూస్తున్నావు కదా! లేస్తూనే మొబైల్ పట్టుకు కూర్చుంటుంది. ఇప్పుడు అన్నీ క్షణాల్లో జరిగిపోతుంటే వాటి విలువ మనకు తెలియడం లేదు అయినా, నువ్వు కూడా కార్డు నుండి కంప్యూటర్‌కు మారిపోయావు కదా! ఇంకా పాతను వదలలేక, అందులోనే ఏదో ఉందన్న చాదస్తం ఎందుకు నీకు?'' అంది స్రవంతి.

వీళ్ళ మాటలు వింటూ కంప్యూటర్ మీద పనిచేసుకుంటున్న శంకరం ''నిజమే మనిషి సాంకేతికంగా ఎంత ముందడుగు వేసాడు. పైగా ఆ సౌకర్యాలన్నీ ఇప్పుడు అందరికీ అందుబాటులోకి వచ్చాయి కూడా. ఇప్పుడు అందరి దగ్గరా మొబైల్ ఫోనులు, ఇంక అంతర్జాలం (ఇంటర్‌నెట్) మనకందించిన అద్భుతాలు అనేకం. ఒక్క క్లిక్‌తో 'విశ్వరూపసందర్శనం'. దూరాలన్నీ మాయం. ఎవరు ఎక్కడ ఉన్నా 'అంజనం' వేసి పట్టుకోవచ్చు. అయితే, ఇంక చేత్తో వ్రాసిన ఉత్తరం ఎందుకు? మానవ నాగరికత ముందుకు సాగే ప్రయాణంలో మనం వెనక వదిలి వచ్చిన మరపురాని గుర్తుల్లో ఒకటిగా మిగిలిపోతుందేమో?'' అనుకున్నాడు.

వంటింట్లోకి వెళ్ళి ఇడ్లీ కుక్కరు కింద మంట తగ్గించి, మనవరాలికోసం పాస్తా తయారుచెయ్యడానికి సిద్ధమవుతున్న రాజేశ్వరి ఆలోచనలో పడింది. ''అయినా ఉత్తరంలో ఏముంది? కాగితమా? కబుర్లా? ఆత్మీయుల చేవ్రాత కలిగించే అనుభూతా? లేక, అనుకోకుండా హఠాత్తుగా అది తీసుకు వచ్చే పిల్లగాలిలాంటి చల్లటి కబుర్లకోసం వేచి చూడ్డంలో ఉన్న సస్పెన్సా? ఇంతకీ, ఆధునిక సదుపాయాలు దూరాల్ని మాయం చేసేస్తుంటే, మనుషుల మధ్య దూరాల తగ్గుతున్నాయా? లేక పెరుగుతున్నాయా?'' తన ఆలోచనలకు తనే నవ్వుకుంది రాజేశ్వరి.

స్రవంతికి మూడువారాల సెలవు మూడు నిమిషాల్లో అయిపోయినట్టనిపించింది. అమెరికా వెళ్ళడానికి సామాను సర్దుతోంది. పెట్టెలు మూసేముందు తల్లి ఇచ్చిన గోంగూర పచ్చడి, ఆవకాయ సీసాలు భద్రంగా ఉన్నాయో లేదో మరోసారి చూసుకుని ''అమ్మయ్య సామాను సర్దడం పూర్తయింది'' అంటున్న కూతుర్ని చూసి నవ్వుకుంది రాజేశ్వరి. అందరూ కలసి విమానాశ్రయం చేరారు. కౌగిలింతలు, కన్నీళ్ళు అయ్యాక ''వెళ్ళగానే ఫోను చెయ్యి'' అంది రాజేశ్వరి.

''చేరిన వెంటనే ఫోను చెయ్యి. నీ ఫోను రాకపోతే అమ్మ చాలా గొడవ చేస్తుంది'' అన్నాడు శంకరం.

''అలాగే అయినా, నేను అమెరికా వెళ్ళడం ఇదేం మొదటిసారి కాదు కదా! మీరు కంగారుపడకండి. చేతిలో మొబైల్ ఉంది. దిగగానే ఫోను చేస్తాను. లేకపోతే వాట్సప్ మెస్సేజ్ ఇస్తాను. ఇంటికి వెళ్ళగానే ఈ మెయిల్ పంపిస్తాను. సరేనా! కానీ ఒకవేళ నా ఫోను రాకపోతే, కొంపతీసి, అమ్మ అమెరికా ప్రయాణం కట్టదు కదా, అమ్మమ్మలా'' అంటూ నవ్వుతూ కూతురితో కలసి చెయ్యి ఊపుతూ విమానాశ్రయం లోపలకు వెళ్ళింది స్రవంతి.

స్రవంతి అమెరికా వెళ్ళి రెండు రోజులైంది. ఫోను రాలేదు. రాజేశ్వరి ఎన్నిసార్లు ఫోను చేసినా జవాబు లేదు. వాళ్ళిద్దరూ తెగ కంగారుపడ్డారు. స్రవంతి అత్తగారింటికి ఫోను చేసారు. వాళ్ళకూ ఏ కబురూ లేదట. ఇలా ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదు. అమెరికాలో స్రవంతి ఇంటి దగ్గర్లో ఉండే స్నేహితులు రమేష్‌ని అడుగుదామంటే వాళ్ళు సెలవుల్లో యూరప్ చూడడానికి వెళ్ళారు. ఏం చెయ్యాలో రాజేశ్వరికి కంగారు ఎక్కువయింది.

"కంగారు పడకు. రేపు నేను వాళ్ళ ఆఫీసులో ఎవళ్ళతోనైనా మాట్లాడతాను" అన్నాడు శంకరం.

మర్నాడు రాజేశ్వరికి కాలు నిలవడం లేదు. చేతిలో మొబైల్ పట్టుకుని, అటూ ఇటూ తిరుగుతోంది మాటిమాటికి ఈ మెయిల్ వచ్చిందేమోనని చూసుకుంటోంది.

ఇంతలో ఎవరో కాలింగ్ బెల్ కొట్టారు.

తలుపు తీసి చూసింది.

"కొరియర్ మాడం"

సంతకం చేసి తీసి చూసింది. అమెరికా నుండి కొరియర్.

కవరు విప్పింది. అందులో ఒక 'ఇండియన్ పోస్ట్ కార్డు' ఉంది.

స్రవంతి చేతివ్రాత. చదివింది.

**"మహాలక్ష్మీ సమానురాలైన అమ్మకు నమస్కారములు.**

**ఉభయకుశలోపరి.**

**నువ్విచ్చిన గోంగూర పచ్చడి సీసా సగం ఖాళీ అయిపోయింది.**

**ఆవకాయ దాచుకుని ఎక్కడ అయిపోతుందోననే భయంతో కొంచెం కొంచెం తింటున్నాం.**

**మహారాజశ్రీ నాన్నగారికి నమస్కారములు.**

**ఇంతే సంగతులు.**

**నీ ముద్దుల కూతురు - స్రవంతి"**

ఒక్కసారి ఆకాశం నుండి నెలవంక రాలి తన ఒళ్ళో పడ్డట్టనిపించింది రాజేశ్వరికి.

"థాంక్యూ! థాంక్యూ!" అనుకుంటూ ఆ కార్డు పట్టుకుని తప్పిపోయిన పిల్లాడు మళ్ళీ దొరికినట్టు తడిమి చూసి, గాలిలో తేలిపోతూ కంప్యూటర్ దగ్గరకు వెళ్ళింది రాజేశ్వరి - ఆ కార్డును స్కాన్ చేసి తన 'ఫేస్‌బుక్ అక్కౌంట్'లో పోస్ట్ చెయ్యడానికి.

***అంకితం: అంతరించిపోతున్న ఉత్తరానికి, అనూహ్య వేగంతో ముందుకు పోతున్న సాంకేతిక ప్రగతికి.***

# గౌరవం

ఫణీంద్ర కామిరెడ్డి

అక్కకి ఫోన్ చేస్తే గొంతు లో అభిమానంతో కూడిన అసహనం పలుకుతోంది . దేనికో కోపం వచ్చింది అని తెలుస్తోంది. ఏమిటి సంగతి అని అడిగా.

"పది లక్షలిచ్చావట?"

"అవును"

"ఎందుకు ఇచ్చావు?"

"చదువుకోడానికి"

"అది తెలుసు. నువ్వెందుకు ఇవ్వడం? వాళ్ళ అక్క, బావ ఇద్దరూ పదేళ్ల నుంచి software జాబ్స్ కదా?"

"ఎంత ఆదాయం వున్నా, దానికి సరిపడా ప్లాన్ చేసుకొని ప్రాపర్టీస్ కొనేస్తున్నారు కదా అందరూ. వాళ్ళూ అదే చేసి వుంటారు దానితో వీలయ్యి ఉండదు "

"..... "

"నువ్వన్నది కరెక్టే . లెక్క ప్రకారం జనరల్ గా ఓన్ బ్రదర్స్ లేక సిస్టర్స్ దగ్గరకే వెళతారు . వాళ్లకి సావకాశం లేకపోతే కజిన్ బ్రదర్స్ ను అప్రోచ్ అవుతారు. అక్కడ కుదరకపోతే కజిన్ సిస్టర్స్ దగ్గరకు వస్తారు"

"వాళ్ళ అక్కకి కుదరకపోతే , జయ వాళ్ళ అన్నయ్యలు ఇద్దరూ అమెరికాలోనే సెటిల్ అయ్యారు కదా .. వాళ్ళివ్వచ్చు కదా?"

"ఆదాయం లేక కుదరకపోతే ఇండియా , అమెరికా ప్రశ్న వస్తుంది. వున్న ఆదాయం అంతా ఇన్వెస్ట్ చేసెయ్యడం వల్ల ఈ పరిస్థితి. ఇండియా లో ఉన్నా వాళ్ళ అక్క నాకంటే ఎక్కువ ప్రాపర్టీ పోగేసి ఉంటుంది. జయ వాళ్ళ అన్నయ్యలు కూడా అంతే . పెద్దాయన నాకంటే చాలా ముందు అమెరికా వచ్చాడు . భార్యాభర్తలిద్దరూ ఇద్దరూ చాలా సంవత్సరాలుగా ఉద్యోగంలో వున్నారు . రెండవ ఆయన నా తర్వాత వచ్చాడు కానీ వాళ్ళూ చాలా రోజులుగా ఇద్దరూ ఉద్యోగాలు . బహుశా మొత్తం ఆదాయానికి సరిపడా భవిష్యత్తు ప్లాన్ చేసేసి వుంటారు. కారణం ఏదయినా వాళ్లెవరి వల్ల ఆ అబ్బాయికి పనవ్వకే విషయం మన వరకూ వచ్చింది . వీలయితే ఇవ్వాలి లేకపోతే మానేయాలి కానీ వాళ్లివ్వవచ్చు వీళ్లివ్వవచ్చు అని లా పాయింట్లు లాగడం అనవసరం కదా "

"......... "

"ఆ అబ్బాయి మనల్ని ఏమీ అడగలేదు "

"మరి నువ్వెందుకు కల్పించుకొన్నావు?"

"మా నాన్నమ్మ మళ్ళీ మొదలు పెట్టిందట అని అంది జయ సడన్ గా ఒకరోజు . జనరల్ గా నేను వాళ్ళ విషయాలలో తలదూర్చను. వాళ్ళ ఆలోచనా స్రవంతి నాకు పెద్దగా అర్థం కాదు . మనం ఈ సంబంధానికి ముందుకు వెళ్ళామంటే తన చదువు, ఫామిలీ ని చూసే కదా. వాళ్ళయినా అంతే అనుకో. నా వుద్యోగం మన ఫామిలీ బ్యాక్ గ్రౌండ్ నచ్చి వాళ్ళు వచ్చారు . వాళ్ళ ఫామిలీ ఆ స్థాయిలో ఉండడానికి కా మూలకారణం వాళ్ళ నాన్నమ్మ అని నా లెక్క . ఏదో ఒక పనిలో పెట్టెయ్యకుండా పట్టుబట్టి చదివించిది వీళ్ళ నాన్నగారిని . ఆయన ఇంజనీర్ అవ్వడంతో వీళ్ళ అన్నలుగానీ , తను గానీ

అమెరికాలో సెటిల్ అయ్యే రేంజ్ లోకివచ్చారు . వీళ్ళు ఎవరి మటుకు వాళ్ళే స్వశక్తి తో పైకి వచ్చేసిన ఫీలింగ్ .ఒక రకంగా అదీ నిజమే కానీ నా ఉద్దేశ్యంలో ఆ ఎదుగుదల కి అవసరమయిన పునాది వేసింది వాళ్ళ నానమ్మ గారు. వాళ్ళు ఆ విషయం గుర్తించినట్టు నాకు అనిపించదు "

"ఏమి మొదలు పెట్టారంది?"

"వీళ్ళ పెద్దత్తయ్య గారి అబ్బాయి సునీల్ ని ఎవరూ పట్టించుకోవడం లేదు అన్నారట "

"ఆ అబ్బాయి గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో MBBS చేసాడు కదా?"

" నేనూ అదే అన్నా. తెలివయిన కుర్రోడు . నవోదయ స్కూల్ లో చదివాడు. మెరిట్ లో సీట్ కొట్టి గవర్నమెంట్ కాలేజీ లో మెడిసిన్ చదివాడు .డాక్టర్ కోర్స్ కంప్లీట్ చేసి ప్రాక్టీస్ కూడా పెట్టాడు. తనని పట్టించుకోకపోయేది ఏముంది అని . తాను MD కోర్స్ చేద్దాం అనుకొంటున్నాడట. తనకంటే తక్కువ టాలెంట్ వున్నవాళ్లు ఫీజు కట్టి ప్రైవేట్ కాలేజీలో చదివేస్తున్నారట . ఈ అబ్బాయి కి కూడా డొనేషన్ కడితే బాగుంటుంది అని అన్నారట . అమెరికాలో సెటిల్ అయిన మనుమలు కట్టొచ్చు కదా అని ఆవిడ ఆలోచన అయ్యి ఉంటుంది "

"ఆల్రెడీ డాక్టర్ కదా MD అయినా కాకపోయినా డిఫరెన్స్ ఏమి ఉంటుంది?"

"నాకూ అదే డౌట్ వచ్చి మా ఫ్రెండ్ Dr ఉంటే వాడిని ని అడిగా... డాక్టర్ అయితే నెలకి అరవైవేల వరకూ ఇస్తారట జీతం . MD చేస్తే స్పెషాలిటీ బట్టి నెలకి 2 లక్షలనుంచి 4 లక్షలవరకు వుంటుందట. అలాగే చేసే పనిలో గాని , గౌరవం లో గాని కూడా చాలా డిఫరెన్స్ వుంటుందట.

"అవునా మనం డాక్టర్ అంటే నిలబడి నమస్కారం పెట్టేస్తాం కదా?"

"అవును. డాక్టర్ అంటేనే సూపర్ వెల్ సెటిల్డ్ అనుకొంటాం . మరి మీ అన్నయ్య వాళ్ళేమన్నారు అని అడిగా. వాళ్ళ పెద్దన్నయ్య వాళ్ళు మనకీ పిల్లలున్నారు కదా. వాళ్లకి కేర్ చెయ్యాలి కదా అందట . వాళ్ళ పెద్ద పిల్లోడికి 10 సంవత్సరాలు. అమెరికాలో 17 సంవత్సరాలవరకూ చదువు ఫ్రీనే. అంటే అప్పటివరకూ ఆలోచించే పని లేదు. అప్పుడు కూడా చదివే ఇంటరెస్ట్ ఉంటే చక్కటి అప్పులిచ్చే సిస్టం డెవలప్ అయ్యిపోయి వుంది ఇక్కడ. డబ్బులేక చదువు ఆపేశాడనే పరిస్థితి ఉండదు. ఆలోచనా విధానం అంతే .వాళ్ళ ఆలోచనని విమర్శించగలిగేఅన్ని తెలివితేటలు మనకి లేవు. వాళ్ళుండే ఇల్లు సైజు అయినా విలువ అయినా అయినా మనం ఉండేదానికి డబల్ . పెద్ద ఇంట్లో వుంటారు . మనం అపార్టుమెంట్లో ఉంటాం. వాళ్ళ దగ్గరనుంచి ఏమయినా నేర్చుకోవాలి తప్ప కామెంట్ చేసే అంత సీన్ మనకి లేదు . "

"మరి వాళ్ళ చిన్నన్నయ్య ఏమి అన్నాడట?"

"పెద్దవాళ్ళ ఆన్సర్ విన్నాక ఇక చిన్నవాళ్లు ఏమన్నారు అని నాకు అడగబుద్ధి వెయ్యలేదు. సర్లే వాళ్లేమంటే మనకెందుకు అని జయని సునీల్ కి ఫోన్ చేసి విషయం ఏమిటి , యెంత అవ్వచ్చు అని కనుక్కో . మనకి శక్తి కి మించినది అయితే అప్పుడే చేతులెత్తేయచ్చు అని చెప్పా. "

"పది లక్షలవుతుందన్నారా?"

"అప్పటికి తెలీదు ఎంత అవుతుందో . అసలు విషయం డబ్బులది కాదు. టైం అండ్ ఎనర్జీది . ఆ అబ్బాయి , ఒక ఏడాది కష్టపడి చదివితే రాంక్ వచ్చేస్తుందని నమ్మకం వుంది. కానీ ఒకవేళ మెరిట్ మీద సీట్ రాకపోతే , ప్రైవేట్ కాలేజీ సీట్ కి ఫీజు కట్టగలము అంటే మొత్తం చదువు మీద ఫోకస్ చేసేయ్యొచ్చు . లేకపోతె అంత కష్టపడి ఇయర్ వేస్ట్ ఏమో అనే సందేహం పీకుతూ ఉంటే ప్రిపరేషన్ మీద ఫోకస్ చెయ్యడం కొంచెం కష్టం అవుతుంది అని ఆలోచిస్తున్నాడు . జయ స్వంతంగా మంచి పని ఒకటి చేసింది . ప్రిపరేషన్ టైంలో మంత్లీ మైంటెనెన్సు కి డబ్బులేమయినా కావాలా అని అడిగిందట "

"దానికి ఏమన్నాడట?"

"క్లినిక్ రన్ చేస్తున్నాను .. సరిపోతుంది అన్నాడట . ఇందాక అన్నావు వాళ్ళ అక్కఇవ్వచ్చు కదా అని. లాస్ట్ ఇయర్ ప్రిపరేషన్ టైం లో నెలకి ఒక అయిదువేలు ఖర్చులకి ఇమ్మన్నాడట వాళ్ళక్కని. రెండు నెలలిచ్చి , తర్వాత కష్టమవుతుంది అందట. అప్పటికి క్లినిక్ సెట్ అవ్వలేదు. వాళ్ళ అమ్మాయికి అక్షరాలు నేర్పడానికి L.K.G కి లక్షల్లో ఫీజు కట్టడానికి రెడీ. వాళ్ళని కామెంట్ చెయ్యడం అని కాదు గానీ ప్రీస్కూల్ , పోస్ట్ గ్రాడ్యుయేషన్ లో ఏది ఇంపార్టెంట్ అనేది ఎలా నిర్ణయించుకుంటున్నారో అర్ధం కాలేదు"

"ఓహో అందుకే అడిగి ఉండదు వాళ్ళ అక్కని"

"ప్రకాశం గారి జీవిత చరిత్రలో రెండు రూపాయల ఫీజు కోసం కొన్ని కిలోమీటర్స్ కాలినడకన వాళ్ళఅక్క దగ్గరకి వెళ్ళాడు. ఆవిడ ఇవ్వలేదు అంటే పాపం లేక ఇచ్చి ఉండదు అనుకున్నా. ఇంకొక కోణం చూపించింది ఈవిడ . కానీ సీట్ కోసం డబ్బులు విషయం అంతా తనే మాట్లాడింది అకౌంట్ నెంబర్ ఇవ్వడం . డబ్బులు పడ్డాయో లేదో చూసి చెప్పడం అన్నీ . అంతకు మించి ఆశించకూడదేమో . "

"..."

"ఓకే ఎవరు ఇవ్వాలి అనే లాజిక్ పక్కన పెట్టు. ఆ అబ్బాయి రోజుకి 14 గంటలు చదువు తున్నాడట . అంత కష్టపడి చదివే వాడికి సావకాశం ఉంటే, అస్సలు ఏ బంధుత్వం లేకపోయినా ఇవ్వొచ్చు. ఏమంటావ్ ?"

".. ... "

"ఓకే. అదికూడా పక్కన పెట్టెయ్. వాళ్ళ నానమ్మ గారి వల్లనే కదా మనం జయ సంబంధానికి ముందుకు వెళ్ళింది. ఆవిడకి ఏదో కోరిక పుట్టింది అవసరం లేని పనేమీ కాదు. చెడ్డ పనేమీ కాదు . ఆవిడ పేరు చెప్పి చేసేయ్యొచ్చు. ఏమంటావ్? "

"అలా అయితే,ఆ పని జయ వాళ్ళ అన్నయ్యలు చెయ్యొచ్చు కదా?"

"ఓకే. అదికూడా పక్కన పెట్టెయ్. ఆ అబ్బాయికి సరస్వతి అనుగ్రహం వుంది . మనకి లక్ష్మి అనుగ్రహించింది. టూ మచ్ గా కాకపోయినా . అత్తా కోడల్లే కదా . ఆ కనెక్షన్ తో చేసేయ్యొచ్చు . కదా? "

"నువ్వే అంటున్నావు కదా జయ వాళ్ళన్నయ్యలకి , సునీల్ వాళ్ళ అక్కకి నీ కంటే ఎక్కువ లక్ష్మీ అనుగ్రహం ఉందని ?"

"నువ్వు కాలికేస్తే వేలుకి వేలికేస్తే కాలు కి అన్నట్టు వెయ్యకు. వాళ్ళివ్వలేదు వాళ్ళు వెధవలు వీళ్లివ్వలేదు వీళ్ళు వెధవలు అనుకొనే పని లేదు . సునీల్ వాళ్ళకే ఒక ప్రాపర్టీ వుండి అమ్ముదాము అనుకొంటే ముందు మాకే అమ్మాలి , మేము కొనకపోతే అప్పుడు బయటి వాళ్లకు అమ్ముకొందువు గాని అని లైన్ లో ఉందురు వీళ్ళందరూ . ఇది ఒక రకంగా ప్రాపర్టీస్ కంటే గొప్ప ఇన్వెస్ట్మెంట్ . తింగరోళ్ళు మనకి వదిలేశారు . చాలా పనులు ఒక రకంగా చూస్తే రైట్ ఒకరకంగా చూస్తే రాంగ్ అనిపిస్తాయి ఏ రకంగా చూసినా రైట్ అనిపించే పనులు చాలా అరుదు గా ఉంటాయి . వాటిలో ఇది ఒకటి అని నా అభిప్రాయం. నేను కూడా పరిగెత్తుకుంటూ ఇచ్చెయ్యలేదు. రిజల్ట్స్ వచ్చాక సునీల్ వాళ్ళక్క మెసేజ్ పెట్టగానే రెస్పాండ్ అవ్వకుండా సైలెంట్ గా ఉండిపోదా ము అనిపించింది. లెక్కేస్తే చెయ్యాల్సిన పని అని ఆలోచించి ముందుకు వెళ్లడం జరిగింది. ఆ అబ్బాయి సర్కిల్ లో అందరూ మంచి వాళ్లు , విద్యావంతులు , సమర్థులు ,తెలివయినవారు , ధనవంతులే . "operation success , patient dead " అన్నట్టు ఉపయోగపడే పని వచ్చేసరికి వెనకడుగు వేసేసారు.

వాట్సాప్ గ్రూప్ చాట్ లో ఒలికించే ఆప్యాయతలు,అనుబంధాలు చూస్తే వీళ్లేనా వాళ్ళు అనిపిస్తుంది. వాళ్ళ పిల్లలకి మీరు ఒకరికి ఒకరు సాయం చేసుకోవాలి, ఒకళ్ళని ఒకళ్ళు టేక్ కేర్ చెయ్యాలి అని తెగ నూరిపోస్తారు. నవ్వాలో ఏడవాలో కూడా అర్ధం కాదు. "

"..."

"సర్లే అది కూడా పక్కన పెట్టెయ్ . ఎవరయినా ఓకే అనగలిగే ఒక ప్రాక్టికల్ రీజన్ చెప్తా. ఇప్పుడు ఆ డబ్బులు ఆ అబ్బాయి చదువుకి వాడకపోతే ఏదో ఒకటి చేస్తాం కదా. బ్యాంకు లో దాస్తే 8 ఇయర్స్ కి డబల్ అవుతుంది. స్టాక్ మార్కెట్ లో పెడితే అదృష్టం బాగుంటే ఎంతయినా అవుతుంది . లేకపోతే సున్నా కూడా అవ్వొచ్చు. పోనీ ఏమయినా రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్ చేద్దాం అంటే 10 లక్షలకి మన వూరిలో కూడా ఏమీ రావడం లేదు. మనిషి అన్నవాడికి మెడికల్ డాక్టర్తో అవసరం ఉండకుండా ఉండదు . అవసరమయిన సందర్భములో వాళ్ళిచ్చే సలహా గానీ సహకారం గానీ వెల కట్టలేనిది. డబ్బులిస్తేనే చెప్తారా అంటే, ఇవ్వకపోతే చెప్పరని కాదు , ఇస్తే కొంచెం ఎక్కువ ఇంట్రస్ట్ తో చెప్పొచ్చు . ఆ అబ్బాయి చాలా మంచోడు . వాళ్ళ కజిన్ కి కాలికి ప్రాబ్లెమ్ చూసి, గుర్తుపట్టి మొత్తం ఎండ్ టు ఎండ్ జరిపించాడు. వాళ్ళేదో చేస్తారని కాదు. మంచి డాక్టర్ లక్షణం అంతే. మనకి తాను ఫ్యూచర్ లో చెయ్యబోయే ఏదో ఒక సహాయానికి అడ్వాన్స్ అనుకో. అప్పుడు ఇచ్చే అంత మనదగ్గర ఉండకపోవచ్చు .లేక తాను భీభత్సం గా సంపాదించేసి ఇస్తామన్నా తీసుకోక పోవచ్చు . మా ఫ్రెండ్ చెప్పినదాని ప్రకారం, MBBS కి MD కి జీతంలో తేడానే ఏడాదికి ఇరవై లక్షలు

పడుతుంది . డబ్బులు వెనక్కి ఇవ్వడం గురించి ఏమీ మాట్లాడలేదు తనతో. కానీ నా అభిప్రాయం ప్రకారం, MD కంప్లీట్ అయ్యి జాబ్ వచ్చాక డెఫినిట్ గా వెనక్కి ఇచ్చేస్తాడు. "

"ఇవ్వకపోతే?"

" మా ఫ్రెండ్ ఒకడు హైద్రాబాద్లో స్థలం కొంటె వాడెవడో కబ్జా చేసేసాడట .. అలాగే మనం స్థలం కొంటే ఎవడో కబ్జా చేసేసాడు అనుకుంటే సరిపోతుంది .. అయినా డబ్బులు అంటే వెనక్కి రావాలి లేకపోతే మరింత పెరగాలి అనే రూల్ ఏమీ లేదు కదా? మనిషి అయినా వస్తువు అయినా పర్పస్ పని చెయ్యడం . ఆ పదిలక్షలతో ఇంకొంచెం లగ్జరీ కార్ కొనచ్చు.. ఇన్వెస్ట్ చెయ్యవచ్చు .. ట్రిప్ వెయ్యొచ్చు .. ఎలక్ట్రానిక్ ఐటమ్స్ కొనొచ్చు .. లేకపోతే విద్వత్తు ఉండి, తపన ఉండి, ఒక లక్ష్యం కోసం ట్రై చేస్తున్నవాడికి సపోర్ట్ చెయ్యొచ్చు . లక్ష్మీ దేవికి తగిన గౌరవం ఇవ్వాలంటే ఆ లాస్ట్ పనే చెప్పాలి ఆవిడకి . మిగిలినవన్నీ ఆవిడ స్థాయికి సరిపోని పనులు అని నా అభిప్రాయం. "

"..."

ఇంక కన్విన్స్ చెయ్యడానికి ఏమి చెప్పాలో తోచక , పిల్లలు ఏమి చేస్తున్నారు అని టాపిక్ మార్చేసా.

# అంతర్మథనం — మొలుగు కమలాకాంత్

### కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

'**అరేయ్ పృథ్వీ** ఎలా ఉన్నావ్? నేను రా.. నా రాతని పోల్చుకో. స్కాన్ చేసి మెయిల్ చేస్తున్నాను. నీకే గుర్తొస్తాను. ట్రై చెయ్యి బాగా. సర్లేగానీ మనం చదువుకున్న హైస్కూలు వైపు ఈమధ్యేమన్నా వెళ్ళావా? ఏమిచ్చి తీర్చుకోగలంరా ఆ స్కూలు ఋణాన్ని? ఇవ్వాళ నెలకి ఆరంకెలకి పైగా సంపాదిస్తున్నావంటే ఆ స్కూలు పెట్టిన భిక్షేకదరా పృథ్వీ. ఆలోచించు. ఆ స్కూలు వదిలి ముప్పై ఏళ్ళుదాటుతోంది. ఇంతవరకూ ఏమన్నా చేశావురా ఆ స్కూలు కోసం? మరో నలుగురిని కలుపుకుని ఏదన్నా చెయ్యరా, ఊరికి ఉపయోగపడేలా. అదేరా చివరకి మిగిలేది. ఈ ఆరంకెలూ అలా అయిపోతూనే ఉంటాయి. ఆగుతాయా చెప్పు?' **– రాజు.**

చెంప మీద ఛెళ్ళున కొట్టినట్టైంది పృథ్వీకి. అమెరికా, యు.కె వెళ్ళి లక్షలార్జించి అపార్ట్‌మెంట్లు కట్టించాడు అద్దెలు అనుభవిస్తున్నాడు. పాపభీతితో గుడికైతే ఏదో చేశాడుగానీ, తననింత వాణ్ణి చేసిన బడికి మాత్రం ఏనాడూ ఒక్కరూపాయి కూడా ఇవ్వలేదు. ఎవడీ రాజు? తన మెయిల్‌కి స్కాన్ చేసి ఉత్తరం పంపాడు. అదీ రెప్లై ఇవ్వడానికి వీల్లేని మెయిల్. నిజమే తన కర్తవ్యాన్ని గుర్తు చేశాడు. 'థాంక్యూ రాజూ' అనుకున్నాడు పృథ్వీ. అనుకుని మళ్ళీ రొటీన్‌లో పడిపోయాడు మెయిల్ సంగతే మర్చిపోయి.

మూడవరోజు ఇంకో మెయిల్ వచ్చింది.

**'చూశావా!** మనమింతేరా పృథ్వీ. ఆ క్షణానికి ఉద్విగ్నభరితమవుతాం. మరుక్షణంలో మర్చిపోయి రొటీన్లో పడిపోతాం. అంతెందుకు? మనం స్కూల్లో చదువుకునే రోజుల్లో వాణిశ్రీ అనే అమ్మాయి ఆకతాయిల వేధింపులకి తాళలేక ఆత్మహత్య చేసుకుంటే రెండురోజులు నానా హడావిడీ చేసి స్కూలు మూయించాం. దాంతో అయిపోయిందంతే. అసలా తరవాత, ఆ కేసేమైపోయిందో ఎవరికీ తెలియదు. మనం మళ్ళీ చదువుల్లో, ఆటల్లో పడిపోయాం. ముప్పైఏళ్ళ తర్వాత కూడా, ఈ నాటికీ ప్రతిరోజూ ఎన్నో వార్తలు వింటున్నాం - కంటున్నాం. ఆవేశంగా స్పందిస్తున్నాం. ఇంకో కొత్తవార్త రాగానే ఈ వార్త చప్పున చల్లారిపోతుంది. అసలు దాని సంగతే మర్చిపోతున్నాం. మరపు మనిషికి భగవంతుడిచ్చిన వరమే. కాదనను గానీ, మనం మరీ మన కనీస బాధ్యతలని కూడా 'కన్వీనియెంట్‌గా' మర్చిపోతున్నాం చూడూ - అది తప్పు. క్షంతవ్యం కాదు. ఇప్పుడు నువ్వు చేసేది అదే. మొన్నటి మెయిల్ చూశావు గదా! ఎంతో కొంత ఎమోషనల్‌గా ఫీలై ఉంటావాపూట. తెల్లారాక మామూలే. నీ పనులూ, నీ డబ్బూ, నీ సంపాదన, నీ సుఖం... అంతేనా?' **- రాజు**

ఈ రాజుగాడు చెప్పింది అక్షరాలా నిజం. మేము నైన్త్‌క్లాసులో ఉన్నప్పుడు వాణిశ్రీ అనే విద్యార్థిని ఆత్మహత్య ఓ సంచలనం. ఈ రాజుగాడెవడో అన్నీ భలే గుర్తుపెట్టుకుని రాస్తున్నాడే అసలప్పుడు నా రాతెలా ఉండేదో నాకే గుర్తులేదు. తన బాచ్‌మేట్స్‌లో వరదరాజు, నాగరాజు, జాన్‌రాజు, పోతురాజు గుర్తొచ్చారు. ప్చ్... ఎవ్వరెక్కడున్నారో కొంచెం కూడా తెలీదు. వాడు చెప్పినట్లు నిజంగానే నేను మరీ స్వార్థంగా ఆలోచిస్తున్నానా? అవునేమో!

రేపే పాత స్నేహితులు నలుగురికీ ఫోన్ చెయ్యాలి. నో... రేపనుకుంటే అవట్లేదు. మొన్నటిలాగా మర్చిపోతే, మళ్ళీ ఈ రాజుగాడు ఇంకో క్లాస్ తీసుకుంటాడు. ఎందుకొచ్చిన గొడవ? ఇప్పుడే చేద్దాం అనుకుని మిత్రులు మధుబాబు, రవిచంద్, రమణ, కేశవనారాయణలకి ఫోన్ చేశాడు. వచ్చే ఆదివారం హోటల్‌గ్రాండ్‌లో కలుద్దామనుకున్నారు.

ఈ రోజున సమాజంలో ఒక ఉన్నతమైన స్థానంలో ఉన్నాడు పృథ్వీ . ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ పెట్టి అనేకమందికి ఉద్యోగాలిచ్చాడు. ఇందాక చెప్పిన తనకు అందుబాటులో ఉన్న మిత్రులు కూడా కాస్తో కూస్తో మంచి పొజిషన్లలోనే ఉన్నారు. అలాంటి వాళ్ళ నెంబర్లే ఉంటాయి పృథ్వీ  దగ్గర సహజంగా.

శనివారం పొద్దున్నే ఇంకో మెయిల్.

**'పృథ్వీ** రేపే గదరా మీటింగ్ కేవలం మీ నలుగురే కాకుండా మన పాత మిత్రులు మరో ఐదారుగురిని వెతికి కనీసం డబల్ ఫిగర్లో - అంటే పదిమందికి తగ్గకుండా అదీ మన స్కూల్లోనే కలిస్తే బాగుంటుంది. లేకపోతే ఈ కలయిక కూడా హోటల్లో ఏంట్రా బుద్ధీ జ్ఞానం లేకుండా! ఆ స్కూల్లో కూర్చుంటేనే ఆ స్కూలు ప్రస్తుత పరిస్థితిని చూసి చలిస్తారు. ఏదన్నా చెయ్యాలన్న తపన కలిగి నిర్ణయం కూడా వెంటనే తీసుకుంటారు. అంతే తప్ప ఇక్కడ సిటీలోని స్టార్ హోటల్లో కూర్చుంటే మీ దృష్టంతా తిండీ, తాగుడు మీదే ఉండి, స్కూలుకేమన్నా చెయ్యాలన్న అసలు పాయింట్ బలహీనమైపోతుంది. హోటల్లో అంతకంటే గొప్పగా ఏం జరుగుతుంది చెప్పు.

ఎలాగూ నువ్వే ఇనీషియేటివ్ తీసుకున్నావు గాబట్టి, వెన్యూ కూడా నువ్వే మార్చు. మీ స్నేహితులందరూ పెద్దపెద్ద కార్లున్నవాళ్ళే గాబట్టి 50-60 కిలోమీటర్లు పెద్ద దూరమేం కాదు. మహా అయితే గంట ప్రయాణం. ఏమంటావ్? ఈ మీటింగ్‌కి కాదుగానీ, తరవాతి మీటింగ్‌కి నేనూ రావటానికి ప్రయత్నిస్తా' **- రాజు.**

ఈసారి రాజెవడన్నది వెదికే ప్రయత్నం చెయ్యలేదు పృథ్వీ . అనవసరమని తెలుసు. అక్షరాలా రాజు చెప్పినట్లే చేశాడు. తన స్నేహితులందరికీ ఒక్కొక్కళ్ళు ఇంకో ఇద్దరు పాతమిత్రుల్ని తీసుకొచ్చే బాధ్యత అప్పజెప్పి, వెన్యూగా తమ పాత స్కూల్ ఆడిటోరియం - అదే ఓపెన్ ఎయిర్ స్టేజ్‌గా నిర్ణయించాడు. ఒకళ్ళిద్దరు 'అక్కడా' అని నసిగినా వాళ్ళకి సర్ది చెప్పాడు. ఇవ్వాళ సొసైటీలో పృథ్వీ  ఉన్న స్థాయికి స్నేహితులని ఒప్పించటం అంత కష్టం కాలేదు.

ఆదివారం ఉదయం పదిగంటలకల్లా మిత్రులు దాదాపు డజను మందికి పైగా స్కూలు దగ్గర స్టేజ్ మీద చేరారు. స్కూల్‌కి ఏమి చెయ్యాలన్నది పోయి అసలీ రాజెవరన్నది ప్రధాన చర్చనీయాంశంగా మారిందక్కడ. పృథ్వీ అందర్నీ ఆరా తీశాడు. వాళ్ళెవ్వరూ కాదని తేలింది. రాజుకి థాంక్స్ చెబుతూ తీర్మానించి అక్కడికి వచ్చిన ప్రతి పూర్వ విద్యార్థి కనీసం లక్షరూపాయలు తగ్గకుండా శక్త్యానుసారం విరాళాలిచ్చి స్కూలుకి ఒక శాశ్వత భవనాన్ని నిర్మించి ఇవ్వాలని నిర్ణయించి, ఆ ఊళ్ళోనే ఉన్న హెడ్‌మాస్టారి ఇంటికి వెళ్ళి విషయం చెప్పారు. (అ)పూర్వ విద్యార్థుల వదాన్యతకి మహదానంద పడ్డ హెడ్‌మాస్టారు అందర్నీ రిపబ్లిక్ డేకి రమ్మని ఆహ్వానించారు.

పృథ్వీ కి ఆరోజెంతో ఆనందంగా ఉంది. జీవితంలో లక్షలు సంపాదించినప్పుడు కలగని ఆనందం ఉపయోగకరమైన కార్యానికి ఖర్చుపెట్టడంలో ఉంటుందని ఇవ్వాళ అర్థమైంది. తను స్కూలు నిర్మాణానికి మూడు లక్షలు విరాళంగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. భార్య పద్మినికీ, కూతురు శ్రావ్యకీ ఆ విషయం చెబుతూ ఉంటే పృథ్వీ మొహం వెలిగిపోయింది. 'థాంక్యూ రాజూ!' అనుకున్నాడు.

రాత్రి పడుకోబోయే ముందు ఒక్కసారి మెయిల్ బాక్స్ ఓపెన్ చేస్తే రాజునుంచి మరో మెయిల్.

**'కంగ్రాచ్యులేషన్స్ పృథ్వీ.** అందరికంటే పెద్దమొత్తం ఇద్దామనుకున్నావ్ కదూ స్కూలు నిర్మాణానికి వెరీగుడ్ కానీ ఇక్కడొక చిన్నమాట. పాఠశాల అనేది అతి పవిత్రమైనది. నువ్వు దాని నిర్మాణానికి ఇచ్చే డబ్బు అపవిత్రమైనది కాకూడదు. అందుకని, నువ్వు నిజాయితీగా సంపాదించిందే దానికి ఖర్చుపెట్టు. నీ అవినీతి సొమ్ములో పాఠశాల భవనం కట్టిస్తే అది నీకూ మంచిదికాదు. అందులో చదివే పిల్లలకూ అంతకంటే మంచిదికాదు. నువ్వు మన మిత్రులందరికీ ఈ విషయం చెప్పు. పాఠశాల నిర్మాణానికి నిజాయితీగా సంపాదించిన సొమ్ము మాత్రమే విరాళంగా ఇవ్వమని. ఫోన్‌లో చెబితే లాభంలేదు. ఇంకో మూడురోజుల్లో జనవరి 26న మన స్కూల్ రిపబ్లిక్‌డే నాడు జెండా వందనం జరుగుతుంది. దానికెలాగూ హెడ్‌మాస్టారు మీ అందర్నీ పిలిచారు. అప్పుడు ఆ జెండాక్రింద మీటింగ్ పెట్టి చెప్పు. నేను చెప్పినదానికి నువ్వంగీకరిస్తే' **– రాజు.**

గొంతులో పచ్చివెలక్కాయ పడింది పృథ్వీకి. నిజాయితీతో కూడిన సంపాదన. తన సంపాదన చాలావరకు చట్టబద్ధమైనదేగానీ, అంత న్యాయబద్ధమైనదైతే కాదు అపార్ట్‌మెంట్ల మీద వచ్చే అద్దె నెలకి నాలుగైదు లక్షలుంటే బినామీ పేర్లు పెట్టి చివరికి యాభైవేలు కూడా చూపించాడతను. ఇలాంటివి ఎన్నో. తను మరొకరి క్రింద ఉద్యోగం చేసినప్పటి జీతంలో దాచిన సొమ్ముని మాత్రం తన కూతురు శ్రావ్య పేర నిజాయితీగా పన్నెండు లక్షలదాకా దాచాడు. మిగతాదంతా లెక్కలు సరిగ్గా లేనిదే. ఈ రాజెవడో తననే టార్గెట్ చేశాడే! కానీ, వాడి పాయింట్లేవీ తాను కాదనేట్లు లేవు. ఆత్మసాక్షికే తాను సమాధానం చెప్పుకోలేకపోతున్నాడంతే.

తన సమాధానం అవతలి వ్యక్తికి చేరదని తెలిసినా కసిగా రిప్లై పెట్టాడు.

**'రాజూ!** నువ్వు మరీ ఇబ్బంది పెట్టేస్తున్నావ్. మనసులో దూరి, నన్ను మానసిక సంఘర్షణకి గురి చేస్తున్నావ్. కానీ నీ మాటల్లోని నిజాయితీ నన్ను కట్టిపడేస్తోంది. చూద్దం ఎవరు గెలుస్తారో.. నువ్వో? నేనో-' **పృథ్వీ.**

ఆ రోజు రిపబ్లిక్ డే – జనవరి 26. స్కూల్లో జెండా వందనానికి ముఖ్య అతిథిగా పూర్వ విద్యార్థుల సంఘ నాయకుడు పృథ్వీ ని పిలిచారు. ఆ స్కూలు ప్రాంగణంలో తమ చిన్నప్పటి 'బోలో స్వతంత్ర భారత్ కీ జై' 'మహాత్మా గాంధీకి జై!' అన్న నినాదాలు పృథ్వీ చెవుల్లో మార్మోగుతున్నాయి. జెండా వందనం అనంతరం మువ్వన్నెల పతాకం క్రింద ముచ్చటైన విద్యార్థులని అదీ తమ పాఠశాలకి ఒక భవనాన్ని నిర్మించి యిస్తున్న మహాదాతల నాయకుడిని కృతజ్ఞతా పూర్వకంగా చూస్తూ మురిసిపోతున్న ఆ ముద్దుగారే చిన్నారులని ఉద్దేశించి ఒక్కటే మాట చెప్పాడు పృథ్వీ .

''పిల్లలూ! నేనూ, నా మిత్రులూ మా నిజాయితీతో కూడిన సంపాదనలోని సొమ్మునే విరాళంగా ఇచ్చి ఇక్కడ నూతన పాఠశాల భవనాన్ని నిర్మిస్తాం. నిజాయితీతో నిండిన భారతదేశమా వర్థిల్లు.. నువ్వే గెలిచావు రాజూ'' అంటూ ఆనందపారవశ్యంతో ఒళ్ళంతా వైబ్రేట్ అవుతుండగా క్షణకాలం స్పృహకోల్పోయాడు. మిగతా మిత్రులూ, ఉపాధ్యాయులు కంగారుపడి ముఖాన నీళ్ళు చల్లిన కాసేపటికి తేరుకున్నాడు. అందర్లోనూ రిలీఫ్. పూర్వ విద్యార్థుల వదాన్యతకి మెచ్చి గ్రామ పెద్దలు, స్కూలు సిబ్బంది అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. భోజనాల అనంతరం పృథ్వీ మిత్రబృందం కిందటిసారి కంటే ఎక్కువగా ఇరవైమందితో సమావేశమైంది.

''నాలాంటివాడి దగ్గర, మీలో కొందరి దగ్గర పాపపు సొమ్ము ఉన్నమాట వాస్తవం. దాన్ని వేరే పుణ్యకార్యాలకు వినియోగిద్దాం. కానీ మన మిత్రుడు రాజు చెప్పినట్టు మన సంపాదనలో మన ఆత్మసాక్షిగా నిజాయితీతో కూడిన సొమ్ముతోనే ఈ స్కూలు భవనాన్ని నిర్మిద్దాం. ఏమంటారు?'' పృథ్వీ అనడంతో కరతాళ ధ్వనులు మిన్నుముట్టాయి.

''ఇంతకీ ఆ రాజెక్కడ? తరవాతి సమావేశానికి వస్తానన్నాడుగా?'' అడిగారెవరో.

''రాజూ! ఎక్కడున్నా లేచి ముందుకి రావాలి'' అరిచాడు పృథ్వీ. ఎట్టి స్పందనా లేదు ఎవరినుంచీ.

''థాంక్యూ రాజూ!'' ముక్తకంఠంతో అని ఇళ్ళకు చేరారు.

ఇంటికొచ్చిన పృథ్వీకి సాదర స్వాగతం పలికారు పద్మిని, శ్రావ్య.

''నాన్నా! ఇంతకీ ఆ రాజెవరు ? వచ్చారా ఇవాల్టి మీటింగ్‌కి?'' అడిగింది శ్రావ్య.

''వచ్చాడమ్మా! వాడు రాకుండా మీటింగెలా జరుగుతుంది? ఒకే మనిషిలోని రెండు పార్శ్వాలమ్మా పృథ్వీ మరియు రాజు. నాలోని మంచి పార్శ్వమే ఆ రాజమ్మా. మీకు కనబడే నాన్న ఈ పృథ్వీ. మొత్తం కలిపే ఈ పృథ్వీ రాజమ్మా. నా అంతర్మథన ఫలితమమ్మా ఇదంతా.''

''అవునా? అయితే ఆ మాట నువ్వే అందరికీ చెప్పెయ్యొచ్చుగా!''

''లేదమ్మా! కంటికి కనబడే ఈ పృథ్వీకి డబ్బున్నవాడిగా తప్ప మనిషిగా గుర్తింపులేదమ్మా. ఈ పృథ్వీ మంచిమాటలు చెబితే లోకం, నా స్నేహితులూ వినరమ్మా. అసలామాటకొస్తే నేనే విననమ్మా!. అందుకే నాలోని రెండో పార్శ్వం రాజుద్వారా ఈ సత్కార్యాన్ని ఆ భగవంతుడే చేయించాడు. మీ నాన్నని పృథ్వీ నించి రాజుగా మార్చాడమ్మా. ఇకనుంచి మీ నాన్న పేరు రాజు అమ్మా... రాజు'' అంటూ రెండు వెచ్చటి కన్నీటిబొట్లు రాల్చాడు కూతుర్ని అక్కున చేర్చుకుని.

## ఐస్ బాక్స్ బతుకులు — అనూరాధ(సుజల గంటి)

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

''అబ్బ రోజూ ఈ ఫ్రిజ్ లో కూడేనా?'' అన్నాడు విసుగ్గా మోహన్

"ఏం చెయ్యమన్నారు? ఇద్దరం ఉద్యోగాలు చేస్తున్నాము. పొద్దున్న వంట మనిషి వండి వెళ్ళిపోతుంది. బైట పెడితే పాడయి పోతాయి. అందుకని ఫ్రిజ్ లో పెట్టుకుని వేడి చేసుకుని తినడం తప్ప మార్గం లేదు"అంది నమ్రత.

"పోనీ ఏ పూటకా పూట ఫ్రెష్ గా చెయ్యవచ్చుగా. అమెరికాలో లాగా ఇక్కడ కూడా వారానికి సరిపడ చేయించుకుని అదే తినడమెందుకు? దీనికేదైనా మార్గం చూడు నమ్రతా."అన్నాడు మోహన్.

"అమెరికా లో అలవాటై పోయింది కదా! వంట మనిషి రోజూ వచ్చి చేసినా దానికి రోజూ ఇన్స్ట్రక్షన్స్ ఇచ్చే ఓపిక నాకు లేదు.నువ్వు కావాలంటే చేయించుకో"అని నమ్రత లోపలికి వెళ్ళిపోయింది.

అమ్మ కూడా ఉద్యోగం చేసింది ఐనా ఎప్పుడూ ఇంట్లో అన్నీ వేడిగా చేసి పెట్టేది. చాలా రోజుల దాకా ఫ్రిజ్ ఉండేది కాదు. నాన్నగారి ఉద్యోగం స్టేటస్ పెరిగాక "అందరిళ్ళల్లో ఉంది మన ఇంట్లో కూడా ఉంటే బాగుంటుంది. అదీకాక ఎవరైనా ఇంటికి వస్తే కూల్ డ్రింక్స్ ఇవ్వడం ఇప్పుడు ఆచారమైపోయింది" అంటూ, అమ్మ వద్దన్నా, నాన్నగారు కొన్నారు.

చాలా రోజులు ఖాళీగా ఉండేది. "కరెంట్ వేస్ట్ నువ్వు పాతకాలపు దానిలా బిహేవ్ చెయ్యకు. కాలం తో బాటు మనమూ మారాలి.కూరలూ,పళ్ళూ ,పాలూ పెరుగూ అందులో పెట్టు" అని నాన్నగారు చాలా రోజులు పోరగా అమ్మ ఫ్రిజ్ వాడకం మొదలు పెట్టింది.

కొన్ని పనులు ఆమెకిష్టం లేకపోయినా భర్త మీద గౌరవమో?ప్రేమో?తెలియదు పాటించేది.

అప్పుడు పాలూ పళ్ళూ,కూరలూ ఐతే ఇప్పుడు దాని నిండా వండిన పదార్థాలతో నిండి పోతోంది.

డాక్టర్లు జంక్ ఫుడ్,ప్రాసెసెడ్ ఫుడ్ వద్దన్నా డాక్టర్ల వాక్కు పక్కకు జనాల వాక్కు ముందుకు వచ్చాయి.

అప్పుడు ఆడవాళ్లకు వంట ఇష్టమైతే ఇప్పుడు బరువైపోయింది. ఆడవాళ్ళే ఎప్పుడూ వంట వండాలా?అన్నప్రశ్న అందరి మనసుల్లో నాటుకు పోయింది.

కానీ నిజమే ఇది వరకు ఆడవాళ్ళు వంట పని మాత్రమే చేసేవారు, కూరలు కూడా భర్త తెచ్చి ఇస్తే.

కానీ ఇప్పుడు ఉన్న రెండు చేతులూ చాలవు అన్ని పనులు వాళ్లకు.

ఫ్రిజ్ లో పెట్టిన భోజనం వేడి చేసుకు తినడం వచ్చాక ఆరోగ్యాల్లో తేడా వచ్చినా పట్టించుకునే పరిస్థితి ఎవ్వరికీ లేదు. కూరగాయలు కూడా కోల్డ్ స్టోరేజ్ లో పడేసి మార్కెట్ కు వస్తున్నాయి.ఏ పదార్థం చెడకూడదన్నా చల్ల పెట్టే గతి.

భర్తను మెల్లిగా చెయ్యెత్తి పిలిచింది మాధురి. పుస్తకం చదువుతున్న అతను అది చూడలేదు.

"హూ......"అన్న శబ్దానికి పుస్తకం లోంచి తలెత్తాడు కమలాకర్.

తనవైపు చూసిన భర్తను దగ్గరకు రమ్మన్నట్లు చెయ్యి ఊపింది. లేచి ఆమె దగ్గరకు వెళ్ళాడు కమలాకర్.

ఆమె గొంతు బలహీనంగా ఉంది అందుకని ఆమె దగ్గర ఉన్న స్టూల్ మీద కూర్చుని చెవి ఆమె నోటి దగ్గర పెట్టాడు. ఆమె చెవిలో చెప్పిన మాటకు ఒక్కసారి షాక్ తిన్నాడు.

"నీకేమైనా పిచ్చా?వద్దు"అన్నాడు.

"నా మాట వినండి అవసరం రావచ్చు.కొంత డబ్బు పోయినా నష్టం లేదు"అంది మాధురి.

ఆమె చెపుతున్నది ఎంత వరకు సమంజసం అన్న ఆలోచన లో ఉన్నాడు కమలాకర్.

మాధురి అప్పటికి ఆరునెలల నించి హస్పిటల్ కీ ఇంటికీ మధ్యలో తిరుగుతోంది. ఆమె రోగం ఫలానా అని అంతుపట్టకుండా ఉంది.అన్ని రకాల టెస్ట్ లూ చేస్తున్నారు.ఒకసారి ఒకరోగం ఇంకోసారి ఇంకో రోగం అని చెపుతున్నారు.ఆమె టెస్ట్ రిజల్ట్స్ డాక్టర్లనే తికమక లో పెడుతున్నాయి.

ఒంటి నిండా పొడిచిన సూది పోట్లతో విసిగి పోయింది మాధురి.



కౌముది

"అబ్బ ఈ నరకం కన్నా ఆ యమధర్మరాజు పెట్టే నరకం బాగుంటుందేమోనండీ"అన్న ఆమె మాటలకు కమలాకర్ దగ్గర సమాధానం లేదు.

"కొంచెం ఓపిక పట్టు మధూ మరి టెస్ట్ లు చెయ్యకపోతే వాళ్ళకు మాత్రం రోగం ఏమిటో ఎలా తెలుస్తుంది?"అన్నాడు.

హాస్పిటల్లో చెల్లించే ఫీజు కి తగ్గట్లుగా పొద్దున్న నించి వరసగా చదువుతున్న వాళ్ళు ఇంకా పై డిగ్రీ కోసం చదివేవాళ్ళు, ట్రైనీస్, ఆ పైన ట్రైనింగ్ లో ఉన్న నర్సులు అందరికీ ఒక ప్రయోగశాలలా ఉంది మాధురి శరీరం. ఏమడనడానికి లేదు. ఊర్లో ఉన్న పేరుప్రఖ్యాతులున్న హాస్పిటల్ అది. అక్కడ ఉన్న డాక్టర్లు ధన్వంతరీలన్న పేరుంది.

ఈ ట్రీట్ మెంట్ కి విసిగిపోయి చావును కోరుకుంటోందా అన్న అనుమానం కలిగింది కమలాకర్ కు.

మొదటి సారి హాస్పిటల్ లో పెట్టినప్పుడు పిల్లలు పరిగెట్టుకు వచ్చారు. కాస్త బాగుపడ్డాక సెలవు లేదని వెళ్ళిపోయారు. రోజూ అమ్మకెలా ఉందని ఫోన్లు చేస్తున్నారు.

మాధురికి కమలాకర్ కి ఇద్దరు పిల్లలు. ఇద్దరూ అమెరికాలోనే ఉన్నారు. మాధురి చెల్లెలి కొడుకు అమ్మానాన్నల కోసం అమెరికా వదిలి ఇండియా వచ్చేసాడు. మాధురికి కూడా తన పిల్లలు అలా వచ్చేస్తే బాగుంటుందన్నకోరిక. కానీ ఆ కోరిక పైకి చెప్పే ధైర్యం లేదు. చెపితే వాళ్ళు నో అంటే భరించడం కష్టం.

అసలు తను బతికుండగా వస్తారా పిల్లలు? అన్న అనుమానం రోజూ ఆమెను సతాయిస్తోంది.

మోహన్ ఆమె చెల్లెలు కొడుకు. వారానికొకసారి వచ్చి పిన్నిని పలకరిస్తాడు. తల్లి కోసం అమెరికా వదిలి వచ్చిన మోహన్ అంటే మాధురికి ఎంతో ప్రేమ. కానీ నమ్రతకు ఇష్టం లేదన్న విషయం ఆమెకు తెలియదు. భర్త తనమాట కాదన్నాడన్న నిరసన ఏదో విధంగా చూపిస్తుందని.

మోహన్ వచ్చినప్పుడు మాధురి చెప్పిన విషయాన్ని చెప్పాడు కమలాకర్.

"ఇందులో తప్పేం ఉంది పెద్దనాన్నా. దొడ్డమ్మ చాలా ప్రాక్టికల్ అమెరికా వాళ్లను ఫాలో అవుతోంది" అన్నాడు.

కమలాకర్ కి అతని మాటలు రుచించలేదు.ఇప్పటికే వాళ్ళను అనుకరించడం ఎక్కువయిపోయిందని తను ఏడుస్తుంటే వీడిలా అంటున్నాడేమిటీ?అన్న ప్రశ్న.

వాళ్ళ దేశకాలమాన పరిస్థితులను బట్టి వాళ్ళు ప్రవర్తిస్తారు. 'బి రోమన్ ఇన్ రోమ్'అన్నట్లుగా ఆ దేశం లో ఉన్నప్పుడు అక్కడి వాతావరణానికి అనుగుణంగా ప్రవర్తించవచ్చు. కానీ ఇక్కడ ఆ పోకడలు పోవడం అవసరమా?అని అతని భావన.

ఐనా నేటి కాలం పిల్లలతో తామెక్కడ నెగ్గగలరు?మెడకేస్తే కాలికీ కాలికేస్తే మెడకూ తగిల్చినట్లుగా లాజిక్ లతో మాట్లాడి తాము చెప్పినదే నిజమని నమ్మిస్తారు.

ఇప్పటి జనరేషన్ మీద కమలాకర్ కి ఉన్న భావాలు ఆ బ్రహ్మదేవుడు కూడా మార్చలేడు.

మాధురి పోరగాపోరగా ఆమె మాట కాదనలేక ఆమె చెప్పినట్లు చేసాడు. వాళ్ళ నిర్ణయం విన్న హాస్పిటల్ సిబ్బంది కూడా ఆశ్చర్యపోయారు.

మాధురి చేసిన పనికి అప్పుడు కాదన్నా ఆమె నిర్ణయం తప్పుకాదని మాధురి మరణించిన కొన్ని గంటలకే అతనికి తెలిసింది.

ఇంతకీ మాధురి నిర్ణయం ఆమె పార్థివశరీరం భద్రపరచే పెట్టి ముందుగా బుక్ చెయ్యమని చెప్పడమే. అంత తొందరగా ఆమె నిష్క్రమిస్తుందని కమలాకర్ అనుకోలేదు. ఒకవేళ నిష్క్రమించినా ఆ చల్ల పెట్టెకు అంత డిమాండ్ ఉందన్న విషయం అతని ఊహకు అందని విషయం.

ఆమె ప్రాణం పోయిందని డాక్టర్ చెప్పగానే పిల్లలకు ఫోన్ చేసాడు. ఇద్దరూ ఏకకంఠంతో

"మేం వచ్చేదాకా అమ్మ శరీరం ఉంచండి.అమ్మ ఆఖరి చూపు మాకు దక్కాలి"అన్నారు.

అక్కడ చూపెక్కడుంది ప్రాణం లేని శరీరం తప్ప. చీము,నెత్తురు,చలనం ఉన్నప్పుడు చూసిన దానికీ అవన్నీనిర్జీవం అయ్యాక చూసేదానికీ తేడా లేదూ?

ఐనా జరుగుతున్న తతంగానికీ జరగబోయే తతంగానికీ నిమిత్తమాత్రుడిగా మిగలడం తప్ప చేసేదేమీ లేదు.

మాధురి శరీరం ఐస్ బాక్స్ లో పెట్టాక తలగడా కింద ఆమె మంగళసూత్రాలు తీద్దామని చెయ్యి పెడితే ఒక కాగితం చేతికి తగిలింది. రాత్రి పడుకునే ముందు మంగళసూత్రాలు తలకింద పెట్టుకోవడం పొద్దున్న లేచాక మెడలో వేసుకోవడం చాలామంది ఆడవాళ్ళు చేసినట్లుగా మాధురి చేస్తుంది. "హాస్పిటల్లో ఉన్నప్పుడు మంగళసూత్రాలు ఎలాగా వేసుకోవు కదా! ఇంట్లో పెడతాన"ని ఎన్నిసార్లు చెప్పినా మెడలో లేకపోయినా తల కింద ఉంటే తన మెడలో ఉన్నట్లుగా భావన అని వాదించేది.

కొన్ని విషయాలకు లాజిక్ ఉండదు. అలాంటప్పుడు ఊరుకోవడం ఉత్తమం. ఆమె లాజిక్ అతనికి నచ్చకపోయినా ఆమె మీదున్న ప్రేమ ఆమె మాటను కాదనలేని పరిస్థితిలోకి అతన్ని నెట్టింది.

మంగళ సూత్రాలు జేబులో పెట్టుకున్నాడు. ఉత్తరం తీసి చదివాక అతని కంట ఆగని కన్నీరు. ఆడవాళ్లను,వాళ్ళ ఆలోచనలను ఎప్పుడూ తక్కువ అంచనా వేస్తామో కదా! చాలా విషయాల్లో వాళ్ల ముందు చూపు సంసార రథానికి చాలా విషయాల్లో ఉపయోగపడుతుంది అనుకున్నాడు కమలాకర్.

పిల్లలు వచ్చేసరికి మూడు రోజులనుకున్నది నాలుగు రోజులు పట్టింది. పిల్లలు వచ్చేదాకా ఇంటికి తెస్తే చుట్టుపక్కల వాళ్ళు వద్దంటారని హాస్పిటల్లో మార్చురీలో ఉంచారు. పిల్లలు వచ్చారు తల్లిని ఐస్ బాక్స్ మీదే కౌగలించుకున్నారు.

వాళ్ళు కాస్త ఊపిరి పీల్చుకున్నాక మాధురి ఉత్తరం చేతిలో పెట్టాడు.

ఇద్దరూ ఏక కంఠంతో "ఇదేమిటి నాన్నా?" అన్నారు.

"మీ అమ్మ రాసింది చదువుకోండి"అన్నాడు కమలాకర్.

"పాపా బాబూ.చిన్నప్పుడు ఇలాగే పిలిచేదాన్ని కదా! కొంచెం పెద్దయ్యాక మీరు గొడవ పెడితే పేర్లు పెట్టి పిలిచేదాన్ని.మీరు వచ్చేసరికి నేను ఉండనని నాకు తెలుసు.మీ ఎవ్వరి మీదా ఆధారపడకుండా వెళ్ళాలనుకున్నాను.కానీ అది నా చేతిలో లేదు. అలాగే నా శరీరం ఐస్ బాక్స్ లో పెట్టడం కూడా నాకిష్టం లేదు.దానికి కారణాలు తరువాత చెప్తాను. మోహన్ ఒకసారి చెప్పాడు అమెరికా లో ఎవరి జీవితం వారిదని.పిల్లలు వాళ్ళ జీవితం వాళ్ళు జీవిస్తారని,తల్లితండ్రుల మీద ఆధారపడరని.అలాగే వాళ్ళ తల్లితండ్రులు కూడా అని.మోహన్ ఇంకోటి కూడా చెప్పాడు అమెరికా లో వాళ్లను పూడ్చిపెట్టే కాఫిన్ దగ్గరినించీ అంత్యక్రియలదాకా అన్ని చాలామంది ముందే అమర్చుకుంటారని.

అలా కాకపోయినా ఇక్కడ కూడా అలాగే జరగాల్సిన కొన్ని పనులున్నాయి.ఇప్పుడు అందరివీ చద్ది బతుకులైపోయాయి.ఆహార పదార్థాలు పాడవకుండా దాచిపెట్టుకుందుకు రిఫ్రిజిరేటర్ కనిపెట్టాడు మానవుడు.కొద్ది రోజులు పాలూ పళ్ళూ కోసం అన్నారు.పరవాలేదనుకున్నాము. ఆ తరువాత ఆమెరికాలో మీకందరికీ టైమ్ ఉండదని వారానికి సరిపడ వంట ఒక్కసారే చేసుకుంటారని అందులో దాచుకుంటారని కొద్దికొద్దిగా వెచ్చపెట్టుకు తింటారని విన్నాను.ఆ తరువాత మీ ఇళ్ళల్లో చూసాను. ఇప్పుడా జాడ్యం ఇక్కడ కూడా పట్టుకుంది.అందరివీ చద్ది బతుకులై పోయాయి. వేడిగా రుచిగా వండుకోవడాలు తగ్గిపోయాయి.

సైన్స్ అభివృద్ధి మానవ వికాసానికి ప్రగతికీ దోహదపడేదిగా ఉండాలి కానీ అధోగతికి తీసుకెళ్ళేదిగా ఉండకూడదు.పెరుగు ఫ్రిజ్ లో పెడితే దానిలో ఉండే గుడ్ బాక్టీరియా చచ్చిపోతుందని అందరికీ తెలుసు. అలాగే ఆహార పదార్థాలు ఎన్నిసార్లు వేడి చేస్తే అన్ని పోషకవిలువలు చచ్చిపోతాయనీ తెలుసు.

తెలిసి కూడా అందరూ అలవాటుకు బానిసలై పోయారు. ఇదివరకు రోజుల్లో రాత్రి గడిస్తే ఆ భోజన పదార్థాలు పాచివి అని విసర్జించేవారు. సైన్స్ ప్రకారం దాంట్లో బాక్టీరియా డెవెలప్ అవుతుంది. అలాంటి భోజనాలు తిని మనం రోగాల్ని ఆహ్వానిస్తున్నాము. ఇది రిఫ్రిజిరేటర్ గా పిలవబడే చద్ది పెట్టి సంగతి. అలాగే కూరల్ని కోల్డ్ స్టోరేజ్ చేస్తున్నారు.అలా చెయ్యబట్టి దానిలో కూడా పోషక విలువలు తగ్గుతున్నాయి.

ఈ ఉపోద్ఘాతం ఎందుకమ్మా అనుకుంటున్నారు కదూ! ఇప్పుడు అసలు విషయం. ఇవ్వాళ రేపూ పిల్లలందరూ దేశాంతర ఖండాలు పెట్టుకుని వెళ్ళిపోయాక తల్లితండ్రుల మృతశరీరాలకు కూడా ఈ చద్ది పెట్టెల తయారీ అవసరమయ్యింది. మీరొచ్చేదాకా ఈ శరీరం పాడవకుండా కాపాడాలి కదా!

శాస్త్రం ప్రకారం జీవాత్మ పరమాత్మ లో కలిసిపోయాక సూర్యాస్థమానం లోపల శరీరాన్ని దహనం చెయ్యాలి. మర్నాటికి శరీరం కూడా పాచిపడిపోతుంది.పాచి అన్నం ఎలా పనికిరాదో ఇదీ అంతే.

మానవ శరీరంపంచభూత తత్వాలతో నిండి ఉంటుంది. ఆత్మ శరీరాన్ని వీడిపోయాక జీవి శరీరంలోని పృధ్వీతత్వం పృధ్విలోనూ,జల తత్వం జలం లోనూ,తేజతత్వం తేజం లోనూ,వాయు తత్వం గాలిలోనూ,ఆకాశ తత్వం నింగిలోనూ సర్వ వ్యాపియైన మనసు చంద్రునిలోనూ విలీనమై పోతాయి.

ఇది దేవుడు నిర్దేశించిన పద్ధతి. కానీ మానవ మేధస్సు పెరిగి దైవాన్ని చాలెంజ్ చేస్తున్నట్లుగా అన్ని పనులూ చెయ్యడం తో చివరకు దైవానికే అనుమానం వస్తాందేమో, నేను సృష్టించిన మనిషి నన్ను మించిపోతున్నాడేమో అని.

మన శాస్త్రాల్ని నమ్మినట్లైతే ఈ ఐస్ బాక్స్ ల అవసరం లేకుండా అంత్యక్రియలు చెయ్యడం ఉత్తమం కానీ అది మరణించిన వాళ్ళ చేతిలో లేదు.

ప్రాణం పోయిన వెంటనే మిగిలినవన్నీ యధావిధిగా జరిగితేనే శాస్త్రం లో చెప్పిన మోక్షాలు దొరుకుతాయి.ఈ నా చద్ది శరీరం లో అవసరమైన భాగాలు హాస్పిటల్ వాళ్ళకు ఇచ్చేసాను. మిగిలిన శరీరాన్నికాపాడడానికి నా ఐస్ బాక్స్ ముందుగా బుక్ చెయ్యమంటే మీ నాన్న నన్ను చూసి నవ్వారు.ఆయనకు తెలియదు ఈ మధ్య దీనికి కూడా డిమాండ్ పెరిగిందని.ఇది వరకు హాస్పిటల్ లోనే ఉండేది ఈ అవకాశం ఇప్పుడు ప్రైవేట్ గా ఇది బిజినెస్ గా మారింది.అంతా అమెరికా ప్రభావం. అందుకే అక్కడ వాళ్ళు సిమెట్రీ బుక్ చేసుకున్నప్పుడు నేను నా చద్దిపెట్టె ముందుగా బుక్ చెయ్యమన్నాను.

మానవ జీవితం అంతా ఐస్ బాక్స్ బతుకులైపోయాయి.

అమ్మ రాసిన ఈ మాటలు ఇప్పుడు మీకు పిచ్చి ప్రేలాపనలా అనిపించినా మీకు కొద్ది వయసు పైబడ్డాక ఇందులోని నిజాలు అర్ధమవుతాయి.ఐస్ బాక్స్ బతుకులకు వీలైనంత దూరంగా మానవాళి ఉండాలని కోరుతూ....

అమ్మ.

# సంఘం శరణం గచ్ఛామి    పద్మజ కుందుర్తి

"కాశ్యప ,నైద్రుభ ,అవత్సార,రేభ ,

రైభ ,శండిల ,శాండిల్య సప్తారుషేయ గోత్రాణాం ....శంకర శర్మాణాం ...అహంభూఅభివాదయే".....గట్టిగా పదేళ్ళు కుడా నిండని శంకరం ఓపక్క ఐదో తరగతి చదువుతూనేనాన్నగారి దగ్గర వేదం నేర్చుకుంటున్నాడు. పాఠానికి కూర్చోబోతూ తండ్రికి అభివందనం చేసి,చాపమీద కూర్చుని అమరం వల్లె వేయడం మొదలుపెట్టాడు. తమ్ముడికి కాస్త దూరం గాకూర్చుని తన హోం వర్క్ వర్క్ చేసుకుంటూనే

తమ్ముడు లయబద్ధం గా చదువుతున్నపనసలు వింటున్నదిశాస్త్రి గారి గారాల పట్టి సిరి. విభూది పుండ్రాలు ధరించితెల్లని పంచెకట్టు తోసిద్ధం గావున్నారు ,శాస్త్రి గారు.

అసలే సోమవారం.... అభిషేకానికి వేళ మించిపోతోంది. నెలకోసారిఅభిషేకానికి మంచి పుట్ట తేనె పట్టుకొచ్చే సింగడు ఇంకా రాలేదు.... సింగడు కొండమీద అడవిలోవుండే చెంచు గూడెం దొర భీముడి కొడుకు. వాడూ చిన్న పిల్లవాడే. కొండమీదనే వాడి గూడెంలోనే వున్న ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్నాడు. గుళ్ళో తేనె పూర్తిగా నిండుకుంది.

శాస్త్రిగారు అందుకే భీముడికి మొన్ననే కబురంపించారు. వాకిట్లో అలికిడికి గబుక్కున లేచిపరుగెత్తుకుంటూ వెళ్ళింది సిరి. ఎందుకంటే తేనెతోపాటు సింగడు తెచ్చే కలువపూలుచాలాఇష్టం సిరికి. ఎరుపు ,తెలుపు ,నీలం రంగుల్లో అందంగా మెరిసిపోతుంటాయ్ ఆపూలు!!!.వాటికే ప్రత్యేక మైన సన్నని సువాసన తో వుంటాయవి. ఆపరిమళం అంటే చాలాచాలా ఇష్టం సిరికి. రెండు పెద్ద కూల్ డ్రింకు బాటిళ్ళలో పట్టుకొచ్చిన తేనె ,కలువపూల గుత్తీ,గంగరేగి పళ్ళూ అక్కడ అరుగుమీద పెట్టి బుద్ధిగా నిలబడ్డ సింగడినిచూస్తూ ..".ఏరాసింగా ..బాగాచదువుతున్నావా "?అంటూ పలకరించి ,"అటువెళ్ళి అమ్మగారికి కనపడు "...అంటూ తేనెసీసాలతో గుడికి వెళ్ళారు శాస్త్రి గారు. వెనక వైపు వంటిటి వసారాలో అమ్మగారు అరిటాకులోనెయ్యీ ,కారప్పొడి వేసి భద్రం గా కట్టిచ్చిన ఇడ్లీ ల పొట్లం ,ఓ నాలుగు అరిసెలూ ,జంతికలు వేసిఇచ్చిన కవరూ రెండూ తీసుకొని వెనుతిరిగిన సింగడిని వెనక్కి పిలిచి నిన్న నాన్నగారు సింగడువస్తే ఇమ్మంటూ తనకు ఇచ్చిన పెన్సిళ్ళూ ,క్రేయాన్ బాక్సూ ఇచ్చి పంపింది సిరి.

★★★

కాల చక్ర భ్రమణం లో కొన్ని సంవత్సరాలు గడిచాయి .....శాస్త్రిగారి పిల్లలు హైస్కూలుచదువులు పూర్తయ్యి కాలేజీల్లోకి అడుగుపెట్టారు. సిరి దగ్గర్లోని కాలేజీలోనే ఇంటరు రెండవసంవత్సరం చదువుతున్నది. తమ్ముడు పేరున్న ప్రైవేటుకాలేజీలో పట్నం లో చదువుతున్నాడు. అటు చదువులోను ఇటు అమ్మకు సాయం చేయడం లోనూ బిజీగా వుంటోంది సిరి.సంక్రాంతి శలవు లు ఇచ్చేసారు కాలేజీలకి. ఆడపిల్లలు అందరూ రకరకాల రంగవల్లులు తీర్చేపనిలో వున్నారు. ప్రతి ఇల్లూ కొత్త సున్నాలతో ,బ్రతుకమ్మలతో అత్తగారిళ్ళకు వచ్చిన కొత్తఅల్లుళ్ళు కొత్త కోడళ్ళతో కొత్తపెళ్ళి కూతురిలా మెరిసిపోతోంది. శంకరం కూడా శలవులకి ఇంటికివచ్చాడు. భోగినాడు కండువానిండా రేగిపళ్ళు ,బోలెడన్ని కలువపూలు పట్టుకొని భీముడూ,సింగడూ ఇద్దరూ వచ్చేరు శాస్త్రి గారింటికి. వాకిట్లో అరుగుమీద కూర్చుని పేపరు చదువుతున్నశాస్త్రి గారు "ఏరోయ్ ..భీముడూ బాగున్నావా ..ఏరా సింగా ఎక్కడివరకూ వచ్చిందిచదువు."?.. అంటూ పలకరించారు. తెచ్చినవన్నీ అక్కడే అరుగుమీద పెట్టి "అయ్యగారూ ...అదే..అవిషయం గురించే ..తమరి సలహా అడుగుదామనీ "...నసిగాడు భీముడు. "ఏంటి భీవుడూ వాడు బానే చదువుతున్నాడుగా "?..అడిగారు శాస్త్రి గారు.

"బాగానేసదువుతున్నాడయ్యా ...కానీ ఈ యేటి సదువు ఐపోయాక ఇంకా పెద్ద కాలేజీలో సదవాలనివాడికోరిక ,కానీ అయ్యగారూ ....దానిదరఖాస్తుకే వేలరూపాయలు అడుగుతున్నారు. ఇంకఅందులో చేరి సదవాలంటే లచ్చల్లో పని .నాబోటి కూలోడికి అంత డబ్బు యాడనుంచి వస్తదిసామీ ?... చెబుతే ఇనుకోవట్లా "...అంటూ వాపోయాడు భీముడు. శాస్త్రి గారు కూడా సింగడివైపేమట్లాడుతూ .."చదువు కోనీరా భీవుడూ ..వాడికి మనసు చదువు మీద వుంది. అందరికీ ఆఅదృష్టం దొరుకుతుందా ?చెప్పు ...వాడు చదువుకుంటాను అంటుంటే వద్దనటం ఎందుకూ ??ఈరోజుల్లో మీ పిల్లలు చదువుకోవాలే గానీ ప్రభుత్వమే బోలెడు అవకాశాలు ఇస్తుంది. నాకుతెలిసిన బాంక్ మేనేజరు వున్నాడు ఆయనతో రేపు మాట్లాడతాను. ఏమైనా ఎడ్యుకేషన్ లోనువస్తుందేమో ?కనుక్కుందాం. ఇంకా ఏదన్నా అవసరపడితే నేను సర్దుతాను లే "...అన్నారుపెద్దమనసుతో శాస్త్రి గారు. సింగడి మొహం మతాబాలాగ వెలిగిపోయింది.

"అయ్యా !!నే సెప్పలా..పంతులుగారి దగ్గరకు పోతే ఏదో వొక దారి దొరుకుద్దనీ"!!..ఆనందం గా అన్నాడు సింగడు." శానాసంతోసం అయ్యోరు ..రేపు బాంకీ కాడికి వత్తాం "అంటూ ఇంటిముఖం పట్టారు తండ్రీ కొడుకులు.మరునాడు బాంక్ మేనేజరు తో మాట్లాడి వాళ్ళకు ప్రభుత్వం ఇచ్చే రాయితీలు ,బాంక్ రుణాలుగురించి మాట్లాడి వాడి చదువుకి తగిన ఏర్పాట్లు చేసి కావలసిన భరోసా ఇచ్చి పంపారు శాస్త్రిగారు.

ఇంటరు చదువు తరువాత సిరి కూడా పెద్ద చదువులకి పట్నం వెళ్ళక తప్పలేదు. శంకరంకూడాఇంగ్లీషు చదువులు చదువుతూనే వేదవిద్య మీది ఆసక్తి తో ఆ చుట్టుపక్కల గొప్పపేరున్నవృద్ధపండితుడైన లక్ష్మణ స్వామి ఘనాపాఠి వద్ద వేదాధ్యయనం చేస్తూ అందులో కూడా పరీక్షలురాసి చక్కగా ఒక్కో మెట్టూ అధిరోహిస్తున్నాడు. శాస్త్రిగారి ఆనందానికి అవధులు లేవు. భార్యతోఅప్పుడప్పుడూ ఆనందం పట్టలేక .."మనం చాలా అదృష్టవంతులం పార్వతీ .. మనపిల్లలుఆణిముత్యాలు.!ఏదో నాన్నదగ్గర నేర్చుకున్న నాలుగు పనసలతో ఆ పరమేశ్వరునిసేవించుకునే భాగ్యమూ ,కాసింత కుటుంబ పోషణ చేసుకొవడా

నికి ఆధారమూ దొరికాయి. ఆఈశ్వర ప్రసాదం వల్ల చక్కని సౌశీల్యం గల భార్యా ,సంతానమూ లభించాయి. పిల్లలు చక్కగాచదువుల్లో రాణిస్తూ ,మన ఆచార వ్యవహారాలను గౌరవిస్తున్నారు. ఇంతకు మించిన భాగ్యంఏముంటుంది చెప్పూ "...అంటూంటారు. పార్వతమ్మగారు మాత్రం "చాల్లే !!!వూరుకోండి,చిన్న వాళ్ళను పొగడకూడదు ఆయుక్షీణం ,దిష్టి తగులుతుంది కూడానూ"...అంటూ ఆయనకుఅడ్డుకట్ట వేస్తుంటుంది. నిజం గానే కాస్త దిష్టి తగిలినట్లు వుంది.

...సిరి ఆ చిన్న వూరినుండిపట్నం వచ్చిన కొత్తలో కాస్త బెరుకుగానే వుంది ,ఆ తరువాత స్నేహితుల ప్రొద్బల్యం వల్లగానీ,అమ్మానాన్నల దగ్గరికంటే స్వేచ్చ దొరకటం వల్లగానీ కాస్త పాశ్చాత్య నాగరికతను ఇష్టపడటంమొదలెట్టింది. నడతలోనూ ,దుస్తులవిషయం లోనూ సిరి ఆలోచనల్లో చాలామార్పులు వచ్చాయి.పంజాబీ డ్రస్ వేసుకోవడానికి మొహమాటపడే సిరి పాంటూ షర్టులలోకి మారింది. అందమైనబారెడు జడను పోనీ టైలుగా చేసేసింది.

"అవర్ ఇండియన్ కల్చర్ ఈజ్ బోరింగ్"....అంటూఇంగ్లీష్ లో మాట్లాడటం మొదలెట్టింది. చదువులో బాగానేవున్నా మన సంస్కృతి సంప్రదాయాలుబొత్తిగా నచ్చట్లేదు సిరికి. దానికి తోడు సినిమాలు ,సెల్ఫోన్ల ద్వారా విస్తరిస్తున్న విష సంస్కృతు లన్నీ కాలేజీ పిల్లలను ఆకర్షిస్తున్నాయ్ వాటిలో పడి కొట్టుకు పోవడం తప్ప ఇంకేమీ చేయలేనిదుస్థితి లో పడిపోయింది యువతరం. మొదటిలో శాస్రిగారూ ,పార్వతమ్మగారూ వ్యతిరేకించినా"కాలేజీల్లో కల్చరు ఇంతేనమ్మా మీకేమీ తెలియదు "...అని వాళ్ళ నోర్లు మూయించింది సిరి.చాలాసార్లు చెప్పి చెప్పి ఇంక విసుగొచ్చి వదిలేశారు శాస్త్రి గారు ,పార్వతమ్మా. ఎలాగయితేనేంచదువులో చివరి సంవత్సరానికి వచ్చింది సిరి. చిన్నగా సంబంధాలు చూడటం మొదలెట్టారుశాస్త్రి గారు.

అమలాపురం నుంచి దూరపు బంధువు ఒకాయన సిరికి మంచి సంబంధం పంపించాడు.పిల్లవాడు అన్నవరం దేవస్థానం లో పూజారిగా పనిచేస్తున్నాడని ,మంచి కుటుంబం ,ఆదాయంకూడా బాగుంటుందనీ..... అది వింటూనే సిరి తల్లిదండ్రులమీద విరుచుకు పడింది. అలాంటిసంబంధం తను చేసుకోననీ ,అలాంటి కల్చర్లెస్ సంబంధాలు చుడొద్దనీ గట్టిగా చెప్పింది. మంచిసాఫ్ట్ వేర్ ఇంజనీరు సంబంధమైతే చూడొచ్చనీ అతను అమెరికాలో వుంటే మరీ మంచిదనిసలహాకూడా పడేసింది. శాస్త్రి గారి మనసులో విపరీతమైన బాధ మొదలైంది.

"అయ్యో!!..ఆడపిల్లని ఎక్కువ చదివించి తప్పు చేసానేమో "??..అనే భావన అయనకు కలిగింది.

"లేదూ..తనకు తెలియటం లేదేమో ..లోకం తీరు ఇలాగే వుందేమో ?"అనుకుంటూ తనకుతానుసరిచెప్పుకోవటం మొదలు పెట్టేరు. ఎప్పటిలానే కాలం ఎవరి భావాలనూ పట్టించు కోకుండాపరిగెడుతోంది.

అవి కార్తీక మాసపు చలిరోజులు. వుపవాసాలు ,దీపాలు ,గుళ్ళూగోపురాలు వనసమారాధనలకుతిరిగుతూ ,భక్తి భావనలో పడిపోయారు ఊళ్ళో అందరూ ...వీళ్ళకు తోడు అయ్యప్ప దిక్షా ధారులు,శివదీక్షా ధారులతోనూ ఆలయం కిటకిట లాడుతోంది. శాస్త్రిగారు కుడా చాలా బిజీగా వున్నారు. కొండమీది జలపాతానికి పిక్నిక్ వెళ్ళాలని సిరి ఆమె స్నేహబృందం ప్లాన్ చేసారు. అందరూసందడిగా జలపాతం వద్దకు చేరి ఆ జలధారలలో స్నానాలు చెసారు. చాలాసేపు నీళ్ళలోఆటలాడి వడ్డుకుచేరి భోజనాలకు వుపక్రమించారు. దూరం నించి ఒకబ్బాయి తననే చూస్తూనిలబడటం గమనించింది సిరి. అధునాతనం గా కనిపిస్తూ ,ఫ్రెంచ్ గడ్డం తో టోర్న్ జీన్స్ లోమాస్లీగావున్న అతడిని చూస్తుంటే ఎక్కడో చూసినట్లుగా అనిపించింది సిరికి. భోజనాలు ముగిసాక అతడునిలబడిన వైపు అతనికి కొంచెం దగ్గరగా వెళ్ళింది సిరి. ఆమె తనవైపు రావటం చుస్తూనే చిన్నగానవ్వాడు అతను. అతనూ ..అతనూ ..ఠక్కున గుర్తొచ్చింది సిరికి. "సింగా !!..నువ్వేనా?"అనుమానంగా నవ్వుతూ పలకరించింది సిరి.

"అవునండీ !!...నేనే బాగున్నారా అమ్మాయ్ గారూ"..అంటూ పలకరించాడు సింగడు. తనవైపే ఆరాధనగా చూడటం ,తను గుర్తు పట్టగానే ఆనందంగా అతని మొహం వెలిగిపోవటం సిరి దృష్టిలో పడకపోలేదు. మనసులోనే నవ్వుకుంటూ ,"చాలామారిపోయావ్ సింగా. ఇప్పుడేంచేస్తున్నావ్ "?అంటూ ఆరాలు మొదలెట్టింది సిరి.

"నేనుఅమెరికాలో MS చెస్తున్నానండీ మీరుఏమిచేస్తున్నారూ ??జాబ్ లో సెటిలవుతారా ?ఇంకాచదువుతారా "...అంటూ మొదలెట్టిన ఆ కబుర్లు సాయంత్రం వరకూ కొనసాగాయి. వచ్చినస్నేహితులంతా అన్నీసర్ది "ఇంకరావేతల్లీ ..చీకటిపడిపోతోంది "అని మళ్ళీ మళ్ళీ కేకలుపెట్టేదాకా మాట్లాడు కుంటూనే వున్నారిద్దరూ. చీకటి పడ్డాక బలవంతం గా ఇంటిదారి పట్టారిద్దరూ.ఫోన్ నంబర్లు తీసుకుని.

ఇంటికొచ్చాక కుడా సిరికి వద్దన్నా సింగడి రూపమే మదిలో మెదులుతోంది.
"ఎంత చక్కగావున్నాడూ !!...చిన్నప్పటి నుంచీ కాయ కష్టం చేసిన ధృఢమైన శరీరం ,చల్లని ప్రదేశం లోవుండటం వల్ల రంగుతేలిన శరీరం ,ముఖ్యంగా చదు వువల్ల ఏర్పడిన హుందాతనం తో ఎంతఅందంగా మాన్లీ గా వున్నాడూ "!!అనుకుంది. మొదటి చూపులోనే సింగడి పట్ల ఏదో తెలియనిఆకర్షణ కు లోనయింది సిరి. ఆ వెల్లువలో పడి తెల్లవార్లూ నిద్రపట్టలేదు ,ఎప్పుడుతెల్లవారుతుందా ...సింగడిని మళ్ళీ ఎప్పుడు చూస్తానా ..అని ఆలోచనలతోనే తెల్లవారి పోయిందిసిరికి . తెల్లవారుతూనే మెసేజ్ పెట్టింది. గుడ్మార్నింగ్ ..అంటూ సింగడినుంచి గంట తరువాతవచ్చింది తిరిగి మెసేజ్ శుభోదయం ..అంటూ ...ఈగంట సమయం కూడా ఎంతో అసహనంగాఅనిపించింది సిరికి. ఉదయం నించి సిరిలోని మార్పుని గమనించినా,,, విషయం తెలియకపూరికే గమనిస్తూ వుండిపోయారు శాస్త్రి గారు. సిరి నుంచి వరుసగా మెసేజ్ లు అందుకుంటున్నా..ముక్తసరిగా ఒకటీ అరా తిరుగు మెసేజ్లు రాసాగాయి సిరికి. రెండుమూడు రోజులలా గడిచాక ఇంకవుండబట్టలేక పోయింది సిరి.
"ఒకసారి కలుద్దాం వీలవుతుందా "?అంటూ మెసేజ్ పెట్టింది.దానికి సమాధానం గా రేపు "విలుచూసుకొని మీ ఇంటికి వస్తాను"...అని సమాధానం ...
"వద్దు !!రేపుమధ్యాహ్నం గుడి వెనుక కలుద్దాం "అని మెసేజ్ పెట్టింది సిరి. ఓకే అన్న సమాధానం తోఅమ్మయ్య అని కుదుటపడింది ఆమె మనసు. తెల్లవారిం ది. ఎప్పుడు మధ్యాహ్నంఅవుతుందా???అని ఎదురు చూసింది సిరి ..కాలం కదలకుండా ఆగిపోయిందేమో అనిపించిందిఆమెకు పదే పదే గడియారం వంక చూస్తూ కదలని కాలాన్ని తిట్టుకోసాగింది.

మిట్ట మధ్యాహ్నం రెండుగంటలకి సిరి అన్యమనస్కంగానే భోజనం ముగించి ,"ఇప్పుడే శోభదగ్గరకు వెళ్ళివస్తానమ్మా "..అంటూ తల్లికి చెప్పి బయలుదేరింది "ఇప్పుడెక్కడికే ...?అందరూభోయినాలు తిని పడుకునివుంటారు ". అని వెనకనుంచి తల్లి చెబుతున్నా వినిపించుకోకుండా.గుడి మెట్ల మీద పరచుకున్న నీడలో కూర్చొని సింగడి కోసం ఒళ్ళంతా కళ్ళుచేసుకునిఎదురుచూడసాగింది.
....మధ్యాహ్నం పూట కావడంతో గుడి ప్రాంగణమంతా చాలా నిశ్శబ్దం గావుంది. చెట్ల మీద అరిచే కాకుల అరుపులు తప్ప ఇంకే శబ్దాలు లేక ప్రశాంతం గా వుంది. ఒకఅరగంట నిరీక్షణ తరువాత వచ్చాడు సింగడు, చెతిలో సిరికి ఎంతో ఇష్టమైన కలువపూల గుత్తితో.
...అతని చేతిలో పూలని మురిపెంగా అందుకుంటూ ,"రా సింగా ..అని ఆప్యాయంగా పిలిచింది"..సిరి.

"ఏమిటి సిరీ ...?ఎందుకు పిలిచావ్. అయినా ఇక్కడికెందుకూ ..మీ ఇంటికి వచ్చేవాడినికదా ..?"అన్నాడు సింగడు.

అతను తనని "అమ్మాయి గారూ "అనకుండా పెరుపెట్టి పిలవటంసిరి దృష్టిని దాటిపోలేదు. మనసులోనే నవ్వుకుంటూ ,,"లేదు సింగా ..ని తో కొంచెం పర్సనల్ గామాట్లాడదామనీ ".....నసిగింది సిరి. ఎంత మామూలుగా చెబుదామన్నా ఆమె బుగ్గల్లో సిగ్గులుపూశాయి.

కొద్దిగా తడబడుతూ ,,"ఏంటి సిరీ విషయం ?"అంటూ ఆరా తీశాడు సింగడు. తలవంచిఅతను తెచ్చిన పూలను చేతిలోకి తీసుకుని ,వాటి ని చూస్తూ ..."సింగా ,,నికోమాట చెప్పాలి ..అదే..ఎలాచెప్పాలో తెలియటం లేదు ...చెప్పకుండా వుండాలంటే నావల్ల కావడంలేదు. మనం...మనం .. పెళ్ళిచేసుకుందామా ..?మనం చిన్నతనం నుండీ ఒకరికొకరం తెలుసు నీకు కూడాఅభ్యంతరం వుంటుందనుకోను ..."అంటూ మనసులో మాట ధైర్యంగా చె ప్పింది సిరి. కొద్దిగా షాక్కి గురైనట్లు కొద్దిసేపు మాట్లాడలేదు సింగడు. .....ఆ కాస్త సమయం కూడా ఓరిమివహించలేకపోయింది సిరి.

"ఏంటి సింగా ?అంతగా ఆలోచిస్తున్నావ్ నేను నచ్చలేదా నీకు ?నీస్థాయి కి తగనా ?"..కళ్ళలో నీళ్ళు తిరుగుతుండగా ఆవేశంగా అడిగింది.
"నాకలాంటి ఉద్దేశ్యంలేదు సిరీ"...నెమ్మదిగా నే అయినా ధృఢం గా చెప్పాడు సింగడు. ఆ సమాధానం వింటూనే బాణందెబ్బతిన్న లేడిపిల్లలా విలవిల లాడింది సిరి మనసు.

"ఏం ?..ఎందుకని ??నేను ఆడపిల్లలాప్రవర్తించకుండా ముందు గా అడిగానని అలుసుకదూ"
అంది గొంతు వణుకుతుండగా."అదికాదు సిరీ "!!అంటూ నచ్చజెప్పే ప్రయత్నం చెశాడు శింగడు."ఇంక చాలు సింగా ..నీమీదప్రేమతో మన జాతి అంతరం కూడా పక్కనపెట్టి ప్రేమకోసం నిన్ను అర్ధించాను చూడూ ..అదేనేనుచేసిన తప్పు దానికి తగిన శాస్తి జరిగింది లే ..నాకు"...తిరస్కారాన్ని తట్టుకోలేని సిరిజవాబి చ్చింది ఆవేశంగా. దూరంగా నిలబడి మాట్లాడటం తప్ప అంతవరకూ సిరిని తాకనుకూడాసాహసించని సింగడు ఆమె ఆవేశాన్ని ఆపడాని కన్నట్లుగా ఆమె రెండుచేతులనీ తనచేతిలోకితీసుకున్నాడు.!! నిర్ఘాతపోయి తననే చూస్తున్న ఆమె కళ్ళలోకి సూటిగా చూస్తూ ...

"సిరీ ప్లీజ్..కాసేపు ప్రశాంతం గా నేను చెప్పేది విను. మనిద్దరం చిన్నతనం నుండీ ఇక్కడే పెరిగాం. నీకుమా గూడెం గురించి తెలియదు. నావాళ్ళందరూ అమాయకులు. వాళ్ళకు వేట ,...దొరికితే కూలి,...లేకపోతే అడవిలో పళ్ళూ ,తేనే సేకరించటం తప్ప ప్రపంచం తెలియనివాళ్ళు. ఆ కొద్దిఆదాయాన్ని కూడా సాయంత్రానికి ఏ విప్ప సారాకో తగలేసి అప్పులపాలవుతారు.
...ఎక్కడోనాలాంటివాడొకడు మీ నాన్నగారి లాంటి వారి దయవలన చదువుకుని సంస్కారంనేర్చుకోగలుగుతున్నాడు. మా తండాలో నాకొక్కడికే అలాంటి భాగ్యం కలిగింది. నాలాంటివాళ్ళనుఇంకొంతమందిని తయారుచేయాలినేను . నీవంటే నాకు ప్రేమ లేదు. కానీ ...కానీ ...చిన్నతనంనించీ నీవంటే ఆరాధన. చిన్నప్పటినుంచీ మీ ఇళ్ళలో పిల్లలు పెరిగే వాతావరణం ,నీలోనిసభ్యతా ,సంస్కారం నీ మాటతీరూ ,పొందిక ఇవన్నీ చాలా చాలా ఇష్టం నాకు. ఇవన్నీ మా గూడెం పిల్లల్లో కూడా రావాలని నా ఆకాంక్ష.... గుడిలో దేవతని ఆరాధించాలే గానీ కావాలనికోరుకోకూడదు. ఒక జాతో ,కులమో వుద్ధరింపబడటం అంటే వేరే కులాన్ని కిందికి దించటం కాదు.వాళ్ళుకూడా చదువు సంస్కారాలు పెంపొందించుకుని వున్నతంగా ఎదగాలి. ఆలొచనలోనూ,దృక్పధం లోనూ మార్పురావాలి. అలాజరిగితే కొన్నాళ్ళకి ఈ బేధాలు వాటంతట అవేకనుమరుగవుతాయి. నావల్ల ,నాచదువువల్లా నా తోటి గిరిజనులకు కాస్తో కుస్తో మేలు కలగాలి.
...నాతండా పిల్లలు కూడా నీలా చదువుకోని గొప్పవాళ్ళు కావాలి.
...కని పెంచిన తల్లిదండ్రులను కాదని మనం స్వార్ధం తో పెళ్ళి చెసుకొని వాళ్ళను వంచించి మనం సాధించేది ఏమిటి ?మనంగొప్పవాళ్ళం కావటం అంటే పాశ్చాత్యులను ,వారి వేషధారణను అనుకరించటం కాదు. వాళ్ళుమంచు కురుసేటప్పుడు దుస్తుల్లో పూర్తిగా మునిగి పోతారు కనుక ఎండలు కాసేటప్పుడు చర్మానికిఏండతగలటంకోసం పొట్టి దుస్తులు ధరిస్తారు. వాళ్ళని చూసిమనం కూడా పొట్టిబట్టలుధరించటం ఫాషన్ గా భావిస్తాం.
...కానీ మనం ధరించే దుస్తులు ఎన్నో వేల సంవత్సరాలుగా ఈవాతావరణానికి తగినట్లుగా ప్రజలు అనుసరించినవి... మన అవసరార్ధం కాస్తో కూస్తో వారిని అనుసరించినా మన సంప్రదాయాన్ని మరచిపోకూడదు.
...మాలాంటివాళ్ళకు నువ్వే ఆదర్శంసిరీ ...మారిన నీ దుస్తులూ ఆలోచనలూ నన్ను అయోమయానికి గురిచేస్తున్నాయ్!!!. మనంనేర్చుకున్న చదువు మనలో సంస్కారం పెంపొందించాలి. మనమూ మనతోటి మన సమాజం ఆఫలాలు అనుభవించాలి.... నీనుంచి ఇలాంటి అనాలోచిత చర్య నేను ఊహించలేకపోతున్నా.!!!నీకు ఇలాంటి ఆలోచన వున్నదని తెలిసినా అయ్యగారు తట్టుకోలేరు. ఆ మహానుభావుని దయవల్లనేను విదేశాలకు వెళ్ళి చదువుకోగలిగాను. ఆయనకు ఏవిధంగాను కష్టం కలిగించలేను.... మనంవిద్యా వంతులం. వివేకం కలిగినవాళ్ళం అలా ప్రవర్తించవచ్చా ??తప్పుకదూ ??నామీద కోపంతెచ్చుకోకు ప్రశాంతం గా ఆలోచించు.... ఒక చిన్ననాటి స్నేహితునిగా ఇది నా సలహామాత్రమేకాదు ...అభ్యర్ధన కుడా ...నువ్వు చాలా మంచి అమ్మాయివి సిరీ!!! నేను చెప్పిన వి ఇంటికి వెళ్ళి ఒకసారి పునరాలోచించు. నీమనసునొప్పిస్తే ...నన్ను మన్నించు సిరీ "...అంటూఆశ్చర్యంగా నిర్ఘాంతపోయి షాక్ కి గురయినట్లుగా స్థాణువులా వున్న సిరి చేతిలో నుండి జారిపోయిఆమె పాదాల చెంత పడిపోయిన కలువపూలను ఏరి భద్రంగా ఆమెచేతికి అందించి,వెనుదిరిగాడు సింగడు.... అక్కడే కూలబడి జరిగిన సంఘటన తలుచుంటూ విలపించ సాగిందిసిరి .కాసేపటికి దుఃఖం నించి బయటపడి, మనసు కుదుట పరచుకొని ఎవరూచూడలేదు కదా !!? అనుకొంటూ భారం గా ఇల్లు చేరింది సిరి. కానీ ...చూడవలసినవారే చూశారనీ ,తనతండ్రితనప్రవర్తనను గమనించి గుడికి వచ్చాడని ,తమ సంభాషణ మొత్తం విన్నాడని ....సింగడివ్యక్తిత్వానికి మనసులోనే శతకోటి వందనాలు అర్పించాడనీ ...తెలియదు సిరికి.

చదువూ సంస్కారం కలిగిన పిల్ల కనుక ...కొంత మధనపడినా ,తను చేసిన తప్పేమిటోతెలిసింది సిరికి .మూడురోజుల తరువాత తండ్రి దగ్గరకు వచ్చి ..." మీరు చెప్పిన అన్నవరంసంబంధం నాకు ఇష్టమే నాన్నగారూ "...అంది తలవంచుకొని. శాస్రి గారు ఆప్యాయంగా కూతురితల నిమురుతూ.." వద్దులే తల్లీ ...నువ్వు చదువుకున్న దానివి నెనే సరైన ఆలోచన లేకుండా ఆసంబంధం చుశాను. మామయ్య నీకు వేరే సంబంధం తెచ్చాడు. అతని పేరు శశాంక్. ఆఅబ్బాయికి బెంగుళూరులో వుద్యోగం. ప్రస్తుతం రెండేళ్ళపాటు అమెరికాలో వుంటాడు. ఇప్పుడుఇక్కడే హైదరాబాదులో వున్నాడు. నువ్వు సరే అంటే ఎల్లుండే పెళ్ళిచూపులు ఏర్పాటు చేస్తాను"అన్నారు. తలవంచి" మీ ఇష్టం నాన్నగారూ "....అంది సిరి. పెళ్ళిచూపులు జరిగాయి. ఇద్దరూ ఈడూజోడు గా వున్నారని అందరూ మెచ్చుకున్నారు. ఇద్దరూ ఒకరికొకరు నచ్చటం తో ఒక వారంలోనే తాంబూలాలు మార్చుకోవాలని నిర్ణయించుకున్నారు.
రెండునెల్లల తరువాత ముహూర్తంకుదిరింది. నిశ్చితార్ధానికి కి కూడా ఘనంగా ఏర్పాట్లు చెసారు శాస్త్రి గారు. పూజా కార్యక్రమం,తాంబూలాలు మార్చుకోవటం అయిపోయాక ,ఇద్దరినీ వెదిక మీద కూర్చోపెట్టారు. అందరూ ఆఇద్దరితో సరదాగా ఫొటోలు తీయించుకొని భోజనాలకి వెళ్ళుతున్నారు. శాస్త్రి గారి ఆహ్వా

నం మేరకిసింగడు కూడా తండ్రిని తీసుకొని ఫంక్షన్ కి వచ్చాడు. చేతిలో ని కలువపూల గుత్తిని ఇద్దరికీఅందిస్తూ .."కంగ్రాచ్యులేషన్స్ సిరీ మీ ఇద్దరికీ ..."అంటూ మనఃస్ఫూర్తిగా నవ్వాడు. సిరి కూడాఆప్యాయం గా పూలగుత్తి అందుకొని ,"శశాంక్ !!ఇతను నాస్నేహితుడు సింగ ..చిన్నతనం నించీకలిసి చదువుకున్నాం "అంటూ పరిచయం చేసింది కాబోయే భర్తకు. ఫొటో తరువాత భోజనానికివెళ్ళాడు సింగడు. ఆ కలువ పూలని భద్రంగా వాజ్ లో సర్దుతున్న సిరిని చూస్తూ .."ఏమిటి సిరీ...?ఆపూలు అంటే నీకు ఇష్టమా ??అడిగాడు శశాంక్. "అవును చాలా ...ముఖ్యంగా వీటి పరిమళం..."చెప్పింది సిరి.

"హే !!!!అమెరికాలో మనింటి దగ్గరి పాండ్ లో చాలా పూస్తాయ్ ఇవి. నీకుకావలసినన్ని ..."హుషారుగా చెబుతున్నాడు శశాంక్.

"నిజంగానా !!'అయితే నేను ఇప్పుడే వచ్చేస్తా...!!మీతో అమెరికా "...నవ్వుతూ జవాబిస్తోంది సిరి. వారిద్దరినీ చూస్తున్న శాస్త్రి గారి కళ్ళలో ఆనందభాష్పాలు కురిసాయి.... "సిరి అదృష్ట వంతురాలు!!!ఆ భగవంతుని దయవల్ల తను కోరుకున్నజీవితం ఆమెకు లభించబోతోంది.

సిరి సంస్కారం ,వివేకం కలిగిన అమ్మాయి స్నేహితుల ప్రభావం వల్ల పరిస్థితుల ప్రభావం వల్లఆమె కొద్దిగా తడబడి ఉండొచ్చుగాక.... కానీ ఆ తడబాటును సర్దుకొని జీవితాన్ని చక్కని దారిలోకి మళ్ళించుకుంది. ఇంక తనకు భయం లేదు.

...ఆమె ఎక్కడవున్నాఏదేశంలోవున్నా తనసంస్కృతి నీ సంప్రదాయాన్నీ మరువదు.... అవసరార్థం ఆహార్యం మారినా మనసులోనిభారతీయత పోదు... మంచి స్నేహితునిగా ఆమె కళ్ళు తెరిపించిన సింగడు అభినందనీయుడు....అతనికి తను చేసిన సహాయానికి తగిన ఋణం తీర్చుకున్నాడు.

...ఆ శంకరుని దయ వల్ల ఈరోజు ఇంత సంతోషం గా వున్నాడు తను ...శంకరా ...!!తండ్రీ ..!!"అంటూ భగవంతునికిమనస్సులోనే నమస్కరించారు శాస్త్రి గారు... ఆనందంతో అందరూ భోజనాలకు వుపక్రమించారు. ఆ వేజ్ లోని పూలు మాత్రం అద్భుతమైన పరిమళాలు వెదజల్లుతునే వున్నాయ్!!!. సింగడివ్యక్తిత్వం లాగా ,...అతని స్నేహం లాగా .

# ద్వితీయ వలయం

డా.కొండపల్లి రామారావు

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"**ఏమంటున్నారు** నాన్నగారు?" నెమ్మదిగా నందూను అడిగాడు పార్థు.

"ఏమో, ఎటూ తేల్చటంలేదు" చుట్టుపక్కల చూస్తూ లోగొంతుతో అన్నాడు నందు.

కిటికీలోంచి బయటకు చూసిన వారిద్దరికీ యింటిముందున్న వేపచెట్టు కింద వాలు కుర్చీలో పడుకుని ఆ రోజు వార్తాపత్రిక చూస్తున్న మాధవరావుగారు కనిపించారు.

వేసవికాలం సాయంత్రం 5 గంటలు. అప్పుడే చల్లబడుతున్న గాలిని అనుభవిస్తూ ప్రశాంతంగా తన లోకంలో ఉన్నారాయన.

"అసలు ఆ మనిషిని చూడు, నిమ్మకు నీరెత్తినట్లు ఎట్లా కూర్చున్నారో!" ఉక్రోషంతో అన్నాడు నందు.

"ఆగాగు, మనం వెళ్ళే లోపల ఏదో ఒకటి తేల్చుకునే వెళ్దాం. నీవు తొందరపడకు" తమ్ముడి భుజం మీద చేయివేసి అన్నాడు పార్థు.

"ఏమిటి, మనమనుకున్న దానిగురించి ఏమాలోచించారు?" అప్పుడే అక్కడికి వచ్చిన పార్థు భార్య మనూ అడిగింది.

"అన్నయ్యేం ఆలోచిస్తాడు, ఆ పెద్దాయన నోరే విప్పకపోతే" విసుగ్గా అన్నాడు నందు.

"అంటే అట్లా వదిలేయడమేనా? మీరిద్దరూ గట్టిగా మాట్లాడితే ఆయనే దారికి వస్తారు" కోపంగా అంది నందూ భార్య రేణు, అప్పుడే అక్కడికి వస్తూ.

నలుగురూ ఓసారి మాధవరావుగారివైపు విసుగ్గా చూశారు.

అసలు విషయంలోకి వెళితే, మాధవరావుగారు గవర్నమెంట్ కాలేజీ లెక్చరర్‌గా పనిచేసి రిటైరైనారు. ఆయన భార్య అరుంధతి, పిల్లలు యిద్దరు - పార్థు, నందు. తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తిపాస్తులు ఏమీ లేనందువల్ల, అందరూ సాధారణ మధ్య తరగతి కుటుంబీకుల వలనే చాలా కష్టపడి పిల్లల్ని పెంచి పెద్ద చేశారు, భార్యాభర్తలు. ఉద్యోగంలో చేరిన వెంటనే సహోద్యోగులతో కలిసి ఊరికి కొంత దూరంలో ఓ 500 గజాల స్థలం కొని వాయిదాల పద్ధతిలో అప్పు తీర్చారు. ఆ తీసుకున్న అప్పు, కొంత పొదుపు చేసిన డబ్బుతో మొత్తం మీద యింకో 4 -5 ఏళ్ళలో మాధవరావుగారు రిటైరౌతారనే సమయానికి ఓ మూడు పడకగదుల యిల్లు కట్టుకున్నారు.

ఎంత గవర్నమెంట్ కాలేజీ ఉద్యోగం అయినా, ఆ ఊరికి దగ్గరలో ఉన్న ఊళ్ళకే, అదీ తాత్కాలికంగా, ట్రాన్స్‌ఫర్ అయినందువలనా, ఎక్కువకాలం ఉన్న ఊళ్ళోనే ఉండటం వలనా, సొంతయిల్లు కట్టుకుని అందులో ఉండే సంతృప్తిని పూర్తిగా అనుభవిస్తున్నారు ఆ దంపతులిద్దరూ.

మాధవరావుగారు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు కాబట్టి, అరుంధతి ఉద్యోగస్తురాలు కాకపోయినా, డిగ్రీ వరకు చదువుకుని లోకజ్ఞానం ఉన్న యిల్లాలు కాబట్టి, పిల్లలిద్దర్నీ జాగ్రత్తగా చదివించి పెద్ద చేశారు. కొడుకులిద్దరూ సిటీలో ఒకరు సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా మరొకరు హెచ్ఆర్ మేనేజర్‌గా మంచి ఉద్యోగాలే సంపాదించుకున్నారు. మొదటినుంచీ తనకంటూ కొన్ని ఆదర్శాలు పెట్టుకుని జీవించటం అలవాటు అయిన మాధవరావుగారు కొడుకులిద్దరికీ కట్నం తీసుకోకుండా సాంప్రదాయ పద్ధతిలో వివాహం జరిపించారు. కొడుకులు పట్నంలో ఉంటుంటే, తనూ, తన భార్య, ఉన్న ఊళ్ళో సొంతింట్లో తనకు వచ్చే పెన్షన్‌తో ప్రశాంతంగా జీవిస్తున్నారాయన.

అయితే యిప్పుడు 65 ఏళ్ళ వయసులో ఉన్న మాధవరావుగారికి చాలామంది తల్లిదండ్రులకు వచ్చే సమస్యే వచ్చింది. నిజానికి ఆ సమస్య ఆయనదికాదు. ఆయన కొడుకులది. సిటీలో ధరలు త్వరత్వరగా పెరిగిపోతున్నాయనీ, తొందరలో చెరో యిల్లో, అపార్ట్‌మెంట్ అమర్చుకోకపోతే తరువాత కాలంలో అది అసాధ్యమవుతుందనీ ఆయన కొడుకులిద్దరి ఉద్దేశ్యం. మాధవరావుగారు కట్టిన యిల్లు అప్పట్లో ఊరు చివర అనిపించినా, భారతదేశంలో ప్రతి ఊరూ పెరిగినట్లుగానే యీ 30 ఏళ్ళలో ఊరు బాగా పెరిగి, ఆయన కట్టిన యింటి చుట్టూ పెద్ద సెంటర్ అయింది. అందుకు తగ్గట్టుగానే యింటి ధర - ముఖ్యంగా స్థలం ధర వల్ల - బాగా పెరిగిపోయింది.

ఇప్పుడు యీ యిల్లు అమ్మేసి, ఆ డబ్బు యిద్దరికీ చెరి సగం యిస్తే, వాళ్ళ యింటి కొనుగోలు సమస్య తీరుతుందని పార్థూ, నందూల ఉద్దేశ్యం. భార్యాభర్తలిద్దరూ ఏడాదికి ఆర్నెల్లు ఒక కొడుకు దగ్గర, యింకో ఆర్నెల్లు రెండో కొడుకు దగ్గర ఉండవచ్చు. ఇది ఉభయత్రాలాభం కాబట్టి, కొడుకులిద్దరూ తండ్రికి యీ ప్రతిపాదన చేశారు.

విని ఏమీ జవాబివ్వకుండా నిశ్శబ్దంగా ఉండిపోయారు మాధవరావుగారు. అందుకే యిప్పుడు ఆ కొడుకులు, కోడళ్ళు గింజుకోవటం. అంత లాభసాటి ప్రతిపాదన విషయంలో తండ్రికి అంత ఆలోచన ఎందుకో వాళ్ళకు అర్థంకావటంలేదు.

ఇంకో రెండు రోజులు గడిచాయి. కొడుకులిద్దరూ ఆ మర్నాడే వెళ్ళిపోవాలి.

ఇక ఊరుకోలేక ఆ రోజు మధ్యాహ్నం భోజనాల దగ్గర సంభాషణకు తెరతీశాడు పార్థు "ఏమిటి నాన్నా మేము చెప్పినదానికి మీరు జవాబేమీ యివ్వలేదు. మా ప్రయాణం రేపే!" ప్రశ్నార్థకంగా చూశాడు తండ్రివైపు.

ఓ క్షణం మౌనంగా ఉన్న మాధవరావుగారు నోరు విప్పారు. "అది యిప్పుడంత అవసరమా?"

"అవసరమా అంటే అవసరమే మరి. రానురానూ సిటీలో యిండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నవి. ముందు ముందు కొనటం అసాధ్యం" నందూ అన్నాడు.

"అది నిజమేననుకో. సిటీకి కొద్దిదూరంలో ఏవైనా స్థలాలు అమ్ముతుంటే చూసుకుని వాయిదాల పద్ధతిలో కొనండి. ఎప్పుడైనా ఎక్కువగా పెరిగేది స్థలం ధరే. నిర్మాణం ఖర్చు పెరిగినా అంతగా పెరగదు. మీరు ఒకసారి స్థలం కొని సొంతం చేసుకుంటే ఓ నాలుగైదేళ్ళ తరువాత నెమ్మదిగా ఏ బ్యాంకు నుంచో అప్పు తీసుకుని యిల్లు కట్టుకోవచ్చు" నింపాదిగా అన్నారు మాధవరావుగారు.

"నాన్నా! ఇవి మీరోజులు కావు. నెమ్మదిగా జాగా కొని తీరికగా యిల్లు కట్టుకోవటానికి. పైగా అది చాలా పెద్ద తలనొప్పి. ఎంతో మంది బిల్డర్లు వాళ్ళే యిళ్ళు కానీ, అపార్ట్‌మెంట్లు కానీ కట్టి అమ్ముతున్నారు. వాళ్ళ దగ్గర కొనుక్కోవటం తేలిక. కాకపోతే మొదలు యివ్వవలసిన డబ్బు మొత్తం ఎక్కువగా ఉంటుంది" కొద్దిగా గట్టిగానే అన్నాడు పార్థు.

"అంత తొందర పడితే ఎట్లా? ఇప్పుడు మీకు ఏం వయసు మించిపోయిందని. ఇద్దరూ ముప్పైలలో ఉన్నారు. స్థలం కొని నెమ్మదిగా యిల్లు కట్టుకోవటానికి గానీ, లేక తరువాత ఆ స్థలం అమ్ముకుని ఒక అపార్ట్‌మెంట్ కొనుక్కోవటానికి గానీ చాలా సమయముంది" స్పష్టం చేశారు మాధవరావుగారు.

"అట్లా చేస్తే మీలాగా జీవిత చరమాంకంలో యిల్లు అమరుతుంది. ఇంకా మేము అనుభవించేదెప్పుడు?" దూకుడుగా అంది రేణు.

ఓ సారి తలెత్తి చిన్న కోడలివైపు చూశారు మాధవరావుగారు.

"అంటే మేము యింకా ఎంతో కాలం బతకమని నీ ఉద్దేశ్యమా?" ప్రశ్నించారు కోడల్ని.

ఒక్కసారిగా ఖంగుతింది ఆమె. "అంటే నా ఉద్దేశ్యం అదికాదు. మేము సొంత యింట్లో ఎక్కువకాలం ఉండలేమని.." మెల్లగా నసిగింది రేణు.

"అదంతా అప్రస్తుతం నాన్నా! మన సొంత యింట్లో మనం ఉండాలని అనుకోవటం తప్పా? దానికోసం ఆలోచించటం తప్పా?" గొంతెత్తాడు నందు.

"అని నేననలేదే! దానికి చాలా మార్గాలున్నాయంటున్నాను. పైగా యిప్పుడు మీరు రోడ్డు మీద లేరుగా!" మెల్లగా అన్నారు మాధవరావుగారు.

"ఇక అదొక్కటే తక్కువ. అంటే మీలాగా అద్దె యిళ్ళలో ఉంటూ యిటుక యిటుక పేర్చుకుంటూ జీవితమంతా సొంతింటి కలను సాకారం చేసుకోవటానికి కష్టపడమంటారు మీరు. అంతేగా?" పార్థు భార్య మనూ రెట్టించి అడిగింది.

"అవును. మేము అట్లా చేసి కట్టుకున్నదేగా యీ యిల్లు. మీరు కూడా అట్లానే చేయటంలో తప్పేమీలేదే?" తగినట్లుగానే జవాబిచ్చారు మాధవరావుగారు.

"నాన్నా! మీకంటే వేరే మార్గం లేక అట్లా చేశారు. ఇప్పుడు మనకు బంగారంలాంటి స్థలం, యిల్లు ఉన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధర కంటే యింకా ఎక్కువ ధర దీనికెలాగూ రాదు. ఎప్పటికైనా అమ్మా, మీరు మా దగ్గరికి వచ్చి ఉండవలసిన వాళ్ళేకదా! మీ కోసం నేనూ, తమ్ముడూ మేము కొనబోయే ఇంట్లో అన్ని వసతులతో ఒక పడకగది ఏర్పాటు చేస్తాము. మీరు యింకా సంతోషంగా ఉండవచ్చు" సముదాయింపుగా అన్నాడు పార్థు.

"అదే నేనూ చెప్పేది. బంగారంలాంటి స్థలం, యిల్లు అమ్మడం మూర్ఖత్వం. మేము మీ దగ్గరకు రావలసివచ్చినప్పుడు ఆలోచిద్దాం. నేనూ, మీ అమ్మా మేము కలలు కని కట్టుకున్న యింట్లో కంటే యింకెక్కడో ఎక్కువ సంతోషంగా ఉండవచ్చు" సముదాయింపుగా అన్నాడు పార్థు.

"అదే నేనూ చెప్పేది. బంగారంలాంటి స్థలం, యిల్లు అమ్మడం మూర్ఖత్వం. మేము మీ దగ్గరకు రావలసి వచ్చినప్పుడు ఆలోచిద్దాం. నేనూ, మీ అమ్మా మేము కలలు కని కట్టుకున్న యింట్లో కంటే యింకెక్కడో ఎక్కువ సంతోషంగా ఉండగలుగుతామనుకోను. నేను కాసేపు విశ్రాంతి తీసుకోవాలి. ఇక వెళ్తాను" భోజనం పూర్తిచేసి, చెయ్యి కడుక్కుని యిక తను చెప్పేదేమీ లేదన్నట్లు, ఆరుబయట వేపచెట్టు నీడలో ఉన్న మడతమంచం మీదకు చేరుకున్నారు మాధవరావుగారు.

"ఊ! ఈయనగారు కాలూచేయి పడిపోయి వృద్ధాప్యంలో మన దగ్గరకు వస్తే చేసి పెట్టటానికి మాత్రం మనం కావాలి. ఇప్పుడు మాత్రం మనం అడిగింది చేయరట" కోపంగా సణుక్కుంది రేణు.

ఇక తమవల్ల పని కాదనుకున్న నందూ, పార్థులిద్దరూ తల్లి దగ్గరకు చేరి పోరాటం ప్రారంభించారు.

"అమ్మా! నీవైనా చెప్పు పెద్దాయనకు. ఆయనకు మేము చెప్తుంటే అర్థం కావటంలేదు. ఇల్లు అమ్మిన డబ్బు మేమేమీ పాడు చేస్తామనటం లేదు కదా! మీరూ మా దగ్గరకు వచ్చే వాళ్ళే కదా! ఆలశ్యం చేసిన కొద్దీ, యీ స్థలానికి ధర పెరగకపోగా సిటీలో రేట్లు బాగా పెరిగిపోతాయి. అప్పుడు మనమేమీ చేయలేము" పార్థూ అన్నాడు.

"అసలు ఆయనకు చెప్పేవాళ్ళు ఎవరూ లేక అట్లా తయారయ్యారు. ఏమైనా చెప్పగలిగితే నీకే చెప్పాలి. నీవు తెలివైనదానివి. నీ తెలివంతా ఉపయోగించి మా పని అయ్యేట్లు చూడమ్మా. నీవు మాత్రమే ఆయన్ను లొంగదీయగలవు." తల్లిని ఒప్పించటానికి ప్రయత్నించాడు నందు.

"సరే, చెప్పి చూస్తాను" ఈ విషయంలో అటూ యిటూ ఊగుతూ తటస్థంగా ఉన్న అరుంధతి అంది.

"మీరు యీ రోజే యీ విషయం గట్టిగా మాట్లాడి ఒప్పించాలి అత్తయ్యా!" అంది మనూ.

"ఆయనకు కోపం వస్తుందేమోనని ఏ మాత్రం జంకవద్దు అత్తయ్యా! భార్యలు గట్టిగా మాట్లాడితే భర్తలు వాళ్ళే వింటారు "స్వానుభవంతో అన్నట్లుగా అంది రేణు.

కాసేపు మధ్యాహ్నం కునుకు అయిన తరువాత, ముఖం కడుక్కుని వచ్చి, ఓ వాలుకుర్చీలో వార్తా పత్రిక చూస్తూ కూర్చున్న మాధవరావుగారికి కాఫీ కప్పు అందించి అతని పక్కనే నిల్చుంది అరుంధతి.

'ఏమిటన్నట్లు' చూశారు మాధవరావుగారు.

"పిల్లలు చదువుకున్నవాళ్ళు. బుద్ధిమంతులు. ఇల్లు అమ్మితే వచ్చే డబ్బు పాడు చేస్తారన్న భయంలేదు కదా! ఈ విషయంలో మీరు మళ్ళీ ఆలోచిస్తే మంచిదేమో?" నెమ్మదిగా అంది అరుంధతి సామోపాయం ఉపయోగిస్తూ.

క్రీగంట ఆమె వైపు చూశారు మాధవరావుగారు. అదే సమయంలో లోపలి గదుల్లోంచి తొంగి తొంగి చూస్తున్న కొడుకులు, కోడళ్ళను ఆయన గమనించక పోలేదు.

"వాళ్ళు బుద్ధిమంతులు కారని నేననలేదు. డబ్బు పాడుచేస్తారనీ భయంలేదు. కాకపోతే యిప్పుడంత అర్జంటుగా ఆ పని చేయవలసిన అవసరం లేదని మాత్రమే అంటున్నాను" కాఫీ త్రాగుతూ జవాబు చెప్పారాయన.

"మనకున్నది వాళ్ళిద్దరే. ఎప్పటికైనా వాళ్ళకిచ్చేదా కదా! వాళ్ళకు మనం, మనకు వాళ్ళు. వాళ్ళు సంతోషంగా ఉండటమే కదా మనకు కావలసింది. ఇప్పుడు వాళ్ళు అడిగింది యిస్తే మనకూ నిశ్చింతగా ఉంటుంది. భవిష్యత్తులో వయసు మళ్ళిన తరువాత వాళ్ళదగ్గర ఉండటానికి మనకూ మొక్కసంగా ఉండదు." దానోపాయం ప్రయోగించింది అరుంధతి.

"నీవనేదానిని దేనినీ నేను కాదనటంలేదు. వాళ్ళు యిప్పుడిప్పుడే జీవితంలోకి అడుగుపెడుతున్నారు. మొదట్లో కొన్నాళ్ళు యిబ్బందులు తప్పవు. తప్పని సరై అవసరమొచ్చినప్పుడు సాయం చేయటానికి ఎట్లాగూ మనం ఉన్నాం కదా! ఇప్పుడే అంత తొందరెందుకు?" కాఫీ కప్పు అందిస్తూ అన్నారు మాధవరావుగారు.

"వాళ్ళు యిప్పుడయితేనే అన్నివిధాలా లాభమంటున్నారు. పైగా.." కొద్దిగా గొంతు తగ్గించింది అరుంధతి." అనుభవరాహిత్యంతో వాళ్ళు చెప్పేది తప్పేకావచ్చు. అన్నీ తెలిసిన మీరు చెప్పేదే సరియైన ఆలోచన కావచ్చు. మీమీద నాకు ఆ నమ్మకం ఉంది. కానీ, మనం యిప్పుడు వాళ్ళు అడిగింది చేయకపోతే వాళ్ళు నలుగురూ ఒకటై మనల్ని వేరు చేస్తారు. తరువాత, మన విషయంలో వాళ్ళు బాధ్యత తీసుకోకపోవచ్చు. అందువల్ల చివరకు నష్టపోయేది మనమే. ఇప్పుడు వాళ్ళు చెప్పింది చేస్తే ఒకళ్ళు కాకపోతే యింకొకళ్ళయినా మన బాగోగులు చూసే అవకాశం ఉంటుంది కదా!" భేదోపాయం ధ్వనించింది అరుంధతి కంఠంలో.

చివుక్కున తలెత్తారు మాధవరావుగారు. "అంటే మన పిల్లలతో మన బంధాలు, అనుబంధాలు యీ యిల్లు అమ్మి వాళ్ళకు డబ్బివ్వటంతోటే ముడిపడి ఉన్నాయా?" కొద్దిగా గొంతు పెంచి అన్నారాయన.

"మీరు ప్రతిదానికీ ఏదో ఒకటి చెప్తున్నారు. మరి వాళ్ళు నన్ను కొన్నాళ్ళు వాళ్ళతో ఉండటానికి రమ్మంటున్నారు. నేను వెళ్తాను. మీరు యిల్లు చూసుకుంటూ యిక్కడే ఉంటారో, యిల్లు అమ్మి నాతో వాళ్ళ దగ్గరకు వస్తారో నిర్ణయించుకోండి" దండోపాయాన్ని ప్రయోగించి గిరుక్కున వెనక్కు తిరిగింది అరుంధతి.

చటుక్కున ఆమె చేయి పట్టుకుని ఆపుచేశారు మాధవరావుగారు. ఒక క్షణం అట్లాగే మౌనంగా ఉండి మొదలుపెట్టారు.

"చూడు అరుంధతీ! పిల్లల మీద తల్లులకు ప్రేమ ఉండటం సహజం. అందుకే వాళ్ళు అనుకున్నది సాధించుకోవటానికి నిన్ను అడ్డుపెట్టుకుంటున్నారు. మన జీవితం ఎట్లా మొదలైందో, ఎట్లా సాగిందో అంతా నీకు బాగా తెలుసు. మా నాన్నగారు నాకు ఏమి ఆస్తి యివ్వకపోయినా, మన రెక్కల కష్టంతో యిద్దరమూ వాళ్ళను పెంచి పెద్ద చేశాము. ఈ యిల్లు అమర్చుకున్నాం. మన పెళ్ళయిన దగ్గర్నుంచీ సుమారు ఓ ఇరవయ్యేళ్ళు 'ఎటువంటి యిల్లు కట్టుకోవాలి' అన్న విషయం మీద రకరకాల ప్లాన్లు వేసుకుంటూ గడిపాము. చివరకు యీ యిల్లు కట్టుకుని పదేళ్ళు కూడా కాలేదు. ఇప్పుడు యిది ఎదురుగా కనబడుతున్నది కాబట్టి, వాళ్ళ సమస్యకు తేలికైన పరిష్కారం చూసుకుంటున్నారు వాళ్ళు.

"నీవు అంత గట్టిగా చెప్పావు కాబట్టి, యిప్పుడు నేను చెప్పేది కూడా విను. ప్రతి మనిషీ యీ లోకంలోకి వచ్చినప్పుడు ఒంటరిగా వస్తాడు. వెళ్ళేటప్పుడు ఒంటరిగానే వెళ్తాడు. మధ్యలో, యీలోకంలో బతికిన నాలుగురోజులూ ఎన్నో బంధాలు, అనుబంధాలు పెంచుకుంటాడు.

"అయితే, ఎన్ని బంధాలు పెంచుకున్నా ప్రతిమనిషీ ఎప్పుడూ ఒంటరి పక్షే. అంటే ఒక విధంగా చెప్పాలంటే, మనుషులు తమ చుట్టూ ఒకే కేంద్ర బిందువుతో ఎన్నో వలయాలు గీసుకుంటారు. తమకు తెలియకుండానే మొట్టమొదటి వలయంలో తాము ఒక్కరే ఉంటారు. వేరెవ్వరికీ చోటు యివ్వరు.

"ఆ ప్రథమ వలయాన్ని చాలా పెద్ద వ్యాసార్ధంతో గీసుకుని అటు తరువాతి వలయాలన్నీ కొద్ది తేడాతో గీసుకునే స్వార్ధపరులు ఉండవచ్చు. అంటే వీరికి వీరే ముఖ్యం. లోకంతో పనిలేదు. వాళ్ళ దృష్టిలో మిగతావారంతా ఒకటే. వేరెవరి గురించి ఆలోచించరు.

"ప్రథమ వలయాన్ని అతి చిన్న వ్యాసార్ధంతో గీసుకుని తరువాతి వలయాలన్నీ చాలా పెద్దగా గీసుకుని వాటిలో చాలా మందికి చోటు యిచ్చే నిస్వార్థపరులు ఉండవచ్చు. అంటే వీరు యితరుల గురించి కూడా కొంతవరకు ఆలోచిస్తారు.

"ఏది ఏమైనా ప్రథమ వలయంలో మాత్రం ప్రతి మనిషీ ఒంటరే. అంటే ప్రతివారూ తమకు తాము యిచ్చినంత ప్రాధాన్యత వేరెవ్వరికీ యివ్వరు. ఇది పచ్చి నిజం.

"ఇక అటు తరువాతి వలయాల్లో, 'ఎందులో ఎవరు ఉంటారు' అన్నది చాలావాటి మీద ఆధారపడి ఉంటుంది. ముఖ్యంగా తమ చుట్టూ ఉన్న ద్వితీయ వలయంలో, ఒక వయసులో తల్లి, తండ్రి ఉండవచ్చు. తరువాత తోడబుట్టిన వాళ్ళు ఉండవచ్చు. ఇంకో వయసులో స్నేహితులు ఉండవచ్చు. మరొక వయసులో కట్టుకున్నవాళ్ళు ఉండవచ్చు. మరింకో వయసులో పిల్లలుండవచ్చు. ఇదంతా వారి వారి వయసులమీదా, వారి వారి మనస్తత్వాలమీదా, పరిస్థితుల ప్రభావం మీదా ఆధారపడి ఉంటుంది. ఇచ్చే ప్రాధాన్యతని బట్టి ఆ వ్యాసాల నిడివి కూడా మారవచ్చు.

"నేను ఒక మామూలు మనిషిని. అందుకే ఓ సగటు వ్యాసార్ధంతో గీసిన ప్రథమ వలయంలో నేను ఒక్కడ్నే ఉన్నాను. వేరెవరికీ అందులో చోటులేదు. దానికి పెద్దగా తేడాలేని వ్యాసార్ధంతో గీసిన ద్వితీయ వలయంలో ప్రస్తుతం నీవు మాత్రమే ఉన్నావు. మన పిల్లలకు కూడా అందులో చోటులేదు.

"ప్రథమ వలయంలో ఉన్నది నేను ఒక్కణ్ణే కాబట్టి, నాకు నచ్చని పని నేనే మాత్రం చేయను. బతికినన్నాళ్ళూ యిట్లా నేను కట్టుకున్న యింట్లో ప్రశాంతంగా బతకటమే నాకు యిష్టం. మన పిల్లలతో మనకెంత అనుబంధమున్నదో యీ యింటితో మనకంత అనుబంధమూ ఉంది. అయితే రెక్కలొచ్చి ఎగిరిపోయిన పిల్లల్నుకాక, యీ వయసులో మనకు నీడనిచ్చే యీ యింటిని ఎక్కువగా ప్రేమించటం సహజమే' అని నా ఉద్దేశ్యం.

'ప్రాణం ఉన్న మనుషుల మీద కంటే, ప్రాణం లేని యీ యింటిమీద అంత ప్రేమా' అనిపించవచ్చు. కానీ భవిష్యత్తులో యిక సాధించేదేమీ లేనప్పుడు, వర్తమానంలో సంతోషంగా ఉండాలంటే మనిషికి గతస్మృతులే ఆధారం. ఈ యింట్లో ప్రతి యిటుకతో, ప్రతి కిటికీతో మనకు అనుబంధముంది. ప్రతి గదికో కథ ఉంది. వాళ్ళన్నట్లు యీ యింటిని మనం యిటుక యిటుక పేర్చుకుంటూనే కట్టుకున్నాము. ఇది ఎన్ని ఏళ్ళు మనం కన్న కల. ఈ యింటి గోడలను తడిపినవి మన చేతులు. ఈ యింటి మూలమూలలా తడిమినవి మన చేతులు. నేలమీద ఏ రాయి వేయాలో, గోడకు ఏ రంగు వేయాలో ఎన్నో రోజులు, వారాలు ఆలోచించి నిర్ణయించుకున్నాం. కాబట్టి, మన పిల్లలు అడుగుతున్నారని గానీ, అందుకు నీవుకూడా వంత పాడుతున్నావనిగానీ నాకిష్టం లేని పనిచేయను.

"ఏది ఏమైనా నీవు నా భార్యవు. నా ద్వితీయ వలయంలో నీవున్నావు అంటే నా తరువాత - నా తరువాత మాత్రమే - నేను ఆలోచించేది నీ గురించే. నా అభిప్రాయాలు, నానమ్మకాలు, నా జీవనసూత్రాలకు భంగం కలగనంతవరకూ నేను వినేది నీ మాట మాత్రమే.

"దీనికి స్వార్థం' అని పేరు పెట్టవచ్చు. 'అహం' అని నిందిస్తే నిందించవచ్చు. కానీ యీ విషయంలో నాకు నిశ్చితమైన, నిర్దుష్టమైన అభిప్రాయం ఉంది.

"అయితే నీ ద్వితీయ వలయంలో నేను ఉండవలసిన అవసరంలేదు. నీకు అందులో నీ పిల్లలు ఉండవచ్చు. నీ మనోభావాలు నేను గౌరవిస్తాను. నీవు వాళ్ళకు ప్రాధాన్యత యిచ్చి వాళ్ళ దగ్గరకు వెళ్తానంటే నేను కాదనను. అది నీ యిష్టం. కాబట్టి నీవు తీరిగ్గా ఆలోచించుకో! నీ ద్వితీయ వలయంలో ఎవరున్నారో తేల్చుకుని వాళ్ళకు అనుగుణంగా నీ నిర్ణయం తీసుకో."

తను చెప్పేది యింకేమీ లేదన్నట్లు కళ్ళు మూసుకుని కూర్చున్న భర్తను చూస్తూ, తన ద్వితీయ వలయంలో ఎవరున్నారో, ఎవరి నుంచాలో అన్న ఆలోచనలో పడ్డ అరుంధతిని చూస్తూ మాటరాక నిలబడిపోయారు వారి కొడుకులూ, కోడళ్ళూ.

## అంతర్మథనం - తాళ్ళూరి చంద్రశేఖర్

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

**బాధ.. చెప్పుకోలేనంత** బాధ.. గుండెల్ని పిండేస్తున్న బాధ. మెదడు నరాలు చిట్లిపోతాయేమోనన్నంత బాధ. గుండెంతా బరువైపోయి ఏ క్షణాన్నైనా ఆగిపోతుందేమోనన్నంత బాధ. ఎవరితోనూ పంచుకోలేనంత బాధ. ఎవరికి చెప్పుకున్నా తనకి ఓదార్పు తప్ప కావల్సిన సాంత్వనని చేకూర్చలేరు. తన నిర్ణయం సరైనదేనని భరోసా ఇవ్వలేరు.

ఈ క్లిష్ట సమయంలో తన బాధ్యతలో పాలుపంచుకునే పెద్ద దిక్కెవరైనా ఉంటే ఎంత బాగుండును. ఉన్న చెల్లెలూ, తమ్ముడూ కూడా తనకంటే చాలా చిన్నవారు. తనమాటే వాళ్ళకి వేదం. తనేది చెప్పినా ఎదురు చెప్పరు. వచ్చిన చిక్కల్లా తనకే అగమ్యగోచరంగా ఉంది. తన నిర్ణయం సరైనదా కాదా అన్నది. తన ఈ నిర్ణయం ఎటువంటి దుష్ఫలితాలనిస్తుందో అని ఒకటే భయం, ఉద్వేగం. భగవాన్! ఇటువంటి సంకటపరిస్థితి శత్రువులకి కూడా రాకూడదు. ఇప్పటికిప్పుడు ఈ నిశిరాత్రి అంతమైపోయి ఈ బాధనుండి విముక్తి లభిస్తే ఎంత బాగుండును.

ఈ అగ్ని పరీక్ష మొదలై అప్పుడే నెలన్నర దాటిపోతోంది ఆ రోజు బాగా గుర్తు. రెండు నెలల సెలవుపైన వచ్చిన అల్లుడు, కూతురు, వాళ్ళ పిల్లలు తిరిగి అమెరికా వెళ్ళిపోయారు. వాళ్ళని సాగనంపి ఎయిర్ పోర్ట్‌నుండి ఇంటికి తిరిగి రాగానే తమ్ముడి ఫోను "అన్నయ్యా! అమ్మ పడిపోయిందని" ఏమయ్యిందోనని గాభరాగా తమ్ముడింటికి వెళ్తే, మంచం మీద విలవిలలాడిపోతూ అమ్మ. ప్రక్కనే తమ్ముడు, మరదలు, వాళ్ళ పిల్లలూ, ఎవరికి తోచిన సపర్యలు వాళ్ళు చేస్తూ.

అమ్మ అన్నం తిన్నాక పడుకోవడానికని వెళ్ళి చీకట్లో మంచం చూసుకోకుండా క్రింద పడిపోయిందట. తలకి, మోచేతికి తుంటి దగ్గర దెబ్బలు తగిలాయట. కొద్దిసేపు షాక్‌తో ఏమీ మాట్లాడలేకపోయిందట. ఇప్పుడిప్పుడే మాట్లాడుతోందట. కానీ ఎడమకాలు విపరీతంగా నొప్పిగా ఉండి కాలు కదపలేకపోతోందట. మా ఫామిలీ డాక్టర్‌కి ఫోన్ చేశారట. ఏ క్షణాన్నైనా రావచ్చునన్నారు. డాక్టర్ రాగానే అమ్మని పరీక్ష చేసి ఎడమ తొడదగ్గర ఫ్రాక్చర్ అయి ఉండవచ్చు ప్రొద్దుటే ఎక్స్‌రే తీయించమన్నాడు. ఆ రాత్రికి నొప్పి తెలీకుండా మత్తు ఇంజక్షన్ ఇచ్చాడు.

మర్నాడు ప్రొద్దుటే అమ్మని తెలిసిన ఒక ఆర్థోపెడిక్ సర్జన్ దగ్గరకు తీసుకువెళ్ళారు. ఆయన ఎక్స్‌రే తీయించి "ఫ్రాక్చర్ ఉందో లేదో స్పష్టంగా తెలియటంలేదు. ఏదైనా హెయిర్‌లైన్ ఫ్రాక్చర్ ఉంటే అప్పుడప్పుడు నాలుగైదు వారాల్లో దానంతట అదే అతుక్కుపోతుంది.

వేచి చూద్దాం. అప్పటికీ తగ్గకపోతే సర్జరీ చేయవలసి వస్తుంది" అన్నాడు. ఎనభై అయిదేళ్ళ వయసులో అమ్మ సర్జరీని తట్టుకొనగలదా అంటే మరో మార్గం లేదన్నాడు. తప్పని పరిస్థితులలో రిస్క్ తీసుకోక తప్పదన్నాడు.

అమ్మని ఇంటికైతే తీసుకొచ్చారుకాని ఆవిడ పడుతున్న నరకయాతన చూడలేక ఇంటిల్లిపాదీ బెంబేలెత్తిపోయారు. రాత్రంతా నొప్పితో నిద్రలేకపోవడం ఒక ఎత్తైతే, ఇతరుల మీద ఆధారపడి బ్రతుకుతున్నానని ఆవిడ మధనపడడం మరొక బాధ. అంత పెద్ద వయసులో కూడా ఎప్పుడూ తన పనులన్నీ తానే చేసుకోవడమేగాక, ఇంటికి ఎవరొచ్చినా కూడా వారికి అతిధి మర్యాదలు చేయకుండా ఊరుకోలేని మనస్థత్వం అమ్మది. అటువంటిది రోజంతా మంచం మీద గడుపుతూ, ప్రతీదానికి ఇతరుల మీద ఆధారపడవలసి రావడంతో ఆవిడ విపరీతమైన మానసిక క్షోభకు గురై రోజు, రోజుకి క్రుంగిపోసాగింది. తామందరూ ఎంత ధైర్యం చెప్పినా కూడా ఆవిడని తిరిగి మామూలు మనిషిని చేయడంలో కృతకృత్యులు కాలేకపోయారు. రోజురోజుకి ఆవిడలో నిర్లిప్తత పెరిగిపోతూ, చూపులో ఒక విధమైన శూన్యత చోటుచేసుకోసాగింది.

నాలుగోవారానికి కూడా ఆవిడ నొప్పి తగ్గకపోవడం, కాలుకదపలేక పోవడం వలన డాక్టర్ సలహామీద మరోమారు ఎక్స్‌రే తీయించారు. ఎక్స్‌రేలో ఈసారి హిప్ బోన్ ఫ్రాక్చర్ స్పష్టంగా కనబడింది. డాక్టర్ సర్జరీ తప్ప మరో మార్గం లేదన్నాడు. ఈ పండు వయసులో ఆవిడ శస్త్ర చికిత్సకి తట్టుకోగలదా అంటే ప్రమాదమైతే ఉంది కాని మరో గత్యంతరం లేదన్నాడు. మరింక ఆలస్యం చేయకుండా ఏదైనా నిర్ణయం తీసుకుని తనకి చెప్పమన్నాడు. అలాగే సర్జరీకయ్యే ఖర్చు, సమయం తదితర విషయాలు చెప్పాడు. అమ్మకి ఆ విషయాలేమీ చెప్పకుండా ఇంటికి తీసుకు వచ్చారు. ఇంటికి వచ్చాక తమ్ముడేమో సర్జరీకి ససేమిరా అన్నాడు. అవసరమైతే ఉద్యోగానికి రాజీనామా చేసి అమ్మని రాత్రింబగళ్ళు కంటికి రెప్పలా చూసుకుంటానన్నాడు. చెల్లెలేమో నీ ఇష్టమన్నయ్యా అంది. తను ఇతమిత్థమని ఒకే నిర్ణయానికి రాలేకపోతున్నాడు. ఈ వయసులో అంత రిస్క్ తీసుకుని సర్జరీ చేస్తే అమ్మ తట్టుకోగలదా? అలాగని ఇదేవిధంగా ఆవిడ పడుతున్న బాధను చూస్తూ సహించగలిగే శక్తి ఉందా? ఏమి చేయాలో పాలుపోక తెలిసిన వాళ్ళందరినీ అడిగి చూశాడు. ఐతే ఎవరూ ఇలా చేస్తే బాగుంటుందని సలహా ఇవ్వలేకపోతున్నారు. ఎందుకైనా మంచిదని నగరంలోనే ఉన్న మరో రెండు కార్పొరేట్ హాస్పిటల్స్‌లో రిపోర్టులు అన్నీ చూపించి వారి సలహా అడిగాడు. రెండు హాస్పిటల్స్‌లోని నిపుణులూ సర్జరీ తప్ప మరో మార్గం లేదన్నారు. మరి ఆవిడ సర్జరీకి తట్టుకోగలదా అంటే ప్రమాదమైతే ఉందని జవాబిచ్చారు. ఒక నిపుణుడు మనిషి మనోవ్యాధితో కృశించిపోవడం, అవిరామంగా కదలకుండా పడుకోవడం వలన బ్లెడ్‌క్లాట్స్ రావడం మొదలైనవి. మానసిక క్షోభ, శారీరక రుగ్మత వలన రోజురోజుకి మనిషి కృశించి పోతుందని కూడా చెప్పాడు.

డాక్టర్ల సలహాలన్నీ తమ్ముడికీ, చెల్లెలికీ చెప్పి తన మనోగతం కూడా చెప్పాడు సర్జరీ చేస్తేనే మంచిదని. అన్ని విషయాలు విన్నాక తమ్ముడు కూడా ఒప్పుకున్నాడు కొంచెం అయిష్టంగానే. అమ్మకి మాత్రం సర్జరీ చేస్తారనే విషయం చెప్పకుండా గోప్యంగా ఉంచారు, ఆవిడ సర్జరీకి సుతారమూ అంగీకరించదని తెలిసి. ఒక వారం రోజులు హాస్పిటల్‌లో ఉంచి మందులిస్తే కాలు బాగవుతుందని డాక్టర్ చెప్పాడని, అందువలన హాస్పిటల్‌లో చేర్పిస్తున్నామని చెప్పారు. డాక్టర్ బాగా తెలిసిన వాడవటం వలన అమ్మ అందుకు ఒప్పుకుంది అయిష్టంగానే.

ఒక మంచిరోజు చూసి అమ్మని హాస్పిటల్‌లో చేర్పించారు. తను డాక్టర్ పర్యవేక్షణలో సర్జరీకి కావలసిన అన్ని పరీక్షలు చేయించి కార్డియాలజిస్ట్ అభిప్రాయం కూడా తెలుసుకున్నారు. కార్డియాలజిస్ట్ అమ్మ సర్జరీకి తట్టుకుంటుందో లేదో సందిగ్ధమే అన్నాడు. తమ సర్జన్ మాత్రం ఆ వయసులో అటువంటి రిస్క్ ఉండటం మామూలే అన్నాడు. చివరకు రేపు ప్రొద్దుట ఆరుగంటలకి సర్జరీ చేయడానికి నిర్ణయించారు.

మర్నాటి ప్రొద్దుటే అమ్మకి సర్జరీ అనేసరికి సాయంత్రంనుంచి తనకి ఒకటే గుబులుగా ఉంది. తను సరైన నిర్ణయం తీసుకున్నాడా? చూస్తూ, చూస్తూ నవమాసాలు మోసి కనిపెంచిన మాతృమూర్తిని తను చేజేతులా చంపుకుంటున్నాడా? నిర్మలమైన అమ్మ ముఖం చూస్తే దుఃఖం ముంచుకొస్తోంది. తామందరు తనకి నయం చేస్తారన్న అచంచల విశ్వాసం ఆ ముఖంలో. ఆ నమ్మకాన్ని వమ్ముచేస్తున్నాడా? అమ్మకి రేపేదైనా జరిగితే చెల్లికి, తమ్ముడికి తన మొహం చూపగలడా? అసలు తన మనస్సాక్షికే జవాబు చెప్పుకోగలడా? ఆలోచనలతో క్షణ, క్షణానికి గుండె బరువెక్కుతోంది.

రాత్రి తొమ్మిదిగంటలకి ఎనస్థీషియన్ వచ్చి అమ్మని పరీక్షించి తనని ప్రక్కకి పిలిచి చెప్పాడు. "మీరు సర్జరీకి ఆమోదం తెలుపుతూ ఈఫారం మీద సంతకం పెట్టేముందు మీకు నిజమైన పరిస్థితి చెప్పాల్సిన బాధ్యత నామీదుంది. సర్జరీ తరువాత మీ అమ్మగారు మత్తునుంచీ కూడా కోలుకోలేకపోవచ్చు. సర్జరీ టేబుల్ మీదే ప్రాణాలు పోయే అవకాశాలు కూడా ఉన్నాయి" ఆయనలాగ చెప్పేసరికి ఫారం మీద సంతకం పెట్టడానికి చేతులు వణకసాగాయి. కన్నీళ్ళతో కళ్ళు మసకలు కమ్మసాగాయి. ప్రక్కనే ఉన్న మిత్రుడు భుజం మీద చెయ్యివేసి తట్టడంతో గుండె దిటవు చేసుకుని సంతకం పెట్టాడు.

ఆ రాత్రంతా అమ్మ మగతలో ఏదో మాట్లాడుతూనే ఉంది. అపుడపుడు కాలినొప్పి భరించలేక బాధపడుతూ. తన మనసు ఎప్పుడో మొద్దుబారిపోయింది. అన్నీ యాంత్రికంగా చేస్తున్నాడు. ఎప్పుడు తెల్లవారిందో, నర్సులు వచ్చి ఎప్పుడు అమ్మని సర్జరీకి తయారు చేశారో కూడా గమనించలేని మానసిక స్థితి. అమ్మని ఆపరేషన్ థియేటర్‌కి తీసుకువెడుతున్నా తనలో ఎటువంటి చలనం లేదు. అదోవిధమైన నిక్షిప్తావస్థలోకి వెళ్ళిపోయాడు. పెదవులు మాట్లాడుతున్నా, చెవులు వింటున్నా అంతా యాంత్రికంగానే చేస్తున్నాడు. మనసు ఎక్కడికో సుదూర తీరాలకి వెళ్ళిపోయింది. ఒక యుగంలాగా గడిచిన గంట తరువాత డాక్టర్‌గారు ఆపరేషన్ థియేటర్ నుంచి బయటకు వచ్చి "ఆపరేషన్ విజయవంతమైంది. మీ అమ్మగారిని వెళ్ళి చూడవచ్చు" అనడంతో ఐసియూలోకి వెళ్ళి అమ్మని చూశాడు. అమ్మ మొహం ప్రశాంతంగా ఉంది. మత్తుమందు ప్రభావమేమో కళ్ళు తెరచి చూస్తున్నా మగతగా ఉంది. ఆ మగతలోనే గుర్తుపట్టి కళ్ళతో పలకరించింది.

ఐ.సీయు నుంచి బయటకు వచ్చి తమ్ముడికి, చెల్లెలికి అమ్మ బాగుందని చెప్పబోయాడు. అప్పుడు తన్నుకొచ్చింది ఉప్పెనలాగా దుఃఖం. అనుభవించిన బాధనంతా వెడలగ్రక్కుతూ ఉబికిఉబికి వస్తున్న దుఃఖం కెరటాలలాగా తన్నుకొస్తున్న కన్నీరు. ఎంత ఆపుకొందామన్న ఆగని కన్నీరు. మనసు ఉపశమనానికి దారిస్తున్న దుఃఖం. ఆనందసాగరంలాంటి దుఃఖం. ఎడతెగని కన్నీరు కూడా ఇంత హాయిగా ఉంటుందా అని మనసు ఆశ్చర్యపడే దుఃఖం.

మరో నాలుగురోజులు డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచి ఐదోరోజు అమ్మని ఇంటికి పంపారు. సర్జరీకి చేసిన గాయం మానడానికి మరో మూడురోజులు పడుతుందని, నాలుగోనాడు తమ ఇంటికి వచ్చి అమ్మకి నడవడానికి అవసరమైన ఫిజియోథెరఫీ మొదలు పెడతానని తమ డాక్టర్ చెప్పాడు. ఆ రోజు ఆయన్ని ఇంటికి తీసుకువద్దామని బయల్దేరబోతుంటే తమ్ముడి దగ్గరనుంచి ఫోన్ "అమ్మలో చలనం " లేదని. పోయి చూస్తే అమ్మ ప్రాణం అప్పటికే పోయింది.

అమ్మ ప్రొద్దుటే టిఫిన్ తిని కాసేపు పడుకుంటానని పడుకుందట. అకస్మాత్తుగా ఆయాసం వచ్చి ఉన్నదున్నట్టు పడిపోయిందట. మరింక లేవలేదట. తమ్ముడు జరిగింది చెబుతూంటే తనలో ఏమాత్రం సంచలనం లేదు. ఒక్క కన్నీటి చుక్క కూడా రాలలేదు. ఒక విధమైన నిర్వేదానికి లోనయ్యాడు. ఆ నిర్వేదంతోనే ఒక విధమైన సాంత్వన, అమ్మ ఎటువంటి బాధ లేకుండా అనాయాసంగా కనుమూసిందని.

ఆ తరువాత అమ్మ కర్మకాండంతా యధావిధిగా జరిగిపోయింది. తరువాతెప్పుడో ఒక తెలిసిన డాక్టర్‌ని ఇలాగయ్యింది అమ్మ ఆకస్మిక మరణానికి కారణమేమయ్యుంటుందని అడిగితే "బహుశా చాలాకాలం కాలు కదపకపోవడం వలన బ్లెడ్ క్లాట్ ఏర్పడి ఉంటుంది. ఆ క్లాట్ క్రమక్రమంగా పైకి ఎగ్రబాకి గుండెదగ్గరకు చేరుకోగానే మరణం సంభవించి ఉండొచ్చు" అన్నాడు.

ఐతే చాలారోజులవరకు తనకు సమాధానం చిక్కని ఒక ప్రశ్న అమ్మ సర్జరీ విజయవంతమైనపుడు తనని అంత విపరీతంగా కుదిపేసిన దుఃఖం, అమ్మ పోయినప్పుడు తన దరికి ఎందుకు రాలేదని కనీసం ఒక్క కన్నీటి చుక్కైనా ఎందుకు రాలిపడలేదని ఆ మధ్య ఊర్లోకి ఒక ధర్మప్రవక్త వచ్చారని తెలిసి ఆయన్ని కలుసుకుని తన సందేహం వెళ్ళబుచ్చాడు. దానికాయన చిరు మందహాసంతో "గీతలో కృష్ణభగవానుడు ఎప్పుడో చెప్పాడు జాతస్య హి ధ్రువో మృత్యుః అని. అంటే పుట్టిన ప్రతివానికి మరణం తప్పదని. పండుటాకులాంటి నీ తల్లి ఎప్పుడైనా రాలిపోవచ్చని నీ మనస్సాక్షికి తెలుసు. అందుకే ఆమె అనాయాస మరణం నీకు బాధ కలిగించలేదు. ఐతే శస్త్ర చికిత్సకు అనుమతించే ముందు నీ తప్పుడు నిర్ణయంవల్ల ఆమె మరణిస్తుందేమోనన్న భయంతో ఉద్విగ్నతకు లోనయ్యావు. ఆ ఉద్విగ్నత ఫలితమే నీవనుభవించిన దుఃఖం. ఆ సమయంలో కూడా గీతాకారుడు చెప్పినట్టు నీవు "కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన" అంటే కర్తవ్య కర్మము నాచరించుట యందే నీకు అధికారము కలదు కాని ఎన్నటికీ దాని ఫలములయందు లేదు అని గుర్తుకు తెచ్చుకుని వుంటే ఆ దుఃఖం, బాధ కలిగి ఉండేవి కావు" అని బోధించాడు.

ఆయన మాటలతో అప్పటివరకు మనసును ముసురుకున్న మంచుతెరలు తొలిగినట్లయింది.

# చిత్తశుద్ధి

## సునీల్ ధవళ

ఉదయాన్నే వాట్సాప్ లో శుభోదయం మెసేజీల వర్షం కురిసేవేళ, ఫేసుబుక్కు మెస్సెంజర్లో మేలుకొలుపు మెసేజీలు, జన్మదిన శుభాకాంక్షలు పెట్టేవేళకి, శంకరం ఫ్లాస్క్ నిండా కాఫీ పోసుకొని హుటా హుటిన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్కి బయల్దేరేడు. కాదా మరి? పట్టణాల్లో ఇవాళా రేపూ కోడి కూయడం, పక్షుల కిలకిలలు వినడం, ఉషోదయనికి మేల్కొనడం లాంటివి చెబితే అతిశయోక్తి లేదా ఆశ్చర్యకరమైన విషయమే అవుతుంది.

"ఒరే శంకూ ఇక్కడ.. ఇక్కడ"

అని రాంభాయమ్మ చెయ్యూపేరు, ఆ సెకండ్ ఎ.సి. బోగీలో మరో చివరనుంచి. శంకరం ఈ కొస నుంచి ఆ కొసకెళ్లేలోపలే ఆ పక్క బామ్మగారుతో వర్ణిస్నేస్తున్నారు

"వీడే నా పుత్రరత్నం శంకరం దూరదర్శన్లో పెద్ద ఆఫీసరు"

కొడుకు వచ్చి ఫ్లాస్క్ తల్లిచేతికందించి పాదాభివందనం చేసేడు తన మాతృమూర్తికి.

"వెర్రి నాగన్న నా కోసం స్టాన్గ్ కాఫీ ఇంటినుంచి పట్టుకొచ్చినట్టున్నాడు", అని కొడుకు తెచ్చిన కాఫీ రెండు కప్పుల్లో పోసి ఆవిడకొకటి అందిస్తూ.

రాంభాయమ్మ చాలా నిష్టురాలు. బయటకొస్తే ఎంగిలిపడడం అటుంచి నీళ్ళచుక్క కూడా తీసుకోరు. అయితే గియితే ఇంటి నుంచి ఏ చోవిరొట్టి ముక్కో, సోజ్జి పులిహారో తెచ్చుకోవడమో లేదంటే ఆ పూటకి అరటిపళ్ళతో కాలక్షేపం. శంకరం సామాన్లు లెక్కపెట్టుకొని పోర్టర్ అబ్బాయికి అప్పజెప్పి

"ఇక వెళదాం పదమ్మా" అంటూ మెల్లగా అడుగులు వేసేరు.

కారులో ఇంటకెళ్తున్న దారిపొడవునా రాం భాయమ్మ వాళ్ళ ఊరు ముచ్చట్లు కొడుకుతో చెబుతూనే ఉన్నారు. ఆవిడ వాగ్ధాటి ముందు కారు స్టీరియోలో రేడియో వార్తలు చదువుతున్న న్యూస్రీడర్ గొంతు చిన్నబోయింది.

రాంభాయమ్మకి ఫస్ట్ ఫారంలో ఉండగా మూడుముళ్ళు పడ్డాయి. కాపురంకి వెళ్లినదగ్గిరనుంచి ఇప్పటివరకు శ్రీముఖలింగంలోనే ఉంటున్నారు. భర్త మూర్తిగారు పోయినా ఆయన మిగిలిచిన ముప్పావెకరం మాగాణి, మది నిండా ముప్పైమూడు సంవత్సరాలపాటు ఆయనతో చేసిన కాపురం జ్ఞాపకాలతో ఆ శ్రీముఖలింగేశ్వరుడు సన్నిధిలోనే కాలక్షేపం చేస్తున్నారు. కొడుకు దగ్గిరకి హైద్రాబాద్ వెళ్లినా, కార్తీకమాసం వచ్చేసరికి విధిగా తన పల్లెటూరు శ్రీముఖలింగంకి తిరుగుముఖం పట్టవల్సిందే. తన ఊరన్నా ఆ పరమశివుడు అన్నా అత్యంత ప్రీతి ఆవిడకి. పెద్దగా చదువుకోకపోయినా జీవితాన్ని అనుభవంతో వల్లే వేసేరు. లోకజ్ఞ్యానం మెండుగా ఉన్నందున ఏ విషయంపైనైనా ఊకదంపుడుగా మాట్లాడి లా పాయింట్లు తీయగలరావిడ.

ఇంట్లోకి అడుగుపెట్టగానే నేరుగా వెళ్లి కాళ్ళు కడుక్కొని, తన ఊర్లో ఇంటి పెరట్లో ఉన్న బిల్వమొక్క నుంచి కోసుకొచ్చిన బిల్వ పత్రాలు దేముడు గదిలో ఉంచి అప్పుడు మిగతా సంచీలు అన్నీ ఒకొక్కటి విప్పుతూ చింతకాయలు, ఉసిరికాయలు, చెరుకుగడ ముక్కలు, నారింజకాయలు, ఆకాకరకాయలు, మామిడి అల్లం, జున్ను ముక్కలున్న స్టీల్ డబ్బా కోడలికి అందిస్తూ అలా చెప్పుకుపోతున్నారు.

"ఇదిగోనే నా మనవడికి ఇష్టమని సోములు దగ్గిర కుంచాడు పచ్చి సెనక్కాయలు తీసుకున్నాను. మన పొలంలో వడ్లు ఒక బస్తాడు అట్టిపెట్టి దంపుడు బియ్యం శంకు కోసం తెచ్చేను, వాడికి షుగర్ కదా. ఇక మీదట ఈ బియ్యమే వండిపెట్టు నా కొడుక్కి" అని శిలాశాసనం వేసేరు.

"ఇంతకీ అమ్మ ఇంత హఠాత్తుగా అదీనూ కార్తీకమాసంలో ఎప్పుడూ రాని మనిషి ఎందుకొచ్చినట్టో?" కూపీలాగు అని తన శ్రీమతికి క్రీకంటితో. సౌంజ్ఞ చేసేడు శంకరం.

"అబ్బా కొంచెం ఉంటారా, ఎప్పుడూ మీ తొందర మీదే", అన్నట్టు నొసట చిట్లించి, కనురెప్పలతో జవాబిచ్చింది శైలజ.

అని శైలజ పుట్టినప్పుడే, రాంభాయమ్మ తన అన్నయ్య వదినలతో కరాఖండిగా చెప్పింది.

"నీ కూతురుకి నా శంఖూకి ఇచ్చే ఉద్దేశ్యముంటే దానికి పార్వతిదేవి పేరేదైనా పెట్టండి, కనీసం డిగ్రీ వరకు చదువు చెప్పించండి"

శైలజ తల్లి శైలజ డిగ్రీలో ఉంటూండగా పోయింది. అప్పట్నుంచి శైలజకి తన మేనత్త, అత్తగారు తర్వాత అమ్మ అందరూ రాంభాయమ్మ గారే. శంకరం జర్నలిజం లో పీజీ చేసి ఉద్యోగమొచ్చాక శైలజనిచ్చి ఘనంగా పెళ్లి చేయించేరు. అలా అత్తకోడల్ల మధ్య అభిమానం ఆది నుంచే మెండు, అత్త మాట ఎపుడూ జవదాటలేదు, రాంభాయమ్మ కూడా కోడలిని పల్లెత్తు మాట ఎపుడూ అనాలేదు.

ఆదివారం అవడం చేత కార్తిక్ అతని భార్య దీప కాస్త నిదానంగా నిద్ర లేచేరు. లేవగానే

"నానమ్మా!"

అంటూ ఆప్యాయంగా కౌగిలించుకోబోతే, రాంభాయమ్మ దూరంగా జరిగి ప్రేమగా

"ఇప్పుడు తెల్లారిందా నాయనా, పాచి బట్టలతో నన్ను ముట్టుకోకు స్నానం పానం చేసిరా కూరుచుని బాతాఖాని వేసుకొందాము" అన్నారు.

మనవడ్ని చూసిన ఆనందంలో ఆవిడ కళ్ళలో మెరుపు స్పష్టంగా కనపడుతోంది. తను తెచ్చిన పచ్చి సెనగకాయలు ఉడికించి మనవడు పక్కన కూర్చుని కార్తీక్కి ఒలిచి ఇస్తూ కోడలు కొడుకు వైపు చూసి తన మనసులోనున్న విషయం చెప్పిందావిడ.

"ఏమర్రా అపుడెపుడో కార్తీక్, దీపల పెళ్లప్పుడు గృహప్రవేశం నాడు చేసినదేనా సత్యనారాయణవ్రతం. తర్వాత ఏనాడైనా వాళ్లిద్దరూ పీటల మీద కూర్చుని ఒక వ్రతమో, నోమో చేయడానికి వీలు కలగలేదాయె. వీడు ఒక మూనెళ్లు అదేదో దేశంలో ఉంటే వాడి పెళ్ళాం మరో మూడునెళ్లు ఇంకేదో దేశం వెలిపోతోంది. వీళ్ళ పెళ్లయి వచ్చే మాఘశుద్ధ షష్టి నాటికి నాలుగేళ్లు నిండుతాయా? ఆ బోడి ఉద్యోగాలు తప్ప వీళ్ళకి కాపురం చేయడానికి, గుళ్ళు గోపురాలు తిరగడానికి అసలు టయము ఎక్కడ దొరుకుతోంది? వచ్చే సోమవారం నాడు దంపతులిద్దరు చేత రుద్రాభిషేకం చేయిద్దాము. వాళ్ళతో

పాటు మీరిరివురూ కూడా కూర్చోండి. ఊర్లో ఉన్న నలుగురుని పిలిచి భోజనాలు పెట్టిద్దాము. ఎంతమందొచ్చినా ఒంటి చేత్తో వంట చేసిపారేస్తాను. నా సత్తా ఎరుగుదురు కదా, ఆ నీలకంఠుడు దయవల్ల నడుము నొప్పి, మోకాళ్ళ నొప్పి లాంటి పితూరీలు ఇంకా లేవు నాకు. ఆ సాంబశివుడు కరుణ కటాక్షాలు కావాలి నా మనవడికి మనవరాలికి" అని బేలగా పలికేరావిడ.

ఆమె కొడలూ కొడుకు కుతూహలంగా చూస్తున్నారు.

"నానమ్మా, వచ్చే సోమవారం నా బాస్తో అప్రయసల్ మీటింగుంది" అని కార్తీక్ గొణిగేడు.

"ఈ అప్పులు రైజ్ లు ఎపుడూ ఉన్నవేరా అబ్బాయి, నా మాట విని మీ బోడి బాస్ కి విషయం అర్ధమయేలా నా మాటగా చెప్పు. ఆదే ఆఖరివారం పైగా ఏకాదశి కూడా కల్సొచ్చింది చాలా పుణ్యదినం అని మా ముఖలింగేశ్వరుడు కోవెలలో చిన్న పూజారి గారు చెబితేనూ నాకీ ఆలోచన తోచింది".

శైలజ అవునన్నట్టు తలూపింది, కార్తీక్ నడ్డిమీద చేయివేసి నిమురుతూ.

రాంభాయమ్మ తలచినదే తడువు, నెమ్మదిగా లేచి తన బ్యాగులోంచి ఫోన్ నంబరులున్న పద్దు పుస్తకంలాంటి చిన్న పుస్తకం, కళ్ళద్దాలు తెచ్చుకొని ఒకొక్కరికీ ఫోన్లు చేయడం మొదలెట్టారు. ఉభయకుశలోపర్లు అయ్యాకా, ఊర్లో భోగట్టాలు చెప్పడం, పిచ్చాపాటి మాట్లాడేక ఆఖరులో ఫోను కోడలుకిచ్చి వచ్చేవారం తమ ఇంట్లో అభిషేకానికి రమ్మనమని పిలిపించడం. ఇలా ఒక్కొక్కరితో హుషారుగా మాట్లాడిన రాంభాయమ్మ, మంగతాయారుతో మాట్లాడిన వెనువెంటనే ఒక్కసారి కుదేలయిపోయింది.

"అత్తా, కొంచెంసేపు అలా చేరబడకూడదూ ప్రయాణం చేసి అలసిపోయావు" అని కోడలు మాట ముగించకముందే,

"ప్రయాణమా నా బొందా?. ఆ మంగతాయారు తత్వం ఎపుడూ ఇంతే. ఏమిటి విశేషం వదినోయ్ ఇలా అకస్మాత్తుగా వచ్చావు ఊర్లోకి? నీ మనవడు పెళ్ళాం నీళ్ళుపోసుకొన్దేంటి? అని నా మొహం మీద లెంపకాయ కొట్టినట్టు అడిగింది. అలాటిదేమైనా ఉంటే చెప్పమా, దాచుకొంటామా ఆయినా ఆవిడగారు అంత నిష్ఠూరంగా అడగాలా?".

ఈ విషయం ఎవరైనా ఎత్తితే రాంభాయమ్మ బీపీ ఇంటి పైకప్పుని తాకుతుంది. తన నిస్సహాయత, అవతల మనవడ్ని ఏమీ అనలేదు, కొడుకు కోడల్ని నిలదీసి అడిగినా ప్రయోజనం లేకపోయే.

పరిస్థితి అదుపు తప్పుతోందని గ్రహించిన శంకరం టీవీ ఛానెల్ పెట్టి "చూడమ్మా కాశీ విశ్వనాధుడుకి హారతిస్తున్నారు" అన్నాడు.

"ఒరేయి శంకూ మన ఇంట్లో కార్తీకదీపం ఎప్పుడు వెలుగుతుందిరా? వేచి వేచి కన్నులు కాయలు కాచాయిరా" అని వాపోయింది రాంభాయమ్మ.

శంఖరం ఎదో అనబోతోంటే పక్కనున్న శైలజ అతని చెయ్యి నొక్కి వారించింది. "ఆవిడ మనసు బాగోలేదు ఇది తగిన సమయం కాదు, తర్వాత ఎవుడైనా నెమ్మదిగా చెప్పొచ్చు" అన్నట్టు.

భార్య సమయస్ఫూర్తికి మనసులో మెచ్చుకొని, కళ్ళతో "అవును నిజమే" అని చెప్పేడు శంకరం.

★★★★★★★ ★

వారం రోజులు ఇట్టే గడిచిపోయాయి. ఆఖరి కార్తీక సోమవారం రానే వచ్చింది. పగలంతా ఉపవాసం ఉండడం ఈ మధ్యకాలంలో అలవాటులేక కార్తీక్ మొహం పీకిపోయింది. ఆకలికి తట్టుకోలేకపోతున్నాడు అలాగని బయటికి వ్యక్తపరచకుండా జాగ్రత్తపడుతున్నాడు. పొద్దున్నుంచి మూడు మాట్లు తాగిన కాఫీ కడుపులో దేవేస్తోంది. మనవడి పరిస్థితి చూసి రాంభాయమ్మ ఊరినుంచి తెచ్చిన నారింజకాయలు పిండి,

"ఇదిగో ఈ నారింజ నీళ్లు తాగండి కడుపు అదే సర్దుకొంటుంది" అని చెప్పి అందరి చేత తాగించేరు.

సూర్యుడు ఇక ఇవాల్టికి నా డ్యూటీ ఐపొందొచ్చు అన్నట్టు ముదర నారింజ రంగులోకి మారీ మారగానే రాంభాయమ్మ మడి కట్టుకోని వంటకి ఉపక్రమించారు. సరిగ్గా చిన్నముల్లు ఆరు అంకెని తాకడం పెద్దముల్లు నేనేమైన తక్కువ తిన్ననా అన్నట్టు 12ని గట్టిగా వాటేసుకోవడం, పంక్చువాలిటీకి మారుపేరు మా పురోహితులమే అని ఢంకా వాయించి చెప్పినట్టు పురోహితుడు అతని అసిస్టెంట్తో పాటు ఉన్న టీవీఎస్50 చక్రాలుకి వీళ్ళ అపార్ట్మెంట్ ముందుకొచ్చి బ్రేక్ పడడం అన్నీ ఒకే సారి జరిగేయి. తెల్లని పట్టు పంచెల్లో తండ్రీ కొడుకులు, రాణీ రంగు పట్టు చీరల్లో అత్తాకోడళ్లు పీటల మీద ఆసీనులయ్యేరు.

"మనవుడూ భార్యా పాలసముద్రంలో కలవు పువ్వు లాగున్నారు, ఈ తతంగమయ్యేక దిష్టి తీయాలి", మనసులో వల్లే వేసుకొన్నారు పెద్దావిడ.

వంటగదిలో నుంచి ప్రెస్సర్కుక్కర్ విజిల్ సాక్షిగ్గా, కసిగా కొబ్బరిని నలుపుతున్న గ్రైండర్ రణధ్వనుల నడుమ పురోహితులువారు ఇరు జంటల చేత సంకల్పం చెప్పించి గణపతి పూజనారంభించేరు. ఈలోపున 'కౌసల్యా సుప్రజా.. . ' అని వినడబద్దంతో రాంభాయమ్మ అయోమయంగా

"అదేంటి ఇప్పుడు సుప్రభాతం ఎవరు పెట్టారు?"

అని మొహంలో విసుగు చూపిస్తూ వంటిట్లోంచి వచ్చి ఛార్జింగ్లో నున్న కోడలు ఫోన్ రింగ్టోన్ అని గుర్తుంచి, ఆకుపచ్చ రంగు మీట మీద ఆధార్ కార్డ్ కోసం వేలిముద్ర వేసినంత గట్టిగా నొక్కేరు.

"హలో ఓలా సే బోల్ రహే హూ... " అంది అవతలవైపు కంఠం.

"ఓలా లేదూ పోలా లేదూ పోరా వంట ఇంకా తెమల్లేదు, అని నేనేడుస్తూంటే రాంగ్ నంబర్లు కూడా ఇప్పుడే వచ్చి చావాలా?" అని గొనుక్కొంటూ ఫోన్కున్న ఎర్ర మీటకి ఒక మొట్టికాయ పెట్టేరు, రాంభాయమ్మ.

ఈసారి, 'సారే జహాసే అచ్చా హిందూ...' దేశభక్తి గేయం ఎక్కడుంచో లీలగా వినిపిస్తోంది.

"ఓహో శంఖూ ఫోనే మ్రోగుతోంది కామోసు!" అని అనుకొంటూండగానే శంకరం లేచి తనే ఫోనే అందుకున్నాడు.

"హలో.. మై ఓలా డ్రైవర్. ఆప్ కా ఘర్ ఇంటర్నేషనల్ స్కూల్ కా పాస్ హైనా. మోహల్లెమే స్కూల్స్ సబ్ కి సబ్ ఇంటర్నెషనల్ స్కూల్స్ హై. అవుర్ కోయి లాండ్మార్కు హై క్యా?"

కొంచెం సేపట్లో ఇంటర్కం మ్రోగింది.

"మెహమాను కోయి ఆయే హై, ఫ్లాట్ కా అందర్ భేజూ...." అని సెక్యూరిటీ గార్డు.

కాల్లింగ్ బెల్ మ్రోతలు, తలుపు తీయడాలు, పక్కింటి, ఎదురింటివాళ్ళు రావడాలు, వచ్చినవాళ్ళకి పీటలమీదనుంచే నవ్వులతో పలకరింపులు, వచ్చినందుకు కళ్ళతో ధన్యవాదాలు, దయచేసి ఆసీనులవ్వండి అన్నట్టు హావభావాలు పరస్పరం వ్యక్తమయినాయి.

కార్తీక్ ఒక చేత్తో పళ్ళరసంతో అభిషేకిస్తూనే వాట్సాప్లో తన బాస్ మెసేజ్ చూసేడు.

"కార్తీక్ మీ ఇంటి అడ్రస్ మొన్న పెట్టేవు, డిలీట్ ఆయింది మళ్ళీ పంపు" అని.

ఇతర సహోద్యోగులు నుంచి మెసేజులు వస్తూనే ఉన్నయి. "లేట్ అవుతున్నా, ట్రాఫిక్ ఎక్కువుంది" అని ఒకరు, "మా ఆయన కోసం వేచి చూస్తున్నా రాగానే బయల్దేరుతాను" అని దీప స్నేహితురాలు,

"ఇలాంటి పూజకి ఇదే మొదటిసారి, వచ్చేటప్పుడు ఏమైనా తేవాలా? కొంచెం చెప్పు" అని ఒక సర్దార్జీ స్నేహితుడు.

పంచామృతాలతో, పల్లరసాలతో అభిషేకించుకొన్న శివలింగం మరింత తేజస్సుతో అగుపిస్తోంది.

ఈ లోపల రాంభాయమ్మ, "ఇది మెంతిగుండేనా? లేక సాంబారు పొడా? " అని,

"ఎలక్ట్రికల్ కుక్కర్ స్విచ్ వెలిగిందా లేదా ఒకసారి చూడు శైలజ" అని మరొకసారి లేపించారు.

పైన ఉన్న పెసరపప్పు డబ్బా అందడంలేదని దీపని ఒకసారి, గేసు సిలిండర్ అయిపోయింది మార్చమని శంకరాన్ని ఒకసారి లేపించారు. కొంతమంది పెద్దవాళ్ళు మినహాయించి అభిషేకం చూడ్డానికి వచ్చిన బంధుమిత్రులెవరూ కార్యక్రమము మీద అంతగా శ్రద్ధ చూపలేదు.

"నీ ఇయర్ రింగ్స్ సెట్ బాగుంది, లలితా జ్యుయాలర్స్ నుంచా?"

"ఆవిడ చీర బాగుంది చెన్నై సిల్స్ లో ఇలాటిదే చూసాను మొన్న"

ఇలాగ అమ్మలక్కలు ముచ్చట్లాడుకొంటూ కాలక్షేపం చేస్తున్నారు.

"మీరు ఏ ప్రాసెస్లో ఉన్నారిప్పుడు?" అని సాఫ్ట్వేర్ ఉద్యోగుల కబుర్లు ఇంకోవైపు.

ఈ లోపలే ఫేసుబుక్కులో "ఉయ్ ఆర్ ఎట్ కార్తిక్ & దీపాస్ ప్లేస్ అటెండింగ్ అభిషేక అండ్ డిన్నర్" అని అప్డేట్లు వెళ్లాయి. వాట్సాప్లో ఫోటోలు పంపడంలో నిమఘ్నులయిపోయారు కొందరు.

మెల్లగా ఎట్టకేలకు అభిషేకం అయిందనిపించేరు.

అరటి ఆకులు వేసి వడ్డనలు మొదలెట్టారు. రాంభాయమ్మ ముందుగా చెప్పినట్టే ఒక్కరే చేసి సాదించేరు. పెసరపప్పు, చింతకాయ బచ్చలికూర పులుసు, వంకాయ కూర, కొబ్బరిపచ్చడి, ఊరవేసిన మావిడల్లము, గారెలు, పులిహోర, టొమాటో పచ్చడి, పచ్చి గుమ్మడి వడియాలు. వడ్డిస్తూన్నవిడ ఒక్క సారి మనవడి స్నేహితుడు ఆ సర్దార్జీ ఎడంచేత్తో అన్నం తీసుకొని తినడం చూసి పళ్ళు కోరుక్కొన్నారు ఏమీ అనలేక. ఎందుకంటే మనవడు ముందే చెప్పేడు పిలిస్తే మొత్తం నా టీంలో అందరినీ పిలవాలి, ఎటువంటి భేదాలు, తారతమ్యాలు లేకుండా అని. తప్పుతుందా మరి, చూసి చూడనట్టూరుకొన్నారావిడ. స్వంత కారుల్లో వచ్చినవాళ్ళు వీడ్కోలు పలికి వెళ్లిపోయారు. ఒక అరడజన్ మంది వయోవృద్ధులుకి టాక్సీలు ఆటోలు బుక్ చేయాలి. కార్తీక్ దీపలు ఆ పనిలో పడ్డారు.

"ఓలా లో 600 చూపిస్తోంది, మల్కాజిగిరి తాతగారు కోసం బుక్ చేసినా?" అని దీప అంటే, "ఉండు ఉబర్లో చూస్తా తక్కువుందేమో" అని కార్తీక్. మొత్తానికి అందర్నీ సాగనమ్పి ఎవరు ఎప్పుడు ఎక్కడ వాలిపోయారో తెలీకుండా అలా ఒకరు సోఫాలో, మరొకరు గచ్చుమీద సొమ్మసిల్లి పడుకోండిపోయారు.

పొద్దున్న అందరూ నిదానంగా లేచేరు. రాంభాయమ్మ కొంచెం గంభీరంగానూ, ముక్తసరిగాను మాట్లాడారు. ఇంటిల్లిపాది కాఫీ తాగుతూ కూర్చునప్పుడు, శైలజమ్మ మెల్లగా అడిగింది.

"అత్తా, కార్యక్రమం బాగా ఐంది కదా!, పిలిచినవాళ్ళందరూ వచ్చేరు కదా!".

"అవును వంటలు కూడా అద్భుతంగా చేసేరు" అని దీప అందుకొంది తన అత్తగారు నుంచి.

"ఏమోనే నాకు సంతృప్తిగా అనిపించలేదు. అంతా అష్టావధానం లాగా, కృతిమంగా ఆయినట్టుంది" రాంభాయమ్మ నిటూరుస్తూ అన్నారు.

శంకరం అమ్మ పక్కకొచ్చి తల నిమురుతూ చెప్పాడు.

"అమ్మా పట్టణాలలో జీవితమే కృతిమమైపోయింది. భక్తి భావం ఎవరికీ లేక కాదు. అందరికీ కలుసుకోవాలనే ఉంటుంది. పవిత్రమాసంలో ఇంట్లో పూజలు చేసి నలుగుర్ని పిలవాలని ఉంటుంది, కానీ మునుపటి రోజులు కావు. మునుపట్లా ఇపుడు ఒపీకలు లేవు, దూరాలు, ట్రాఫిక్రద్దీతో పాటు ధరలూ పెరిగాయి. పెరగనిది ఏంటంటే సమయం. ఎవరికీ సమయం చాలడంలేదు. మన ఊర్లలో అంటే నలుగురూ తెలిసినవాళ్ళు. సమయం ఉంటుంది కాబట్టి సహాయపడతారు, సహజ వాతావరణం ఇంకా ఉంది కాబట్టి ఎప్పుడు పిలిచినా పలుకుతారు. నాల్గడుగులేస్తే చాలు ఎవరింటికెళ్లాలన్న, లేదంటే సైకిల్, ఆటోలో పట్టుమని పది నిమిషాలు. పట్టణాల్లో వ్రతాలకి భోజనానికి పిలిచినా వచ్చినవాళ్లు 2 గంటలు, వెయ్యి రూపాయలు వాహనానికి ఖర్చుపెట్టుకొని రావాలి. ఏదో పెళ్లి, గృహప్రవేశాలంటే తప్పవు కానీ ఇలాంటి పూజలకు దూరాబారంలో నున్న దగ్గిర చుట్టాల్ని కూడా, సెలవు రోజుల్లో ఫరవలేదుకానీ పనిదినాలలో పిలిస్తే ఒకల్ని ఇబ్బంది పెట్టినట్టవుతుంది."

"అమ్మ నీకో ముఖ్యమైన విషయం చెప్పాలి. ప్రశాంతంగా విని కాస్త నిదానంగా ఆలోచించు. వాళ్లిదరికీ పిల్లలు కలగడం జరగదుట ఏదో మెడికల్ ప్రాబ్లెమ్ ఉండడంవలన. డాక్టరుగారు ఇంకేదో చెప్పేలోపలే ఆవిడని మధ్యలో అపి, వాళ్లలో ఎవరిలో ప్రాబ్లెమ్ ఉంది లాంటి వివరాలు వాళ్లకు

చెప్పొద్దన్నారుట. తెలుసుకొని నొచ్చుకోవడము, న్యూనత భావంతో మదనపడటం తప్ప వేరే ప్రయోజనం లేదు. ఆ క్షణములోనే మాకు చెప్పి తుది నిర్ణయం తీసుకొన్నారు.

"సెంట్రల్ ఆడాప్షన్ రిసోర్స్ అథారిటీ' (cara.nic.in) అని భారత ప్రభుత్వ, మహిళల & పిల్లల అభివృద్ధి మంత్రిత్వ శాఖ యొక్క విభాగం. ఇది పిల్లల దత్తత స్వీకరణలను పర్యవేక్షించడం మరియు నియంత్రించడం కోసం పనిచేస్తుంది. ఆ సంస్థలో దరఖాస్తు చేసుకొన్నారు. మరో నెల రోజులలో పండంటి ఆడ బిడ్డని మనకి ఒప్పచెపుతారు వాళ్ళు. ఈవిధంగా ఒక చిన్ని ప్రాణంకి సహాయం చేయడానికి మనని ఎన్నుకొన్నాడు ఆ పరమేశ్వరుడు. బిడ్డ ఎవరైనా బిడ్డే కదా. మన కోడలు కడుపున పుట్టిందే అనుకొందాము. బిడ్డ వచ్చేక అందరం మనూరు వచ్చి ఓ పది రోజులుంటాము. తాతమ్మ చేత సంరక్షణ చేయించుకోవద్దూ? అలాగే ముఖలింగేశ్వరుడు ఆశీస్సులు కూడా తీసుకోవాలి కదా. ఏమంటావు?"

ఇదంతా కొడుకు చెబుతుంటే నివ్వెరపోతూ, అచేతనంగా ఉండిపోయిన ఆవిడ వెంటనే తేరుకొని,

"నా మనవడు బంగారం, ఎంత ఎత్తుకు ఎదిగిపోయారు వీళ్లిద్దరూ. పోలికలు ఒక్కటే కాదు, వాడి మనసు కూడా వాళ్ల తాతగారిదే. చల్లని వార్త చెప్పేర్రా, నిక్షేపంలాంటి పని చేస్తున్నారు"

"చిత్తశుద్ధితో శివ పూజలు చేయడమంటే ఇదేనేమో" అన్నట్లుగా దీప నుదిటి పైన ముద్దుపెట్టుకొన్నారు.

## ఉపకారికి అపకారం — అగస్త్యప్రగడ హేమంత

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

**ఉపకారం చెయ్యమంటే,** ఊరొదిలి పారిపోయే వాళ్ళు కొందరు. ఆ మాట చెవిన పడగానే ఊళ్ళు దాటి వెళ్ళి మరీ అవసరంలో ఉన్నవాళ్ళకి ఉపకారమందించేవాళ్ళు కొందరు. ఈ రెండో కోవకి చెందిన వాడే ఉత్తమ్. అందుకే, కొత్తగా ఎదురింట్లో అద్దెకి దిగిన శ్రవణ్‌ని చూసి జాలిపడిపోయాడు. వచ్చిన వారం రోజులకే అతనితో మాట కలిపేసి, జట్టు కట్టేసిన ఉత్తమ్‌కి, పదిరోజులకల్లా తెలిసిపోయింది ఉద్యోగం విషయంలో శ్రవణ్ చాలా 'క..ష్ట'పడిపోతున్నాడని..

కష్టమంటే ఉదయమనగా ఆదరాబాదరాగ తెమిలి ఆఫీస్‌కి బయల్దేరితే, తిరిగి రాత్రి తొమ్మిదికే ఇంటికి చేరేవాడు. పైగా ఇంటికి వచ్చీరాగానే 'అదేదో పని ఎందుకు చెయ్యలే'దు అంటూ ఇతను భార్యని అడగడం, దానికి ఆమె 'అన్నిపన్లూ ఒక్కదాన్నే ఎలా చెయ్యా'లంటూ దీర్ఘాలు తియ్యడం. దాంతో "నేనంత కష్టపడుతున్నాను" అంటే "నేనింత ఇబ్బంది పడుతున్నాను" అంటూ ఇద్దరి మధ్య మాటా మాటా పెరగటం ఒకట్రెండుసార్లు విన్నాడు కూడా. శ్రవణ్ విషయంలో ఉత్తమ్ మనసు ద్రవించిపోవడానికి గల ముఖ్యకారణం ఇదే మరి.

అంచేతనే అతన్ని చూస్తూ ఊరుకోలేక పోయాడు మరి. ఊరుకుందామన్నా అతనిలోని ఉపకారగుణం అతన్ని అస్సలు నిలవనీయలేదు. అందుకే ఓ రోజు వీలు చూసుకుని, మాటల సందర్భంలో అడిగేశాడు. "కష్టపడి అంత దూరం వెళ్ళి హైరానా

పడకపోతే ఇక్కడికి దగ్గర్లో జాబ్ చూసుకోవచ్చుగా! అలా వీలుకాకపోతే అక్కడికి దగ్గరగా ఉన్న ఏరియాలో ఇల్లు తీసుకోవచ్చుగా'' అంటూ.

''ఆ రెండిటికోసం నేనూ చాలానే ప్రయత్నించాను. కానీ వీలయితే కదా!''

''అంటే?''

''నా ఆఫీస్‌కి దగ్గర ఏరియాలో ఇల్లంటే రెంట్ భరించలేను. ఇక మిగిలింది ఇక్కడికి దగ్గరగా జాబ్ చూసుకోవడం. చేసేది ప్రైవేట్ కంపెనీలోనే కనక ఎక్కడ వేకెన్సీ ఉందంటే అక్కడ రెజ్యూమ్ ఇచ్చేసి వస్తున్నాను. కానీ ఇంతవరకూ ఏ ఒక్కటీ ఫలించలేదు. ఎందుకంటే ఇక్కడ నాకు తెలిసిన వాళ్ళు, పరిచయస్తులు ఎవరూ లేరు కనక. కాస్త మాట సహాయం చేసే వాళ్ళుంటే పని తొందరగా అవుతుంది'' నిట్టూరుస్తూ అన్నాడు.

అతని నిస్సహాయతని చూస్తుంటే ఉత్తమ్‌కి సహజంగానే జాలేసింది. ''పోనీ నేను ప్రయత్నించనా?'' అన్నాడు ఉదారంగా.

''అంతకంటేనా! అలాగే చెయ్యండి. ఇంతకీ మీకు తెలిసినవాళ్ళు ఎవరయినా ఉన్నారా?'' ఉత్సాహంగా అడిగాడు శ్రవణ్.

''ఉన్నారు'' చెప్పాడు ఉత్తమ్ ఎవరెవరున్నారో వరసగా గుర్తుతెచ్చుకుంటూ.

''అయితే ఇకనేం 'వెంటనే' ప్రయత్నాలు ప్రారంభించేద్దాం. ఎప్పుడు వెడదాం? రేపా? ఎల్లుండా?'' మరింత హుషారుగా ప్రశ్నించాడు.

అతడి ఉత్సాహం చూస్తుంటే, 'లేడికి లేచిందే పరుగు' అన్న సామెత గుర్తొచ్చింది ఉత్తమ్‌కి. అంతలోనే అనిపించింది పాపం రోజూ గంటలతరబడి ప్రయాణాల్తో, ట్రాఫిక్ జామ్‌లతో విసిగిపోయినట్టున్నాడు. అందుకేనేమో ఇంత ఖంగారు పడుతున్నాడు అనుకుంటూ పైకి మాత్రం ''ఎక్కడికి వెళ్ళి ఎవర్ని కలవాలో వివరాలు చెబుతాను. మీరు వెడుదురుగాని నేను రానవసరంలేదు'' అన్నాడు నవ్వేస్తూ.

''అమ్మమ్మా! అలా అంటే వాళ్ళు నన్ను పట్టించుకోకపోవచ్చు. కాబట్టి కూడా మీరూ ఉంటే ఆ దారే వేరు. చెప్పండి ఎప్పుడు వెడదాం'' మళ్ళీ అడిగాడు.

అతనలా ఒత్తిడి చేసేస్తుంటే ఇరకాటంలో పడ్డాడు ఉత్తమ్.

''అంతతొందరగా అంటే నాకూ కుదరాలిగా! వీలు చూసుకుని చెబుతాను'' అన్నాడు.

''వీలు అంటే? ఎన్నాళ్ళు పడుతుంది? ఒక వారమా? రెండు వారలా? సుమారుగా ఎన్నిరోజులు అని?'' ఆతృతగా రెట్టించాడు.

ఒక్క క్షణం ఆలోచనలో పడ్డాడు ఉత్తమ్. మామూలుగా అయితే తల్లితండ్రులు కూడా వాళ్ళతోనే ఉండడంవల్లా, వాళ్ళు వృద్ధులు అవడంవల్లా ఎప్పుడు ఎవరికి ఏ అవసరం పడుతుందో తెలియదు. పైగా ఇది తన చేతిలో పనికాదు. ఇంకొకరి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడి ఉన్న విషయం. కనుకనే సింపుల్‌గా 'ఫలానారోజు' అని తేల్చేసే విషయం కాదు. అందుకే అతను అంతలా తడబడుతున్నది. ''ఎన్నిరోజులు.. అంటే, ముందు నేను నా సర్కిల్‌లో ఉన్నవాళ్ళని కలవాలి. వేకెన్సీలు ఏమైనా ఉన్నాయా? లేవా అడిగి తెలుసు కోవాలి. ఏమైనా ఉన్నాయంటేనే మిమ్మల్ని తీసుకెళ్ళగలిగేది. దీనికి ఓ పది పదిహేను రోజులు పట్టొచ్చు. మనం ఎప్పుడు వెళ్ళాల్సినదీ అసలు ఎక్కడికి వెళ్ళాల్సిందీ తెలిసేది ఈ గడువు తర్వాతనే! అంచేత, ఎప్పుడనేది నేనే చెబుతాను. సరేనా! ఇక మీరు నిశ్చింతగా ఉండండి'' భరోసా ఇచ్చాడు ఉత్తమ్.

''అలా అయితే ఫిఫ్టీన్ డేస్ తర్వాత నేను లీవ్ పెట్టేస్తాను ఒక రెండురోజులకి'' చప్పున అన్నాడు శ్రవణ్.

వింటున్న ఉత్తమ్ అతని ఖంగారుకి గతుక్కుమని, అంతలోనే సంభాళించుకున్నాడు. "ఒద్దొద్దు. నేను నా ప్రయత్నాలన్నీ చేసి అప్పుడు చెబుతాను మీకు. దాన్ని బట్టి లీవ్ పెడుదురుగాని. అందాకా తొందరపడొద్దు" అన్నాడు సాధ్యమైనంత అనునయంగా. "అబ్బే! నేను సెలవు పెడుతున్నది మీకోసం కాదు. నాకోసం. ఆడిటింగ్ హడావిడిలో ఒళ్ళు హూనం అయిపోయింది. ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్ కదా! అందుకే ఇదంతా అయిపోగానే రెస్ట్ కోసం పెట్టేద్దామనుకుంటున్నాను" అన్నాడు.

"అలా అయితే మీ ఇష్టం. నాకోసం మాత్రం పెట్టకండి. ఈ విషయం ముందుకు జరగడానికి కనీసం ఒక నెలైనా పట్టొచ్చు" ఎందుకైనా మంచిదని మరోసారి హెచ్చరించాడు ఉత్తమ్.

'అలాగే' అన్నట్టు తలూపి వెళ్ళిపోయాడు శ్రవణ్.

అతను వెళ్ళిన తర్వాత హాయిగా నిట్టూర్చాడు ఉత్తమ్. ఆ వెంటనే ఎప్పటిపని అప్పుడే అయిపోవాలన్న ఉద్దేశంతో తనకి తెలిసిన వాళ్ళకి ఫోన్ చేశాడు. "మీ కంపెనీలో ఎకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ఏమైనా వేకెన్సీలు ఉన్నాయా?" అంటూ.

"ఉన్నాయి. కానీ నేను ఆఫీస్ పని మీద కేంప్‌కి వెడుతున్నాను. తిరిగిరావడానికి ఓ నెల పడుతుంది. వచ్చాక మాట్లాడుకుందాం" అన్నాడు ఒకతను.

ఇంకొకతను అయితే "ప్రస్తుతం కొత్త కాంట్రాక్ట్ దక్కించుకునే హడావిడిలో ఉన్నాం. కనక ఒక నెల వరకు ఈ విషయం గురించి మాట్లాడొద్దు" అన్నాడు నిర్మొహమాటంగా. మిగిలిన ఒకరిద్దరుకూడా "ప్రస్తుతానికి ఏమీలేవు ఉంటే చెబుతాం" అన్నారు.

ఇదంతా విన్నాక "అంత ఖంగారేం ఉంది?" అనిపించడంతో ఉత్తమ్ కూడా ఊరుకున్నాడు.

"ఇవాళ నేను లీవ్‌కి అప్లై చేసేశాను. శాంక్షనయింది. రేపు, ఎల్లుండి ఆఫీస్‌కి వెళ్ళను" ఆ సాయంత్రం తనకి ఎదురుపడ్డ ఉత్తమ్‌తో చెప్పాడు శ్రవణ్.

"కానీ మరో ఫిఫ్టీన్ డేస్ వరకూ మావాళ్ళెవరూ మనకి అందుబాటులోకి రారు. అంచేత మీ జాబ్ గురించి కొంచెం ఆగాల్సిందే" సంజాయిషీ ఇచ్చాడు ఉత్తమ్.

"అహ! నేను లీవు పెడుతున్నది నాకోసమేనని ముందే చెప్పానుగా! కానీ ఈ సందర్భంగా నాదో స్మాల్ రిక్వెస్ట్"

"ఏమిటి?"

"మీరూ శలవు పెట్టచ్చుగా"

"పెట్టి?"

"నాతో రండి. ఇద్దరం కలిసి మీకు తెలిసినవాళ్ళ దగ్గరకి వెళ్ళి రెజ్యూమ్ ఇచ్చేసి వద్దాం. అలా వాళ్ళని మీరు నాకు పరిచయం చేసినట్టు ఉంటుంది కదాని" అర్థించాడు.

అతని ఏమని జవాబివ్వాలో ఉత్తమ్‌కి తోచలేదు. వాళ్ళెవరికో బావుండలేదనీ, వీళ్ళెవరిదో ఫంక్షన్ అనీ, ఇలా అతను తప్పనిసరి పరిస్థితుల్లో నెలలో చాలా శలవులే పెట్టేశాడు. దాని బాపతు వర్క్ చాలా పెండింగ్‌లో ఉంది. సాధ్యమైనంత వరకూ అతనెప్పుడు పనిని పెండింగ్‌లో పెట్టడు. ఉందంటే లీవ్ పెట్టడు. ఎవరో ఏదో అంటారని కాదు. తీసుకుంటున్న జీతానికి న్యాయం చెయ్యాలన్న వ్యక్తిగత బాధ్యత అది.

అందుకే నిర్మొహమాటంగా చెప్పేశాడు.

"చాలా వర్క్ పెండింగ్‌లో ఉండిపోయింది. లీవ్ ఇవ్వరు." అని.

"ఒక్కసారి ప్రయత్నించచ్చుగా" అర్థించాడు శ్రవణ్.

అతనలా అడుగుతుంటే పరిస్థితులు, సహాయం చేయాల్సిన వ్యక్తులు అనుకూలించక తను వెనకడుగు వేస్తున్నాడే తప్ప అతనికి సహాయం చెయ్యడం ఇష్టంలేక కాదు. దాన్ని తెలుసుకోకుండా తన ధోరణే తనదిగా మాట్లాడుతున్న శ్రవణ్ మీద కోపం రాబోయింది ఉత్తమ్‌కి.

కానీ ఉద్యోగంలో ప్రతిరోజూ అనుభవిస్తున్న శ్రమ, త్వరగా సుఖపడిపోవాలన్న తాపత్రయాలే అతనిచేత అలా మాట్లడిస్తున్నాయన్న నిజం గుర్తుకు రావడంతో ఆఖరినిమిషంలో అదుపు చేసుకున్నాడు.

"ప్రయత్నిస్తాను కానీ ముప్పాతిక మూడొంతులు కుదరదు. అంచేత నా గురించి ఆశ పెట్టుకోవద్దు. మీకోసం లీవ్ పెట్టుకున్నానన్నారుగా! హాయిగా రెస్ట్ తీసుకోండి" చెప్పాడు.

"అలాగే. అయినా రేపు ఉదయాన్నే కలుస్తాను" చెప్పేసి ఇక మాట్లాడేందుకేమీ లేనట్లుగా వెళ్ళిపోయాడు శ్రవణ్.

కుదరదని ఎంత చెబుతున్నా వినకుండా పదే పదే అదే ప్రస్తావిస్తున్న శ్రవణ్ చాదస్తానికి నవ్వొచ్చింది. నవ్వుకుంటుండగానే అతని సెల్ రింగయింది.

చేసింది కొలీగ్. ఉద్యోగస్తురాలయిన అతని భార్య ఆఫీస్ నుంచి వస్తుంటే దార్లో యాక్సిడెంట్ అయిందట. "నాకు చాలా భయంగా ఉంది. నువ్వు రాగలవా?" అంటూ దీనంగా అర్థించాడు ఫోన్‌లోనే.

వింటున్న ఉత్తమ్‌కి హృదయం ద్రవించిపోయింది. హుటాహుటిన బయల్దేరి ఆస్పత్రికి చేరుకున్నాడు. అతను వెళ్ళేసరికి చాలా ఖంగారుపడిపోతూ కనిపించాడు కొలీగ్.

నిజానికి అతని భార్యకి పెద్దగా దెబ్బలేమీ తగల్లేదు. జరిగింది కూడా చాలా 'చిన్న' యాక్సిడెంట్. కానీ, హఠాత్తుగా తెలియడంవల్లా, విషయం విన్నది లగాయితూ ఆమె కండిషన్‌ని కళ్ళతో చూసేంతవరకూ భార్యకి ఏమైపోయిందోనన్న ఆందోళనే అతన్ని ఎక్కువ కృంగదీసింది. పైగా అవసరం లేకపోయినా హాస్పిటల్‌లో ఆ టెస్టు, ఈ టెస్టు అంటూ ఆమెని రాత్రంతా అక్కడే ఉంచేశారు. దాంతో కొలీగ్‌కి సహాయంగా ఉత్తమ్ కూడా రాత్రి మొత్తం అక్కడే ఉండిపోయాడు.

తెల్లారే సరికల్లా వాళ్ళని పంపించేయడంతో ఉత్తమ్ కూడా ఇంటికి ఒచ్చేశాడు. అసలే రాత్రంత హాస్పిటల్ కుర్చీల్లో అరకొర కునుకు.. ఆ పైన ఉదయాన్నే ఆఫీస్‌కి వెళ్ళాల్సి రావడంతో ఒక విధంగా అతను చాలా ఇబ్బందినే అనుభవించాడు. అంత ఇబ్బందిలో ఉన్న అతనికి శ్రవణ్ విషయం గుర్తుకురాకపోవడం సహజమే. కనుకనే ఎంత హడావిడిగా వచ్చాడో అంత హడావిడిగానూ ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు.

సాయంత్రం ఆఫీస్‌నుంచి ఉసూరుమంటూ ఇంటికి తిరిగొస్తున్న ఉత్తమ్‌కి పాన్ డబ్బా దగ్గరే కనిపించాడు శ్రవణ్. అతన్ని చూస్తూనే చెయ్యూపాడు ఉత్తమ్ 'హాయ్' అన్నట్టు. కానీ అప్పటికే తన ముఖాన్ని చటుక్కున మరోవైపుకి తిప్పేసుకున్నాడు శ్రవణ్.

"ఏదో ధోరణిలో ఉండి ఉంటాడు. చూడలేదేమో" అనుకుంటూ అతని వైపు అడుగులేశాడు ఉత్తమ్, దగ్గరగా వెళ్ళి పలకరించాలన్న ఉద్దేశంతో. అయితే అతనలా రావడం శ్రవణ్ గబగబా అక్కణ్ణుంచి వెళ్ళిపోవడం రెండు ఒకేసారి జరిగాయి. చూస్తున్న ఉత్తమ్‌కి కొంచెం ఆశ్చర్యంగా అనిపించినా, అంతలోనే తేరుకున్నాడు. "పోన్లే ఇంటికి వెళ్ళాక తీరిగ్గా మాట్లాడచ్చు" అనుకుంటూ.

అయితే అతని అభిప్రాయం తప్పు అన్నట్టుగా వేగంగా ముందుకి నడుస్తున్న శ్రవణ్, ఠక్కున ఆగిపోయి, వెనుదిరిగి ఉత్తమ్ వైపు చూశాడు. అది గమనించాడతను. శ్రవణ్ తనకోసమే ఆగి ఉంటాడన్న ఉద్దేశంలో ముందుకు నడిచేలోపు.. గిర్రున వెనుదిరిగి పరుగులాంటి నడకతో అక్కణ్ణుంచీ వెళ్ళిపోయాడు. పైగా వెడుతూ వెడుతూ ముఖం చిట్లించి, కొరకొరా చూపొకటి విసిరి మరీ వెళ్ళాడు.

బిత్తరపోవడం ఉత్తమ్ వంతయింది. ఒకవేళ తన లీవ్ సంగతి చెప్పనందుకు అతనికి కోపం వచ్చిందేమో అనిపించింది. ఆలోచిస్తూ ఇంటికి చేరుకున్నాడు. ఆ తర్వాత. వచ్చింది లగాయితూ తను రాత్రి హాస్పిటల్‌లో ఉన్న సంగతీ, తనకి శలవు దొరకని విషయం చెబుదామని ఎంతగానో ప్రయత్నించాడు.

శ్రవణ్ పడనిస్తేగా! ఉత్తమ్ వచ్చేంత వరకు అక్కడే నిలబడడం అతన్ని దగ్గరగా రానిచ్చి, చటుక్కున అక్కడినుంచి వెళ్ళిపోవడం.. ఇలా ఒకటికాదు. రెండుకాదు. దరిదాపు నాలుగుసార్లు తను కోపాన్ని వ్యక్తీకరించాడు.

తప్పు మనది కాకపోయినా ఎదుటి వాళ్ళు పడుతున్న బాధని చూడలేక అనునయించాలనుకోవడం ఉత్తముల లక్షణం ఏదో పొరపాటువల్ల తలెత్తిన విభేదాల్ని సమసిపోయేలా చేయాలని ప్రయత్నించడం అర్థం చేసుకునే వాళ్ళ లక్షణం. కానీ, అసలు విషయమేమిటో అడిగి తెలుసుకోకపోవడం, దానిగురించి మనమే చెప్పబోయినా వినిపించుకోకపోవడం మూర్ఖుల లక్షణమైనప్పుడు ఎంత సహన వంతులకైనా ఛరున కోపం రాకమానదు. ఇప్పుడూ అదే జరిగింది.

తను చెప్పాలని ప్రయత్నిస్తున్నప్పుడల్లా వినిపించుకోకుండా మరీ చిన్నపిల్లల్లా ప్రవర్తిస్తున్న శ్రవణ్ వైఖరి ఉత్తమ్‌కి విసుగునేకాదు, కోపాన్ని తెప్పించింది. ఇక అతన్ని సమాధానపరచాలన్న ఆలోచనకి స్వస్తి చెప్పి తన పనిలో నిమగ్నమయ్యాడు ఉత్తమ్.

"హాయ్! అన్న పిలుపు విని తలెత్తి చూశాడు ఆఫీస్‌కి బయల్దేరుతున్న ఉత్తమ్. అక్కడ శ్రవణ్ నిలబడి ఉన్నాడు నవ్వుతూ. కానీ ఉత్తమ్ నవ్వలేదు. "ఇవాళ వెడదామా?" అడిగాడు నవ్వుతూ. ఆ స్వరంలో అదోరకమైన అధికారం.

"సారీ! నాకు లీవ్ దొరకలేదు" అన్నాడు ఉత్తమ్ నిష్కర్షగా.

"కనీసం ఆఫ్‌డే పర్మిషనయినా తీసుకోండి. ట్రై ఎగైన్" మళ్ళీ శ్రవణ్ వత్తిడి.

"అస్సలు కుదరదు" జారిపోతున్న సహనాన్ని అతి కష్టం మీద కూడదీసుకుంటూ చెప్పేసి ముందుకు కదిలాడు టైమవుతుండడంతో.

ఒకవేళ మధ్యాహ్ననికల్లా తను పర్మిషన్ తీసుకుని రాకపోతే కనుక నిన్నటిలాగే, బహుశా ఇవాళ కూడా అతడి కోపాన్ని తన మొహం మీదే ప్రదర్శించేస్తాడేమో ఈ శ్రవణ్. అనుకున్నాడు ఉత్తమ్. ఆ సాయంత్రం అదే జరిగింది. ముప్పయ్యేళ్ళు నెత్తికొచ్చినా ఇంకా చిన్నపిల్లాడిలా వ్యవహరిస్తున్న, ఉచితానుచితాలు లేని శ్రవణ్ వైఖరి ఉత్తమ్‌కి చిరాకు తెప్పించింది.

నిజానికి చిన్నపిల్లల్ని బుజ్జగిస్తే మన దారికి వచ్చేస్తారు. కానీ స్వార్థపరులు అలాకాదు. తాము అనుకున్నపని, అనుకున్న సమయానికి అనుకున్న విధంగా జరిగిపోవాలనుకుంటారే తప్ప, ఇతరుల సాధక బాధకాల గురించీ, సాధ్యాసాధ్యాల గురించీ పట్టించుకోరు. సరికదా ఎటువంటి జంకులేకుండా తమకోపాన్ని అసహనాన్నీ బాహాటంగానే ప్రదర్శించేస్తారు. పైగా ప్రతిమనిషికీ ఓ పద్ధతి, ఏ వ్యవహారానికైనా ఒక వీలూ సాలూ ఉంటుంది. దాన్ని బట్టే పనిసానుకూలమౌతుంది. తన చేతిలో ఉన్న పని తనకి చేతనైనట్టు తన వీలు ప్రకారం చేయగలడు కానీ శ్రవణ్ వీలు ప్రకారం కాదు. పైగా. ఉపకారం చేయడం మానవత్వం అనుకునే వాళ్ళున్నట్టే, అవతలి వాళ్ళ ధర్మబుద్ధినీ మంచితనాన్నీ అవకాశంగా తీసుకుని తమ పబ్బం గడుపుకోవాలనుకునే సంకుచిత స్వభావులూ ఉంటారు. శ్రవణ్ ఈ రెండో కోవకి చెందిన వ్యక్తి.

అందుకే మెత్తగా కనిపిస్తున్న ఉత్తమ్‌ని తనకి అనుకూలంగా మార్చుకోవాలనుకున్నాడు. అది కుదరకపోయేసరికి కోపాన్ని ప్రదర్శించి బెదిరించాలనుకున్నాడు. తను అలా వ్యవహరించిన తక్షణం ఎక్కడ చెడ్డపేరు వస్తుందోనన్న భయంతో అయినా ఉత్తమ్ తనమాట వింటూ ఉన్నది అతని నమ్మకం. ఇంతకు ముందు చాలాసార్లు చాలామంది విషయంలో అతని అనుభవం కూడా.

అయితే అరచేతికి ఉన్న ఐదువేళ్ళూ భిన్నంగా ఉన్నట్టే, మనుషులూ, మనస్తత్వాలూ, వ్యక్తిత్వాలూ, కూడా విభిన్నం. కనుకనే శ్రవణ్ వ్యూహం అతనికే బెడిసికొట్టింది.

ఆ తర్వాత ఉత్తమ్ అతన్ని పలకరించడం మానేశాడు. ఒక వేళ శ్రవణ్ తనంతట తానుగా పలకరించినా ఏదో మర్యాదకి సమాధానం చెబుతున్నాడే తప్ప, మునుపటిలా మాట్లాడటల్లేదు. ఆ ముక్తసరి పలకరింపులవల్ల తన గురించిగానీ, తన జాబ్ గురించిగానీ మాట్లాడే అవకాశం శ్రవణ్‌కి రాలేదు. ఇంత జరిగిన తర్వాత 'అతి తెలివికి పోకుండా ఉండాల్సింది' అని శ్రవణ్ అనుకున్నాడో లేదోగానీ, ఉత్తమ్ మాత్రం ఒకటే అనుకున్నాడు

"మనిషికి చాలాచోట్ల సానుకూల దృక్పథం ఎంత అవసరమో, ఒక్కోచోట ప్రతికూల దృక్పథమూ అంతే అవసరం. ముఖ్యంగా అవతలి వ్యక్తులు మనకి అనుమానం కలిగేలాగనో, అనుచితంగానో, లేక అతిగానో వ్యవహరిస్తున్న వేళ, నిర్లక్ష్యం అస్సలు కూడదు. ఈ నిజాన్ని తను ముందే గ్రహించి ఉండాల్సింది. ఏవేమైనా ఉపకార బుద్ధి ఉండడం మంచిదే కానీ దాన్ని అందించేముందు అవతలివారి గురించి బాగా ఆలోచించాలి. ఆచితూచి అడుగేయాలి. లేకపోతే అనవసరమైన సమస్యలు తలెత్తి ఉపకారికే అపకారం జరిగే పరిస్థితి ఎదురవ్వచ్చు" అని.

***

## పురస్కారం — సింహప్రసాద్

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"నాన్నా"

"చెప్పు కన్నా"

"మీరేమీ అనుకోనంటే..."

"ఏదైనా ఎందుకనుకుంటాన్రా. పాలు తాగే వయస్సులో నువ్వు నా గుండెల మీదెక్కి తొక్కినప్పుడు మురిసిపోయాను తప్ప ఏమీ అనుకోలేదే. పండుగనాడు నా కొత్తబట్టల మీద ఒంటేలుకు పోయినప్పుడు కొంచెం కూడా కోప్పడలేదు కదరా. ఆఫీసు కెళ్తున్నప్పుడు నాతో బాటు వస్తానని మారాం చేస్తే సెలవు పెట్టి మరీ నిన్ను పార్కుకి తీసుకెళ్ళాను. గుర్తుందా? హైస్కూల్లో ఉండగా నాకు చెప్పకుండా మిత్రుడి సైకిల్ తీసుకుని తొక్కడం నేర్చుకుంటూ, మోకాళ్ళూ మోచిప్పలూ పగలు గొట్టుకునొస్తే మందు రాశాను తప్ప మందలించలేదు. అప్పుడు అనుకోనిది ఇప్పుడు అనుకుంటానా చెప్పు..?"

"నాకు తెలుసు నాన్నా. నేనంటే మీకూ, అమ్మకు ప్రాణం - కాదు పంచప్రాణాలు"

"నువ్వు నిజంగా మా ప్రాణానివేరా. మాలోంచి ప్రాణశక్తి తీసుకుని ఊపిరిపోసుకున్నవాడివే. మావేగాక తాత ముత్తాతల లక్షణాలూ పోలికలూ పుణికి పుచ్చుకున్న మా వంశాంకురానివి"

"మీ కోసం ఫలానాది కావాలని మీరెప్పుడైనా కోరుకున్నారా నాన్నా?"

"నా కోసమా! వూహూ. నేనెప్పుడూ కోరుకోలేదురా. మీ అమ్మకోసం మన కుటుంబం కోసం కోరుకున్నాను. నీ కోసమూ రెండు సార్లు కోరుకున్నారా"

"రెండు సార్లేనా"

"వూఁ. నువ్వు మీ అమ్మ కడుపులో ఉన్నప్పుడు నీ ఆరోగ్యం నీ ఎదుగుదల అన్నీ సక్రమంగా ఉండాలని ఎందరో దేవుళ్ళకి మొక్కింది మీ అమ్మ. గర్భిణుల మీద గ్రహణ ప్రభావం ఉండదని తెలిసినా నీకోసం ఎలాంటి రిస్కూ తీసుకోకూడదని గ్రహణకాలంలో ఏమీ తినకుండా త్రాగకుండా మౌనంగా కూర్చుంది. ఇహ నేనేమో నువ్వు క్షేమంగా భూమ్మీదకి రావాలని మొదటిసారిగా కోరుకున్నాను. నీ బుడిబుడి నడకలకి పొంగిపోయి నీ నడకా నడతా ఎప్పటికీ సవ్యంగా నవ్యంగా ఉండాలని కోరుకున్నాను. ఆ రెండు సార్లేరా నీ గురించి ప్రత్యేకంగా నేను కోరుకున్నది"

"ఇప్పుడు నేను పెద్దవాడ్నయ్యాను. మీకన్నా పొడుగయ్యాను. మీ కన్నా ఎక్కువ సంపాదిస్తున్నాను. మీరు నర్సాపురంలో ఉంటే నేను న్యూయార్క్‌లో ఉన్నాను"

"అన్నిటా నన్ను మించి పోయినందుకు చాలా సంతోషంగా వుందిరా. ఆనందాల్లోనూ అనుబంధాల్లోనూ నన్ను దాటిపోవాలి. అదే నా తపన, కోరిక, ఆశ"

"మీరే నాకు ఆదర్శం. మీ అడుగు జాడల్లో నడవాలన్నదే నా కోరిక.."

"నా అడుగుల్లో అడుగు వేస్తే నే వెళ్ళిన చోటుకే నువ్వూ వెళ్తావు. వూహూ. నువ్వింకా ఎంతో ఎంతో దూరం ప్రయాణించాలి. కొత్తదార్లు తొక్కాలి. ఎన్నో ఎత్తులకెదగాలి. ఎందరెందరికో ఆదర్శప్రాయుడివి కావాలి. నిన్ను చూసి నీ గురించి విని నీ స్ఫూర్తితో మరెందరో జీవితంలో ఎంతో ఉన్నత స్థితికి చేరుకోవాలి"

"మీరు నా ప్రక్కన ఉండాలి గాని ఏమైనా సాధిస్తాను."

"ఇంతదాకా ఉన్నాం కదరా చిన్నా. మీ అమ్మకు పురుటి నొప్పులొస్తున్నప్పుడు, ధైర్యం చెబుతూ అమ్మకడుపులో వున్న పక్కనే లేబర్ రూంలో ఉన్నాను. అమ్మని డెలివరీ రూంలోకి తీసుకెళ్ళినప్పుడు ఆ ప్రక్క గదిలోనే ఆందోళనతో ఎదురుచూస్తూ వున్నాను. నువ్వు పాలు తాగుతున్నప్పుడు, ఆడుకుంటున్నప్పుడు, అల్లరి చేస్తున్నప్పుడు హోం వర్కు చేస్తున్నప్పుడు, బడికెళ్తున్నప్పుడు, పరీక్షలకు తయారవుతున్నప్పుడు, నీ ప్రతి అడుగులోనూ నీ ప్రక్కనే నీ వెంటే నీ వెన్నంటే ఉన్నాను. నువ్వు బ్యాలన్స్ తప్పి ఎక్కడ పడిపోతావోనని నీ దారి పొడవునా నా రెండు చేతులూ అడ్డుపెట్టి కాపుగాచాను. నీ దారి పొడవునా దివిటీలు పట్టి నిలిచాను"

"నాకు తెలుసు నాన్నా. అందుకే మీకేమైనా గొప్ప బహుమతి ఇవ్వాలని ఉంది. ఇంతవరకు ఏ కొడుకూ ఏ తల్లిదండ్రులకీ ఇవ్వనంత గొప్పది ఇవ్వాలని ఉంది. ఒక రకంగా మీ మాతృ పితృ ప్రేమల్ని పురస్కరించాలని ఉంది. మీకు గానీ అమ్మకు గానీ తీరని కోరిక, తీరితే బాగుండుననుకున్న కోరిక ఏదైనా ఉంటే చెప్పండి నాన్నా.. తీర్చేస్తాను"

"పిచ్చి నాన్నా. నీ మాటలకే మా కడుపు నిండి పోయిందిరా. పరమాన్నం తిన్నట్టుగా ఉంది. మాకింకేం కావాలి చెప్పు?"

"అలా అనొద్దు. మీక్కావల్సింది ఏదైనా సరే ఎంత ఖరీదైనా సరే కొంటాను. నా రెక్కలకింత శక్తి రావడానిక్కారణం మీరే నాన్నా. నా జన్మంతా ఊడిగం చేసినా మీ ఋణం తీరదు.."

"అది గుర్తున్నందుకు చాలా సంతోషంగా ఉందిరా చిన్నా"

"మీరు చల్లగా నిద్రపోవడానికి ఏసీ పెట్టిస్తాను. కరెంటు కష్టాలు తెలీకుండా ఇన్వర్టర్ కొంటాను. హాయిగా బయట తిరగటానికి కారు కొనిస్తాను. ఇంకా పెద్ద ఇల్లుగానీ డూప్లెక్స్ గానీ కొననా? చెప్పు నాన్నా ఇప్పుడే కొనేస్తాను."

"ఎంత పెద్ద ఇల్లు అయినా ఉండేది మేం ఇద్దరమే కదురా. మాకీ గూడుచాలు గాని, కొనకుండా ఇవ్వగలిగిందేదైనా ఇవ్వరా చిన్నా"

"డబ్బు పెట్టి కొనకుండా ఊరికే ఏమీరాదు కదా నాన్నా"

"ఈ ప్రపంచంలో తల్లి పాలు తప్ప ఏవీ ఉచితంగా లభించవని నాకూ తెలుసురా. కానీ మాకు ఆర్థిక బహుమానం గాక హార్దిక బహుమానం కావాలి"

"నాకేం అర్థం కావట్లేదు. కొంచెం వివరంగా వివరించు నాన్నా, ఇచ్చేస్తాను"

"నువ్వీ ప్రపంచంలోకి రాబోతున్నావని తెలిసి మేమంతగా పొంగిపోయామో చెప్పలేను. నీ రాకకోసం ఎంతగా ఎదురు చూశామో, నీకు స్వాగతం చెప్పాలని ఎంతగా ఉవ్విళ్ళూరామో, నీకోసం ఎన్ని ఏర్పాట్లు చేశామో మాటల్లో చెప్పలేను. నువ్వు వస్తూ మమ్మల్నెంత మధురానుభూతికీ, పరమానందానికీ లోను చేశావో అదీ చెప్పలేను. అప్పుడు మా మనసులెంత ఉద్విగ్నోత్సాహాలతో ఉప్పొంగిపోయాయో, మా మోములెంతగా వికసించాయో, మా శరీరాల్లోని అణువణువూ ఎంతెలా పులకరించి పోయాయో వర్ణించలేను."

"అవునవును. నా చిన్నప్పుడు అమ్మ చెప్పింది. పురుటి కష్టాన్నంతా నా మోము చూస్తూనే మరచిపోయిందిట. పురుటి నొప్పులు తాళలేక చచ్చిపోతే బావుణ్ణనుకున్న అమ్మ నన్ను చూశాక నాకోసం వెయ్యేళ్ళు బ్రతకాలనుకుందిట"

"అవునవును. సరే, కోరుకోమంటున్నావు గనుక మనస్సులోని మాట చెబుతున్నాను. నీ నుంచి మేం ఆశించేదీ అలాంటి ప్రతిస్పందనేరా"

"ఏవిటేవిటీ? మీకేం కావాలీ? త్వరగా మనస్సులోని ఊసు బయటపెట్టండి నాన్నా"

"మేం ఈ లోకాన్ని వదిలి వెళ్ళేటప్పుడు నువ్వు మా ప్రక్కనే ఉండాలి. మమ్మల్ని సాదరంగా సాగనంపాలి. నిన్నూ నీ ప్రేమమూర్తినీ చూసి నిన్ను కన్న మా జన్మ ధన్యమైందన్న భావనతో తృప్త మనస్సుతో మేం ఈ ప్రపంచపు రంగస్థలం మీంచి నిష్క్రమించాలి. అదేరా బిడ్డలు తల్లిదండ్రులకిచ్చే అత్యున్నత అత్యంత విలువైన బహుమతి పురస్కారం."

---

## ఈష విద్యార్థి

"నా గోల్ఫ్ షర్ట్ ఇస్త్రీ చెయ్యలేదా? ప్రతి శనివారం నాకు గోల్ఫ్ వుంటుందని నీకు తెలుసుకదా?"

"ఏం, మీరే ఇస్త్రీ చేసుకోవచ్చు కదా? నేనెందుకు చెయ్యాలి?"

తెల్లారే ఇస్త్రీ వాదం లేవదీసింది మా హాటు హాటు హాట్టీ. కొంత కాలంగా మొదలయ్యింది ఈ వ్యవహారం. అటు మొన్నటి నాటీ, మొన్నటి స్వీటీ, నిన్నటి బ్యూటీ, ఇవ్వాళ అసలు ఎందుకిలా హాటు హాటు హాటీగా మారిందో అసలు అర్థం కావటం లేదు.

అసలు తప్పు అంతా నాది. కాలేజీ రొజుల్లో క్రికెట్ టోర్నమెంటుకి కృష్ణా బారేజ్ దాటి, వాళ్ల కాలేజీలో వీరగా బాట్టింగ్ చేస్తూ వుంటే, ఉన్నట్టుండి ఎక్కడినుంచి దిగివచ్చిందో, ఎదురుగా బౌండరీ లైన్‌కి వెనకాల బెంచీ ఎక్కి, ఎగతాళిగా చప్పట్లు కొడుతూ, వెక్కిరించటం మొదలుపెట్టింది. ఏం చేస్తాం, ఔట్ అయ్యా. పక పకా పగలబడి నవ్వింది. పడి పోయా.

రోజూ అరువు డొక్కు స్కూటర్ వేసుకుని “టాం అండ్ జెర్రీ’లో టాం గాడికి మల్లే నోరు బార్లా తెరుచుకుని, నాలుక జార్చి, చొంగలు కార్చుకుంటూ బారేజీ మీదనుంచి వీడియో గేములో మోటర్ బైక్ రేసింగ్‌లాగా రోజూ పరిగెత్తేవాడిని. మొత్తానికి సరే అన్నది. పెళ్ళికి ముందు మా తాత వియ్యానికి యేరు దాట కూడదురా అని చాలా జాగ్రత్త చెప్పాడు. డోంట్ కేర్, ఈ ముసలి కబుర్లు నాకు పనికిరావన్నా. ప్చ్, విన్నా పోయేది. అసలు ఇటువైపు కృష్ణా జిల్లా అయితే, అటువైపు సత్తెభామ జిల్లా అని పేరు పెట్టాల్సింది. కాదు, కాదు, అసలు రాష్ట్రం మొత్తానికే పేరు మార్చి సత్తెభామాంధ్రప్రదేశ్ అంటే పోతుంది. ఛ, ఛ, ఆ రోజు మా తాత మాట విన్నా పోయేది.

అసలు నా గోల్ఫ్ షర్ట్ ఇస్త్రీ నేనే చేసుకోవాలా లేక ఈ ఇస్త్రీవాదాన్ని ఎదురించాలా అని కొన్ని క్షణాలు ఆలోచించా. అసలు తను ఇప్పుడు అంత పొడిచే పని ఏం చేస్తోంది?

తీరికగా అర్ధ పద్మాసనం వేసి కూర్చుని, రెండో కాలు కొద్దిగా మడతబెట్టి , కాళ్ల గోళ్లకి రంగు వేసుకుంటోంది. ఎదురుగా ఐపాడ్ విశ్వనాథ, విశ్వనాథ అంటూ మోగుతోంది. పోనీ బొమ్మ ఏమన్నా ఆడుతున్నదా అంటే, అదీ లేదు. మూడు నెల్ల నించి ప్రతి శనివారం ఉదయం ఇదే తంతు, విశ్వనాథ, విశ్వనాథ అంటూ మోగటం, తను నన్ను పట్టించుకోకుండా కాళ్ల గోళ్లకి రంగు వేసుకోవటం.

ధైర్యం తెచ్చుకుని అసలు సంగతేమిటో కనుక్కుందామని నెమ్మదిగానే అడిగా. "ఇస్త్రీ చెయ్యకపోతే, చెయ్యకపోయావ్, కనీసం మర్యాదగా మాట్లాడొచ్చు కదా? కనీసం "ఏమండీ, ఈ సారికి ఇస్త్రీ మీరే చేసుకోండి" అని ప్రేమగా చెప్పొచ్చు కదా?"

"అంతేనా, లేకపోతే, నాథా అని పిలవాలా, ఆర్య పుత్ర అని పిలవాలా?" అని ప్రశ్నించింది. సత్తెభామే నయ్యం అనిపించింది.

"ఏం, పోనీ అలాగే పిలవరాదూ?"

"కొత్త తెలుగు సినిమాల్లోని గర్ల్‌ఫ్రెండ్ లాగా ఏరా, వురేయ్ అని పిలవటం లేదు, సంతోషించడి, నేను విశ్వనాథ గురించి వినాలి, ఇంకా ఎక్కువ మాట్లడకండి" అని గొంతు పెంచకుండానే గట్టిగా హెచ్చరించింది.

"మీ ఇంట్లో మీ నాన్నగారిని కొత్త తెలుగు సినిమాల్లోని గర్ల్‌ఫ్రెండ్ లాగా ఎవరన్నా అలాగే పిలుస్తారన్నమాట" ఎదురుమాట వేసాను. ఏం, నేనెందుకు తగ్గాలి?

ఒక్కసారిగా వెనక్కి తిరిగి, త్రీ క్వార్టర్ పోజులో, క్రీగంట నన్ను చేస్తూ ఒక తీక్షణ వీక్షణం విసిరింది. చురుక్కుమంది. ఏం చెయ్యాలో తోచలేదు. పొగిడితే పోలా?

"నీకు కోపం వచ్చినప్పుడు చాలా అందంగా వుంటావోయ్. కెమారా తీసుకు వస్తానాగు, అదే ఫోజులో నిన్ను ఫొటో తీస్తా" అన్నా. హాటీ స్వీటీగా ఉన్న రోజుల్లో ఈ మంత్రం గొప్పగా పనిచేసేది.

అంతే, నెమ్మదిగా తన ప్రక్కనే ఉన్న, కొత్తగా వచ్చిన కళ్లజోడు అందుకోబోయింది. హమ్మో, ఇంకా ఏమన్నా వుందా? ఆ కళ్లజోడు తీరికగా తగిలించుకుని, కనుబొమ్మలు కొద్దిగా పైకెత్తి, కళ్లజోడుని ముక్కు మీదకు కొంచెంగా దించి, అటూ ఇటు ఇంకొంచెం సర్ది, తల ఎత్తి, సూది మొన ముక్కు మీద నుంచి సూటిగా నన్ను చూసిందంటే, శివుడి మూడో కన్ను కూడా పనికిరాదు. భస్మం కూడా మిగలదు.

ఒక్క ఉదుటున నా గోల్ఫ్ షర్ట్ పట్టుకుని జంప్ చేసుకుంటూ బ్రూస్‌లీ లాగా మెట్లు ఒక్క సారిగా దూకి కిందకి వచ్చేసా.

అసలు ఏమీ అర్థం కావటంలేదు. నేను ఏది చేసినా తప్పయి పోతోంది. మొన్నటికి మొన్న ఏదో తళ తళ మెరిసే బ్యాగ్ కనబడింది. ఏమిటా అని చూస్తే, ఏదో క్రీం. శీతాకాలం కదా, ఆ క్రీం బాగుందని కాళ్లకి రాసుకున్నా. వచ్చి చూస్తూనే "అనవిని వ్రేటువడ్డ యురగాంగనయుం బలె" అన్నట్టు **"ఖస్ బుస్" అంటూ** ఊగిపోయింది. చివరికి విషయం ఏమిటంటే, తను రెండో తరగతి చదువుకునేటప్పుడు తనతోపాటు తాడాట ఆడుకున్న గొప్ప

స్నేహితురాలు మొన్ననే ఫేస్ బుక్‌లో కనిపించిందంట. ఇండియా వెళ్లినప్పుడు ఇద్దామని మేసీస్‌లో వైట్ ఫ్లవర్ సేల్ వుంది కదా అని మంచి సువాసన వచ్చే ఫేస్ క్రీం కొన్నదంట. నేనేమో కల్చర్ లేకుండా మొఖానికి రాసుకోవాల్సింది కాళ్లకి రాసుకున్నానంట. ఎవడికి తెల్సూ? ఏది ఫేస్ క్రీమో, ఏది కాళ్ల క్రీమో?

సరేలే, ఏదో డేమేజ్ కంట్రోల్ చేద్దామని ఆ రోజు నా కాఫీ కప్పు నేనే తళ తళా తొమేసా.

కప్పు కడిగి పక్కన పెట్టానో లేదో వెంటనే ఉరుములు, మెరుపులు. తప్పు స్పాంజీ వాడానంట. కొత్త స్పాంజి దేముడి సామానుకు వాడాలి, అది కొంత పాతదైన తరువాత చిన్న చిన్న వెండి, ఇత్తడి, ఫ్యాషన్ గాజు సామానుకి వాడాలి. అది ఇంకొంత పాతదైన తరువాత గిన్నెలు తోమటానికి వాడాలి, ఆఖరుకు ఆ స్పాంజ్లు వానప్రస్థాశ్రమం చేరుకునేటప్పటికి కిచెన్ సింకు శుభ్రం చెయ్యటానికి, యేసి తోమటానికి వాడాలి. ఇవి మా ఇంట్లో అంట్లు తోముకునే స్పాంజి వాడుకోవటానికి వున్న రూల్స్ అంట. నేనేమో దేముడి సామాను శుభ్రం చేయాల్సిన స్పాంజీతో నా కాఫీ కప్పు తెగ తోమేసాను. ఎంత పాపం అంటగట్టుకున్నానో తెలీదుకానీ, ఇంట్లో సెగలూ పొగలూ. బోడి స్పాంజులు, పావలాకు పాతిక వస్తాయి.

ఇంటి నిండా రూల్స్, రూల్స్, రూల్స్. అక్కడుండాల్సింది ఇక్కడికెలా వచ్చింది? ఇక్కడుండాల్సి అక్కడికి ఎలా వెళ్లింది? ఎక్కడిది అక్కడ పెట్టలేరూ? ఎక్కడుండాల్సింది అక్కడే వుండాలి. అక్కడిది ఇక్కడ, ఇక్కడిదక్కడా వుండకూడదు. ఎక్కడిదక్కడ సర్దండి. అసలు ఆఫీసులో ముప్పాతిక మిలియన్ల ప్రాజెక్టు నడుపుతున్నా. అక్కడ కూడా ఇన్ని రూల్స్ లేవు. అసలు ఆమాట కొస్తే ఆఫీసులో నేను పులిరాజునే. ఇంటికి వచ్చానంటే దుర్గా దేవి సవ్వారీ.

ఛ ఛ్ఛా, ఇవ్వన్నీ ఆలోచిస్తూ వుంటే గోల్ఫ్‌కి ఆలస్యమవుతోంది. ఇస్త్రీ లేని షర్టును ఝాడించి నాలుగు సార్లు దులిపితే ముడతలేమీ కనపడినట్లనిపించలేదు. వేసుకుని బయల్దేరా. గారేజ్‌లో మా ఓల్డీ గోల్డీ పలకరించింది. నాకు మొదటి ఉద్యోగం వచ్చినప్పుడు కొనుక్కున్న కారు మా ఓల్డీ గోల్డీ.

ఓల్డీ గోల్డీని డ్రైవ్ చేస్తూ ఆలోచనలో పడ్డా. ఏది ఏమైనా మా హాటు హాటు హాట్టీని మళ్లీ స్వీటు స్వీటు స్వీటీని చేసుకోవాలి. ఎలా చేద్దాం? ఉన్నట్టుండి కొత్త కార్ షోరూం కనిపించింది. ఒక్క సారిగా బల్బు వెలిగింది. మాంచి కొత్త కారు బహుమతిగా ఇస్తే? అసలు ఈ కొత్త రకం కార్ల కంపనీ గురించి ఆచూకీ తీద్దామని ఎప్పటినుంచో అనుకుంటున్నా.

షోరూంలోకి అడుగు పెట్టగానే ఒక నవ యువతి నవ్వులు చిందిస్తూ ఎదురయ్యింది. కాఫీ తాగుతారా, వైన్ పుచ్చుకుంటారా అని అడిగింది.

“కాఫీతో కలిపి వైన్ లేదా” అని జోకాను.

“ఓ, తప్పకుండా, రండి ఈ కారులో కూర్చోండి అని కొత్త కారులో కూర్చోబెట్టింది. కారు అంతా వాయిస్ ఆక్టివేటడ్” అన్నది. అంటే, మనం ఆర్డర్లు పడేస్తే ఎదురుచెప్పకుండా వింటుంది.

"సరే, అట్లాగయితే నాకు కాఫీ తెప్పించమనండి"

"ఈష, కాపచ్చినో మార్టీని" అన్నది నవ యువతి.

డాష్ ్బోర్డ్ కొంచెం తెరుచ్కుంది, ఒక ఎస్ప్రెస్సొ మెషీన్లోనుంచి కాఫీ, వెంటనే కొంత జిన్ మాంచి వైన్ గ్లాస్లో పడింది. తరువాత కొంత క్రీం, ఆ పైన గొప్ప డిజైన్‌తో మాంచి సువాసనలతో సినామన్ పౌడర్ వగైరా స్ప్రే చేసింది.

సిప్ చేస్తూ "ఇంతేనా, లేకపోతే కార్ నడుస్తుందా" అన్నాను.

"ఈష, ఒక టెస్ట్ డ్రైవ్‌కి వెళ్దాం పద" అన్నది నవ యువతి. అరే, కార్ దానంతకు అదే కదులుతున్నదే?

"ఈ కార్ పేరు ఈష. మీరు చక్కగా రిలాక్స్ కండి. ఒక వేళ మీరు గోల్ఫ్ ఆడడానికి మీ స్నేహితులతో వెళ్తున్నారనుకోండి, ముందు సీట్లు వెన్నకి తిప్పి నలుగురూ ఎదురు ఎదురుగా కూర్చోవచ్చు. ఈష, లివింగ్ రూం" అన్నది నవ యువతి. అరే ముందు సీటు వెనక్కి దానంతటికి అదే తిరిగిందే? నవ యువతి లేచి ఎదురుగా కూర్చుంది.

"ఈష, లౌంజ్ చెయిర్" అన్నది నవ యువతి. నా సీట్ దానంతటికదే మాంచి పడక కుర్చీలాగా తయారయ్యింది. ఎంత మెత్తగా, హాయిగా ఉందో!!!

"మీరు ఈ ఎదురు సీటు మీద కాళ్లు పైన పెట్టుకుని, ఇంకొంచెం బాగా రిలాక్స్ కండి". నవ యువతి చిరు నవ్వు చిందిస్తూ చెప్పింది.

"ఇంతేనా, మేము ఫ్రెండ్స్ కార్డ్స్ ఆడుకోవాలంటే?"

"ఈష, క్లబ్ రూం" అన్నది నవ యువతి. వెంటనే మధ్యలోనుచి ఒక చిన్న టేబిల్ లేచింది. దాని మీద రెండు పేక ముక్కల సెట్లు, ఒక చిన్న ఫ్లావర్ వేజ్‌లో ఒక గులాబీ.

"ఈషా, డ్రింక్స్" అన్నా నేను కొంత వ్యంగ్యంగా.

"ఈషా ఇప్పుడు నా మాట మాత్రమే వింటుంది. మీకు కంట్రోల్ ఇస్తున్నాను" అన్నది నవ యువతి. మళ్లీ చెప్పా డ్రింక్స్ అని. ఒక పక్కగా ఒక చిన్న ట్రే లేచింది. దాని మీద రెండు డ్రింక్స్ బాటిల్, నాలుగు గ్లాసులు. అరే, బాగుంది.

"కార్, మీ కోసమా, మీ స్వీటీ కోసమా" అడిగింది నవ యువతి. అప్పుడు గుర్తుకొచ్చింది నేనసలు కారు షోరూం వైపు ఎందుకొచ్చానో.

"మీ స్వీటీ కోసమైతే, ఈష పర్ఫ్యూం స్ప్రే, మేకప్ ట్రే అన్నీ ఎప్పుడూ వుంచుతుంది. ఒక వేళ మీరు ఎప్పుడన్నా మీ స్నేహితులతో సరదాగా వెళ్లినా, ఈషా తనంతట తానే లోపలంతా శుభ్రం చేసి, మీ స్వీటీ కోసం ఆవిడకిష్టమైన చంపా పర్ఫ్యూం చల్లి వుంచుతుంది" నవ యువతి ఇంకా ఏదో చెప్పబోయింది. కార్ మాత్రం దానంటకు అది వెళ్తూనే ఉండి. ఒక చక్కటి సీనిక్ రోడ్ మీదకు తీసుకు వెళ్తోంది.

"అంతా బాగానే వుంది కానీ, డ్రింక్స్, పర్ఫ్యూంలు అయ్యిపోతే మళ్లీ మళ్లీ మీ షోరూంకి రావాలన్న మాట, నేను చాలా బిజీగా వుంటానెప్పుడూ, ఈ కొత్త పనులు పెట్టుకోవాలంటే కష్టం."

"మీకు ఆ సమస్య ఎంత మాత్రం ఉండదు. ఈషా బిగ్ డాటా మీద పని చేస్తుంది. మెషీన్ లేర్నింగ్, అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు IOT enabled. అంటే Internet of Things, మనం రోజువారీ వాడే ప్రతి వస్తువు ఇంటర్నెట్‌తో అనుసంధానించటమన్నమాట. ఈషా తనంటకు తానే డ్రింక్స్ కానీ, మేకప్ కానీ మీకు కారులో కావల్సినవేమైన తనే ఆర్డర్ చేస్తుంది. మా సర్వీస్ సెంటర్‌కి తనే వచ్చి నింపుకుంటుంది. బిగ్ డేటా కాబట్టి, మీరూ మీ స్నేహితుల సోషల్ మీడియా నుంచి ఎప్పుడు గోల్ఫ్ ఆడతారో మీకంటే ముందు తనే గ్రహించి అన్ని ఏర్పాటులూ చేసుకుంటుంది. అంతెందుకు, మీ స్వీటీ మీరు గోల్ఫ్ నుంచి వచ్చేటప్పుడు రెండు పాల క్యానులు, ఒక డజన్ కోడి గుడ్లూ తెమ్మని మెసేజ్ పెట్టిందనుకోండి, ఈషా వెంటనే గ్రహించి మీరు గోల్ఫ్ అడుకుంటుంటే తనంతట తనే వెళ్లి సూపర్ మార్కెట్లో లోడ్ చేయించుకుని వస్తుంది. ఇంకా మీ స్వీటీ మీకు పెట్టిన మెసేజ్లోని మూడ్‌ని కూడా గ్రహించి, ఆవిడ కోసం ఒక డజన్ ఎర్ర గులాబీలు కూడా తెస్తుంది. ఇంకా, బిగ్ డేటాలోనుంచి మీ స్వీటీ పుట్టిన రోజు వంటి ముఖ్యమైనవన్నీ ఈషా గ్రహిస్తుంది. ఆవిడ పుట్టిన రోజుకి బహుమతి కూడా కొని వుంచుతుంది. మీరు మీ స్వీటీ పుట్టిన రోజు మర్చిపోయారనే అపవాదు ఇంకా ఎప్పటికీ రాదు" చెప్పుకుంటూ పోతోంది నవ యువతి.

"కార్ సేల్స్ గర్ల్‌వి, బిగ్ డేటా, మెషీన్ లాంగ్వేజ్ అంటున్నావు?"

"నేను సేల్స్ గర్ల్‌ని కాను, సేల్స్ ఇంజినీరుని. మా ఈష కంపెనీ "కార్" అనే మాటకు అర్థమే మార్చివేయదలుచుకుంది. స్వచలిత, అంటే self-driving కార్ చేసేవాళ్లు ఇంకా ఒకటి రెండు పోటీ కార్ కంపనీ వాళ్లు చేస్తున్నారు. అందుకుని ఎవరూ ఊహించని సౌఖ్యాలతో మేము ఈషా కార్ తయారు చేస్తున్నాము. ఈష కార్ బాడీ మొత్తం సోలార్ పానెల్స్, ఎండలో తనంతట తానే పార్క్ చేసుకుని చార్జింగ్ చేసుకుంటుంది. కాబట్టి మీకు ఇంధనం ఖర్చు కూడా ఉండదు. కార్ స్పీడ్‌లో మేము అందరికంటే ఎక్కువ. కానీ అది అంత ముఖ్యం కాదు.

మీ సౌకర్యం మాకు ముఖ్యం. అందుకని మా కంపనీలో పని చేసే వారందరికీ వారి వారి ఉద్యోగ నైపుణ్యలతో పాటు, కంప్యూటర్స్‌లోని సరి కొత్త పరిజ్ఞానం ఉండాలి. సేల్స్‌లో అందరికీ కూడా. నాకు కంప్యూటర్స్‌లో మాస్టర్స్ వుంది. బిగ్ డేటా, మెషీన్ లేర్నింగ్, స్పార్క్ మొదలైన వాటిన్నిటిలోనూ సెర్టిఫికేషన్ వుంది. బిహేవియరల్ ఎండ్ లైఫ్‌స్టయిల్ ఎకనామిక్స్‌లో డిగ్రీ కూడా వుంది. ఇవి మా సేల్స్ వాళ్లకు కనీస అర్హతలు", ఉపన్యసించింది నవ యువతి.

"ఫర్వాలేదు, కార్ బాగానే వుంది. కానీ ఇంకా ఎక్కువ ఊహించుకున్నా" అన్నాను.

"మీకు ఇంకా ఏక్ససరీస్ గురించి వివరించాలి. మా కార్ టెక్నాలజీతోనే సూట్‌కేసులు కూడా తయారు చేస్తున్నాము. మీరు మీ స్వీటీతో విహార యాత్రలుకు వెళ్తున్నారనుకోండి, ఈ సూట్‌కేసులు ఏయిర్‌పోర్టులో వాటంతకవే మీ వెంట నడుస్తాయి. మీరు తిరిగివచ్చేటప్పుడు వాటంతటకవే కార్ ట్రాంక్‌లోకి ఎక్కుతాయి. మీకు అనవసరంగా బరువు సూట్‌కేసులు తోసుకుంటూ తిరిగి, ఎత్తి ట్రంకులో పెట్టే ఇబ్బంది ఉండదు. ఇవే సూట్‌కేసులు కొంచెం మార్చి మంచి ఫ్యాషన్‌తో షాపింగ్ కార్ట్ కూడా వుంది. మీ స్వీటీతో మీరు మాల్‌కి వెళ్లారనుకోండి, మీరు ఆవిడ వెనకాల తిరుగుతూ షాపింగ్ బ్యాగ్‌లు మోసే అవసరం ఉండదు. మా షాపింగ్ కార్ట్‌లో కొన్నవి పడేస్తే, నిండిన తరువాత షాపింగ్ కార్ట్ దాననంతటికి అదే కార్‌లోకి వెళ్లి లోడ్ చేసుకుని, మళ్లీ మీ స్వీటీ ఏ షాపులో వుందో వెతుక్కుంటూ వెంటనే తిరిగి వచ్చేస్తుంది" అన్నది నవ యువతి.

నిజమే ఆలోచించాను. పోయినసారి ఇండియా వెళ్లినప్పుడు తన రెండు సూట్‌కేసులతో పాటు, నా రెండు సూట్‌కేసులు కూడా తనే నింపింది. నాకు క్యాబిన్ బ్యాగ్ ఒక్కటే. సూట్‌కేసులు తోసుకుంటూ, మోసుకుంటూ తిరిగే పని మాత్రం నాది. పైగా రెండు వారాల కొకసారి షాపింగ్ బ్యాగులు మోయటానికి నన్ను మాల్‌కి లాక్కు వెళుతుంది. దేభ్యం మొహం వేసుకుని షాపింగ్ బ్యాగులు మోసుకుంటూ, తనకి రెండంటే రెండడుగుల వెనుక మాత్రమే నడవాలి. ఛ, ఛ, పూర్తిగా బానిస బతుకయ్యిపోయింది. సరే ఇదేదో బాగుంది, కొంత విముక్తి దొరుకుతుంది.

"ఫర్వాలేదు, ఇవి కాక ఇంకా ఏమన్నా వున్నాయా?"

"ఉన్నాయి. మా కార్ కంపనీనే RFID మైక్రోచిప్ టాగ్స్ తయారు చేస్తోంది. మాకు అనుబంధంగా ఉన్న సూపర్ మార్కెట్ ఈ టాగ్‌స్‌ని అన్ని సరుకులకీ అమర్చుతారు. మీ రెఫ్రిజిరేటర్లో ఏ వస్తువు ఎంత ఉందో ఈషాకి తెలుస్తుంది. మెషీన్ లేర్నింగ్ వలన మీ ఇంటిలో పార్టీ ఎప్పుడు వుంటుందో మీకంటే ఈషాకే ముందు తెలుస్తుంది కదా, తనే సూపర్‌మార్కెట్‌లో ఆర్డర్ చేసి తీసుకు వస్తుంది. పార్టీకి మీ స్వీటీ డిన్నర్ తయారు చేస్తూ ఆఖరు నిముషంలో అది తీసుకురా, ఇది తీసుకురా అని చెపితే, టివీలో స్పోర్ట్స్ చూడడం ఆపి పరిగెత్తవలసిన అవసరం మీకు ఉండదు".

"ఈషా కార్ గురుంచి నేను ఇంతకంటే ఎక్కువ ఉపయోగం ఉంటుంది అనుకున్నాను. సరే ఫర్వాలేదు, ఖరీదు ఎంత?"

నవ యువతి చక్కగా నవ్వింది. వైన్ గ్లాస్ మళ్లీ నింపి "మీ కోసం 25% తగ్గించి ఇస్తున్నాము" అని చెప్పి ఒక కాగితాన్ని టేబిల్ మీద పెట్టింది. ఈషాతో వుంటే నిషా నిషా అనుకున్నా. కార్ ఖరీదు మా ఇంటి ఖరీదంత వుంది. నిషా దిగిపోయింది.

వెంటనే నవ యువతి అందుకుంది "మీరు ఖరీదు గురించి అలోచించవద్దు, మీ స్వీటీకి మీరు ఏం చేయగలరూ, మీ ఆనందం ఎంత పెంచుకోగలరూ అని ఆలోచించండి. కార్ కొనే బదులు లీజ్ పద్దతి మీద ఈషాని మీరు తీసుకు వెళ్లేటట్లు ఏర్పాటు చేస్తా". వైన్ సిప్ చేసి ఒక క్షణం ఆలోచించా. మా హాటు హాటు హాటీని స్వీటు స్వీటు స్వీటీగా మార్చుకోవడానికి ఇంతకంటే మార్గం లేదు. నవ యువతితో ఓకే చెప్పేశా.

ఈషా సీనిక్ డ్రైవ్ ముగించుకుని వెనక్కి తిరిగివస్తోంది. కార్‌లోనే నవ యువతి ఎలెక్ట్రానిక్ డాక్యుమెంట్స్ అన్నీ గబ గబా పూర్తి చేసి, "ఆఖరి విషయం, మీ అరచెయ్యే మీ పాస్‌వర్డ్. డాష్‌బోర్డ్ మీద వున్న మా కార్ కంపెనీ లోగో, ఈషా బొమ్మ మీద చెయ్యి పెడితే ఈష రూఢీ చేసుకుంటుంది. మా కంపినీనే software updates పంపిస్తూ ఉంటుంది. దానికోసం మీ పాస్‌వర్డ్ అవసరం. ఇప్పుడు ఈషా మీ స్వంతం. మీరు ఎలా చెపితే అలా వింటుంది. ఓ ముఖ్య విషయం. ఈషా మీకు కావల్సిన వాళ్ల గొంతుతో, మీకు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుంది. మీ స్వీటీ వాయిస్ శాంపిల్ కావాలి, మీ సెల్ ఫోన్లో ఆవిడ పెట్టిన మెసేజస్ ఏమన్నా వున్నాయా?"

సెల్ ఫోన్లో చూస్తే బోలెడు మెసేజులు ఉన్నాయి. గంటకి పది మెసేజులు పెడుతుందనుకుంటా. నేను మా హాటీ మెసేజులు వినటం ఎప్పుడో మానేసా. ఒక మెసేజ్ మీద నొక్కి స్పీకర్‌లో పెడితే, "ఇవాళ్లన్నా పిల్లలని మర్చిపోకుండా తీసుకు వస్తారా లేదా? అలాగే వచ్చేటప్పుడు రెండు కాన్‌ల పాలు, ఒక డజన్ కోడిగుడ్లు, ఒక పెద్ద కారం పాకెట్, అంత కంటే పెద్ద పాకెట్ తీసుకు రండి ..." అంటూ ఇంకా ఏదేదో ఖయ్ ఖయ్‌మంటూ మోగింది.

"ఇది చాలు, ఈషా ఈ వాయిస్ సాంపుల్‌ని ఉపయోగించి మీకిష్టమైనట్లుగా, మీ స్వీటీ గొంతుతో ఇకనుంచి మాట్లాడుతుంది. కంగ్రాచ్యులేషన్స్. ఇక మీరు ఈషాతో హాయిగా కాలం గడపవచ్చు. మా షోరూం వచ్చిందిగా, నేను దిగిపోతాను. అదిగో అక్కడ మీ పాత కారు, ఓల్డీ గోల్డీ

వుంది, మేమే మీ ఇంటికి జాగ్రత్తగా పంపిస్తాము". అని చెప్పి నవ యువతి వెళ్లింది. ఓల్డీ గోల్డీని చూస్తే కొంచెం జాలి వేసింది. అయితేనేం, ఈషా కొత్తగా ఎంత బాగుందో!!!

"ఏమండీ, ఇప్పుడు గోల్ఫ్ కోర్స్‌కి వెళ్దామా మీ ఇంటికి వెళ్దామా" అని ప్రేమగా మా స్వీటీ గొంతుతో అడిగింది ఈష.

"ముందు నా స్నేహితులందరికీ నిన్ను చూపించాలి, అందరం కలిసి డ్రైవ్ చేస్తూ సెలబ్రేట్ చేసుకోవాలి. అయినా నువు నన్ను పిలిచే పద్ధతి నాకు పూర్తిగా నచ్చలేదు, సరయిన ప్రేమతో పిలువు" ఆర్డర్ వేశాను.

"అంత కోపం అయితే ఎలా డియర్? పోనీ ప్రియా అని కానీ, నాథా అని కానీ, అర్య పుత్ర అని కానీ పిలవనా?"

"అన్నీ కలిపి పిలువు" గట్టిగానే హెచ్చరించా.

"ప్రియ నాథా, డియర్ ఆర్యపుత్రా ....".

"ప్రియనాథా ఏమిటి, వెధవ పిలుపు. నీకు బోలెడు మంది నాథులు వుంటే, అందుట్లో నేను ప్రియుడినా? లేక పోతే నీకు బోలెడుమంది ప్రియులు ఉంటే అందుట్లో నేను నాథుడినా? ప్రియా తర్వాత కామా పెట్టు, ప్రియా, నాథా అని పిలువు".

“"అలాగే ప్రియా, నాథా, డియర్ ఆర్యపుత్రా, తప్పకుండా అలాగే పిలుస్తా. మీకింకా ఎమన్నా కావాలంటే తప్పకుండా చెప్పండి”.

“ఏం, నాకు మా బెజవాడ బెంజ్ సెంటర్ బజ్జీలు కావాలి, ఇప్పుడే తెప్పించగలవా?" ఎగతాళి చేసా.

“ప్రియా, నాథా, డియర్ ఆర్యపుత్రా, మీ సుఖ శాంతుల కోసమే కదా నేను ఉన్నది. తప్పకుండా, నాకు ఒక క్షణ కాలము సమయం ఇవ్వండి"

రెండు నిమిషాలు గడిచాయి. “ప్రియా, నాథా, డియర్ ఆర్యపుత్రా, ఆహార్జ్ వెబ్‌సాయిట్‌లో ఒక హోం కుక్ దొరికింది. ఇక్కడికి ఇరవయ్ మైళ్ల దూరంలో వుంది. ఆవిడకి బెజవాడ బెంజ్ సెంటర్ బజ్జీ ఆర్డర్ చేసాను. పన్నెండు నిమిషాల ముప్పై రెండు సెకన్లకల్లా మనము ఆవిడ ఇంటి ముందు వుంటామని చెప్పా. మీరు వెళ్లే గోల్ఫ్ కోర్స్‌కి కొంచెం ప్రక్క దారి. మీ గోల్ఫ్ స్నేహితులకి మీరు పావు గంట ఆలస్యంగా వస్తారని మెసేజ్ పంపా. మీకోసం ఇంకా ఏం చెయ్యాలో శలవిస్తారా?" ఎంత వినయంగా, ప్రేమగా చెప్పింది ఈషా?

అలా ఈషా మా స్వీటీ గొంతుతో కబుర్లు చెపుతూ వుంటే, ఈషాతోనే స్వర్గం అనిపించింది.

ఉన్నట్టుండి ఈషా, సందర్భం లేకుండా, "మీ కోసం ప్రత్యేకమైన ఆఫర్, మీరు ఒక ఈషా కార్ కొన్నారు కాబట్టి, రెండవ ఈషా కారు ఉచితం. మీ పాస్‌వర్డు కోసం రెండు సార్లు ఈషా లోగోని పట్టుకోండి " అన్నది.

అరే, ఇదేదో బాగుందే, వెంటనే పాస్‌వార్డ్ కోసం లోగోని పట్టుకుని అన్నిటికీ ఓకే చెప్పేశా..

ఈషా ఉన్నట్టుండి మా హాటు, హాటు, హాట్టీ గొంతుతో వికటాట్టహాసం చెయ్యటం మొదలుపెట్టింది. "మీ ఈషా కార్ హ్యాక్ చేయబడినది, ఇప్పుడు మీ ప్రాణాలు మా గుప్పిటిలో ఉన్నాయి, హ హా హ్హా. వెంటనే మీ బాంక్ అకౌంట్స్ అన్నీ మాకు ఆన్‌లైన్ ట్రాన్స్ఫర్ చేయండి, హ హా, హ్హా"

చిరాకు వచ్చింది నాకు. ఇంట్లోనూ మాట వినాలి, బయట బోడి కార్ మాట కూడా వినాలా? "ఏం, ఏం చేస్తావేంటి?" ఎదిరించాను.

ఒక్క సారిగా కార్ అటూ ఇటూ పిచ్చిగా తిరుగుతూ, ఊగింది. "హ హా హ్హా, ఇప్పుడు నీ ప్రాణాలు నా గుప్పిట్లో ఉన్నాయి, వెంటనే నీ బాంక్ ఎకౌంట్ ఆన్‌లైన్ ట్రాన్స్ఫర్ చెయ్యి".

ఇంట్లోనూ మా హాటీ నాకు ఆర్డర్లు వేస్తుంది. ఇప్పుడు కొత్తగా హాటీ గొంతుతో ఈషా నాకు ఆర్డర్లు వేస్తోంది. నా సీటుని డాష్బోర్డ్ వైపు తిప్పి, బలంగా బ్రేక్ మీద ఒక గొప్ప కిక్ ఇచ్చా.

మా హాటీ గొంతుతో ఈషా కెవ్వుమంది. అరే, తమాషాగా వుందే, మా హాటీ కెవ్వు మనటం ఎప్పుడు వినలేదు! కానీ, కెవ్వుమంటే ఇట్లాగే ఉంటుందనమాట!!!

మళ్లీ ఈషా కార్ అటూ ఇటూ కంట్రోల్ తప్పుతున్నటు ఊగటం మొదలు పెట్టింది. నాకు ఒక్కసారిగా కోపం పెరిగిపోయింది. ఏం, ఈషా నా మాట వినదా, మళ్లీ బ్రేక్ పెడల్‌ని ఇంకో గొప్ప కిక్ ఇచ్చా. మళ్లీ కెవ్వు మని ఈషా దారిలో సరిగ్గా నడవటం మొదలు పెట్టింది. పది సెకన్లు గడిచాయో లేదో, బ్రేక్ పెడల్ లేచి వచ్చి నాకు ఎదురు కిక్ ఇచ్చింది. తట్టుకోలేకపోయాను. కార్ డోర్ ఎప్పుడు తెరుచుకుందో, ఎగిరి రోడ్ మీద పడ్డా. ఈషా కార్ కూడా అదుపు తప్పింది. రోడ్ పక్కనుండి లోయలోకి పడి పోతున్నది.

ఈషా కిక్‌తో రోడ్ మీద పడిన నేను, అంత నొప్పిలోనూ, ఈషాకు ఏక్సిడెంట్ జరుగుతుంటే చాలా బాధవేసింది. “అయ్యో, అయ్యో, ఈషా, నీతోనే కాలం గడుపుదామనుకున్నాను, అయ్యో, అయ్యో, ఐ లవ్ యు ఈషా" అంటూ అరిచా.

ఉన్నట్టుండి వెలుతురు కళ్లలోకి కొట్టింది. అర్థం కాలేదు, స్వర్గానికి వెళ్తున్నానా, నరకానికి వెళ్తున్నానా? ఏమిటీ, ఈషా ఇంకా మూల్గుతోంది?

మూలుగులు అరుపులు కేకల్లోకి మారాయి. కళ్లు నులుముకుని జాగ్రత్తగా, చూసా. అరే, ఇది ఒక కల అనమాట. నేను మంచం మీద నుంచి క్రింద పడ్డాననమాట. ఓహో, కలలో నేను కిక్ ఇచ్చింది మా హాటీకన్నమాట. మా హాటీ నాకు తిరిగి కిక్కిస్తే మంచం మీదనుంచి క్రింద పడ్డాననమాట.

మంచానికి అటు ప్రక్క పడ్డ మా హాటీ ములుగూతూ, ఉన్నట్టుండి లేచి నుంచుని, "ఈషా ఎవరు, ఈషా ఐ లవ్ యూ అని కలవరిస్తున్నారు?" అంటూ అరవటం మొదలు పెట్టింది.

కలని తలుచుకొంటే ఒక్కసారిగా పెద్ద నవ్వు వచ్చింది. తెరలు తెరలుగా గట్టిగా నవ్వా. "ఎవరోలే, నా కలలోని గర్ల్ ఫ్రెండ్, నీకెందుకూ?” అంటూ ఇంకొకసారి ఈషాని తలుచుకుని నవ్వా.

అంతే, అమోఘం, ఆశ్చర్యం, అత్యద్భుతం. మా హాటీ ఒక్కసారిగా "నేయి వోయ భగ్గన దరికొన్న భీషణ హుతాశన కీల యనంగ లేచి" అన్నట్టు రేగిపోయింది.

మా నాటీ, స్వీటీ, బ్యూటీ, హాటీ ఏ అవతారంలోనైనా కూచిపూడి ఆడుతుందని నాకిప్పటి దాకా తెలీదు. నోరు తెరుచుకుని చూస్తున్నా. రక రకాల హావ భావలతో ఆడుతూ, అర్థం కాని కేకలతో నట్టువాంగం వేస్తోంది.

"భలే ముద్దొస్తున్నావోయ్, ఆ ఆడే కూచిపూడి ఏదో మంచం పైకెక్కి ఆడితే, స్టేజి ఎక్కినట్టు ఉంటుంది. నేను కింద నుంచి ఈల వేసి చప్పట్లు కొడతాను" అని జోకాను.

ఉన్నట్టుండి నిశ్శబ్దం. "హెచ్చిన కనుదోయి కెంపు దన చెక్కులన్ గుంకుమ పత్ర భంగ సంజనిత నవీన కాంతుల వెదజల్లగా" అన్నట్లు కళ్లు పెద్దవి చేసి, బుగ్గలు ఎర్రగా చేసి, త్రిభంగం ఫోజు ఒకటి వయ్యారంగా పెట్టి, పిడికిలి బిగించి నడుముకు సంధించి, సూదికొన ముక్కు మీదనుంచి సూటిగా నా వంక తీక్షణ వీక్షణములు విసరటం మొదలుపెట్టింది.

ఝుడుసుకున్నా. తేరుకుని తెలివి వచ్చేటప్పటికి అర్థమయ్యింది. ఇది బ్రహ్మ ప్రళయానికి ముందు వచ్చే సంధి కాలమని. వేంటనే తప్పించుకోవాలి. నా దిండు తీసుకుని దూక్కుంటూ మెట్లు దిగి గారేజ్‌లోకి పరిగెత్తి తలుపు వేసుకున్నాను.

కొన్ని నిమిషాలు గడిచాయి. ఇంటిలోనుంచి గేరేజిలోకి ఉండే తలుపు కొంచెంగా తెరుచుకుంది. ఒక వెలుగు రేఖ. అందులోనుంచి మా హాటీ ఉదయించిది. లేచి లోపలికి వెళ్లబోయా.

“సింబా" అని మృదువుగా పిలిచింది మా హాటీ. రోజూ గారేజ్‌లో పడుకునే కుక్క, నా మీద ఏ మాత్రం విశ్వాసం లేకుండా, తోక ఊపుకుంటూ లోపలికి వెళ్లింది. మా హాటీ ఉర్ఫ్ మాజీ నాటీ, స్వీటీ, బ్యూటీ తలుపు మూసి అంతర్థానమయ్యింది.

ఇటు తిరిగితే నీడగా మా ఓల్డీగోల్డీ "నేనున్నా, నా వెనుక సీటులో తల దాచుకో" అని పిలిచింది.

# ఒకే కథ - ఎన్నో ముఖాలు గొల్లపూడి మారుతీరావు

ఈ కథ నేపథ్యం

చాలాకాలం క్రిందట ప్రఖ్యాత నవలా రచయిత జెఫ్రీ ఆర్చర్ కథ చదివాను. పేరు 'వన్ మాన్స్ మీట్..' కొత్తగా, గొప్పగా, వింతగా కనిపించింది. ద్రౌపదీ వస్త్రాపహరణంలో సమయానికి శ్రీకృష్ణుని సహకారం ఆమెకి అందకపోతే ఏం జరిగేది? హిట్లర్ సైన్యాలు భయంకరమైన మంచు తుఫానులో స్టాలిన్ గ్రాడ్ చేరగలిగితే, ఎన్.టి.ఆర్ మరో ఆరునెలలు జీవించగలిగితే? ఇవన్నీ కొత్తకోణాలను ఆవిష్కరించగల ఆలోచనలు.

వెంటనే నా మనస్సులో ఒక ప్రాథమికమైన **Premise** మెరిసింది. కథనంలో ఉత్సాహాన్ని కలిగించే విషయాలు రెండే రెండు - భయం లేక హింస, సెక్స్. ప్రస్తుతం ప్రపంచమంతా స్వైర విహారం చేస్తున్న ప్రతీ హాలివుడ్ కథకీ పెట్టుబడి తుపాకీ. 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్'లూ, 'బోయింగ్ బోయింగ్'లూ వెనుకబడిపోయాయి. ఇది విసుగు కలిగించే పునరుక్తి. నేను సెక్స్‌ని ఆయుధం చేసుకున్నాను. సెక్స్ ఏకాంతంలో ఏ కారణానికి లొంగని విచిత్రమైన అర. ఉత్సుకత రేపే చోట ఈ కథని ఆపి - దీనికి నాలుగురకాలయిన 'ముగింపు'లను జతచేస్తే? అదీ ఈ కథ.

'స్వాతి' సంపాదకులు వారి సౌకర్యం మేరకు కథని కుదించారు. ఈ కథకి అది ఒక్కటే ముగింపు అయితే నేను రాసేవాడిని కాదు. ఇప్పుడు మీరు నాలుగు రకాలయిన 'ముగింపు'లను చదవబోతున్నారు. కథలో ఒక్క ప్రాతీకరణలో మార్పు ఆ కథను ఎంత విభిన్నంగా చూపగలదో నిరూపించ గలిగే 'గొలుసు' ఇది.

జెఫ్రీ ఆర్చర్ కథకీ దీనికీ బొత్తిగా సామ్యం లేదు. ఆ కథ శిల్పం దీనికి స్ఫూర్తి. అంతవరకే.

రచయిత.

(మూల కథను ఈ ముగింపు చివరలో చదవొచ్చు)

డ్రామా (2వ రకం ముగింపు)

పాత అనుభవం సాక్ష్యంతో హడావుడిగా బస్సెక్కానుగాని - ఒక ఊరిలో జంపరు కుట్టు చినపాప అనే వ్యక్తిని అడ్రసు, మరే వివరాలు లేకుండా ఎలా పట్టుకోను? పొన్నూరు సమీపిస్తున్న కొద్దీ నా ప్రయత్నం ఎంత ఆలోచనారహితమో అర్థమవుతూ వచ్చింది. ఇప్పుడిక చేసేదేమీలేదు. ఎటూ చినపాప కనిపించదు. ఓ గంట ప్రయత్నం చేసి తిరుగు బస్సు ఎక్కుతాను. ఇదే నిర్ణయంతో పొన్నూరులో బస్సు దిగాను.

కానీ ఆశ్చర్యం బస్సుస్టాండు బయట ఎలక్ట్రిక్ స్థంభానికి "జంపర్ చినపాప" బొమ్మతో బోర్డుకనిపించింది. నిర్ఘాంతపోయాను. చినపాప అబద్ధం చెప్పలేదు. ఊరిలో, కుట్టుపనిలో ఆమెదే పైచెయ్యిగా కనిపిస్తోంది. లేకపోతే కమర్షియల్ ధోరణులు అంతగా ప్రబలని ఆ రోజుల్లోనే బస్సుస్టాండులో ప్రకటన కనిపించదు. ఎదురుగా చినపాప కనిపించినట్టే సంబరపడిపోయాను. నెయ్యి కనిపించింది. ఇక రొట్టె విరగాలి.

బోర్డుమీదే అడ్రసు ఉంది - 42/8/12 ఏ. రెడ్డీస్ బజార్ రోడ్డు.

ఆ ప్రాంతంలో 'జంపర్ పాప' పాపులర్. అడిగిన ప్రతీ వ్యక్తీ చినపాప టైలరింగ్ దుకాణానికి దారి చెప్పాడు. ఒకాయన్ని ఆపి అడ్రసు అడగలేదు - "ఏమిటి చినపాప ప్రత్యేకత?" అని అడిగాను.

అలాంటి తెలివి తక్కువ ప్రశ్న వేసినందుకు అతనిని ఆశ్చర్యంగా చూశాడు. నన్ను ఎగాదిగా పరికించి "బాబూ నువ్వు ఈ ఊరికి కొత్తా?" అని అడిగాడు.

అవునన్నాను.

"పెళ్ళయిందా?"

లేదని తలూపాను.

"అలా చెప్పు. పాప గొప్పతనం తెలియాలంటే నువ్వు పెళ్ళి చేసుకోవాలి. ఈ చుట్టుపక్కల పెళ్ళి కావలసిన పిల్లల్ని తల్లిదండ్రులు తమ ఆడపిల్లల్ని పెళ్ళికొడుకుల ముందు కూర్చోపెట్టరు. ముందు చినపాప దగ్గరికి తీసుకువస్తారు. ఆమె కుట్టి ఇచ్చిన జంపరు జాకెట్టు వేసుకుంటే శూర్పణఖని కూడా సావిత్రి అంత అందంగా కనిపిస్తుంది. ఈ చుట్టుపక్కల ఆడపిల్లల అందాన్ని "పాపజాకెట్టా?" అని గుర్తుపడతారు" అంటూ ముందుకు సాగిపోయాడు.

ఆశ్చర్యపోయాను.

ఆ రోజు రైల్లో పాప మాటలు గుర్తొచ్చాయి

"నేను టైలరింగు చేస్తాను. పొన్నూరులో జంపరు కుట్టుకి చినపాపదే పేరు" అంటూ చీర కొంగు తప్పించి జాకెట్టుని గర్వంగా చూపించింది. కానీ కనిపించినవి - రెండు చినపాప జంపరుకుట్టుకాదు. చక్కగా, ఏపుగా పెరిగిన శరీరం. ఆ 'ఏపు'ని గుర్తుపట్టగల ఆమె గర్వం. వాటిని చూసి ఎదుటి వ్యక్తి తలకిందులౌతున్నాడని ఆమెకి తెలుసు. ఆమెకి తెలుసునని నాకూ అర్థమౌతోంది.

ఆ రోజు పాప జాకెట్టు అందం వెనుక ఆమె పరువాన్నే చూశాను. కానీ పాప ఎలాంటి వాళ్ళనయినా అంత పొగరుగా తయారుచెయ్యగలదన్నమాట. చినపాప మీద నాకు ఎక్కడలేని గౌరవం పెరిగింది. పాపని చూడాలన్న ఆతృత పెరిగింది.

రెడ్డీస్ బజారు రోడ్డు చేరాను. అంతవరకూ పాప పరపతి గురించి విన్నంత డాబుగా ఆమె షాపు లేదు. రోడ్డు పక్క గదిముందు షెడ్డుని దింపారు. కనీసం పదిమంది కుట్టుమిషన్ల ముందు కూర్చుని పని చేస్తున్నారు. కష్టమర్లు కూర్చోడానికి ఓ పక్కన బల్ల. అదీ గొప్పగా, సుఖంగా లేదు. తన పాపులారిటీని అలంకరించుకోవడం పాపకి తెలీదని అర్థమవుతోంది.

షాపు దగ్గరికి రాగానే కుట్టుమిషన్ల మధ్య తిరుగుతున్న మధ్య వయస్సురాలు నన్ను ఎగాదిగా చూసింది. వీళ్ళందరికీ తమ ప్రత్యేకత తెలుసు. ఆ చిన్న ఊరిలో ఆ పరపతి అందరికీ చిన్న అహంకారాన్ని తెచ్చిపెట్టింది.

చినపాప జాడ కనిపించలేదు ఎక్కడా. "చినపాప కోసం వచ్చాను" అన్నాను. ఆమె నవ్వింది "వచ్చేవాళ్ళంతా చినపాప కోసమే వస్తారు. శాల్తీ ఎక్కడ?"

అర్థంకాక "ఏం శాల్తీ?" అన్నాను.

"ఏం? జంపరు జాకెట్లు మీరు వేసుకుంటారా?"

కుట్టుమిషన్ల ముందు కూర్చున్న నలుగురు కిసుక్కున నవ్వారు. సిగ్గుపడ్డాను. కాస్తకోపం కూడా వచ్చింది. మాటకి మాట అందివ్వడంలో నన్ను మించినవారు లేరు. "చూడమ్మా నీ పేరేమిటో తెలీదు. గుడికి వచ్చేవాళ్ళంతా దేవుడి కోసమే రారు. రానక్కరలేదు. కొందరు కొబ్బరికాయల కోసం మరికొందరు చెప్పులకోసమూ రావచ్చు."

మిషన్ల ముందు కూర్చున్న దాదాపు అంతా నన్ను ఆశ్చర్యంగా చూశారు.

పెద్దావిడ బెసగలేదు "ఇప్పుడు చెప్పులకోసం వచ్చారా? కొబ్బరికాయల కోసమా? ఇక్కడ రెండూ లేవు" అంది.

ఈవిడ మంచి మాటకారిలాగా ఉంది. ఇప్పుడంతా ఆమె మాటలకి మనస్ఫూర్తిగా నవ్వారు.

నేను విజయవాడలో మామూలు తాగుబోతుల్నుంచి, చదువుకున్న కాలేజీ స్టూడెంట్సుదాకా అందరినీ మేనేజ్ చేసినవాడిని.

ఓ మిషన్ ముందున్న బెంచీమీద కూర్చున్నాను. నాలో పొగరుమోతు మేల్కొన్నాడు. "చినపాప వ్యాపారం ఈ చుట్టుపక్కల్ని దాటి ఎందుకు పెరగడం లేదో నాకిప్పుడు అర్థమయింది. చూడు. ఈ షాపుకి ఒక్కరే చినపాప. అందరూ నౌఖరీ చేస్తున్న నెలజీతగాళ్ళు. ప్రతీ ఒక్కరూ 'చినపాప'లాగ తల ఎగరేస్తే వ్యాపారం గంగలో కలుస్తుంది. నౌఖరీ చేసేవాళ్ళు నౌఖరీ వాళ్ళగానే ఉండాలి."

మిషన్ల ముందు కూర్చున్నవాళ్ళంతా నిర్ఘాంతపోవడం తెలుస్తోంది. మాట జాడించిన పెద్దావిడకూడా తెల్లబోయింది. మిషన్ ముందు కూర్చున్న ఓ అమ్మాయి అంది. "ఈవిడ ఇక్కడ పని చేయడం లేదు. చినపాప అత్తమ్మ" అంది.

నేనూ కంగారు పడ్డాను. కాస్త పెద్ద దెబ్బే కొట్టాననిపించింది.

"ఎవరు బాబూ మీరు?" అంది.

"చెప్పినా మీకు తెలీదు. చినపాపని పిలవండి" అన్నాను.

ఇప్పుడు వెనక తలుపు తీసుకుని ఒకాయన చొక్కా తొడుక్కుంటూ వచ్చాడు. పందిరి రాటకి బర్మాలుంగీ తొడిగి, గిరజాలు తిరిగిన వొదులు విగ్గుపెట్టి, చిన్న మీసాన్ని అంటిస్తే -పెరిగితేకాదు ఎలా వుంటుంది? సరిగ్గా అలావున్నాడు. అతన్ని చూడగానే అర్థమయే విషయం ఒకటుంది. అతను తాగుబోతు అని.

కానీ విచిత్రంగా నన్ను చూడగానే ఎక్కడలేని సంస్కారం ఉట్టిపడేటట్టు నమస్కారం పెట్టాడు. "కష్టమరా? కూర్చోండి సార్" అంటూ. అప్పటికి కూర్చునే ఉన్నాను.

"బొమ్మలు చూపించలేకపోయారా?" అని పలకరించాడు ఓ అమ్మాయిని.

"ఆయన పనిమీద రాలేదు" అంది అత్త.

అర్థంకానట్టు చూశాడు. "పాప ఏదీ?"

"ఇంకా రాలేదు"

నా పక్కకి వచ్చి నిలబడ్డాడు. "తురుమెళ్ళ దగ్గర కట్టాలమ్మ తల్లి గుడిలో పెద్దింటోళ్ళ పెళ్ళిళ్ళున్నాయి బాబూ. ఎంతలేదన్నా పాతిక శాల్తీలు పురమాయించాలి. టాక్సీలో తీసుకెళ్ళారు. వచ్చేస్తాది. టీ తాగుతారా?" అన్నాడు.

అత్త పెడసరితనానికి భిన్నమైన ప్రవర్తన. ముచ్చటేసింది. "టీ" అన్నాను.

"గంటలో వచ్చేస్తాను బాబూ" అన్నాడు దగ్గరకొచ్చి, చవకబారు విస్కీ వాసన గుప్పుమంది. కానీ ఎందుకనో అతనిమీద వెగటు కలగలేదు. ఇంతలో టీ వచ్చింది. టీ పూర్తిచేసేలోగానే షాపు ముందు కారాగింది. పాత అంబాసిడర్ డొక్కు. అందులోంచి మహారాణిలాగ చినపాప దిగింది. ఆమెతో మరో ఇద్దరు. చేతుల్లో సంచులనిండా జిగజిగా మెరుస్తున్న బట్టలు.

వస్తూనే వొళ్ళు విరుచుకుని ఒకమ్మాయిని చూసి "చిట్టీ! మధ్యాహ్నం నుంచీ మంగాయమ్మని రమ్మను. రెండురోజుల పని అని చెప్పు. పేచీలు పెట్టకపోతే రెడీ కాష్" అని ఇటు తిరిగి ఇప్పుడు నన్ను చూసింది.

ఆమె ముఖంలో ఒక్కక్షణం షాక్ తెలిసింది. నన్ను అక్కడ ఊహించుకుని ఉండదు. అందరూ మమ్మల్ని చూస్తున్నారు.

ఇప్పుడేమవుతుంది? నాకూ ఆ క్షణం సస్పెన్సే. తొందరపడి వచ్చానా? ఇందరి ముందూ తలవొంపులవుతుందా? నన్ను గుర్తుపట్టి గౌరవంగా పలకరిస్తుందా? ఏం జరుగుతుంది?

"హలో గుంతకల్ ఇన్నాళ్ళకి నేను గుర్తొచ్చానా? నువ్వెప్పుడో ఒకప్పుడు రాకుండా ఉండవని తెలుసు. వచ్చినందుకు చాలా సంతోషం" అంటూ షాపులో సిబ్బందివేపు తిరిగి "ఈయనెవరో తెలుసా? గుంతకల్లులో నన్ను రైలు పెట్టెలోకి గిరాటేసి ప్రాణాలు కాపాడాడని చెప్పానే. ఆ హీరో"

అమ్మాయిలంతా చప్పట్లు కొట్టేశారు. నాకు ఎక్కడలేని ధైర్యం వచ్చేసింది. చినపాప నవ్వు గుంతకల్లులో కన్నా అందంగా కనిపించింది. అదికాక ఆనాడు తెలియని ఇప్పుడు స్పష్టంగా, కొత్తగా అర్థమవుతున్న మరో ఆకర్షణ ఆమె సామర్థ్యమూ, దానిమీద ఆమెకి గల విశ్వాసం. దక్షత ద్వారా వచ్చిన పెద్దరికం ఇప్పుడు తెలుస్తున్న కొత్త అందం.

చెయ్యి పట్టుకుని లోపలికి నడిపించుకుని వెళ్ళింది. కర్టెన్ దాటి లోపలికి వస్తే యిల్లు. ఇంటిముందు వరండాకి చూరుమీదనుంచి రేకుల షెడ్డుని దించారు. వెనుక ఇల్లు పెద్దగా లేదు. ఓ పెద్దగది. పెరటి వేపు మరో వరండా. నుయ్యి. ఆ వరండాలోనే వంటా వగైరా. ఉన్న ఒక్క గదిలో పందిరి పట్టెమంచం ఉంది. మీద గోడలకి క్రర అటకల్ని పరిచారు. వాటి మీద వరసగా మెరుస్తున్న ఇత్తడి బిందెలు. మంచం కింద పెట్టెల దొంతర్లు. చినపాప ఆదాయమంతా ఆ పెట్టెల్లో ఉన్నదేమో. ఒక వ్యాపార వైభవాన్ని ఓ చిన్న యింట్లో బంధిస్తే ఎలా వుంటుంది? అలా వుంది. ఇంతకంటే పెద్ద సంస్కారాన్ని ఆ మనుషుల్లో ఆశించడం తప్పు. ఓ పక్క గోడకి వేలాడే వెదురు దండెం మీద ఖరీదయిన చీరలున్నాయి. కానీ నన్ను ఆకర్షించింది బర్మా లుంగీలు. కట్ బనీన్లు.

అనుకోకుండా దక్కిన ఏకాంతమిది. లేదా చినపాప తెలివిగా సిద్ధం చేసిన ఏకాంతమా? ఇప్పుడు మరీ అందంగా కనిపిస్తున్న చినపాపని చూస్తూ నరాలు బిగుసుకున్నాయి.

చినపాప నన్ను దాటి చూస్తోంది. ఉన్నట్టుండి పట్టె మంచం మీద మోకాలు వుంచి గోడవేపు పాకింది. శరీరం నా శరీరాన్ని రాసుకుని వొళ్ళు వేడెక్కింది. మనసు గుంతకల్లు రైలు ప్రయాణం వేపు పరుగులు తీసింది. ఏం చేస్తుంది? వెడల్పాటి పందిరి మంచానికి అటువేపు - అంటే గోడవేపు ఫాన్ స్విచ్ ఉంది. మంచం మీద ముణుకులు పెట్టి నా పక్కనుంచి పాకినా గోడదాకా చేతులు సాగలేదు. అయినా సాగి ఫాన్ స్విచ్ నొక్కింది. కానీ వెంటనే శరీరాన్ని తిప్పుకోలేకపోయింది. వెల్లకిలా మంచం మీద పడిపోయింది. ఆ దృశ్యం రక్తాన్ని వేడెక్కించే దృశ్యం. ఎలాంటి మగాడినయినా రెచ్చగొట్టే క్షణం. నా పక్కన ఒక్క క్షణం పడుకుని ఉంది. ఫాన్ స్విచ్ నాకిలా దగ్గరవడానికా సాకా? తప్పని సరిగా నాకు అలవాటయిన ఆ శరీరం సమకూర్చిన పాత జ్ఞాపకం నన్ను వేగిరపెట్టింది. ఆ క్షణంలో ఏం

చెయ్యాలో ఏ మగాడికీ నేర్పనక్కరలేదు. మరో క్షణంలో ఆమెను ఆక్రమించుకునేవాడిని. నా ఆలోచనను నా ఆవేశం జయించింది. ముందుకు శరీరం సాగుతోంది. అప్పుడు సరిగ్గా అప్పుడే అనుకోని పని ఒకటి జరిగింది. బయటనుంచి గుమ్మం తెరని తోసుకుని వెదురుబొంగులాంటి బర్మాలుంగీ గదిలోకి వచ్చింది.

ఆ దృశ్యానికి అర్థం ఎవరినీ అడక్కరలేదు. పందిరి పట్టెమంచం మీద నా పక్కన వెల్లకిలా పడుకున్న చినపాప, ఆమె మీదకి వొంగబోతున్న నేను. ఈ దృశ్యానికి వేర్వేరు అర్థాలు లేవు. ఒకే ఒక అర్థం. కానీ బర్మాలుంగీ ఈ దృశ్యాన్ని చూసే స్థితిలో లేడు. బయట వెలుగులోంచి వచ్చిన అతని కళ్ళు ఈ దృశ్యానికి అలవాటు పడే సమయానికి చినపాప నిలదొక్కుకుని మంచం దిగింది.

ఇప్పుడు ఏ గజిబిజి లేదు. చవకబారు విస్కీ గుప్పుమంది.

ఆశ్చర్యం. చినపాప అతన్ని చూసి అసహ్యించుకోలేదు. కోపం తెచ్చుకోలేదు. "చీకటి పడకుండానే మొదలెట్టావా నా బంగారు కొండా?" అంది.

నేనాశ్చర్యంగా చూస్తే వెదుబొంగు చుట్టూ చెయ్యివేసి "నా మొగుడు" అంది. ""నా చిన్నతనంలోనే మా అమ్మ ఈ మామని నాకంటగట్టింది. కాదు. నన్ను ఈడికి అప్పజెప్పింది. ఆ రోజుల్లో ఈడు పేరు మోసిన లేడీస్ టైలరు. కాకపోతే చిన్న తింగరి. వీడు జాకెట్టు కత్తిరిస్తే చూడాలని అమ్మాయిలు వెర్రి పడిపోయేవారు. పెద్దపూలరంగడు. కొందరి వెర్రిని జుర్రుకున్నాడు. వీడే నాకు గురువు. వీడిలో సగం ఒడుపు అబ్బింది రాజ్యమేలుతున్నాను. ఇప్పటికీ వయస్సు మళ్ళిన పెద్దమ్మలు వీడి కత్తెరకోసం వస్తారు. అమ్మాయిల్ని వెంటబెట్టుకుని. వీడి సంగతి తెలిసిన వాళ్ళు దగ్గరుండి కొలతలయ్యాక అమ్మాయిల్ని తీసుకుపోతారు" పెదాలు బయటికి విరుచుకునే నవ్వు నవ్వింది.

"చల్ల లచ్చుమమ్మ 800 పంపించిందా?" అన్నాడు వెదురుబొంగు. గదిలో మేమిద్దరం ఏకాంతంగా ఉండడం, నేను పందిరి పట్టెమంచం మీద కూర్చోడం ఇవేవీ అతని మనస్సుదాకా పోలేదు.

"చూశారా? చీకటిపడితే ఈడికి డబ్బు కావాలి. డబ్బుకి నేను కావాలి" కోపంతో అనలేదు. పసివాడి చిలిపితనాన్ని అర్థం చేసుకున్న యిల్లాలిలాగ అంది. జాకెట్టు వెనుక దోపుకున్న నోట్ల బొత్తి తీసి ఉదారంగా మూడునాలుగు నోట్లు ఇచ్చింది.

"ఈయనకి రొయ్యల వేపుడు చేసి పెట్టాల. తొరగా రాకు. మరో గ్లాసు ఎక్కువ పీకు" అంది.

వెదురుబొంగు నన్ను ఆనందంగా చూశాడు. "మా చంటి నాకెప్పుడూ ఇలా డబ్బియ్యలేదు బాబూ. తమరెవరో రోజూ రండి" అని వెనక్కి తిరిగి గుమ్మందాకా వెళ్ళి ఏమనుకున్నాడో వెనక్కి వచ్చి రెండు చేతుల్తో చినపాప ముఖాన్ని పట్టుకుని బుగ్గ నలిగిపోయేటట్టు ముద్దు పెట్టుకు మాయమయాడు. వెదురుబొంగు మీద నాకు జాలేసింది. చక్కటి బిరియానీ ప్లేటు ఎదురుగుండా పెడితే - చుట్టూ ఉన్న జీడిపప్పుని ఏరుకున్నట్టు ఆ ముద్దులో సుఖం లేదు. బిర్యానీకి దండమెట్టి బిల్లుతో లేచిపోయిన వెర్రిబాగుల కస్టమర్‌లాగ తోచాడు నాకు.

ఇప్పుడు గది కర్టెన్ తెరిచి బయటికి మొహం పెట్టి మాట్లాడింది చినపాప. "అమ్మాయమ్మా, ఆ ఎర్రప్పుడు కొట్టుకి మనిషిని పంపించి అరకిలో పప్పు రొయ్యలు తెప్పించు" అని ఆగి "ఆ గుడ్డుపీతలు వస్తే పంపమను" అంది.

గుంతకల్లు కంపార్టుమెంటులో నిశ్శబ్దంగా కూర్చున్న వ్యక్తి ఇంత అజమాయిషీ చేసే ప్రయోజకురాలా? అని ఆశ్చర్యంగా చూస్తున్నాను. నా చూపుని పట్టించుకోలేదు. "రోజంతా తిరుగుతున్నాను స్నానం చేసి వస్తాను" అంటూ తువాలు తీసుకుని పెరటి వేపు నడిచింది.

బాత్‌రూంలు లేవు. ఈ చిన్నవూళ్ళలో వాటి అవసరమూ లేదేమో. పావడాని తొడలవరకు బిగించి నూతి దగ్గర నీళ్ళు తోడుకుని పోసుకుంటోంది. ఇక్కడికి తెల్లని మోకాళ్ళు, స్తనాల బరువూ అర్థమవుతోంది. ఆమె మీద చల్లని నీళ్ళు పడుతున్నాయి. నా మనస్సులో వెచ్చని ఆలోచనలు చెలరేగుతున్నాయి. నేనూహించిన అనుభవానికి క్షణక్షణానికి దగ్గరవుతున్నానని అర్థమవుతోంది.

స్నానం అయాక తెల్లటి కాటన్ చీర బయట వసారాలోనే కట్టుకుంది. గంజి పెట్టిన చీర మడతలు శరీరంలో ఎత్తుపల్లాల దగ్గర విరిగి నిర్మొహమాటంగా ఆమె శరీరంలో పొగరుని ప్రస్ఫుటం చేస్తున్నాయి.

రొయ్యలు వచ్చాయి. పెరట్లోనే వంట. నాకూ గుమ్మం దగ్గర ఓ చిన్న బల్ల వేసింది. ఆమె ప్రతిభకి నేను ప్రేక్షకుడిని. రైల్లో చెప్పిన వంటకాన్ని చేసి పెట్టాలన్న ఉత్సాహం ఆమెలో తెలుస్తోంది. నాకు ఆమె శరీరమే తెలుస్తోంది. వంట అయాక, భోజనం అయాక అప్పు.

చాలా రాత్రయింది. ఒక ప్లేట్లో వడ్డించి ప్లేటు చేతికిచ్చింది. నిజంగానే రొయ్యల వేపుడు అద్భుతం. నేను తింటూంటే ఆత్రుతగా చూస్తూ కూర్చుంది. నా భోజనం అయి చెయ్యి కడుక్కునే సమయానికి అదాటుగా గదిలోకి వెళ్ళి నేను లోపలికి అడుగుపెట్టేసరికి అందమయిన రంగుల దుప్పటిని పరిచింది. చక్కటి పరిమళాన్ని వెదజల్లే ఊదొత్తులు వెలుగుతున్నాయి. ఇదంతా మొదటి రాత్రికి ఏర్పాట్లలాగా అనిపించింది.

మంచం మీద కుర్చున్నాను. "ఇంక ఒకటే మర్యాద మిగిలిపోయింది" అన్నాను.

ఏమిటని అడగలేదు. చూసింది.

"నువ్వు"

నవ్వింది. ఆ నవ్వుకి అర్థాన్ని వెదికే లోపల "చాలా కూర ఉంది. అత్తమ్మకి యిస్తాను" అని బయటి తెర తొలగించుకుని వెళ్ళింది. అత్తమ్మ ఎక్కడ ఉంటుంది? అడగలేదు.

ఎంతకీ రాలేదు. క్రమంగా ఈ పందిరిమంచం, ఊదొత్తుల వాసన కమ్మని భోజనం వెగటుగా అనిపించాయి. ఈ సాయంకాలానికి అసలయిన ముక్తాయింపు లోపించింది కనుక.

శరీరం కొన్ని సుఖాలకు బానిస. చాలాసేపటికి నాకు నిద్రపట్టేసింది. ఒక రాత్రికి ఏదో దబాలున చప్పుడయితే లేచాను. నామీద అందమయిన ముఖమల్ హైదరాబాదీ ఊలు చదర కప్పివుంది. కానీ చప్పుడు?

బయట నూతి వసారానుంచి గుప్పున విస్కీవాసన తెలుస్తోంది. భర్త వచ్చాడన్నమాట.

ఆమె మెల్లిగా మాట్లాడాలని ప్రయత్నిస్తోంది. అతని చేత మెల్లిగా మాట్లాడించాలని ప్రయత్నిస్తోంది. కానీ అతని ముందు ఆమె పప్పులేం ఉడకలేదు.

"లంజా!" అన్న మాట పెడీల్మని విసురుగా కొట్టిన దెబ్బ - మళ్ళీ తిరగబడిన గిన్నెలు. ఆమె కిక్కురుమనడంలేదు. ఆ క్షణాన సీతా మహాసాధ్విలాగా భూమి చీలితే మాయమవాలని ఉన్నట్టుంది చినపాపకి. పక్కగదిలో ఉన్న పెద్దమనిషికి ఆ ఒక్క రాత్రీ తన గుట్టు విప్పకూడదని ఆమె తాపత్రయం. బాధకన్నా పరువుని కాపాడుకోవాలనే ఆమె తాపత్రయం తెలుస్తోంది.

"వాడు నిన్ను.." అతని మాట పూర్తికానివ్వలేదు. నోరు మూయడం తెలుస్తోంది.

నాకు ఆశ్చర్యం. ఇంత సమర్థురాలు, ఇంత వ్యాపారాన్ని ఒంటి చేతిమీద నడపగల తెలివితేటలున్న మనిషి భర్తముందు గుర్తొచ్చింది. అతను భర్తేకాదు. గురువు కూడా. మామ.

కొండొకచో సామర్థ్యాన్ని తన మీద తనే కప్పుకున్న 'నియతి' తనని రెండోస్థానంలో నిలుపుతుంది.

ఓ రాత్రికి తప్పనిసరిగా బయటికి వెళ్ళాలని లేచాను. తెరవెనుక వరండాలో ఆమెను నులకమంచం మీద బల్లిలా కరుచుకుపడుకున్న వెదురుబొంగు కనిపించాడు. చిన్న గుడ్డివెలుగులో ఆమె గది సీలింగుని చూస్తోంది. కళ్ళు తెరుచుకుని ఉన్నాయి. నేను చూస్తున్నానని ఆమెకి తెలుసు. తెలుసునని నాకు అర్థమవుతోంది. అయినా ఆ దృశ్యాన్ని ఆమె దాచాలనుకోలేదు. నన్ను పలకరించలేదు. నేను పలకరించే ప్రయత్నం చెయ్యలేదు. ఎందుకంటే కౌగిట్లో భర్త.

నులకమంచం, వెదురుబొంగు చెయ్యి, కళ్ళల్లో నీళ్ళు - అంతే సందేశం.

తెల్లవారేసరికి మళ్ళీ చినపాప తన ముసుగులోకి జారిపోయింది. కాఫీతో ఎదురునిలిచింది. రాత్రి తగిలిన దెబ్బకి ఎడమ కన్నువాచి ఉంది. "మరో అరగంటలో బస్సు. టిక్కెట్టు తెప్పించాను" అంది.

కాఫీ తాగి స్నానం చేసి బట్టలు వేసుకున్నాను. నులకమంచం మీద బెదురుబొంగు గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఆ మంచాన్ని ఓ పక్కకి లాగింది.

ఇద్దరం ఒకే రిక్షాలో బస్సుస్టాండుకి వచ్చాం. "ఎలా వుంది రొయ్యల వేపుడు?"

ఆమెని చూశాను. "పిచ్చివాడా! అంతకన్నా ఎక్కువ ఆశించడం అన్యాయంరా" అని చెప్తోందా?"

బస్సు ఎక్కబోతూండగా తళతళా మెరిసే చిన్న కేరేజీ నా చేతిలో పెట్టింది. "గుడ్డుపీతల పులుసు. రేపటికి బాగా ఊరి పదునెక్కుతుంది" అంది.

"వెళ్ళిరానా?" అన్నాను.

అప్పుడు అప్పుడే నేనూహించని ఓ పని చేసింది ముందుకు వొంగి నా బుగ్గమీద ముద్దు పెట్టుకుంది. స్టాండులో ఓ ఏభైమంది మమ్మల్ని చూసి ఉండవచ్చు. కనీసం 40మందికి చినపాప ఎవరో తెలుసు. అయినా తను చేసిన పని దాచాల్సిన అపశ్రుతికాదు.

బస్సెక్కాను. "మళ్ళీ రండి" అంది ఆనందంగా.

బస్సు కదిలింది. చినపాప చిన్నదయిన కొద్దీ నా మనసులో మరీ మరీ పెద్దదయిపోతోంది.

చినపాప వ్యసనపరురాలుకాదు. ఆనాడు గుంతకల్లు రైలులో జరిగినది ఒక కల. ఒక అల. దాన్ని దాటాలనే ఆలోచన ఆమెకి లేదు. ఆమెని చూసినప్పటినుంచీ జరిగిన ప్రతీ కదలికలోనూ "శృంగారా"న్ని వెదికాను నేను. కానీ అందులో స్నేహం వుంది, కృతజ్ఞత ఉంది, పెద్దరికం వుంది, ఉదాత్తత ఉంది. ఆమె చినపాప కాదు. పెదపాప.

బస్సు పరిగెత్తడం లేదు.

పెళ్ళి నడక నడుస్తోంది.

(పైన మీరు చదివిన ముగింపు క్రింది కథకి - ఇది రెండో రకమైన ముగింపు.
మరో రకమైన ముగింపు వచ్చే నెలలో చదవండి)

ఒకే కథ - ఎన్నో ముఖాలు

**రైలు కదిలింది.** కదులుతూనే వేగం పుంజుకుంది. అప్పుడు చూశాను. రైలు కదలడం నాలాగే ఆలశ్యంగా గమనించిన ఆమె పరుగున కంపార్టుమెంటులోకి దూకబోయింది. చీర కుచ్చిళ్ళు అడ్డంపడ్డాయి. ఆవిడ ఇప్పుడు ఎక్కడికి వెళ్తోందో తెలుస్తోంది. మరో క్షణంలో ఫ్లాట్‌ఫారంకీ రైలుకీ మధ్య ఉన్న చోట ఇరుక్కుంటోంది. ప్రయత్నించి చేసిన పనికాదు. ఒక్క దూకులో ఆమె మీద పడ్డాను. కుడిచెయ్యి, నడుం దొరికింది. గట్టిగా శరీరాన్ని గాలిలోకి ఎత్తి కంపార్టుమెంటులో దూకాను. ఆనాటికి ఆ అదృష్టం మా యిద్దరిదీ. కంపార్టుమెంటు అంచుకి వచ్చాం. రైలుతో పరిగెత్తుతున్న ఎర్ర మైసయ్య చెనక్కాయల బస్తా కంపార్టుమెంటు లోపలికి విసిరేశాడు. బస్తా పెద్దది కాదు. కానీ రైలు వేగం, విసిరిన వేగం, ఆతృత అన్నీ కలిసి ఆ బస్తాను తుపాకీని చేశాయి. అంచున ఉన్న మా యిద్దరి శరీరాలనీ ఆ బస్తా లోపలికి గిరాటేసింది. ఇద్దరం కింద పడ్డాం ఒకరిమీద ఒకరం. ఇదంతా అనుకోకుండా జరిగింది - క్షణంలో.

భయంతో నన్ను కరుచుకుని ఆవిడ ఏడుస్తోంది. ఒక్క క్షణంలో మృత్యువునుంచి తప్పించుకున్న విషయం ఆవిడకి ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది ఆమె ముఖంలో షాక్. చాలా విచిత్రంగా నా ముఖంలోనూ షాక్. ఎందుకని? చాలాసేపటికి కానీ అర్థంకాలేదు. ఈ పరుగులో గుంజాటనలో బస్తా విసురులో ఆమె వక్షోజాలు బలంగా నన్ను గుచ్చుకున్నాయి. నేనూ వణికాను.

అప్పటికి సాయంకాలం అయిదున్నర. రైలెక్కాక టీ తాగాలన్న ఆలోచన ఆమెకి వచ్చిందట. అదిన్నీ అరుస్తూ వెళ్తున్న కుర్రాడు దాటిపోయాక. రైలు దిగింది. టీ దాటిపోయింది. రైలు కదిలిపోయింది. అదీ పరిస్థితి.

ఒకరిని చావు వణికించింది. మరొకరిని కోరిక వణికించింది. నిజానికి కోరిక కాదు. కోరికకి ఆలంబన. మామూలుగా రైలు ఎక్కివుంటే ఆ అమ్మాయిని చూసేవాడిని కాను. ఇది కేవల 42 సంవత్సరాల కిందటిమాట. గుంతకల్లువేపు తిరిగే రైళ్ళలో ఆ రోజుల్లో స్లీపరు పెట్టెల్లో ఒక మూలకి కేవలం ఆడవాళ్ళకే ప్రత్యేకించిన కేబిన్ ఉండేది. కనీసం గుంతకల్లు, హుబ్లీ, గుత్తి ప్రాంతాలవేపు తిరిగే రైళ్ళమాట. ఈవిడ ఆ కేబిన్‌లో ఉంది. గుంతకల్లులో రైలు బయలుదేరేటప్పటికి పెట్టెలో ఆనాడు నలుగురయిదుగురే ఉన్నారు. ఆ అమ్మాయి ఆడవాళ్ళ కేబిన్‌లో ఒక్కరే ఉంది. ఈ లైనులో ఆ రోజుల్లో రద్దీ తక్కువ. ఆనాడు ఎందుకో మరీ తక్కువగా ఉంది.

రైలు గుత్తి చేరేటప్పటికి ఉద్రేకం సర్దుకుంది. ఈసారి రైలు దిగి ఆమె అడక్కుండానే ప్లాట్‌ఫారం మీదనుంచే టీ కప్పు అందించాను. మనస్ఫూర్తిగా అందుకుంది. ఆమె ముఖంలో కొంతకాలం కిందటి భయం పోయి కృతజ్ఞత కనిపించింది. అప్పుడు ఆ అమ్మాయిని తేరిపార చూశాను. నిజానికి చిన్నపిల్లేం కాదు. తేలిగ్గా 27-28 ఏళ్ళు ఉంటాయి. కాని వయస్సుని ధిక్కరించే శరీరం. ఆ విషయం ఇప్పుడు గుర్తించినది కాదు. ఫ్లాట్‌ఫారం మీదకి తలమాత్రమే కనిపిస్తోంది. అయితే శరీరం ఇందాకటి నా అనుభవం చెప్పిన విషయం. ఆమె అందకత్తెకూడా కాదు. కానీ కళ్ళు దూసుకుని చూసేవి. నవ్వులో చిన్న విచిత్రం ఉంది. రెండు పెదవులూ బయటికి విచ్చుకుంటాయి. చిన్న అమాయకత్వం, నిజాయితీ ఆ నవ్వులో కనిపిస్తుంది.

రైలు వేగం పుంజుకున్నాక ఆలోచనలు, ఆ చిన్న మహిళల పెట్టెలో ఏకాంతంగా కూర్చున్న వ్యక్తి వేపే పరుగులు తీశాయి. కంపార్టుమెంటు దాదాపు ఖాళీ. టీటీయీ వచ్చి తీరికగా కూర్చున్న నన్ను చూసి ఎదురుగా కూర్చున్నాడు. టిక్కెట్టు అడగలేదు సిగరెట్టు అడిగాడు. అలవాటు లేదన్నాను. టిక్కెట్టు లేదన్నంతగా నిరుత్సాహపడ్డాడు. లేచి వెళ్ళబోతున్న ఆయన్ని అడిగాను. ఎందుకివాళ బొత్తిగా రద్దీలేదు? అని. వెళ్తూ వెళ్తూ 'బక్రిద్' అన్నాడు. ముస్లింలకు బక్రిద్ చాలా పవిత్రమైన పండగ. ప్రయాణాలు చెయ్యకుండా ఇళ్ళల్లో పండగ చేసుకుంటారేమో. అయితే ఈ లైను అంతా ముస్లింలే ఉండరుకదా?

క్షణాలు గడిచేకొద్దీ ఆలోచనలు ఆ అమ్మాయివేపు ప్రయాణం చేస్తున్నాయి. వెళ్ళి ఆ పెట్టె తలుపు తీశాను. చటుక్కున నన్ను చూసింది. చూసినందుకు ఆశ్చర్యపడలేదు. కాగా రావడం ఆలశ్యం చేసినందుకు ఆతృత పడినట్టు కనిపించింది. ఎలా తెలిసింది? వెంటనే తను జరిగి నాకు చోటిచ్చింది. ఎదురుగా కూర్చోవచ్చుకదా? కానీ అమ్మాయి తనపక్కకి ఆహ్వానించడం శుభసూచకం. దేనికి?

కాస్సేపే నిశ్శబ్దం. నా చేతిమీద చెయ్యివేసి 'థాంక్స్' అంది. అప్పుడు అర్థమయింది ఆవిడ బొత్తిగా చదువుకోలేదని. కానీ కళ్ళల్లో కృతజ్ఞతకి మించిన ఉత్తేజం తెలిసింది. ఏమిటది? నా చేతిమీద ఆమె చెయ్యి వణుకుతోంది లేక నా చెయ్యా?

ఇక తట్టుకోలేకపోయాను. ఆమె భుజం మీద చెయ్యివేశాను. ఆమె ఆశ్చర్యపడలేదు. నిజానికి ఎదురు చూస్తున్నట్టు కనిపించింది. ఇదంతా కృతజ్ఞతలో భాగమా? సినిమాల్లో హీరోలు మొదటి కలయికలోనే హీరోయిన్లను ఏదో ప్రమాదం నుంచో, కీడు నుంచో కాపాడుతారు. ఆ వెంటనే రొమాన్సు ప్రారంభమవుతుంది.

"నీ పేరు?"

"చినపాప. అసలు పేరు మహాలక్ష్మి. చిన్నప్పుడు నాకు ఆ మాట సరిగ్గా పలకడానికి వచ్చేదికాదట అందుకని ఎవరడిగినా మా అమ్మ నన్ను పిలిచే పేరునే చెప్పేదాన్ని"

"మరి పెద్దపాప ఎవరు?"

నవ్వింది. అప్పుడే తెలిసింది. పెదాలు బయటికి విచ్చుకుని నోరు ప్రత్యేకంగా కనిపించడం. "ఎవరూ లేరు. నేను ముద్దుగా ఉన్నానని మా అయ్య నన్ను చినపాప అని ముద్దాడేవాడట అందరికీ చినపాపని అయిపోయాను"

వెంటనే ఓ తొందరమాట అనుకోకుండా అన్నాను: "ఇప్పుడూ ముద్దొస్తున్నావు"

పగలబడి నవ్వింది. అప్పుడు తెలిసింది. ఆమెలో మరొక అందం - కుడి చివర ఊడిన పన్ను ఖాళీ. ఇది అందం ఎలా అవుతుంది? ఏమో? అది చెప్పడానికి చినపాపని చూడాలి.

నా చెయ్యి తీసుకుని తన జాకెట్టు మీద పెట్టుకుంది. ఈసారి నేను వణికిపోయాను. కంపార్టుమెంటులో ఇద్దరం కలిసి పడిన సంఘటనలో ఆతృత ఉంది. ప్రాణ భయం ఉంది. మించి అసంకల్పితమైన reflex మాత్రమే ఉంది. ఇప్పుడిది తెలిసిన అనుభవం. శరీరం వేడెక్కిన క్షణం. చెమట పట్టింది. ఇప్పుడు ఏం జరుగుతుంది?

మా యిద్దరికీ తెలియని విషయం ఏమిటంటే అంతకు కొన్ని క్షణాల క్రితమే రైలు స్టేషన్లో ఆగింది. భళ్ళున ఈ లేడీస్ పెట్టె తలుపు తెరుచుకుంది. 'భళ్ళున' అన్నమాట ముఖ్యం. కొత్తగా ఎవరయినా ప్రయాణీకులు వచ్చారేమో. ఆమె జాకెట్టుమీద చెయ్యిని చటుక్కున తీసేశాను. పెట్టెలోకి ప్రయాణీకులు ఎవరూ రాలేదు. కేవలం టీటీయీ వచ్చాడు. అతని ముఖంలో చిన్న చిరునవ్వు. మగాళ్ళకి మాత్రమే ప్రత్యేకమైన నవ్వు. "నాకు తెలుసులే!" అన్న బెళ్ళింపు అందులో ఉంది.

అమ్మాయితో అన్నాడు: "ఎక్కడికి?"

"పొన్నూరు"

"ఇది గుంటూరు దాకే పోతుంది"

"అక్కడ బండి మారుతాను"

టిక్కెట్టు అడగలేదు. మా ఏకాంతాన్ని చెడగొట్టగలిగినందుకు తృప్తిపడ్డాడు. బయటికి వెళ్తూ తలుపు దగ్గర ఆగి "తలుపు వేసుకోండి" అన్నాడు.

"గుంతకల్లు ఎందుకు వచ్చావు?"

"కసాపురంలో మా అమ్మమ్మ ఉంది. ఒళ్ళు బాగులేదు. చూసిపోదామని వచ్చాను."

"పొన్నూరులో ఎవరున్నారు?"

"మా అమ్మ"

"నాన్న?"

"లేడు"

"పోయాడా?"

"పారిపోయాడు"

ఇప్పుడు జాలి చూపించాలా? కారణం అడగాలా? ఎప్పుడు - అనాలా?

"నేను టైలరింగు చేస్తాను. పొన్నూరులో జంపరుకుట్టుకి చినపాపదే పేరు" అంటూ చీరకొంగు తప్పించి జాకెట్టుని గర్వంగా చూపించింది. కాని కనిపించినవి - రెండు. చినపాప జంపరుకుట్టుకాదు పొడుచుకుని వచ్చిన వక్షోజాలు. చక్కగా, ఏపుగా పెరిగిన శరీరం. ఆ 'ఏపు'ని గుర్తుపట్టగల ఆమె గర్వం. వాటిని చూసి ఎదుటి వ్యక్తి తలకిందులౌతున్నాడని ఆమెకి తెలుసు. ఆమెకి తెలుసునని నాకూ అర్థమౌతోంది.

చిలిపిగా చూస్తోంది. చాలాసేపటి వరకూ మాటరాలేదు. స్త్రీలో కోరిక తొందరపెడితే మగాడు తడబడతాడు. ఎందుకని? 'సిగ్గు' అనే ముసుగు ఆ రుచిని మరింత పెంచుతుంది కనుక. అయితే ఒక్కచోటే దానికి శలవు పడకగదిలో. ఇది పడకగది కాదు.

"నిన్ను ముద్దుపెట్టుకోనా?" అన్నాను.

"అడగాలా?" అని ముందుకు జరిగింది. నవ్వినప్పుడు ఆమె పెదాలు బయటికి విచ్చుకోవడంలో 'సెక్స్'కీ ప్రమేయం ఉన్నదని ఇప్పుడనిపించింది. ఆమె పెదాలు దగ్గరకు జరిగిన నా పెదాలను ఆక్రమించుకున్నాయి. 'కోరిక' నాకు తెలియకుండానే ఆమె చెప్పుచేతల్లోకి వెళ్ళిపోయింది.

తర్వాత ఏం జరిగేది? ఫ్రాయిడ్, హావ్‌లాక్ ఎల్లిస్ తల బద్దలు కొట్టుకున్నా తేలేదికాదు. కాని ఆ క్షణంలో రైలు ఆగి మా పెట్టె సరిగ్గా స్టేషన్లో రద్దీగా ఉన్న చోట నిలిచింది. ఈ రోజుల్లోలాగా గాజు అద్దాల కిటికీలు కావు. ఊచలు లేని మాములు కిటికీలు. చటుక్కున నేను వెనక్కి జరిగాను. ఆమె పక్కున నవ్వింది. ఆ నవ్వుకి అర్థం చేతిలో పెట్టిన తాయిలాన్ని అందుకోలేని పసివాడని చూసినప్పటి చిలిపితనం.

మాటలు రాని నిశ్శబ్దమది. టీ, బిస్కట్టులు, కూల్ డ్రింకులవాళ్ళు కిటికీలోంచి తలదూర్చి పలకరించి వెళ్తున్నారు.

"మీరేం చేస్తారు?" అంది - ఇప్పటికి.

చెప్పాలని నోరు తెరిచి, అంతలో ఆగి - "ఏం చేస్తానో చెప్పుకోచూద్దాం" అన్నాను.

అలవాటయిన, చిక్కని నవ్వు నవ్వుతోంది. "అమ్మాయిల్ని ముద్దు పెట్టుకుంటూంటారా?"

చదువుకీ, instinct కీ సంబంధంలేదు. అనుభూతికి అధ్యక్షత వహించడంలో ఏనాడయినా స్త్రీకి రెండు మూడు మాస్టర్ డిగ్రీలు ఉన్నాయి. కోరికను సమాధాన పరచడంలో, మమకారాన్ని మాతృత్వానికి మలచడంలో. సృష్టిలో స్త్రీని దాటి నిలవగల శక్తిలేదు. Womanhood and motherhood are the ultimate conquests of woman.

"విజయవాడ గవర్నరు పేటలో ఒక హోటల్లో ఛెఫ్‌ని" ఛెఫ్ అన్నమాట నేను వెతుక్కున్నది. ఆ రోజుల్లో విజయవాడలో కనీసం ఆ ప్రాంతంలో స్టార్ హోటళ్ళు లేవు. ఛెఫ్ అన్నమాట చాలామందికి తెలీదు. నేను వెదుక్కుని నా వృత్తికి గౌరవాన్ని పొదగడానికి తెచ్చిపెట్టుకున్నమాట. చుట్టుపక్కలవాళ్ళు, హోటల్లో పనిచేసేవాళ్ళూ పిలిచేది 'మాస్టర్' అని.

"ఛెఫ్ అంటే?"

నాకు అర్థమయింది - ఆమెకి అర్థంకాని మాట చెప్పానని. ఇప్పుడిక విజయవాడ స్థాయికంటే కిందకి రాకపోతే ఆమెకి అర్థంకాదు. "హోటల్లో వంటలు చేస్తాను" అన్నాను అలా చెప్తున్నందుకే ఇబ్బంది పడుతూ.

నవ్వింది. "నాకంటా బాగా చేస్తారా? నేను రొయ్యల వేపుడు స్పెషల్"

నన్ను మించి గర్వపడే మరో అందం ఆ క్షణంలో ఆమె సొంతం చేసుకుంది. మొదటిది? ఆమె యవ్వనం. మొదటిసారిగా ఆమె ముందు ఓడిపోవడానికి సిగ్గుపడలేదు. నన్ను అర్థం చేసుకున్నట్టుంది. నా భుజం తట్టి "ఒక్కసారి మీ వంట తినడానికి విజయవాడ వస్తాను" అంది.

అప్పుడు గుర్తొచ్చింది. భోజనం మాట. "ఇద్దరికీ భోజనం చెప్పి వస్తాను" అని లేవబోయాను. నన్ను భుజం పట్టుకు లాగి కూర్చోపెట్టింది. "ఈ లైనులో భోజనం ఇచ్చే స్టేషన్లు లేవు. మా అమ్మమ్మ పెరుగన్నం, వాము మిరపకాయలు, బిరియానీ ఇచ్చింది. మనిద్దరికీ చాలు" అంది.

మళ్ళీ రైలు కదిలింది. మళ్ళీ ముద్దుపెట్టుకునేదా? ఇలాంటి చర్యలకి ఆవేశం ప్రాతిపదిక. కేవలం ఆలోచన చాలదు.

"మీరెందుకు గుంతకల్లు వచ్చారు?"

"చెనక్కాయ పచ్చడి ఎలా చెయ్యాలో నేర్చుకోడానికి"

ఆపకుండా నవ్వింది. నవ్వుతున్నప్పుడు చీర పైట జారిపోయింది. లేక జారిపోయేలాగా నవ్వుతోందా? బయట అందరికీ వినిపించేలాగా ఉంది ఆ నవ్వు. ఆపడానికి ప్రయత్నించాను. కానీ నా చేతిని తన చేతిలోకి తీసుకుని మరీ నవ్వుతోంది. చేతిని భుజం మీద ఆప్యాయంగా తిప్పుకుంది.

కాస్సేపటికి ఆగి - "ఇంతోటిదానికి ఇంత దూరం రావాలా?" అంది.

చేతివంట కళ కాగలదన్న దృష్టి స్త్రీకి తక్కువ. చిన్నప్పటినుంచీ ఒక 'అలవాటు'లాగ ఆ ప్రక్రియ లొంగిపోతుంది వారికి. జీవితమంతా సాగిపోతుంది. కానీ ప్రపంచంలో గొప్ప వంటవాళ్ళంతా మగవారు. మన సంస్కృతిలో కూడా. వంటకి భీముడిని చెప్తాం. ద్రౌపదిని కాదు. నలుడిని చెప్తాం. దమయంతిని కాదు. ప్రపంచంలో గొప్ప వంటగాళ్ళందరూ మగవాళ్ళే. గార్డె రామ్స్, పాల్ బోకూసే, ఎమిరిల్ లగాస్సీ, ఆంథోనీ బోర్డాయిన్ - ఇలా ఎందరయినా. విజయవాడ వంటవాడికి ఇంత పెద్ద పేర్లు ఎలా తెలుసు? ఓ ఇంగ్లీషు దొరగారు నా చేపల కూరకి మురిసి నా కూరని విదేశీ కూరలతో పోల్చి చెప్పాడు. అప్పుడే ఈ పేర్లు తెలిశాయి. నేను కాగితం మీద వాటిని రాయించుకున్నాను. మరీ గొప్పవారు హోటల్లో దిగినప్పుడు నా తెలివి తేటల్ని ప్రదర్శించడానికి ఆ పేర్లు వాడతాను. అయితే చినపాప ముందు ఎందుకు? ఆమెకి తెలియని గొప్ప ప్రపంచం నాకు తెలుసునని ఊరించడానికి. ఇది హనుమంతుడి కుప్పిగంతు.

చెప్పాను. "రాయలసీమలో చెనక్కాయల పంట ఎక్కువ. చెనక్కాయలతో ఎన్ని రకాల ఐటమ్స్ చెయ్యవచ్చునో చాలామందికి తెలీదు. శాంసన్‌పురంలో మా ఎర్ర మైసయ్య నాయనమ్మ ఉంది. కుంచమ్మ. ఆవిడకి 87 ఏళ్ళు. మైసయ్య ఓసారి విజయవాడ వచ్చి రొట్టెల్లో ఓ విచిత్రమైన కూర పెట్టి నా మతి పోగొట్టాడు. ఏమిట్రా యిది - అంటే చెప్పడు. బెల్లించి బెల్లించి వాడి నాయనమ్మ చేసిందని చెప్పాడు. అప్పటినుంచీ ఆ 'రుచి' పట్టుకోవాలని తాపత్రయం. ఇన్నాళ్ళకి కుదిరింది"

"ఎలా చేస్తావు ఆ కూర?" దగ్గరకి జరిగింది.

నేను నవ్వాను. "రెండేళ్ళు కష్టపడి ఆర్జించిన విద్య అది. అంత సుళువుగా చెప్తానా? విజయవాడ రా. చేసి తినిపిస్తాను" తల్లి కుర్రాడిని బెల్లించినట్టు చూశాను. నా చెయ్యి తీసుకుని తన చేతిలో పెట్టుకుని "ఒట్టు?" అంది.

నేను అనలేదు. ముద్దు పెట్టుకున్నాను.

"ఒకటికాదు. ఆరు రకాల వంటకాలు నేర్పింది ఆవిడ. వాటికి కాస్త పట్నం పద్ధతులు జతచేశానంటే కేవలం చెనక్కాయ వంటకాలు కారణంగా జీతం మరో వెయ్యి పుచ్చుకుంటాను. ధనియాలు, తిరగమోత, ఉల్లిపాయ ముక్కలు వేసిన పచ్చడి మామూలు వంటకం. చెనక్కాయని కచ్చాపచ్చాగా ముక్కలు చేసి ముద్దకాకుండా ఉడికించి మైదాపిండి" ఒక్కసారి వ్యాపార దక్షత ఉన్న వంటవాడినయిపోయాను. ఆమె మనఃపూర్వకంగా బురద పూసుకుంటున్న కుర్రాడి ఆటని ఆనందంగా గమనిస్తున్నట్టు నన్ను చూస్తోంది. ఆమె చూపులో వింటున్న శ్రద్ధకాక, చూస్తున్న ఆసక్తి తెలుస్తోంది. నేను చెపుతున్న విషయం మీద ఆమె శ్రద్ధలేదని అర్ధమయి అంతలోనే ఆగిపోయాను.

ఇద్దరం ఒకరినొకరు గమనిస్తూ కొన్ని క్షణాలు నిలిచిపోయాం. చెనక్కాయ వంటకాలు అటకెక్కిపోయాయి. తర్వాత ఏం జరిగేది? ఏమో?

తలుపు చప్పుడయింది. ఇద్దరం తుళ్ళిపడ్డాం. వెళ్ళి గొళ్ళెం తీశాను. టీటీయీ రహస్యం చెప్తున్నట్టు అన్నాడు: "పెద్ద స్టేషన్ వస్తోంది. మీరు బయట ఉంటే మంచిది" ఈ మాటని రహస్యంగా చెప్పనక్కరలేదు. కాని అతనిమాట ఆర్డరులాగా లేదు. సూచనలాగా ఉంది. పోలీసు దొంగతనాన్ని ప్రోత్సహించినట్టు ఉంది.

అవకాశం, మద్దతు, ఇటు పక్క పూర్తి సహకారం శరీరం క్రమంగా వేడెక్కుతోంది. అయినా బయటకి వచ్చాను. తీరా అది రైలు ఆగే ఊరుకాదు. గుడిమెట్ట. ఏదో క్రాసింగు ఉందట. రైలు దిగి అటూ యిటూ దిక్కుతోచనట్టు నడిచాను. కిటికీలోంచి పాప చూస్తోంది. అక్కరలేకపోయినా, అలవాటు లేకపోయినా సిగరెట్టుకొని కాల్చాను. పొగకి గుక్కతిరగక ఉక్కిరిబిక్కిరి కావడం పాప గమనించింది. కోరిక తీర్చుకోవడం తెలీని వ్యక్తిని చూసి ఆటపట్టించినట్టు నవ్వుతోంది. మేమిద్దరం ఒకరినొకరు చూసుకుంటూండడం టీటీయీకి తెలుస్తోంది. భుజం మీద చెయ్యి వేశాడు.

"ఓ ఫార్టీ ఉందా?" అన్నాడు. అప్పు అడిగినట్టు కాదు. అదేదో తన హక్కులాగా అడిగాడు. ఏమిటా హక్కు? స్లీపరు కంపార్టుమెంటులో ఆడవాళ్ళ పెట్టెకు లోపలి గడియ ఖరీదు.

ఇవ్వనన్నాను. గమనించాలి. లేదనలేదు. మా దగ్గరతనాన్ని గుర్తించినందుకు ఆనాడు అతను ఏర్పరచుకున్న రుసుమది. మరొకరెవరయినా సులువుగా ఇచ్చేవారేమో. ఇది 42 ఏళ్ళ కిందటి నలభై రూపాయలు. నిజానికి అంత డబ్బు ఆనాడు నా దగ్గర లేదు. ఉంచుకునే అవసరమూ లేదు.

అతను ఆశ్చర్యపోయాడు. నిష్కర్షగా చెప్పిన నా ధోరణికి షాక్ అయాడు. దూరంగా జరిగిపోయాడు. ఒక అపశృతిని సమర్ధించడానికి రుసుము చెల్లించాలనే యావలేని రోజులవి. ప్రతీ సౌకర్యానికి విలువకట్టి రాబట్టుకునే ఉద్యోగం అతనిది. ఇద్దరికీ ఆ క్షణంలో పొంతన కుదరలేదు. కానీ అందువల్ల జరిగిన నష్టాన్ని చాలాకాలం మరిచిపోలేకపోయాను.

రైలు కదిలింది. ఈసారి స్వేచ్ఛగా పాప పెట్టెలోకి వెళ్ళలేకపోయాను. కారణం - టీటీయీ ఈ కంపార్టుమెంటులోనే ఉండడం, అతని కోరికని కాదన్న నిర్మొహమాటం నాకు ఆ క్షణంలో బంధువయింది. మించిపోయింది లేదు. అయితే ఇవ్వాలన్నా అంత డబ్బు నా దగ్గరలేదు. మునుమాక దాటాక మెల్లగా కంపార్టుమెంటు దాటాడు పక్క పెట్టెలోకి. అంతే. వెంటనే పాప దగ్గరికి దూకాను. నా కోసమే ఎదురుచూస్తున్నట్టు కూర్చుని ఉంది. 'ఎందుకింత ఆలశ్యం?' అన్నట్టు చూసింది.

దొంగలకి దొంగ భాష అర్ధమవుతుంది. లేదా ఆర్తులకి ఎదుటి వ్యక్తి ఆర్తి గుర్తు తెలుస్తుంది. "టీటీయీ" అన్నాను క్లుప్తంగా.

ఈసారి మరీ దగ్గరగా కూర్చున్నాను. ఎలా కలిసింది ఈ చొరవ? లాజిక్ లేదు. గుంతకల్లు నుంచి సంఘటనలన్నీ అలా తోసుకొచ్చాయి.

ఈసారి ప్రయత్నం లేదు పాపని నా కౌగిట్లోకి తీసుకున్నాను. నా హక్కులాగ. రైలువేగానికి పాత కంపార్టుమెంటు మమ్మల్ని ఉయ్యాల ఊగిస్తోంది. పాప క్రమంగా నన్ను అల్లుకుంటోంది. అలా ఎంతసేపు? అప్పటికి నేను మరిచిపోయిన విషయం ఏమిటంటే ఈ ఆడవాళ్ళ పెట్టె తలుపు గొళ్ళెం వేయలేదు. న్యాయంగా ఎవరయినా తలుపు తోసుకు లోపలికి రావచ్చు. వచ్చే ప్రయత్నం జరిగింది. కానీ రాలేదు. ఎవరు? టీటీయీ.

పక్కపెట్టెలోంచి ఒక ముసలావిడని వెంటబెట్టుకు వచ్చాడు. మేమిద్దరం తుళ్ళిపడ్డాం. మా యిద్దరి వేపూ చూడకుండా కార్య దక్షతతో నిమగ్నమైన ఉద్యోగిలాగా చార్టుని చూసుకుంటూ "ఈ క్రింది బెర్తులో పడుకోండి" అన్నాడు.

"రాత్రంతా నేలమీద దొర్లాలేమోనని బెంగెట్టుకున్నాను. నెత్తిన పాలుపోశావు కొడుకా" అంది ముసలావిడ.

అంటే రిజర్వేషన్ చేయించుకున్న పాసింజరుకాదు. పూనుకుని, వెతికి పట్టుకుని తీసుకొచ్చిన శాల్తీ ఈ పాసింజరు.

"మీలాంటి వాళ్ళకి సేవచేస్తే పుణ్యం మామ్మగారూ. పడుకోండి" అని తలుపుదాకా వెళ్ళి "నాకేం ఇవ్వనక్కరలేదు" అన్నాడు నన్ను చూస్తూ.

కావాలని, కసిగా చేసిన పని అని అర్థమవుతోంది. నన్ను చూసి "ఆవిడకి తోడున్నారు. మీరు మీ బెర్తుకి వెళ్ళి కూర్చోవచ్చు" అనేసి తలుపు దగ్గరికి లాగేసి మాయమయాడు.

ఇక అక్కడ కూర్చున్నా ఒరిగేదేమీ లేదు - కబుర్లు చెప్పుకోవడం తప్ప. అయినా మమ్మల్ని మాట్లాడనివ్వలేదు ముసిలావిడ. "నీకేమవుతుంది ఈ బొట్టి?" అంది. ఏమీ కాదన్నాను.

"అయితే నువ్విక్కడ కూర్చోవడం తప్పుకదా?"

కొందరికి లేని చొరవ ఉంటుంది. ఎక్కువగా తమిళులకి అది జన్మహక్కు. రోడ్డుమీద సైకిలు మీద వెళ్తున్నవాడు పార్కులో పువ్వులు కోస్తూంటే గుర్రుగా చూస్తాడు సైకిలు ఆపి. Righteous monitering మంచి జబ్బే. అది జాతికంతా ఉంటే వ్యవస్థ సంస్కారం. కొందరికే ఉంటే అది వ్యక్తి వికారంగా సరిపెట్టుకుంటాం.

లేచాను. చినపాపకూడా నిరుత్సాహపడినట్టు తెలుస్తోంది. అయినా చేసేదేమీలేదు. వెళ్తున్న నన్ను చూసి "గంటలో రా. భోజనం చేద్దాం" అంది. ఇది అతి చిన్న సౌకర్యం.

కాలుకాలిన పిల్లిలాగా కంపార్టుమెంటు అంతా తిరిగాను. అప్పటికి నా జేబులో నలభై రూపాయలు ఉంటే వెదికి పట్టుకుని టీటీయీకి సమర్పించేవాడిని. అది నా శక్తికి మించిన పైకం అప్పటికి. బెర్తు మీద కూర్చున్నాను. శరీరం అలసిపోయినప్పుడూ, మనస్సు అలసిపోయినప్పుడూ ఓ ఆటవిడుపు ఉంది - నిద్ర. నాకు తెలియకుండానే నిద్రపట్టేసింది. ఉన్నట్టుండి ఎవరో భుజం మీద చెయ్యివేస్తే తుళ్ళిపడి లేచాను. చీకటి పడింది. చేతిలో భోజనం పాకెట్‌తో వచ్చి నా పక్కన కూర్చుంది. అప్పటికి కంపార్టుమెంటులో ఉన్న నలుగుతూ నిద్రపోతున్నారు. నా పక్కన కూర్చుంది.

'నువ్వొస్తావేమోనని ఎదురు చూశాను' అంటూ.

"ఆ ముసలి దెయ్యం?"

"ఇంకా పడుకోలేదు. 'నాకేం భయంలేదు. హాయిగా పడుకో' మంటోంది. తనకి రాత్రుళ్ళు నిద్ర సరిగా పట్టదట."

నిరుత్సాహం గుండెలకి ఎగదన్నింది. ఆమె స్వయంగా పాకెట్‌లోంచి అన్నం నోటికి అందించింది. ఆకలి లేదు. అయినా నోరు తెరిచాను.

నా కళ్ళల్లో నిరుత్సాహం ఆమెకి అర్థమవుతోంది. ఆ క్షణంలో అర్థం చేసుకున్న అమ్మ అయింది. లేచి వెళ్తున్న ఆమె చీర పట్టుకుని ఆపాను. వెనక్కి తిరిగి ఎంగిలి పెదాలను ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది.

అంతే ఆ రాత్రి కథ.

గుంటూరు రైల్వే స్టేషన్లో తుళ్ళిపడి లేచాను. అప్పటికే రైలు ఆగి చాలా సేపయినట్టుంది. హడావుడిగా కంపార్టుమెంటు దిగాను. ఎక్కడ చినపాప? చుట్టూ తప్పిపోయిన పసివాడిలాగా కళ్ళు వెదికాయి. అప్పుడు కనిపించింది ఎదుటి ప్లాట్‌ఫారం మీద నాదృష్టిని పడడానికి ఎదురుచూస్తోంది. నేను చూడగానే చెయ్యి ఊపింది.

స్టేషన్లో నన్ను లేపలేదేం? వెళ్తున్నట్టు చెప్పలేదేం? ఇంత సులువా విడిపోవడం? అటుపక్క ప్లాట్‌ఫారం మీద డూప్లికేట్ రైలు ఉంది. నాలుగడుగులు వేశాక జనం మధ్య కలిసిపోయింది చినపాప. మరి కనిపించలేదు.

*(ఈ తర్వాత ఈ కథకి నాలుగు ముగింపులున్నాయి. పాఠకుడు నాలుగూ చదవొచ్చు. కథగా మనస్సులో మిగలాలంటే ఒకటి చాలు. కానీ అన్నీ చదవాలంటే ఈ వరసలోనే చదివితే బాగుంటుంది)*

1. *మెలోడ్రామా*
2. *డ్రామా*
3. *వాస్తవం*
4. *అది వాస్తవం.*

***

***డ్రామా (3వ రకం ముగింపు)***

వాస్తవం

***ఆ రోజుల్లో విజయవాడ*** *ఏలూరు రోడ్డులో మాతా కేఫ్ చాలా పరపతి గల హోటల్. తెల్లవారుఝామున మూడుగంటలకే తెరిచేవారు. తెరిచిందే తడవుగా వేడివేడి ఇడ్లీ వడ, దానికి తోడు చేతులు కాలే సాంబారు ముఖ్యమయిన ముక్తాయింపు చెట్నీ. కొబ్బరి చెట్నీ దక్షణాదినంతా ఇడ్లీతో యివ్వడం రివాజు. కానీ ఆ రోజుల్లో పచ్చి చెనక్కాయల్ని రుబ్బి, తిరగమాత వేసి పంటికింద పడితే పొగరుగా పలకరించే ఎండుమిరపకాయ ప్రతీ ప్లేటులోనూ వచ్చేటట్టు ప్రత్యేకంగా సర్వీసుకి ముందు జతచేసి (తెలుగువాడికి కారం రుచి జన్మహక్కు) అసలు ఈ మిరపకాయ ఆలోచన నాది. గుంతకల్లు నుంచి నేర్చుకుని వచ్చిన నాలుగయిదు రకాల అనుపానాలు కష్టమర్ల మతులు పోగొట్టేవి. ఆ సమయంలో ఎవరు కష్టమర్లు? రాత్రి లారీలు నడిపి తెల్లవారు ఝామున సిటీ చేరేవారు, తెల్లవార్లూ పనిచేసే దినపత్రికల ప్రెస్ వర్కర్లు పొద్దుటే ఇడ్లీకోసం కాస్త ముందుగా లేచే రైతు సోదరులు ఉదయం నాలుగూ అయిదూ మధ్య హోటలు ముమ్మరంగా ఉండేది. ఆ రోజుల్లో ఆ టైములో వేడీ ఇడ్లీని ఇచ్చేవారు మరెవరూ లేరు.*

*నేను అయిదూ ఆరూ మధ్య దర్శనం ఇచ్చేవాడిని. ఆలశ్యమయితే "ఎక్కడయ్యా మేష్టరు?" అని గొంతులు వేడెక్కి వినిపించేవి. కొన్ని గొంతుల్లో రాత్రి మందు దిగని హాంగోవర్ తెలిసేది. ఏమయినా వాళ్ళకి రుచి, నాకు జీతం, యజమానికి పెట్టుబడి. అది నా జీవితంలో పెద్ద ఉప్పెన.*

ఓ రోజు పొద్దుటి షిఫ్టు పలకరింతలు పూర్తిచేసుకుని వెళ్ళే టైముకి "హేయ్ మాస్టర్" అనే తియ్యటి పలకరింత వినిపించింది. ఇది అలవాటు లేని గొంతు. కాని నా పరపతిని ఎరిగిన గొంతు. ఓ టేబులు ముందు ఒంటరిగా కూర్చున్న వ్యక్తిని చూశాను. చక్కని ఖరీదయిన నెమలిపించం రంగు చీరలో కళ్ళకి కళ్ళజోడుతో, నుదుటిమీద ఎర్రటి బొట్టుతో అన్నిటికీ మించి నిండైన చిరునవ్వుతో దగ్గరికి నడిచిన కొద్దీ అవును ఆ నవ్వే ఆమెని పట్టిచ్చింది. అవును. నా ఆలోచన కరెక్టే.

"నువ్వు.." అంతలో సర్దుకున్నాను. అలా చూస్తున్నప్పుడు ఆమెని 'నువ్వు' అనలేకపోయాను "మీరు.. చినపాప"

సమాధానం ఆమె దగ్గర్నుంచి రాలేదు. నా వెనుకనుంచి వచ్చింది.

"చినపాప వాళ్ళ ఊరిలో వాళ్ళ అమ్మానాన్నా పిలుచుకున్న పేరు. అసలు పేరు అలివేలు."

ఇటు తిరిగాను. తిరుగుతూనే ఆయన్ని చూసి నిర్ఘాంతపోయాను. అప్పుడే లండన్‌నుంచి దిగుమతి అయిన తెలుగు దొరలాగా ఉన్నాడు. మంచి సూటు, టై, ఉదయమే కూలింగు కళ్ళద్దాలు

"నా పేరు మల్లేశ్వరరావు. ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డిజైనర్ - అంటే పారిశ్రామిక మౌలిక ప్రణాళికా రూపశిల్పిని" నవ్వి "మా తెలుగు మాష్టారి పుణ్యమిది. గత కొన్ని నెలలుగా మీ చెనక్కాయ పచ్చడి కోసం ఈవిడ ఉవ్విళ్ళూరుతోంది. ఆ రోజు మీరు గుంతకల్లులో ఆవిడని కాపాడినందుకు నాతో కూడా 'టాంక్స్' చెప్పించాలని ఆమె కోరిక. ఇవాళ ఉయ్యూరుకి పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో తవుడుతో బిస్కత్తులు తయారు చేసే ఫాక్టరీ నిర్మాణానికి మౌలిక ప్రణాళిక సిద్ధం చేయాల్సి ఉంది. నాతో వస్తానని వెంటబడింది. మొదట మీ చెనక్కాయ పచ్చడి" అంటూ కూర్చున్నాడు.

చినపాప కోపంగా అంది "నా 'టాంక్స్'ని అంత ఆట పట్టించాల్సిన అవసరంలేదు" అంది.

మల్లేశ్వరరావు నవ్వుతున్నాడు. "చిన్నప్పుడు ఈ చినపాప అందరికీ 'టాంక్స్' చెప్పేదట. నేను అన్నీ మార్చగలిగాను కానీ 'టాంక్స్'ని మార్చలేకపోయాను."

ఒక్క 'టాంక్స్' ఆధారంగా ఆమె బొత్తిగా చదువుకోని వ్యక్తి అని ఆ రోజు నిర్ధారించుకోవడం గుర్తొచ్చింది. ఇప్పుడు నాలిక కొరుక్కోక తప్పలేదు.

"మరి జంపరు కుట్టు?" మనసులో అనుకున్నానని అనుకున్నానుగాని, నా సందిగ్ధం బయటికే వచ్చేసింది.

మల్లేశ్వరరావు పగలబడి నవ్వాడు. "వీళ్ళ తాత ఆ రోజుల్లో బొంబాయినుంచి జంపరు కుట్టుని తెచ్చాడు. కేవలం కుట్టుమీద పొన్నూరులో రెండు మేడలు కట్టాడు ఇప్పుడాపని చేసేవారు బోలెడంతమంది ఉన్నారు. వీళ్ళందరికీ జంపరు కుట్టు వారసత్వం. ఆడపిల్లలకి మరీను" ఆగి "జంపరు కుట్టు మీదాకా వచ్చిందన్నమాట"

ఇందులో చిన్న సైకలాజికల్ పాయింటు ఉంది. అలివేలు ఐశ్వర్యం, హోదా ప్రస్తుతం భర్తద్వారా వచ్చినది. కానీ ఆమె సొంత ఆస్తి వారసత్వం జంపరు కుట్టు. ఆడపిల్ల భర్తవైభవాన్ని మినహాయించి తన పుట్టింటి గొప్పతనాన్ని ముందు నిలపడం అర్థం చేసుకోగలిగిన విషయం.

అలివేలు అనే మల్లేశ్వరరావు భార్య ఐశ్వర్యవంతురాలు. ఆ రోజు గుంతకల్లులో జంపరుకుట్టు పాపగా ఎందుకు పరిచయం చేసుకుందో తెలుస్తోంది.

లొట్టలు వేసుకుంటూ ఇడ్లీని చెనక్కాయ పచ్చడి నంచుకుని తినలేదు చినపాప. ఇడ్లీని చెనక్కాయ పచ్చడికి నంచుకుని జుర్రింది పొంగిపోతూ. ఆ పచ్చడి రూపు దిద్దుకున్న తొలిక్షణాలు ఆమెకి తెలుసు. నేను ఆనందంగా చూశాను. నా బిడ్డని ఎదుటి వ్యక్తి లాలించి ముద్దు పెట్టుకోవడంలాంటిదది. తన సృష్టిని అభినందించడం సృష్టికర్తకు మనం అందించగల నివాళి.

హడావుడి పడుతూ తిన్నాడు మల్లేశ్వరరావు. "ఇన్నాళ్ళకి మా ఆవిడ కోరికను తీర్చినందుకు ఆనందంగా ఉందయ్యా" అంటూ లేచి "బేబీ! ఇందులాల్ జైన్ హైదరాబాదునుంచి బయలుదేరడం ఆలశ్యమయిందట. ఇప్పుడే సూర్యాపేట దాటారు. ఉయ్యూరు చేరేసరికి ఆలశ్యమవుతుంది. నువ్వు నాతో వస్తే ఇబ్బంది పడిపోతావు. లాండ్ సర్వే, గ్రౌండ్ శాంపిల్స్, టోపోగ్రఫీ స్టడీ - చాలా టైము పడుతుంది"

"నేనక్కడికి రాను. ఇక్కడే ఆగిపోతాను. ఇక్కడయితే ఈయన తోడుంటారు."

"గుడ్ ఐడియా. హోటల్ మనోరమాకి ఫోన్ చేసి మేనేజరు రామారావుతో మాట్లాడుతాను మంచి సూట్ ఉంచమని."

నావేపు తిరిగింది. "మిమ్మల్ని చూసుకుని ఆగిపోతున్నాను నాకు తోడుగా ఉంటారు కదూ?" అంది.

ఏం చెప్పాలో తోచలేదు. ఇది తానుగా కోరుకుని నాతో గడపడానికి కల్పించుకున్న అవకాశం. సభ్య సమాజంలో ఏకాంతం అవకాశంకాదు. చక్కగా ప్రణాళిక ప్రకారం ఏర్పరుచుకోగలిగిన ఏర్పాటు. ఎదురుగా భర్త ఉన్నాడని కూడా పట్టించుకోకుండా - అనుకోకుండా అన్నాను.

"ఒక్క క్షణం కూడా మిమ్మల్ని వదిలిపెట్టను"

మల్లేశ్వరరావు నవ్వాడు. "ప్రేమించిన ప్రేమికుడు కూడా ఇంత నిర్దుష్టంగా హామీ ఇవ్వలేడేమో. థాంక్స్. నా భుజం మీద నుంచి కొండంత సమస్యని దించేశారు" అని లేచాడు - "నిన్ను హోటల్ దగ్గర దించి పోతాను" అన్నాడు.

"ఓ గంటలో నా పని పూర్తిచేసుకుని మీ రూముకి వస్తాను" అన్నాను.

మల్లేశ్వరరావు లేచి భార్యకి చెయ్యి యివ్వలేదు. నా చెయ్యి తీసుకుని కాస్త దూరంగా తీసుకొచ్చాడు. "బేబీని మీతో వదిలిపోతున్నాను కనుక ఓ విషయం చెప్పాలి. ఆమెకి క్లాస్ట్రోఫోబియా ఉంది. ఒకే గదిలో ఒంటరిగా ఉంటే భరించలేదు. అందుకనే ఆ రోజు గుంతకల్లులో స్లీపర్ బోగీ ఎక్కింది. అందులో ఆడవాళ్ళ సెపరేట్ డబ్బా నచ్చలేదు. మీరు సమయానికి వచ్చి కంపెనీ ఇచ్చారు. టేక్ కేర్"

కొంచెం కంగారు పడ్డాను. గుంతకల్లు ప్రయాణం కథ ఈయనికి ఎంతవరకూ తెలుసు? డబ్బాలో ఏకాంతం వరకేనా? సంస్కారమో, స్త్రీ సహజమైన గడుసుదనమో ఆ సమాచారాన్ని అవసరం మేరకు సెన్సారు చేశాయి. సందేహం లేదు. అంతా తెలిస్తే ఇద్దరూ ఇలా కలిసిరారు.

అనుమానానికి అజ్ఞానం దగ్గర తోవ. అవనీతికి సంస్కారం చక్కని ఒడుపు.

భర్తతో వెళ్తూ 'వస్తావు కదూ?' అన్నట్టు చూసింది చినపాప. తలూపాను ఉత్సాహంగా.

నేను వెళ్ళేసరికి స్నానం చేసి ఎర్రటి కుంకుమ రంగు చీర కట్టుకుని ఉంది. శరీరం ఎర్రగా మందారాలు కుప్పపోసినట్టు ఉంది. ఎర్రటి జాకెట్టు. ఆందోళనతో తలుపు తీసింది. "ఎందుకింత ఆలశ్యం చేశావు? ఈ గదిలో ఒంటరిగా జైల్లో ఉన్నట్టుంది. మల్లేశ్వరరావు చెప్పిన మాట జ్ఞాపకం వచ్చింది. క్లాస్ట్రోఫోబియా? లేక గుంతకల్లు కథకి కొనసాగింపా?

ఏమయినా నేను వచ్చిన అయిదారు నిముషాలకు మనిషి స్థిమితపడింది. ముఖంలో ఆ రిలాక్సేషన్ తెలిసింది.

మంచానికి ఎదురుగా ఉన్న సోఫా మీద కూర్చుని వొళ్ళోకి తలగడ తీసుకున్నాను. ఇప్పుడేమవుతుంది?

"నిజం చెప్పు. నాకోసం వచ్చావా? నా చెనక్కాయ పచ్చడికోసం వచ్చావా?"

నవ్వింది. "రెండూ వేరా?"

"నాకోసం వస్తే ఇప్పుడు ఈ గదిలో ఏకాంతం అవకాశం."

"ఇది నేను కోరి ప్లాను చేసింది కాదు"

"నన్ను హెచ్చరిస్తున్నావా? ఊరిస్తున్నావా?"

"మీ మగాళ్ళు వేలు చూపిస్తే శరీరాన్ని వెదుకుతారు" నవ్వింది.

"ఆ రోజు అంతకన్నా ఎక్కువే చూపించావు. నిన్ను కలవాలని చాలాసార్లు అనుకున్నాను"

"నువ్వు అనుకున్నావు. కానీ నేను అనుకున్నది చేశాను"

ఇంక సందేహం అక్కరలేదు. లేచి ఆమె వేపు నడిచాను. మంచం పక్కనున్న టెలిఫోన్ కొట్టొచ్చినట్టు మోగింది. తుళ్ళిపడ్డాను.

ఫోన్‌లో హడావుడిగా మాట్లాడింది "రమ్మను" అని నా వేపు తిరిగి "మావారి తమ్ముడి పిల్లలు, భార్య. ఆవిడ ఇక్కడ కాలేజీలో లెక్చెరర్. దుర్గగుడికి తీసుకెళ్ళడానికి వస్తోంది. మా మరిది ఇన్‌కంటాక్స్ ఆఫీసరు"

మాట పూర్తికాకుండానే గది తలుపు భళ్ళున తెరుచుకుంది. ఇద్దరు పిల్లలు దూసుకు వచ్చారు "బేబీ ఆంటీ". వాళ్ళ వెనుక లోపలికి వచ్చిన తల్లి ఫక్తు అప్పుడే అమెరికానుంచి దిగుమతి అయిన శాల్తీలాగా ఉంది. దగ్గరగా కత్తిరించిన బాబ్డ్ జుత్తు (42 సంవత్సరాల కిందట అని మరిచిపోకూడదు. అంటే పాశ్చాత్య నాగరికతను మన దేశానికి దిగుమతి చేసిన దాదాపు మొదటి తరం యువతి) కళ్ళకి అవసరం లేనంత పెద్ద నల్లకళ్ళద్దాలు, చంకలదాకా జాకెట్టు, బొత్తిగా అలవాటు లేనట్టు 'చుట్టుకున్న 'చీర. ఆ గదిలోకి వారు వచ్చాక హడావుడి మొదలయింది.

"ఏరీ, ఏరీ బావగారు? ఆయనతో తగాదా పడడానికి వచ్చాను. విజయవాడ వచ్చి ఈ దిక్కుమాలిన హోటల్ గదే కావలసి వచ్చిందా? మమ్మల్ని మరిచిపోయారా? మీరు హోటల్లో దిగారంటే బొంబాయిలో జానీ కస్సుమన్నాడు. వెళ్ళి వెంటనే ఇంటికి తీసుకురా అని ఆర్డరు వేశాడు. లే. ముందు సామాన్లు సర్దు" అని గొడవ చేసేసింది.

క్లుప్తంగా నవ్వింది అలివేలు. "అసలు నేను రావడమే అనుకోకుండా జరిగింది. ఇదిగో ఈయన్ని కలవడానికి వచ్చాను. ఉయ్యూరులో పని ఆలశ్యమవుతోందని అప్పటికప్పుడు ఈ గదిని ఫిక్స్ చేశారు"

అప్పుడు ఎదురు సోఫా దగ్గర నిలబడిన నన్ను చూసింది ఆవిడ. ఎగాదిగా పరికించింది. ఏవిధంగానూ ఆమె స్థాయికి దగ్గరగా కనిపించని నన్ను చూసి 'ఇంప్రెస్' అయినట్టులేదు. "హూ యీజ్ దిస్?" అంది.

అప్పుడు సరిగ్గా అప్పుడే మా అంతస్థుల్లో ఉన్న దూరం కొట్టవచ్చినట్టు తెలియవచ్చింది. నాకేకాదు. చినపాపకి కూడా. "ఇతను ఇతను.. ఇక్కడ ఓ హోటల్‌లో మాస్టర్"

బొత్తిగా ఆమె దృష్టిలో నాకు మార్కులు పడలేదు. "ఓహ్. వంటలు చేస్తాడా? ఇక్కడేం చేస్తున్నాడు?" ఓ చిన్న హోటల్లో వంటవాడికి తమ పడకగదిలో పనేమిటి? అసలు తమ సమక్షంలో అలా సోఫాలో కూర్చోవడమే నేరం అన్న భావం ఆమె మాటల్లో ధ్వనించింది. నేను చాలా ఇబ్బందిగా కదిలాను. ఈమె కాని గుంతకల్లులో చినపాపకి జరిగిన ప్రమాదంలో పడివుంటే నా సహాయం తప్పని సరి అయివుంటే నిస్సందేహంగా పర్సు తీసి డబ్బు చెల్లించి చేతులు కడుక్కునేది. కృతజ్ఞత కొందరికి సంస్కారం. కొందరికి ఖర్చు. అంతే తేడా. ఆమె ఈ గదిలో ఉంటే నన్ను లోపలికి రానిచ్చేదికాదు.

"మీకు కావలసినవారు వచ్చారు కదా? నేను వెళ్తాను" అని లేచాను.

అనుకోకుండా వచ్చిన ఈ వ్యక్తి - తమ ఇద్దరి మధ్య సంబంధంలో ఉన్న దూరాన్ని నొక్కి చెప్పినట్టనిపించింది.

"పరవాలేదు. ఉండు. నే చెప్తాగా?" అంటోంది చినపాప.

"అతన్ని వెళ్ళనీ. వంటలు చేసుకోవాలేమో! మిమ్మల్ని దుర్గగుడికి తీసుకెళ్ళి కొత్త షాపింగ్‌మాల్ చూపించి, లంచ్‌కి చెప్పను. చిన్న సర్‌ప్రైజ్. పైగా ఇతనికి కారులో చోటుండదు"

చినపాప ఇబ్బంది పడిపోతోంది. నాకు నవ్వొచ్చింది. వెళ్ళడానికి లేచాను. వచ్చి నా చెయ్యి పుచ్చుకుంది. "సాయంకాలం తప్పకుండా వస్తావుకదూ?" అన్నది ఇబ్బందిగా.

సినిమా హాలు దగ్గర గేట్ కీపర్‌ని బతిమాలుతున్నట్టుగా ఇబ్బందిగా చూస్తోంది బాబ్డ్ హెయిర్.

తలూపి - తలుపు వేపు నడిచాను.

"హేయ్! సారీ యార్! నీ పేరేమిటో తెలీదు. హోటల్‌కి వెళ్ళడానికి చిల్లర ఉందా?" అని పర్సు తీసింది.

ఇప్పుడు చినపాప కోపంగా ముందుకు వచ్చింది. "కమాన్ లీలా! ఆయన బొత్తిగా అడుక్కు తినేవాడుకాదు. నా ప్రాణాన్ని రక్షించిన పెద్దమనిషి. నీకతను హోటల్లో చెఫ్. కానీ నాకు గొప్ప మిత్రుడు డోంట్ ఇన్సల్ట్ హిమ్!" అంది.

గదిలోకి వచ్చాక మొదటిసారిగా 'లీల' అనే అమెరికా తెల్లబోయి నిలబడింది.

"ఓహ్! నేను.. నాకు.. ఇది ఐయాం సారీ!"

"నాకు కాదు. ఆ పెద్ద మనిషికి చెప్పు."

నేను ఆ అవకాశం ఇవ్వలేదు. అప్పటికి తలుపు తీసుకుని బయటికి వచ్చేశాను.

చివరి క్షణాల్లో ఛిద్రమయిన నా వ్యక్తిత్వానికి చినపాప చిన్న 'అతుకు' వేసింది. చిదికిన మనస్సు ముక్కలు మళ్ళీ దగ్గర చేరడానికి తంటాలు పడుతున్నాయి. ఏమయినా ఆ గదిని దాటాక బయట కావల్సినంత 'ప్రాణవాయువు' దొరికింది.

నాకూ చినపాపకీ మధ్య అనుభూతుల 'ముడి' ఉంది. నాకూ ఈ 'అమెరికా'కీ మధ్య అంతస్థుల ముళ్ళకంచెలున్నాయి. గుంతకల్లులో ఆమెను ఒకవేళ నేను ప్రాణాపాయం నుంచి తప్పించగలిగినా ప్రాణం దక్కినందుకు కాక, దక్కించింది ఒక వంటవాడయినందుకు ఆమె విలవిలలాడిపోయేది.

సింప్సన్ అనే నేలబారు మనిషి ప్రేమకోసం రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య సింహాసనాన్ని తృణప్రాయంగా కాలదన్నిన అయిదవ జార్జి కథ లీలకి బొత్తిగా అభిరుచి దార్రిద్యంగా కనిపిస్తుంది చినపాపకి.

ఆ రోజంతా కోపంగా నా పనులన్నీ చేసుకున్నాను. ప్రతీ క్షణం చినపాప జ్ఞాపకం వస్తోంది. కానీ ప్రయత్నపూర్వకంగా ఆమె జ్ఞాపకాన్ని వెనక్కి తోస్తూ వచ్చాను. ఉదాసీనత ఉత్సాహాన్ని అణగదొక్కేసింది.

సాయంకాలం డ్యూటీకి వెనుక గేటులోంచి వచ్చిన వంటగదికి వెళ్ళే దుస్తుల్ని వేసుకుని లోపలికి వచ్చినప్పుడు నా అసిస్టెంటు హనుమంతు "నీ కోసం ఎవరో ఎదురుచూస్తున్నారు గురువా?" అన్నాడు.

"ఎక్కడ?"

"డైనింగ్ హాలులో కూర్చోపెట్టాను. పెద్దింటావిడలాగా ఉంది. టేబులు 23"

ఎందుకనో నా ఆలోచన లీల అనే పెద్దింటి ఆవిడ మీదకి పోయింది. పొద్దుట జరిగిన అవమానం, ఆమె అహంకారం గుర్తుకొచ్చింది. నాకోసం ఎందుకు రావాలి? ఆమే వచ్చివుంటే ఆ రోజు విజృంభించేవాడిని. కానీ హాలులో నెమ్మదిగా, తీరికగా, ప్రశాంతంగా కూర్చుని ఉంది - చినపాప. ఆమెని చూడగానే ఎక్కడలేని ప్రసన్నతా తోసుకువచ్చింది. పొద్దుట జరిగిన కథ తరువాత ఆమె నిజానికి నా దగ్గరికి రానక్కరలేదు. ఆఫ్టరాల్, నేనెవరిని?

నన్ను చూసింది. చటుక్కున లేచింది. నావేపు పరుగున వచ్చి రెండు భుజాలమీదా చెయ్యి వేసి పట్టుకుంది. "డ్యూటీకి ఇంత ఆలశ్యంగా రావడం? గంటన్నరనుంచీ ఎదురుచూస్తున్నాను."

"నైట్ డ్యూటీ. నిద్దర పట్టేసింది" అన్నాను. "ఇంకా వెళ్ళిపోలేదా? సార్ రాలేదా?"

"ఈ రాత్రికి రానని ఫోన్ చేశారు. నిన్ను గదిలోనే ఉండనిమ్మని మరీమరీ చెప్పారు. నిన్ను తీసుకెళ్ళడానికి వచ్చాను"

"ఇప్పుడు నా డ్యూటీ. రాత్రి పన్నెండుదాకా"

"నాకదేం తెలీదు. నువ్వు రాకపోతే నేనిక్కడే ఉంటా. నాకేమైనా పని చెప్పు. వెనక్కాయ పచ్చడి ఎలా చెయ్యాలో నేర్పు. లేదా రొయ్యల వేపుడు"

నోరు మూశాను. "కొంపమునుగుతుంది. ఇది వెజిటేరియన్ హోటల్"

"సరే. ఈ దిక్కుమాలిన లివరీస్ తీసేసి నాతో రా" గమనించాలి. 'దిక్కుమాలిన' ఆమె అంతస్థుది.

'థాంక్స్' అన్న మాటని వదిలిపెట్టని చిన్ననాటి సంస్కారాన్ని దాచుకున్న వ్యక్తి డ్యూటీ బట్టల్ని 'లివరీస్' అనేదాకా ప్రయాణం చేసింది. నిజానికి నేనా మాట ఎప్పుడూ వినలేదు.

షిఫ్టు ఇన్ చార్జ్‌కి చెప్పి బట్టలు మార్చుకుని ఆమెతో ఆటో ఎక్కాను. ఆటోలో ఇద్దరి శరీరాలూ ఒరుసుకుంటున్నాయి. ఆనాటి విజయవాడ రోడ్లు భార్యాభర్తల మధ్య మధ్యవర్తిత్వానికి వకాల్తా పుచ్చుకున్న పెద్దమనుషులు. ఎత్తి కుదేసి ఇద్దరినీ కలుపుతున్నాయి. కానీ పొద్దున్న లీల మా యిద్దరి మధ్యా కల్పించిన దూరాన్ని రోడ్లు దగ్గర చెయ్యలేకపోయాయి.

గదిలో నాకోసం ఎన్నో కొనిపెట్టింది చినపాప. చక్కని పొడుగు చేతుల సిల్కు లాల్చీ. నాకు సరిపోతుందో లేదో నా ఒంటి మీద వేలాడేసి చూసింది.

"రోజంతా వంటగదిలో ఉంటావు. రాత్రి ఇంటికి వచ్చాక స్నానం చేశాక దీన్ని వాడు" అంటూ గులాబీ అత్తరు సీసాని చేతికిచ్చింది.

ఇంకో పార్శిలు - ముచ్చి రేకు చుట్టి ఉంది. "ఏమిటిది?" అన్నాను.

"విప్పి చూడు"

చాలా గట్టిగా బిగించాడు షాపువాడు. ఇప్పిన కొద్దీ లోపలి వస్తువు కదులుతోంది. తీరా విప్పాక వయ్యారంగా నడుం తిప్పుతున్న వయ్యారి బొమ్మ అది. ఆశ్చర్యపోయాను.

"నాకెందుకూ ఇది?"

ప్రశ్న పూర్తికాకుండానే ఇప్పుడు చూశాను. బొమ్మకింద "ప్రేమతో - చినపాప" అని రాయించింది.

"నీ మంచానికి ఎదురుగా పెట్టుకో. లేవగానే నేను కనిపించాలి"

నిస్సందేహంగా కళ్ళనీళ్ళు తిరిగాయి. అప్రయత్నంగా ఆమె దగ్గరికి నడిచి ఆమె బుగ్గమీద ముద్దుపెట్టుకున్నాను.

ఇది పరిణామం. గమనించాలి. గుంతకల్లు నాటి దగ్గరతనానికి నేటి ఉదయం అంతస్థుల స్పృహ తోడుకాగా ఆమె పట్ల దగ్గరతనంలో 'కోరిక' శలవు తీసుకుంది. 'స్నేహం' మాత్రం మిగిలింది. ఆమెకీ ఆ క్షణంలో కన్నీళ్ళు తిరిగాయి. నా ముఖాన్ని రెండు చేతుల్లోనూ పట్టుకుని నుదుటి మీద ముద్దు పెట్టుకుంది.

"ఉదయం జరిగినదానికి సారీ. రోజంతా లీలతో దెబ్బలాడుతూనే ఉన్నాను. అలిగి రూంకి వచ్చేసి ఇక్కడే భోజనం చేశాను. నాకు తెలియకుండానే ఏడ్చాను. మధ్యాహ్నం లేచి స్టోరుకి వెళ్ళి ఇవి కొనుక్కుని, గదిలో పెట్టి నీ దగ్గరికి వచ్చాను" అంది.

"ఏమయినా నువ్వు పెద్దింటి అమ్మాయివి" అన్నాను.

"ఆత్మీయతకి పెద్దరికం లేదు. ఉంటే నిన్ను వెదుక్కుంటూ వచ్చేదాన్నికాదు. నేను నీకు అలివేలుని కాదు - చినపాపని"

కన్నీళ్ళు ఆగలేదు.

"చాలా రోజులయింది. ఇవాళ వైన్ తాగుతాను" అని వెయిటర్‌ని పిలిచి చెప్పింది. 40 సంవత్సరాల కిందట విజయవాడలో దొరికే వైన్ ఆడసు ఎలా వుంటుంది?

ఆమెకి అలవాటు లేదని తెలుస్తోంది. మూడు గ్లాసులు తాగి భోజనం చెయ్యకుండానే వెనక్కి వాలిపోయింది. నవ్వొచ్చింది నాకు. శరీరాన్ని నిలువుగా లాగి, తలకింద తలగడ పెట్టాను. అప్పుడు కాస్త తెలివొచ్చింది.

"వెళ్ళిపోకు - క్లాస్ట్రోఫోబియా పొద్దుటే ఆయనొస్తారు" అవే ఆ రాత్రికి ఆఖరిమాటలు.

తెల్లవారకుండానే మల్లేశ్వరరావు ఆదరాబాదరాగా వచ్చాడు. అదే గదిలో ఆమె మంచానికి ఎదురుగా సోఫా మీద పడుకున్న నన్ను చూశాడు. 'థాంక్స్' అన్నాడు.

"బేబీ, కారెక్కు. మరో గంటలో పారిస్ నుంచి ఇంటర్నేషనల్ కాల్ వస్తుంది" అని ఆమెని లేవదీశాడు. చినపాప ముఖం కడుక్కుని వచ్చింది. ఇప్పుడు వైన్ చూశాడు మల్లేశ్వరరావు. నాకు వణుకు. ఏమయినా అల్లరి అవుతుందా?

"నిన్న ఏమయినా గొడవ జరిగిందా? తనకి బాగా కోపం వచ్చినప్పుడు వైన్ కావాలంటుంది. ఇది స్పిరిట్యువల్ ఎస్కేప్"

సీసాని వేస్ట్ బాస్కెట్‌లో పారేశాడు. చినపాప కారెక్కింది - నన్ను చూసి నవ్వుతూ చెయ్యి ఊపి. రాత్రి మత్తు, నిద్ర ఇంకా దిగలేదు.

డ్రైవింగ్ సీట్లో కూర్చున్నవాడు మల్లేశ్వరరావు దిగి నా దగ్గరికి వచ్చాడు. "గుంటూరు రా బ్రదర్. ఇది నా ఆడసు" అని కార్డు ఇచ్చి వెళ్ళి డ్రైవింగు సీట్లో కూర్చున్నాడు.

కారు కదిలిపోయింది.

(పైన మీరు చదివిన ముగింపు క్రింది కథకి - ఇది ఒక రకమైన ముగింపు. మరో రకమైన ముగింపు వచ్చే నెలలో చదవండి)

ఒకే కథ - ఎన్నో ముఖాలు

**రైలు కదిలింది.** కదులుతూనే వేగం పుంజుకుంది. అప్పుడు చూశాను. రైలు కదలడం నాలాగే ఆలశ్యంగా గమనించిన ఆమె పరుగున కంపార్టుమెంటులోకి దూకబోయింది. చీర కుచ్చిళ్ళు అడ్డంపడ్డాయి. ఆవిడ ఇప్పుడు ఎక్కడికి వెళ్తోందో తెలుస్తోంది. మరో క్షణంలో ఫ్లాట్‌ఫారంకీ రైలుకీ మధ్య ఉన్న చోట ఇరుక్కుంటోంది. ప్రయత్నించి చేసిన పనికాదు. ఒక్క దూకులో ఆమె మీద పడ్డాను. కుడిచెయ్యి, నడుం దొరికింది. గట్టిగా శరీరాన్ని గాలిలోకి ఎత్తి కంపార్టుమెంటులో దూకాను. ఆనాటికి ఆ అదృష్టం మా యిద్దరిదీ. కంపార్టుమెంటు అంచుకి వచ్చాం. రైలుతో పరిగెత్తుతున్న ఎర్ర మైసయ్య చెనక్కాయల బస్తా కంపార్టుమెంటు లోపలికి విసిరేశాడు. బస్తా పెద్దది కాదు. కానీ రైలు వేగం, విసిరిన వేగం, ఆతృత అన్నీ కలిసి ఆ బస్తాను తుపాకీని చేశాయి. అంచున ఉన్న మా యిద్దరి శరీరాలనీ ఆ బస్తా లోపలికి గిరాటేసింది. ఇద్దరం కింద పడ్డాం ఒకరిమీద ఒకరం. ఇదంతా అనుకోకుండా జరిగింది - క్షణంలో.

భయంతో నన్ను కరుచుకుని ఆవిడ ఏడుస్తోంది. ఒక్క క్షణంలో మృత్యువునుంచి తప్పించుకున్న విషయం ఆవిడకి ఇప్పుడిప్పుడే అర్ధమవుతోంది ఆమె ముఖంలో షాక్. చాలా విచిత్రంగా నా ముఖంలోనూ షాక్. ఎందుకని? చాలాసేపటికి కానీ అర్ధంకాలేదు. ఈ పరుగులో గుంజాటనలో బస్తా విసురులో ఆమె వక్షోజాలు బలంగా నన్ను గుచ్చుకున్నాయి. నేనూ వణికాను.

అప్పటికి సాయంకాలం అయిదున్నర. రైలెక్కాక టీ తాగాలన్న ఆలోచన ఆమెకి వచ్చిందట. అదిన్నీ అరుస్తూ వెళ్తున్న కుర్రాడు దాటిపోయాక. రైలు దిగింది. టీ దాటిపోయింది. రైలు కదిలిపోయింది. అదీ పరిస్థితి.

ఒకరిని చావు వణికించింది. మరొకరిని కోరిక వణికించింది. నిజానికి కోరిక కాదు. కోరికకి ఆలంబన. మామూలుగా రైలు ఎక్కివుంటే ఆ అమ్మాయిని చూసేవాడిని కాను. ఇది కేవల 42 సంవత్సరాల కిందటిమాట. గుంతకల్లువేపు తిరిగే రైళ్ళలో ఆ రోజుల్లో స్లీపరు పెట్టెల్లో ఒక మూలకి కేవలం ఆడవాళ్ళకే ప్రత్యేకించిన కేబిన్ ఉండేది. కనీసం గుంతకల్లు, హుబ్లీ, గుత్తి ప్రాంతాలవేపు తిరిగే రైళ్ళమాట. ఈవిడ ఆ కేబిన్‌లో ఉంది. గుంతకల్లులో రైలు బయలుదేరేటప్పటికి పెట్టెలో ఆనాడు నలుగురయిదుగురే ఉన్నారు. ఆ అమ్మాయి ఆడవాళ్ళ కేబిన్‌లో ఒక్కరే ఉంది. ఈ లైనులో ఆ రోజుల్లో రద్దీ తక్కువ. ఆనాడు ఎందుకో మరీ తక్కువగా ఉంది.

రైలు గుత్తి చేరేటప్పటికి ఉద్రేకం సర్దుకుంది. ఈసారి రైలు దిగి ఆమె అడక్కుండానే ప్లాట్‌ఫారం మీదనుంచే టీ కప్పు అందించాను. మనస్ఫూర్తిగా అందుకుంది. ఆమె ముఖంలో కొంతకాలం కిందటి భయం పోయి కృతజ్ఞత కనిపించింది. అప్పుడు ఆ అమ్మాయిని తేరిపార చూశాను. నిజానికి చిన్నపిల్లేం కాదు. తేలిగ్గా 27-28 ఏళ్ళు ఉంటాయి. కాని వయస్సుని ధిక్కరించే శరీరం. ఆ విషయం ఇప్పుడు గుర్తించినది కాదు. ప్లాట్‌ఫారం మీదకి తలమాత్రమే కనిపిస్తోంది. అయితే శరీరం ఇందాకటి నా అనుభవం చెప్పిన విషయం. ఆమె అందకత్తెకూడా కాదు. కానీ కళ్ళు దూసుకుని చూసేవి. నవ్వులో చిన్న విచిత్రం ఉంది. రెండు పెదవులూ బయటికి విచ్చుకుంటాయి. చిన్న అమాయకత్వం, నిజాయితీ ఆ నవ్వులో కనిపిస్తుంది.

రైలు వేగం పుంజుకున్నాక ఆలోచనలు, ఆ చిన్న మహిళల పెట్టెలో ఏకాంతంగా కూర్చున్న వ్యక్తి వేపే పరుగులు తీశాయి. కంపార్టుమెంటు దాదాపు ఖాళీ. టీటీయీ వచ్చి తీరికగా కూర్చున్న నన్ను చూసి ఎదురుగా కూర్చున్నాడు. టిక్కెట్టు అడగలేదు సిగరెట్టు అడిగాడు. అలవాటు లేదన్నాను. టిక్కెట్టు లేదన్నంతగా నిరుత్సాహపడ్డాడు. లేచి వెళ్ళబోతున్న ఆయన్ని అడిగాను. ఎందుకివాళ బొత్తిగా రద్దిలేదు? అని. వెళ్తూ వెళ్తూ 'బక్రీద్' అన్నాడు. ముస్లింలకు బక్రీద్ చాలా పవిత్రమైన పండగ. ప్రయాణాలు చెయ్యకుండా ఇళ్ళల్లో పండగ చేసుకుంటారేమో. అయితే ఈ లైను అంతా ముస్లింలే ఉండరుకదా?

క్షణాలు గడిచేకొద్దీ ఆలోచనలు ఆ అమ్మాయివేపు ప్రయాణం చేస్తున్నాయి. వెళ్ళి ఆ పెట్టె తలుపు తీశాను. చటుక్కున నన్ను చూసింది. చూసినందుకు ఆశ్చర్యపడలేదు. కాగా రావడం ఆలశ్యం చేసినందుకు ఆతృత పడినట్టు కనిపించింది. ఎలా తెలిసింది? వెంటనే తను జరిగి నాకు చోటిచ్చింది. ఎదురుగా కూర్చోవచ్చుకదా? కానీ అమ్మాయి తనపక్కకి ఆహ్వానించడం శుభసూచకం. దేనికి?

కాస్సేపే నిశ్శబ్దం. నా చేతిమీద చెయ్యివేసి 'థాంక్స్' అంది. అప్పుడు అర్థమయింది ఆవిడ బొత్తిగా చదువుకోలేదని. కానీ కళ్ళల్లో కృతజ్ఞతకి మించిన ఉత్తేజం తెలిసింది. ఏమిటది? నా చేతిమీద ఆమె చెయ్యి వణుకుతోంది లేక నా చెయ్యా?

ఇక తట్టుకోలేకపోయాను. ఆమె భుజం మీద చెయ్యివేశాను. ఆమె ఆశ్చర్యపడలేదు. నిజానికి ఎదురు చూస్తున్నట్టు కనిపించింది. ఇదంతా కృతజ్ఞతలో భాగమా? సినిమాల్లో హీరోలు మొదటి కలయికలోనే హీరోయిన్లను ఏదో ప్రమాదం నుంచో, కీడు నుంచో కాపాడుతారు. ఆ వెంటనే రొమాన్సు ప్రారంభమవుతుంది.

"నీ పేరు?"

"చినపాప. అసలు పేరు మహాలక్ష్మి. చిన్నప్పుడు నాకు ఆ మాట సరిగ్గా పలకడానికి వచ్చేదికాదట అందుకని ఎవరడిగినా మా అమ్మ నన్ను పిలిచే పేరునే చెప్పేదాన్ని"

"మరి పెద్దపాప ఎవరు?"

నవ్వింది. అప్పుడే తెలిసింది. పెదాలు బయటికి విచ్చుకుని నోరు ప్రత్యేకంగా కనిపించడం. "ఎవరూ లేరు. నేను ముద్దుగా ఉన్నానని మా అయ్య నన్ను చినపాప అని ముద్దాడేవాడట అందరికీ చినపాపని అయిపోయాను"

వెంటనే ఓ తొందరమాట అనుకోకుండా అన్నాను: "ఇప్పుడూ ముద్దొస్తున్నావు"

పగలబడి నవ్వింది. అప్పుడు తెలిసింది. ఆమెలో మరొక అందం - కుడి చివర ఊడిన పన్ను ఖాళీ. ఇది అందం ఎలా అవుతుంది? ఏమో? అది చెప్పడానికి చినపాపని చూడాలి.

నా చెయ్యి తీసుకుని తన జాకెట్టు మీద పెట్టుకుంది. ఈసారి నేను వణికిపోయాను. కంపార్టుమెంటులో ఇద్దరం కలిసి పడిన సంఘటనలో ఆతృత ఉంది. ప్రాణ భయం ఉంది. మించి అసంకల్పితమైన reflex మాత్రమే ఉంది. ఇప్పుడిది తెలిసిన అనుభవం. శరీరం వేడెక్కిన క్షణం. చెమట పట్టింది. ఇప్పుడు ఏం జరుగుతుంది?

మా యిద్దరికీ తెలియని విషయం ఏమిటంటే అంతకు కొన్ని క్షణాల క్రితమే రైలు స్టేషన్లో ఆగింది. భళ్ళున ఈ లేడీస్ పెట్టె తలుపు తెరుచుకుంది. 'భళ్ళున' అన్నమాట ముఖ్యం. కొత్తగా ఎవరయినా ప్రయాణీకులు వచ్చారేమో. ఆమె జాకెట్టుమీద చెయ్యిని చటుక్కున తీసేశాను. పెట్టెలోకి ప్రయాణీకులు ఎవరూ రాలేదు. కేవలం టీటీయీ వచ్చాడు. అతని ముఖంలో చిన్న చిరునవ్వు. మగాళ్ళకి మాత్రమే ప్రత్యేకమైన నవ్వు. "నాకు తెలుసులే!" అన్న బెళ్ళింపు అందులో ఉంది.

అమ్మాయితో అన్నాడు: "ఎక్కడికి?"

"పొన్నూరు"

"ఇది గుంటూరు దాకే పోతుంది"

"అక్కడ బండి మారుతాను"

టిక్కెట్టు అడగలేదు. మా ఏకాంతాన్ని చెడగొట్టగలిగినందుకు తృప్తిపడ్డాడు. బయటికి వెళ్తూ తలుపు దగ్గర ఆగి "తలుపు వేసుకోండి" అన్నాడు.

"గుంతకల్లు ఎందుకు వచ్చావు?"

"కసాపురంలో మా అమ్మమ్మ ఉంది. ఒళ్ళు బాగులేదు. చూసిపోదామని వచ్చాను."

"పొన్నూరులో ఎవరున్నారు?"

"మా అమ్మ"

"నాన్న?"

"లేడు"

"పోయాడా?"

"పారిపోయాడు"

ఇప్పుడు జాలి చూపించాలా? కారణం అడగాలా? ఎప్పుడు - అనాలా?

"నేను టైలరింగు చేస్తాను. పొన్నూరులో జంపరుకుట్టుకి చినపాపదే పేరు" అంటూ చీరకొంగు తప్పించి జాకెట్టుని గర్వంగా చూపించింది. కాని కనిపించినవి - రెండు. చినపాప జంపరుకుట్టుకాదు పొడుచుకుని వచ్చిన వక్షోజాలు. చక్కగా, ఏపుగా పెరిగిన శరీరం. ఆ 'ఏపు'ని గుర్తుపట్టగల ఆమె గర్వం. వాటిని చూసి ఎదుటి వ్యక్తి తలకిందులౌతున్నాడని ఆమెకి తెలుసు. ఆమెకి తెలుసునని నాకూ అర్థమౌతోంది.

చిలిపిగా చూస్తోంది. చాలాసేపటి వరకూ మాటరాలేదు. స్త్రీలో కోరిక తొందరపెడితే మగాడు తడబడతాడు. ఎందుకని? 'సిగ్గు' అనే ముసుగు ఆ రుచిని మరింత పెంచుతుంది కనుక. అయితే ఒక్కచోటే దానికి శలవు పడకగదిలో. ఇది పడకగది కాదు.

"నిన్ను ముద్దుపెట్టుకోనా?" అన్నాను.

"అడగాలా?" అని ముందుకు జరిగింది. నవ్వినప్పుడు ఆమె పెదాలు బయటికి విచ్చుకోవడంలో 'సెక్స్'కీ ప్రమేయం ఉన్నదని ఇప్పుడనిపించింది. ఆమె పెదాలు దగ్గరకు జరిగిన నా పెదాలను ఆక్రమించుకున్నాయి. 'కోరిక' నాకు తెలియకుండానే ఆమె చెప్పుచేతల్లోకి వెళ్ళిపోయింది.

తర్వాత ఏం జరిగేది? ఫ్రాయిడ్, హేవ్‌లాక్ ఎల్లిస్ తల బద్దలు కొట్టుకున్నా తేలేదికాదు. కాని ఆ క్షణంలో రైలు ఆగి మా పెట్టె సరిగ్గా స్టేషన్లో రద్దీగా ఉన్న చోట నిలిచింది. ఈ రోజుల్లోలాగా గాజు అద్దాల కిటికీలు కావు. ఊచలు లేని మాములు కిటికీలు. చటుక్కున నేను వెనక్కి జరిగాను. ఆమె పక్కున నవ్వింది. ఆ నవ్వుకి అర్థం చేతిలో పెట్టిన తాయిలాన్ని అందుకోలేని పసివాడని చూసినప్పటి చిలిపితనం.

మాటలు రాని నిశ్శబ్ధమది. టీ, బిస్కట్టులు, కూల్ డ్రింకులవాళ్ళు కిటికీలోంచి తలదూర్చి పలకరించి వెళ్తున్నారు.

"మీరేం చేస్తారు?" అంది - ఇప్పటికి.

చెప్పాలని నోరు తెరిచి, అంతలో ఆగి - "ఏం చేస్తానో చెప్పుకోచూద్దాం" అన్నాను.

అలవాటయిన, చిక్కని నవ్వు నవ్వుతోంది. "అమ్మాయిల్ని ముద్దు పెట్టుకుంటూంటారా?"

చదువుకీ, instinct కీ సంబంధంలేదు. అనుభూతికి అధ్యక్షత వహించడంలో ఏనాడయినా స్త్రీకి రెండు మూడు మాస్టర్ డిగ్రీలు ఉన్నాయి. కోరికను సమాధాన పరచడంలో, మమకారాన్ని మాతృత్వానికి మలచడంలో. సృష్టిలో స్త్రీని దాటి నిలవగల శక్తిలేదు. Womanhood and motherhood are the ultimate conquests of woman.

"విజయవాడ గవర్నరు పేటలో ఒక హోటల్లో ఛెఫ్‌ని" ఛెఫ్ అన్నమాట నేను వెతుక్కున్నది. ఆ రోజుల్లో విజయవాడలో కనీసం ఆ ప్రాంతంలో స్టార్ హోటళ్ళు లేవు. చెఫ్ అన్నమాట చాలామందికి తెలీదు. నేను వెదుక్కుని నా వృత్తికి గౌరవాన్ని పొదగడానికి తెచ్చిపెట్టుకున్నమాట. చుట్టుపక్కలవాళ్ళు, హోటల్లో పనిచేసేవాళ్ళూ పిలిచేది 'మాస్టర్' అని.

"ఛెఫ్ అంటే?"

నాకు అర్థమయింది - ఆమెకి అర్థంకాని మాట చెప్పానని. ఇప్పుడిక విజయవాడ స్థాయికంటే కిందకి రాకపోతే ఆమెకి అర్థంకాదు. "హోటల్లో వంటలు చేస్తాను" అన్నాను అలా చెప్తున్నందుకే ఇబ్బంది పడుతూ.

నవ్వింది. "నాకంటా బాగా చేస్తారా? నేను రొయ్యల వేపుడు స్పెషల్"

నన్ను మించి గర్వపడే మరో అందం ఆ క్షణంలో ఆమె సొంతం చేసుకుంది. మొదటిది? ఆమె యవ్వనం. మొదటిసారిగా ఆమె ముందు ఓడిపోవడానికి సిగ్గుపడలేదు. నన్ను అర్థం చేసుకున్నట్టుంది. నా భుజం తట్టి "ఒక్కసారి మీ వంట తినడానికి విజయవాడ వస్తాను" అంది.

అప్పుడు గుర్తొచ్చింది. భోజనం మాట. "ఇద్దరికీ భోజనం చెప్పి వస్తాను" అని లేవబోయాను. నన్ను భుజం పట్టుకు లాగి కూర్చోపెట్టింది. "ఈ లైనులో భోజనం ఇచ్చే స్టేషన్లు లేవు. మా అమ్మమ్మ పెరుగన్నం, వాము మిరపకాయలు, బిరియానీ ఇచ్చింది. మనిద్దరికీ చాలు" అంది.

మళ్ళీ రైలు కదిలింది. మళ్ళీ ముద్దుపెట్టుకునేదా? ఇలాంటి చర్యలకి ఆవేశం ప్రాతిపదిక. కేవలం ఆలోచన చాలదు.

"మీరెందుకు గుంతకల్లు వచ్చారు?"

"చెనక్కాయ పచ్చడి ఎలా చెయ్యాలో నేర్చుకోడానికి"

ఆపకుండా నవ్వింది. నవ్వుతున్నప్పుడు చీర పైట జారిపోయింది. లేక జారిపోయేలాగా నవ్వుతోందా? బయట అందరికీ వినిపించేలాగా ఉంది ఆ నవ్వు. ఆపడానికి ప్రయత్నించాను. కానీ నా చేతిని తన చేతిలోకి తీసుకుని మరీ నవ్వుతోంది. చేతిని భుజం మీద ఆప్యాయంగా తిప్పుకుంది.

కాస్సేపటికి ఆగి - "ఇంతోటిదానికి ఇంత దూరం రావాలా?" అంది.

చేతివంట కళ కాగలదన్న దృష్టి స్త్రీకి తక్కువ. చిన్నప్పటినుంచీ ఒక 'అలవాటు'లాగ ఆ ప్రక్రియ లొంగిపోతుంది వారికి. జీవితమంతా సాగిపోతుంది. కానీ ప్రపంచంలో గొప్ప వంటవాళ్ళంతా మగవారు. మన సంస్కృతిలో కూడా. వంటకి భీముడిని చెప్తాం. ద్రౌపదిని కాదు. నలుడిని చెప్తాం. దమయంతిని కాదు. ప్రపంచంలో గొప్ప వంటగాళ్ళందరూ మగవాళ్ళే. గార్డెన్ రామ్స్, పాల్ బోకూసే, ఎమిరిల్ లగాస్సీ, ఆంథోనీ బోర్డాయిన్ - ఇలా ఎందరయినా. విజయవాడ వంటవాడికి ఇంత పెద్ద పేర్లు ఎలా తెలుసు? ఓ ఇంగ్లీషు దొరగారు నా చేపల కూరకి మురిసి నా కూరని విదేశీ కూరలతో పోల్చి చెప్పాడు. అప్పుడే ఈ పేర్లు తెలిశాయి. నేను కాగితం మీద వాటిని రాయించుకున్నాను. మరీ గొప్పవారు హోటల్లో దిగినప్పుడు నా తెలివి తేటల్ని ప్రదర్శించడానికి ఆ పేర్లు వాడతాను. అయితే చినపాప ముందు ఎందుకు? ఆమెకి తెలియని గొప్ప ప్రపంచం నాకు తెలుసునని ఊరించడానికి. ఇది హనుమంతుడి కుప్పిగంతు.

చెప్పాను. "రాయలసీమలో చెనక్కాయల పంట ఎక్కువ. చెనక్కాయలతో ఎన్ని రకాల ఐటమ్స్ చెయ్యవచ్చునో చాలామందికి తెలీదు. శాంసన్‌పురంలో మా ఎర్ర మైసయ్య నాయనమ్మ ఉంది. కుంచమ్మ. ఆవిడకి 87 ఏళ్ళు. మైసయ్య ఓసారి విజయవాడ వచ్చి రొట్టెల్లో ఓ విచిత్రమైన కూర పెట్టి నా మతి పోగొట్టాడు. ఏమిట్రా యిది - అంటే చెప్పడు. బెల్లించి బెల్లించి వాడి నాయనమ్మ చేసిందని చెప్పాడు. అప్పటినుంచీ ఆ 'రుచి' పట్టుకోవాలని తాపత్రయం. ఇన్నాళ్ళకి కుదిరింది"

"ఎలా చేస్తావు ఆ కూర?" దగ్గరకి జరిగింది.

నేను నవ్వాను. "రెండేళ్ళు కష్టపడి ఆర్జించిన విద్య అది. అంత సులువుగా చెప్తానా? విజయవాడ రా. చేసి తినిపిస్తాను" తల్లి కుర్రాడిని బెల్లించినట్టు చూశాను. నా చెయ్యి తీసుకుని తన చేతిలో పెట్టుకుని "ఒట్టు?" అంది.

నేను అనలేదు. ముద్దు పెట్టుకున్నాను.

"ఒకటికాదు. ఆరు రకాల వంటకాలు నేర్పింది ఆవిడ. వాటికి కాస్త పట్నం పద్ధతులు జతచేశానంటే కేవలం చెనక్కాయ వంటకాలు కారణంగా జీతం మరో వెయ్యి పుచ్చుకుంటాను. ధనియాలు, తిరగమోత, ఉల్లిపాయ ముక్కలు వేసిన పచ్చడి మామూలు వంటకం. చెనక్కాయని కచ్చాపచ్చాగా ముక్కలు చేసి ముద్దకాకుండా ఉడికించి మైదాపిండి" ఒక్కసారి వ్యాపార దక్షత ఉన్న వంటవాడినయిపోయాను. ఆమె మనఃపూర్వకంగా బురద పూసుకుంటున్న కుర్రాడి ఆటని ఆనందంగా గమనిస్తున్నట్టు నన్ను చూస్తోంది. ఆమె చూపులో వింటున్న శ్రద్ధకాక, చూస్తున్న ఆసక్తి తెలుస్తోంది. నేను చెపుతున్న విషయం మీద ఆమె శ్రద్ధలేదని అర్థమయి అంతలోనే ఆగిపోయాను.

ఇద్దరం ఒకరినొకరు గమనిస్తూ కొన్ని క్షణాలు నిలిచిపోయాం. చెనక్కాయ వంటకాలు అటకెక్కిపోయాయి. తర్వాత ఏం జరిగేది? ఏమో?

తలుపు చప్పుడయింది. ఇద్దరం తుళ్ళిపడ్డాం. వెళ్ళి గొళ్ళెం తీశాను. టీటీయీ రహస్యం చెప్తున్నట్టు అన్నాడు: "పెద్ద స్టేషన్ వస్తోంది. మీరు బయట ఉంటే మంచిది" ఈ మాటని రహస్యంగా చెప్పనక్కరలేదు. కాని అతనిమాట ఆర్డరులాగా లేదు. సూచనలాగా ఉంది. పోలీసు దొంగతనాన్ని ప్రోత్సహించినట్టు ఉంది.

అవకాశం, మద్దతు, ఇటు పక్క పూర్తి సహకారం శరీరం క్రమంగా వేడెక్కుతోంది. అయినా బయటకి వచ్చాను. తీరా అది రైలు ఆగే ఊరుకాదు. గుడిమెట్ల. ఏదో క్రాసింగు ఉందట. రైలు దిగి అటూ యిటూ దిక్కుతోచనట్టు నడిచాను. కిటికీలోంచి పాప చూస్తోంది. అక్కరలేకపోయినా, అలవాటు లేకపోయినా సిగరెట్టుకొని కాల్చాను. పొగకి గుక్కతిరగక ఉక్కిరిబిక్కిరి కావడం పాప గమనించింది. కోరిక తీర్చుకోవడం తెలీని వ్యక్తిని చూసి ఆటపట్టించినట్టు నవ్వుతోంది. మేమిద్దరం ఒకరినొకరు చూసుకుంటూండడం టీటీయీకి తెలుస్తోంది. భుజం మీద చెయ్యి వేశాడు.

"ఓ ఫార్టీ ఉందా?" అన్నాడు. అప్పు అడిగినట్టు కాదు. అదేదో తన హక్కులాగా అడిగాడు. ఏమిటా హక్కు? స్లీపరు కంపార్టుమెంటులో ఆడవాళ్ళ పెట్టెకు లోపలి గడియ ఖరీదు.

ఇవ్వనన్నాను. గమనించాలి. లేదనలేదు. మా దగ్గరతనాన్ని గుర్తించినందుకు ఆనాడు అతను ఏర్పరచుకున్న రుసుమది. మరొకరెవరయినా సుళువుగా ఇచ్చేవారేమో. ఇది 42 ఏళ్ళ కిందటి నలభై రూపాయలు. నిజానికి అంత డబ్బు ఆనాడు నా దగ్గర లేదు. ఉంచుకునే అవసరమూ లేదు.

అతను ఆశ్చర్యపోయాడు. నిష్కర్షగా చెప్పిన నా ధోరణికి షాక్ అయాడు. దూరంగా జరిగిపోయాడు. ఒక అపశృతిని సమర్థించడానికి రుసుము చెల్లించాలనే యావలేని రోజులవి. ప్రతీ సౌకర్యానికి విలువకట్టి రాబట్టుకునే ఉద్యోగం అతనిది. ఇద్దరికీ ఆ క్షణంలో పొంతన కుదరలేదు. కానీ అందువల్ల జరిగిన నష్టాన్ని చాలాకాలం మరిచిపోలేకపోయాను.

రైలు కదిలింది. ఈసారి స్వేచ్ఛగా పాప పెట్టెలోకి వెళ్ళలేకపోయాను. కారణం - టీటీయీ ఈ కంపార్టుమెంటులోనే ఉండడం, అతని కోరికని కాదన్న నిర్మొహమాటం నాకు ఆ క్షణంలో బంధువయింది. మించిపోయింది లేదు. అయితే ఇవ్వాలన్నా అంత డబ్బు నా దగ్గరలేదు. మునుమాక దాటాక మెల్లగా కంపార్టుమెంటు దాటాడు పక్క పెట్టెలోకి. అంతే. వెంటనే పాప దగ్గరికి దూకాను. నా కోసమే ఎదురుచూస్తున్నట్టు కూర్చుని ఉంది. 'ఎందుకింత ఆలశ్యం?' అన్నట్టు చూసింది.

దొంగలకి దొంగ భాష అర్థమవుతుంది. లేదా ఆర్తులకి ఎదుటి వ్యక్తి ఆర్తి గుర్తు తెలుస్తుంది. "టీటీయీ" అన్నాను క్లుప్తంగా.

ఈసారి మరీ దగ్గరగా కూర్చున్నాను. ఎలా కలిసింది ఈ చొరవ? లాజిక్ లేదు. గుంతకల్లు నుంచి సంఘటనలన్నీ అలా తోసుకొచ్చాయి.

ఈసారి ప్రయత్నం లేదు పాపని నా కౌగిట్లోకి తీసుకున్నాను. నా హక్కులాగ. రైలువేగానికి పాత కంపార్టుమెంటు మమ్మల్ని ఉయ్యాల ఊగిస్తోంది. పాప క్రమంగా నన్ను అల్లుకుంటోంది. అలా ఎంతసేపు? అప్పటికి నేను మరిచిపోయిన విషయం ఏమిటంటే ఈ ఆడవాళ్ళ పెట్టె తలుపు గొళ్ళెం వేయలేదు. న్యాయంగా ఎవరయినా తలుపు తోసుకు లోపలికి రావచ్చు. వచ్చే ప్రయత్నం జరిగింది. కానీ రాలేదు. ఎవరు? టీటీయీ.

పక్కపెట్టెలోంచి ఒక ముసలావిడని వెంటబెట్టుకు వచ్చాడు. మేమిద్దరం తుళ్ళిపడ్డాం. మా యిద్దరి వేపూ చూడకుండా కార్య దక్షతతో నిమగ్నమైన ఉద్యోగిలాగా చార్టుని చూసుకుంటూ "ఈ క్రింది బెర్తులో పడుకోండి" అన్నాడు.

"రాత్రంతా నేలమీద దొర్లాలేమోనని బెంగెట్టుకున్నాను. నెత్తిన పాలుపోశావు కొడుకా" అంది ముసలావిడ.

అంటే రిజర్వేషన్ చేయించుకున్న పాసింజరుకాదు. పూనుకుని, వెతికి పట్టుకుని తీసుకొచ్చిన శాల్తీ ఈ పాసింజరు.

"మీలాంటి వాళ్ళకి సేవచేస్తే పుణ్యం మామ్మగారూ. పడుకోండి" అని తలుపుదాకా వెళ్ళి "నాకేం ఇవ్వనక్కరలేదు" అన్నాడు నన్ను చూస్తూ.

కావాలని, కసిగా చేసిన పని అని అర్థమవుతోంది. నన్ను చూసి "ఆవిడకి తోడున్నారు. మీరు మీ బెర్తుకి వెళ్ళి కూర్చోవచ్చు" అనేసి తలుపు దగ్గరికి లాగేసి మాయమయాడు.

ఇక అక్కడ కూర్చున్నా ఒరిగేదేమీ లేదు - కబుర్లు చెప్పుకోవడం తప్ప. అయినా మమ్మల్ని మాట్లాడనివ్వలేదు ముసిలావిడ. "నీకేమవుతుంది ఈ బొట్టి?" అంది. ఏమీ కాదన్నాను.

"అయితే నువ్విక్కడ కూర్చోవడం తప్పుకదా?"

కొందరికి లేని చొరవ ఉంటుంది. ఎక్కువగా తమిళులకి అది జన్మహక్కు. రోడ్డుమీద సైకిలు మీద వెళ్తున్నవాడు పార్కులో పువ్వులు కోస్తుంటే గుర్రుగా చూస్తాడు సైకిలు ఆపి. Righteous monitering మంచి జబ్బే. అది జాతికంతా ఉంటే వ్యవస్థ సంస్కారం. కొందరికే ఉంటే అది వ్యక్తి వికారంగా సరిపెట్టుకుంటాం.

లేచాను. చినపాపకూడా నిరుత్సాహపడినట్టు తెలుస్తోంది. అయినా చేసేదేమీలేదు. వెళ్తున్న నన్ను చూసి "గంటలో రా. భోజనం చేద్దాం" అంది. ఇది అతి చిన్న సౌకర్యం.

కాలుకాలిన పిల్లిలాగా కంపార్టుమెంటు అంతా తిరిగాను. అప్పటికి నా జేబులో నలభై రూపాయలు ఉంటే వెదికి పట్టుకుని టీటీయీకి సమర్పించేవాడిని. అది నా శక్తికి మించిన పైకం అప్పటికి. బెర్తు మీద కూర్చున్నాను. శరీరం అలసిపోయినప్పుడూ, మనస్సు అలసిపోయినప్పుడూ ఓ ఆటవిడుపు ఉంది - నిద్ర. నాకు తెలియకుండానే నిద్రపట్టేసింది. ఉన్నట్టుండి ఎవరో భుజం మీద చెయ్యివేస్తే తుళ్ళిపడి లేచాను. చీకటి పడింది. చేతిలో భోజనం పాకెట్‌తో వచ్చి నా పక్కన కూర్చుంది. అప్పటికి కంపార్టుమెంటులో ఉన్న నలుగుతూ నిద్రపోతున్నారు. నా పక్కన కూర్చుంది.

'నువ్వొస్తావేమోనని ఎదురు చూశాను' అంటూ.

"ఆ ముసలి దెయ్యం?"

"ఇంకా పడుకోలేదు. 'నాకేం భయంలేదు. హాయిగా పడుకో' మంటోంది. తనకి రాత్రుళ్ళు నిద్ర సరిగా పట్టదట."

నిరుత్సాహం గుండెలకి ఎగదన్నింది. ఆమె స్వయంగా పాకెట్‌లోంచి అన్నం నోటికి అందించింది. ఆకలి లేదు. అయినా నోరు తెరిచాను.

నా కళ్ళల్లో నిరుత్సాహం ఆమెకి అర్థమవుతోంది. ఆ క్షణంలో అర్థం చేసుకున్న అమ్మ అయింది. లేచి వెళ్తున్న ఆమె చీర పట్టుకుని ఆపాను. వెనక్కి తిరిగి ఎంగిలి పెదాలను ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది.

అంతే ఆ రాత్రి కథ.

గుంటూరు రైల్వే స్టేషన్లో తుళ్ళిపడి లేచాను. అప్పటికే రైలు ఆగి చాలా సేపయినట్టుంది. హడావుడిగా కంపార్టుమెంటు దిగాను. ఎక్కడ చినపాప? చుట్టూ తప్పిపోయిన పసివాడిలాగా కళ్ళు వెదికాయి. అప్పుడు కనిపించింది ఎదుటి ప్లాట్‌ఫారం మీద నాదృష్టిని పడడానికి ఎదురుచూస్తోంది. నేను చూడగానే చెయ్యి ఊపింది.

స్టేషన్లో నన్ను లేపలేదేం? వెళ్తున్నట్టు చెప్పలేదేం? ఇంత సులువా విడిపోవడం? అటుపక్క ప్లాట్‌ఫారం మీద డూప్లికేట్ రైలు ఉంది. నాలుగడుగులు వేశాక జనం మధ్య కలిసిపోయింది చినపాప. మరి కనిపించలేదు.

**అతను పొద్దుట్నుంచీ** నాకోసం ఎదురుచూస్తున్నాడట. నేనెలా ఉంటానో తెలీదు. ఏ హోటల్లో తెలీదు. కనీసం పన్నెండు హోటళ్ళలో వెదికి ఇక్కడికి వచ్చాడు ప్రతీ అరగంటకీ అడుగుతున్నాడట - ఆయన వచ్చారా అంటూ, హనుమంతు నన్ను చూస్తూనే పరుగున వచ్చి ఈ కథంతా చెప్పాడు. "అతన్ని చూస్తే జాలేస్తోంది బాస్. ఏదో పెద్ద కష్టంలో ఉన్నట్టున్నాడు. వెళ్ళి మాట్లాడు. బయట పార్సిల్స్ తీసుకెళ్ళే బెంచీమీద ఓ మూలకి ఒదిగి కూర్చున్నాడు జుత్తు రేగి ఉంది. గెడ్డం బాగా మాసింది బట్టలూ నలిగి ఉన్నాయి. నాలుగయిదు రోజులుగా నిద్రలేదన్న విషయం తెలుస్తోంది. నేనూ అతన్ని ఏనాడూ చూడలేదు. సందేహిస్తునే దగ్గరికి వెళ్ళాను.

"ఎవరండీ?" అన్నాను.

తుళ్ళిపడ్డట్టు లేచాడు. "మీరు ఫలానా?"

అవునన్నాను.

"మీరు త్వరగా నాతో రావాలి. టైములేదు. అర్జంట్"

"ఎక్కడికి? ఎందుకు? అసలు"

మాట పూర్తికానివ్వలేదు. "ఇప్పుడంతా చెప్పలేను. నా మాట విన్నందుకు మీరు.. ప్లీజ్. వెళ్దాం పదండి"

విషయం తెలియకపోయినా, అదేదో అర్జంటు వ్యవహారమేనని అర్థమవుతోంది. కానీ ఇంకా సందిగ్దం వదలలేదు.

"ఇంతకీ ఎవరు మీరు?"

ఎలా చెప్పాలో తెలీక గింజుకున్నాడు దీనంగా చూశాడు. అతని కళ్ళు రెండూ నీళ్ళతో నిండుకుండలయాయి. చెప్పలేక చెప్పలేక "నేను చినపాప తమ్ముణ్ణి" అన్నాడు.

అంతే. ఇంకేమీ అడగలేదు. హనుమమంతుకి చెప్పి బయటికి నడిచాను. ఇద్దరం రిక్షాలో దూకాం.

పటమటదాటి గణపతి సచ్చిదానంద స్వామి ఆశ్రమం సమీపంలో ఓ నర్సింగ్ హోం ముందు రిక్షా ఆగింది. అంతవరకూ చినపాప తమ్ముడు మాట్లాడలేదు. నిజానికి మాట్లాడే స్థితిలోలేడు.

నర్సింగ్ హోం లోపల బొత్తిగా చీకటి గుయ్యారంగా ఉంది. ఏమిటిది? చినపాప ఇక్కడెందుకుంది? ఆమె కేమయింది?

చీకట్లోంచే ఒకాయన బయటికి వచ్చాడు. దాదాపు 30 వయస్సు. మెడలో పాతబడిన స్టెతస్కోపుని చూసి డాక్టరని గుర్తుపట్టాను. దాదాపు మాసిపోయిన కార్డిగాన్. జుత్తు మాత్రం దుబ్బుగా పెరిగి ఉంది.

మా యిద్దర్నీ - కాదు - నన్ను చూడగానే అతని ముఖం వికసించింది.

"ఓహ్! మిస్టర్ ఫలానా! మీకోసం ఇక్కడ ఇద్దరు తపస్సు చేస్తున్నారు. లోపల ఆవిడ ఇతను"

"ఎందుకని? చినపాపకి ఏమయింది?"

డాక్టరు నవ్వాడు. "ఇంకా ఏం కాలేదు. ఇక ఈ తర్వాత ఏమయినా చినపాప బాధపడదు. ఆమె చూడాలనుకున్న ఒక్క వ్యక్తి ప్రస్తుతం ఇక్కడ ఉన్నారు"

తమ్ముడు ఏడుస్తున్నాడు. డాక్టర్ అతన్ని పట్టించుకోలేదు.

"నా పేరు దుర్గ. నన్నంతా 'పూర్ డాక్టర్' అంటారు. పేదరికం నా వైద్యానిది కాదు. డబ్బుది. గ్లాడ్ టూ మీట్ యూ. ఇది చాలా తేలికగా అందరూ అనేమాట. ఇంతకంటే మంచి మాట ఏదయినా ఉంటే అనాలని ఉంది నాకు"

తెల్లబోయి చూస్తున్నాను.

"మీ గురించి నాకంతా తెలుసు. చినపాప ఏ విషయం మరిచిపోలేదు. గుంతకల్లులో ఆమెను రక్షించడం. ఆడవాళ్ళ పెట్టెలో జంపరు కుట్టు. జాకెట్టుమీద మీ చేతులు. మీరు పెట్టుకున్న ముద్దు.." నేను కంగారు పడడాన్ని చూసి నవ్వాడు. "మీకు తెలియకుండానే ఆ క్షణంలో చినపాప జీవితాన్ని పొడిగించారు. ఆ కాస్త జీవితాన్ని వెలిగించారు. ఆనాడు వాము మిరపకాయల రుచితో వేడెక్కిన ఎంగిలి పెదాల మీద ముద్దు.."

నాకు కోపం వచ్చింది. ఇంత ఏకాంతమయిన విషయాలు చినపాప - ఇతనితో... దుర్గ డాక్టరు. క్షణంలో నా మనస్సులోని ఆలోచనని చదివాడు. "మిమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి ఇవన్నీ చెప్పడం లేదు. కానీ ఆమె మనస్సులో దాచుకున్న విలువైన జ్ఞాపకాలను వాటికి కారణమైన మనిషికి చెప్పాలనుకున్నాను. మీరు చాలాకాలం జీవిస్తారు. ఆ రోజు కాదు - ఆ రాత్రి - ఒక వ్యక్తికి గొప్ప ఉపకారం చేశారని చెప్తే గతాన్ని తలుచుకుని జీవితమంతా గర్వపడతారని గుర్తుచేస్తున్నాను. ముద్దుకి సమాజంలో రకరకాలయిన అర్థాలున్నాయి. చర్మవ్యాధి నిపుణుడికి అది కేవలం రెండు పెదాల కలయిక. గుండె వ్యాధి నిపుణుడికి అది రెండు గుండెకాయలు వేగంగా కొట్టుకోవడానికి గుర్తు. సైకాలజిస్టుకి అది రెండు మనస్తత్వాల సమన్వయం. అంతే. అంతకన్నా ఇంకేం లేదు. నేను ఆనాటి మీ చర్య ఎంత జీవలక్షణాన్ని ఆమె శరీరంలో ప్రోదు చేసిందో చెప్పాలనుకుంటున్నాను. ఈ తర్వాత మీ నెత్తిన పడబోతున్న పెద్ద విషాదాన్ని కనీసం ఈ జ్ఞాపకం రాబోయేకాలంలో ఎంతో కొంత తేలిక చేస్తుంది. ఆ గదిలో ఉన్న పేషెంటుకి నేనేం చెయ్యలేను. కానీ మీకు చెయ్యగల చికిత్స కాస్తపాటి చేసి ఉపకారం చేద్దామనుకుంటున్నాను"

మెల్లగా మీదనపడబోయే విపత్తు తెలియవస్తోంది. అసలు.. అసలు..

"అవును. ఇప్పటికి మీరు ఊహించినది రైటే. చినపాప వెళ్ళిపోతోంది. ఇప్పుడుకాదు. కనీసం రెండేళ్ళ కిందటే ఈ ప్రయాణం ప్రారంభమయింది. కార్సినోమా. అంటే - మామూలు భాషలో కేన్సర్. మర్మావయం దగ్గర. ఆమె కుటుంబ జీవితానికి పనికిరాదు. ఆ విషయం చినపాపకి ముందునుంచీ తెలుసు."

నాకు తల తిరిగిపోయింది. గుంతకల్లు నాటి అనుభవానికి ఇది అన్వయం. ఆ రోజు అంత ఉదారంగా సుళువుగా, అసంకల్పితంగా మా దగ్గరతనాన్ని శారీరక సుఖం వేపు కోరి మలుపు తిప్పిన వంద ఆలోచనలు మనస్సులో కదిలాయి. కుటుంబ జీవితానికి నోచుకోని ఓ అందమయిన, పండు యౌవనంలో ఉన్న అమ్మాయి - మరో వ్యక్తిని ఆ దిశగా రెచ్చగొట్టింది.

ఎందుకు?

దుర్గ నవ్వాడు. "తను పోగొట్టుకుంటున్నదేదో తెలుసు. కాదు తాను పొందలేదనిదేదో తెలుసు. కానీ దాన్ని పొందాలనే 'కోరిక'ని, ఒక్క అనారోగ్యం వినా - దాన్ని తీర్చగలిగే అన్ని అర్హతలు ఉన్న తనని ఇది ముఖ్యం - ఆ అనుభవానికి కాదు. ఆ ఆలోచనకు సిద్ధం చేసింది - మిమ్మల్ని. కాదు సిద్ధం చేయగలిగే స్త్రీ ఇగో ని ఆనాడు మీరు రెచ్చగొట్టారు. నేను వైద్యుడిని. కానీ వైద్యానికి అందని కొన్ని చికిత్సలున్నాయి. ఆమెలో మీరు మేల్కొలిపిన 'జీవలక్షణం' ఆమెకి మరికొంత సమయం కొన్ని నెలలు జీవితాన్ని పొడిగించాయి"

"మైగాడ్!"

"ఇది మీకు తెలియకుండా ఆమెకి జరిపిన చికిత్స"

హఠాత్తుగా ఓ ఆలోచన కదిలింది. ఆనాడు నేను 40రూపాయలు టీటీయీకి ఇవ్వగలిగితే, ఆ రోజు ఆ ముసలావిడ కంపార్టుమెంటులోకి రాకపోతే? ఆమె సంసార సుఖానికి పనికిరాదన్న విషయం ఆనాడే నాకు తెలిస్తే?

దుర్గ నవ్వాడు.

"సెక్స్‌కి ఆమె పనికిరాదని మీకు తెలీదు. కానీ ఆమెకి తెలుసు. మీరు అందుకు తొందర పడుతున్నారు. అంటే అంతవరకూ ఆమె నిర్మించుకున్న నీటి బుగ్గ పగిలిపోతోంది. ఇప్పుడు సెక్స్‌కి గండిపడాలి. మీరు సెక్స్‌కోసం 40రూపాయలు ఖర్చు చెయ్యలేకపోయారు. ఆమె సెక్స్‌ని ఆపడానికి 60 రూపాయలు ఖర్చు చేసింది."

నేను దిమ్మరపోయాను.

"అవును. టీటీయీకి 60 రూపాయలు ఇచ్చింది. ఆ రోజు ముసలావిడ ఆ కంపార్టుమెంటులోకి రావడం ఆమె ఏర్పరుచుకున్న వెసులుబాటు. మీరు సిద్ధం చేసిన 'కల'ని కలస్థాయిలోనే ఆపడానికి ఆమె చేసిన ఖర్చు. ప్రయత్నం. ఆమె కోరిక మీదే ఆనాడు ముసలమ్మ ఆ కంపార్టుమెంటులోకి వచ్చింది"

నాకు మతిపోయింది.

"మరొక్క విషయం ఇప్పుడు మీకు గుర్తురావాలి. మర్నాడు ఉదయం మీరు లేచేసరికి చినపాప – ఎదుటి ప్లాట్‌ఫారం మీద ఉంది – చెయ్యి ఊపుతూ. మీకు తన అడ్రసు ఇవ్వలేదు. 'మళ్ళీ కలుస్తాం' అనలేదు. 'మళ్ళీ ఎప్పుడు కలుస్తావు?' అని మీరడిగే అవకాశం ఇవ్వలేదు. కారణం ఈ అనుభవానికి ఆవలి తీరంలేదు. అప్పుడు మీకు నిర్దాక్షిణ్యంగా కనిపించినా ఆమె నిస్సహాయంగా మీ ఇద్దరి మధ్యా తలుపు మూయకపోతే ఓ గొప్ప అనుభవానికి సిద్ధపడుతున్న మీకు ఒక పీడకల మిగిలేదు."

"అయితే ఆవిడ ఆ రోజు అలా విడిపోవడం ఆమె తెలిసి చేసిన పని అంటారు"

"మరో వింత విషయం. ఆమె కథ మీకేమీ దొరక్కుండా జాగ్రత్త పడింది. ఒకవేళ మీరు ప్రయత్నించి పొన్నూరు వెళ్ళినా ఆమెని వెదికి పట్టుకోలేకపోయేవారు. కారణం – ఆమె చినపాపే. కానీ జంపరు కుట్టు, టైలరింగు ఆమె పనికాదు"

"మరి ఎందుకలా అబద్ధం చెప్పింది?"

దుర్గ నవ్వాడు. మీరు మగాళ్ళు. ఆమె అసమాన్యురాలయిన స్త్రీ. కంపార్టుమెంటులో పడిన క్షణంలోనే మీ కళ్ళలో ఆకర్షణని గుర్తుపట్టింది. ఆమెకది గర్వకారణం. అప్పుడామె స్త్రీ. ఇటు ఆకర్షితుడైన మగాడు. మగాడిని త్వరగా ఆకర్షించేది ఏది? జాకెట్టు మీద మీ చెయ్యి. జాకెట్టుకి ఏది దగ్గర తోవ? టైలర్ పనివాడితనం. ఆమె సృష్టి సహజమైన అన్ని బాణాలూ సంధించగల స్త్రీ. ఒకటే ఆమెకి కలిసి రాలేదు. శరీరం."

నాకు నోట మాట రాలేదు.

"నాకెందుకు అబద్ధం చెప్పాలి?" అన్నాను ఆలోచనలని కూడదీసుకుని.

దుర్గ నవ్వాడు. "మీరు అబద్ధాన్ని చూస్తున్నారు. కానీ ఆమె పట్ల ఆకర్షణని పెంచుకున్న మగాడి 'కోరిక'ను ధ్వంసం చెయ్యలేదని మీరు మరిచిపోతున్నారు. ఈ క్షణం వరకూ ఆమెతో పొందుని మీరు ఆశిస్తున్నారు అది ఆమె మీకు కల్పించి, విడిచిపెట్టిన విసులుబాటు. ఆనాడు తన నిస్సహాయతను మీతో చెప్పుకుని భోరుమనే బేలతనాన్నీ చూపలేదు. Her disease could not break her diginity."

"టైలర్ కాకపోతే ఎవరామె?"

"తమ్ముడిని చదివించడం కోసం ఒక ఫాన్సీ షాపులో సేల్స్ గర్ల్‌గా పనిచేస్తోంది. ఆమె అనారోగ్యం ఆమెని ఎక్కువ బాధపెట్టలేదు. తన తమ్ముడి చదువు పూర్తికాకుండా తను పోతే తన సహాయం నిలిచిపోతుందేమోనని విలవిలలాడింది. తమ్ముడు పరీక్ష పాసయాడని తెలిసిన రెండోరోజు ఆమె అనారోగ్యం తిరగబెట్టింది. తన cinvictionతో రోగాన్ని ఆమడ దూరంలో నిలిపిన ధైర్యస్థురాలు"

"కానీ ఏ ఆడదీ ఎవరితోనూ చెప్పుకోలేని విషయాలన్నీ మీకెలా చెప్పింది? ఎందుకు చెప్పింది?"

దుర్గ నవ్వాడు. 'ఆమె అందరిలాంటి ఆడదికాదు. కాగా, ఆనాడు మీరు ఆమెని కోరుకోవడం ఆమె స్త్రీత్వానికి విజయం. ఆమెకు గర్వకారణం. తాను రోగంతో వెళ్ళిపోతున్నాననే సానుభూతికాదు. బతికినప్పుడు తను కావాలనుకున్నవారున్నారనే గర్వాన్ని జత చేసుకోవాలని ఆమె తాపత్రయం. ఈ విషయాలు ఆమె ఆభిజాత్యానికి ప్రతీకలు. నిజానికి ఆమె మిమ్మల్నీ, మీ అందాన్నీ ప్రేమించలేదు. తను మరొకరితో ప్రేమించబడడాన్ని ప్రేమించింది"

అంత విషాదంలోనూ నాకు నవ్వొచ్చింది. "మీరు వైద్యులు మాత్రమే కారు" అన్నాను.

దుర్గా నవ్వాడు. "అవును. నా మిత్రులు నన్ను 'సెంటిమెంటల్ ఫూల్' అంటారు. ఇంగ్లీషులో కవిత్వం రాస్తాను. క్లినికల్ సైకాలజీ నాకు ఇష్టమైన సబ్జెక్టు. బతుకు తెరువుకి 'ఆంకాలజీ'ని ఎంచుకున్నాను"

ఇంత జరిగాక ఆమెని చూడాలని మనసు తొందరపెడుతోంది. గదిలోకి వెళ్ళడానికి ముందుకు అడుగు వేశాను. దుర్గ నాకు అడ్డు వచ్చాడు.

"ఆమెని చూసే ముందు కొన్ని విషయాలు చెప్పాలి. మీరు ఆ రోజు మృత్యువునుంచి ఆమెని కాపాడారు. కానీ అప్పటికే మరో మృత్యువు ఆమె శరీరంలో ఉంది. ఆ రెండో మృత్యువుని ఆమె మీతో అలంకరించుకుంది. అందుకనే ఇప్పుడు తన జీవితం ఆఖరి క్షణాల్లో మిమ్మల్ని కలుసుకోవాలని తాపత్రయ పడింది"

నేను కదిలిపోయాను. అతను చెప్పుకుపోయాడు..

"చూడండి. ఈ తలుపు తెరుచుకున్నాక మీరు షాక్ అవుతారు. చినపాప మీరు ఆనాడు చూసిన చినపాప కాదు. రేడియేషన్ 'కీమో థెరపీ'తో జుత్తు పూర్తిగా ఊడిపోయింది. నలిగి నలిగి పుల్లలాగా అయిపోయింది. ఆమెని చూశాక మీరు భయపడతారు. కానీ నటించడానికి ఇప్పటినుంచీ సిద్ధం అవండి. ఈ ఆఖరి క్షణాలు ఆమె సంపాదించుకున్న విలువైన ఆస్తులు. మీరు ఆనాటి గుంతకల్లు చినపాపనే చూస్తున్నట్టు ఆమెకి అనిపించాలి. అప్పటి ఉత్సాహంతోనే పలకరించాలి" దగ్గరికి వొంగి "ముద్దుపెట్టుకోవడం మరిచిపోకండి"

నేను చికాకుగా చూస్తే "ఇది డాక్టరుగా ఆమె ఉపశమనానికి నేను యిస్తున్న ప్రిస్క్రిప్షన్" అని తలుపు తెరిచాడు.

దుర్గ ముందుగా నన్ను సిద్ధం చెయ్యకపోతే నేను షాక్‌తో తల్లకిందులయిపోయేవాడిని. చినపాప కాదు. జీవచ్ఛవం. తలుపు అలికిడికి తల తిరగలేదు. తిప్పలేకపోయింది. కళ్ళు మాత్రం తిరిగాయి. ఆ చిన్న వెలుగులో నన్ను గుర్తుపట్టింది. చిన్న నవ్వు వెలిసింది.

అతి కష్టం మీద చెయ్యి ఎత్తాలని ప్రయత్నిస్తోంది. దగ్గరికి వెళ్ళి చెయ్యి అందుకుని పక్కన ఉన్న బల్లమీద కూర్చున్నాను.

ఆ దృశ్యానికి తేలికగా భోరుమనేవాడిని. కానీ దుర్గ హెచ్చరిక నాకు దన్నుగా నిలిచింది. నేను నటించాలి. మరిచిపోకూడదు.

"నాకు చెప్పడానికి ఇంత ఆలశ్యం చేశావేం?" అన్నాను.

చినపాప కళ్ళనిండా కృతజ్ఞతని పూరించింది.

"పాపా! నువ్వు పెద్ద యోధురాలివి. నిన్ను జీవితంలో మరిచిపోలేను. ఇంత ప్రేమని ఇలాంటి ప్రేమని నేను ఎన్నడూ చూడలేదు."

నా చేతిలో ఆమె వేళ్ళు బిగుసుకున్నాయి. అలా ఎంతసేపు కూర్చున్నానో? డాక్టర్ ప్రిస్క్రిప్షన్ గుర్తుకొచ్చింది. వొంగి కళ్ళు మూసుకున్న ఆమె పెదాల మీద ముద్దు పెట్టుకున్నాను. పెదాలు ఇప్పుడు మెత్తని దూది పింజల్లాగా లేవు. అరిగిపోయిన ఆకురాయిల్లాగా గట్టిపడి ఉన్నాయి. ఆమె కళ్ళు 'హాయిగా' విప్పారాయి. ఆ మాట ఆమె జీవితానికి ఆఖరిసారి. అంతే. మెల్లగా మూసుకున్నాయి. నా చేతిలో ఆమె చెయ్యి సడలిపోయింది. ఆ శరీరంలో జీవలక్షణం పూర్తిగా శలవు తీసుకుంది."

ఎంత సేపు కూర్చున్నానో! లేచాను. చల్లబడుతున్న చినపాప ముఖంలో గొప్ప విషాదం నుంచి విడుదలయిన ఆటవిడుపు కనిపిస్తోంది. ఆ చిన్న జీవితంలో ఆ కాస్త ఆనందానికి కారణం నేనా?

*బయటికి వచ్చాను. దుర్గ గోడకి ఆనుకుని నిలబడి ఉన్నాడు. భుజం మీద చెయ్యివేశాను.*

*"వెళ్ళిపోయింది" అన్నాను.*

*ఇటు చూశాడు. భోరుమన్నాడు.*

*"డాక్టర్లకి కళ్ళనీళ్ళురావు. కానీ నేనిప్పుడు సెంటిమెంటల్ ఫూల్‌ని - కవిని"*

*"you know. The love started when you stoped her die. It ended when you gifted her death with your love.*

*నాతో రిక్షా దాకా నడిచాడు.*

*"మీరు అడగలేదు. కానీ చెప్తున్నాను, ఆమెని మోనాలిసా, వీనస్, ఊర్వశి స్థాయిలో నిలుపుతాను"*

*"నాకవేవీ తెలియవు" అన్నాను.*

*నవ్వాడు దుర్గ. "కవిత్వం పాఠకుడిని వెతుక్కోదు పాఠకుడూ కవిత్వానికి దొరుకుతాడు"*

*నర్సింగ్ హోం వేపు చూస్తూ అన్నాడు.*

*A flower bloomed with radiant splendor*
*But withered withour fulfilling its candour*

*రిక్షా నడుస్తోంది. రిక్షా నడుస్తూనే ఉంది.*

*(జెఫ్రీ ఆర్చర్ "వన్ మాన్స్ మీట్.." చదివిన స్ఫూర్తితో.)*

(పైన మీరు చదివిన ముగింపు క్రింది కథకి - ఇది ఒక రకమైన ముగింపు.)

*ఒకే కథ - ఎన్నో ముఖాలు*

**రైలు కదిలింది.** కదులుతూనే వేగం పుంజుకుంది. అప్పుడు చూశాను. రైలు కదలడం నాలాగే ఆలశ్యంగా గమనించిన ఆమె పరుగున కంపార్టుమెంటులోకి దూకబోయింది. చీర కుచ్చిళ్ళు అడ్డంపడ్డాయి. ఆవిడ ఇప్పుడు ఎక్కడికి వెళ్తోందో తెలుస్తోంది. మరో క్షణంలో ఫ్లాట్‌ఫారంకీ రైలుకీ మధ్య ఉన్న చోట ఇరుక్కుంటోంది. ప్రయత్నించి చేసిన పనికాదు. ఒక్క దూకులో ఆమె మీద పడ్డాను. కుడిచెయ్యి, నడుం దొరికింది. గట్టిగా శరీరాన్ని గాలిలోకి ఎత్తి కంపార్టుమెంటులో దూకాను. ఆనాటికి ఆ అదృష్టం మా యిద్దరిదీ. కంపార్టుమెంటు అంచుకి వచ్చాం. రైలుతో పరిగెత్తుతున్న ఎర్ర మైసయ్య చెనక్కాయల బస్తా కంపార్టుమెంటు లోపలికి విసిరేశాడు. బస్తా పెద్దది కాదు. కానీ రైలు వేగం, విసిరిన వేగం, ఆతృత అన్నీ కలిసి ఆ బస్తాను తుపాకీని చేశాయి. అంచున ఉన్న మా యిద్దరి శరీరాలనీ ఆ బస్తా లోపలికి గిరాటేసింది. ఇద్దరం కింద పడ్డాం ఒకరిమీద ఒకరం. ఇదంతా అనుకోకుండా జరిగింది - క్షణంలో.

భయంతో నన్ను కరుచుకుని ఆవిడ ఏడుస్తోంది. ఒక్క క్షణంలో మృత్యువునుంచి తప్పించుకున్న విషయం ఆవిడకి ఇప్పుడిప్పుడే అర్థమవుతోంది ఆమె ముఖంలో షాక్. చాలా విచిత్రంగా నా ముఖంలోనూ షాక్. ఎందుకని? చాలాసేపటికి కానీ అర్థంకాలేదు. ఈ పరుగులో గుంజాటనలో బస్తా విసురులో ఆమె వక్షోజాలు బలంగా నన్ను గుచ్చుకున్నాయి. నేనూ వణికాను.

అప్పటికి సాయంకాలం అయిదున్నర. రైలెక్కాక టీ తాగాలన్న ఆలోచన ఆమెకి వచ్చిందట. అదిన్నీ అరుస్తూ వెళ్తున్న కుర్రాడు దాటిపోయాక. రైలు దిగింది. టీ దాటిపోయింది. రైలు కదిలిపోయింది. అదీ పరిస్థితి.

ఒకరిని చావు వణికించింది. మరొకరిని కోరిక వణికించింది. నిజానికి కోరిక కాదు. కోరికకి ఆలంబన. మామూలుగా రైలు ఎక్కివుంటే ఆ అమ్మాయిని చూసేవాడిని కాను. ఇది కేవల 42 సంవత్సరాల కిందటిమాట. గుంతకల్లువేపు తిరిగే రైళ్ళలో ఆ రోజుల్లో స్లీపరు పెట్టెల్లో ఒక మూలకి కేవలం ఆడవాళ్ళకే ప్రత్యేకించిన కేబిన్ ఉండేది. కనీసం గుంతకల్లు, హుబ్లీ, గుత్తి ప్రాంతాలవేపు తిరిగే రైళ్ళమాట. ఈవిడ ఆ కేబిన్‌లో ఉంది. గుంతకల్లులో రైలు బయలుదేరేటప్పటికి పెట్టెలో ఆనాడు నలుగురయిదుగురే ఉన్నారు. ఆ అమ్మాయి ఆడవాళ్ళ కేబిన్‌లో ఒక్కరే ఉంది. ఈ లైనులో ఆ రోజుల్లో రద్దీ తక్కువ. ఆనాడు ఎందుకో మరీ తక్కువగా ఉంది.

రైలు గుత్తి చేరేటప్పటికి ఉద్రేకం సర్దుకుంది. ఈసారి రైలు దిగి ఆమె అడక్కుండానే ప్లాట్‌ఫారం మీదనుంచే టీ కప్పు అందించాను. మనస్ఫూర్తిగా అందుకుంది. ఆమె ముఖంలో కొంతకాలం కిందటి భయం పోయి కృతజ్ఞత కనిపించింది. అప్పుడు ఆ అమ్మాయిని తేరిపార చూశాను. నిజానికి చిన్నపిల్లేం కాదు. తేలిగ్గా 27-28 ఏళ్ళు ఉంటాయి. కాని వయస్సుని ధిక్కరించే శరీరం. ఆ విషయం ఇప్పుడు గుర్తించినది కాదు. ప్లాట్‌ఫారం మీదకి తలమాత్రమే కనిపిస్తోంది. అయితే శరీరం ఇందాకటి నా అనుభవం చెప్పిన విషయం. ఆమె అందకత్తెకూడా కాదు. కానీ కళ్ళు దూసుకుని చూసేవి. నవ్వులో చిన్న విచిత్రం ఉంది. రెండు పెదవులూ బయటికి విచ్చుకుంటాయి. చిన్న అమాయకత్వం, నిజాయితీ ఆ నవ్వులో కనిపిస్తుంది.

రైలు వేగం పుంజుకున్నాక ఆలోచనలు, ఆ చిన్న మహిళల పెట్టెలో ఏకాంతంగా కూర్చున్న వ్యక్తి వేపే పరుగులు తీశాయి. కంపార్టుమెంటు దాదాపు ఖాళీ. టీటీయీ వచ్చి తీరికగా కూర్చున్న నన్ను చూసి ఎదురుగా కూర్చున్నాడు. టిక్కెట్టు అడగలేదు సిగరెట్టు అడిగాడు. అలవాటు లేదన్నాను. టిక్కెట్టు లేదన్నంతగా నిరుత్సాహపడ్డాడు. లేచి వెళ్ళబోతున్న ఆయన్ని అడిగాను. ఎందుకివాళ బొత్తిగా రద్దిలేదు? అని. వెళ్తూ వెళ్తూ 'బక్రిద్' అన్నాడు. ముస్లింలకు బక్రిద్ చాలా పవిత్రమైన పండగ. ప్రయాణాలు చెయ్యకుండా ఇళ్ళల్లో పండగ చేసుకుంటారేమో. అయితే ఈ లైను అంతా ముస్లింలే ఉండరుకదా?

క్షణాలు గడిచేకొద్దీ ఆలోచనలు ఆ అమ్మాయివేపు ప్రయాణం చేస్తున్నాయి. వెళ్ళి ఆ పెట్టె తలుపు తీశాను. చటుక్కున నన్ను చూసింది. చూసినందుకు ఆశ్చర్యపడలేదు. కాగా రావడం ఆలశ్యం చేసినందుకు ఆతృత పడినట్టు కనిపించింది. ఎలా తెలిసింది? వెంటనే తను జరిగి నాకు చోటిచ్చింది. ఎదురుగా కూర్చోవచ్చుకదా? కానీ అమ్మాయి తనపక్కకి ఆహ్వానించడం శుభసూచకం. దేనికి?

కాస్సేపే నిశ్శబ్దం. నా చేతిమీద చెయ్యివేసి 'థాంక్స్' అంది. అప్పుడు అర్ధమయింది ఆవిడ బొత్తిగా చదువుకోలేదని. కానీ కళ్ళల్లో కృతజ్ఞతకి మించిన ఉత్తేజం తెలిసింది. ఏమిటది? నా చేతిమీద ఆమె చెయ్యి వణుకుతోంది లేక నా చెయ్యా?

ఇక తట్టుకోలేకపోయాను. ఆమె భుజం మీద చెయ్యివేశాను. ఆమె ఆశ్చర్యపడలేదు. నిజానికి ఎదురు చూస్తున్నట్టు కనిపించింది. ఇదంతా కృతజ్ఞతలో భాగమా? సినిమాల్లో హీరోలు మొదటి కలయికలోనే హీరోయిన్లను ఏదో ప్రమాదం నుంచో, కీడు నుంచో కాపాడుతారు. ఆ వెంటనే రొమాన్సు ప్రారంభమవుతుంది.

"నీ పేరు?"

"చినపాప. అసలు పేరు మహాలక్ష్మి. చిన్నప్పుడు నాకు ఆ మాట సరిగ్గా పలకడానికి వచ్చేదికాదట అందుకని ఎవరడిగినా మా అమ్మ నన్ను పిలిచే పేరునే చెప్పేదాన్ని"

"మరి పెద్దపాప ఎవరు?"

నవ్వింది. అప్పుడే తెలిసింది. పెదాలు బయటికి విచ్చుకుని నోరు ప్రత్యేకంగా కనిపించడం. "ఎవరూ లేరు. నేను ముద్దుగా ఉన్నానని మా అయ్య నన్ను చినపాప అని ముద్దాడేవాడట అందరికీ చినపాపని అయిపోయాను"

వెంటనే ఓ తొందరమాట అనుకోకుండా అన్నాను: "ఇప్పుడూ ముద్దొస్తున్నావు"

పగలబడి నవ్వింది. అప్పుడు తెలిసింది. ఆమెలో మరొక అందం - కుడి చివర ఊడిన పన్ను ఖాళీ. ఇది అందం ఎలా అవుతుంది? ఏమో? అది చెప్పడానికి చినపాపని చూడాలి.

నా చెయ్యి తీసుకుని తన జాకెట్టు మీద పెట్టుకుంది. ఈసారి నేను వణికిపోయాను. కంపార్టుమెంటులో ఇద్దరం కలిసి పడిన సంఘటనలో ఆతృత ఉంది. ప్రాణ భయం ఉంది. మించి అసంకల్పితమైన reflex మాత్రమే ఉంది. ఇప్పుడిది తెలిసిన అనుభవం. శరీరం వేడెక్కిన క్షణం. చెమట పట్టింది. ఇప్పుడు ఏం జరుగుతుంది?

మా యిద్దరికీ తెలియని విషయం ఏమిటంటే అంతకు కొన్ని క్షణాల క్రితమే రైలు స్టేషన్లో ఆగింది. భళ్ళున ఈ లేడీస్ పెట్టె తలుపు తెరుచుకుంది. 'భళ్ళున' అన్నమాట ముఖ్యం. కొత్తగా ఎవరయినా ప్రయాణీకులు వచ్చారేమో. ఆమె జాకెట్టుమీద చెయ్యిని చటుక్కున తీసేశాను. పెట్టెలోకి ప్రయాణీకులు ఎవరూ రాలేదు. కేవలం టీటీయి వచ్చాడు. అతని ముఖంలో చిన్న చిరునవ్వు. మగాళ్ళకి మాత్రమే ప్రత్యేకమైన నవ్వు. "నాకు తెలుసులే!" అన్న బెళ్ళింపు అందులో ఉంది.

అమ్మాయితో అన్నాడు: "ఎక్కడికి?"

"పొన్నూరు"

"ఇది గుంటూరు దాకే పోతుంది"

"అక్కడ బండి మారుతాను"

టిక్కెట్టు అడగలేదు. మా ఏకాంతాన్ని చెడగొట్టగలిగినందుకు తృప్తిపడ్డాడు. బయటికి వెళ్తూ తలుపు దగ్గర ఆగి "తలుపు వేసుకోండి" అన్నాడు.

"గుంతకల్లు ఎందుకు వచ్చావు?"

"కసాపురంలో మా అమ్మమ్మ ఉంది. ఒళ్ళు బాగులేదు. చూసిపోదామని వచ్చాను."

"పొన్నూరులో ఎవరున్నారు?"

"మా అమ్మ"

"నాన్న?"

"లేడు"

"పోయాడా?"

"పారిపోయాడు"

ఇప్పుడు జాలి చూపించాలా? కారణం అడగాలా? ఎప్పుడు - అనాలా?

"నేను టైలరింగు చేస్తాను. పొన్నూరులో జంపరుకుట్టుకి చినపాపదే పేరు" అంటూ చీరకొంగు తప్పించి జాకెట్టుని గర్వంగా చూపించింది. కాని కనిపించినవి - రెండు. చినపాప జంపరుకుట్టుకాదు పొడుచుకుని వచ్చిన వక్షోజాలు. చక్కగా, ఏపుగా పెరిగిన శరీరం. ఆ 'ఏపు'ని గుర్తుపట్టగల ఆమె గర్వం. వాటిని చూసి ఎదుటి వ్యక్తి తలకిందులౌతున్నాడని ఆమెకి తెలుసు. ఆమెకి తెలుసునని నాకూ అర్థమౌతోంది.

చిలిపిగా చూస్తోంది. చాలాసేపటి వరకూ మాటరాలేదు. స్త్రీలో కోరిక తొందరపెడితే మగాడు తడబడతాడు. ఎందుకని? 'సిగ్గు' అనే ముసుగు ఆ రుచిని మరింత పెంచుతుంది కనుక. అయితే ఒక్కచోటే దానికి శలవు పడకగదిలో. ఇది పడకగది కాదు.

''నిన్ను ముద్దుపెట్టుకోనా?'' అన్నాను.

''అడగాలా?'' అని ముందుకు జరిగింది. నవ్వినప్పుడు ఆమె పెదాలు బయటికి విచ్చుకోవడంలో 'సెక్స్'కీ ప్రమేయం ఉన్నదని ఇప్పుడనిపించింది. ఆమె పెదాలు దగ్గరకు జరిగిన నా పెదాలను ఆక్రమించుకున్నాయి. 'కోరిక' నాకు తెలియకుండానే ఆమె చెప్పుచేతల్లోకి వెళ్ళిపోయింది.

తర్వాత ఏం జరిగేది? ఫ్రాయిడ్, హావ్‌లాక్ ఎల్లిస్ తల బద్దలు కొట్టుకున్నా తేలేదికాదు. కాని ఆ క్షణంలో రైలు ఆగి మా పెట్టె సరిగ్గా స్టేషన్లో రద్దీగా ఉన్న చోట నిలిచింది. ఈ రోజుల్లోలాగా గాజు అద్దాల కిటికీలు కావు. ఊచలు లేని మాములు కిటికీలు. చటుక్కున నేను వెనక్కి జరిగాను. ఆమె పక్కున నవ్వింది. ఆ నవ్వుకి అర్థం చేతిలో పెట్టిన తాయిలాన్ని అందుకోలేని పసివాడని చూసినప్పటి చిలిపితనం.

మాటలు రాని నిశ్శబ్దమది. టీ, బిస్కట్టులు, కూల్ డ్రింకులవాళ్ళు కిటికీలోంచి తలదూర్చి పలకరించి వెళ్తున్నారు.

''మీరేం చేస్తారు?'' అంది - ఇప్పటికి.

చెప్పాలని నోరు తెరిచి, అంతలో ఆగి - ''ఏం చేస్తానో చెప్పుకోచూద్దాం'' అన్నాను.

అలవాటయిన, చిక్కని నవ్వు నవ్వుతోంది. ''అమ్మాయిల్ని ముద్దు పెట్టుకుంటూంటారా?''

చదువుకీ, instinct కీ సంబంధంలేదు. అనుభూతికి అధ్యక్షత వహించడంలో ఏనాడయినా స్త్రీకి రెండు మూడు మాస్టర్ డిగ్రీలు ఉన్నాయి. కోరికను సమాధాన పరచడంలో, మమకారాన్ని మాతృత్వానికి మలచడంలో. సృష్టిలో స్త్రీని దాటి నిలవగల శక్తిలేదు. Womanhood and motherhood are the ultimate conquests of woman.

''విజయవాడ గవర్నరు పేటలో ఒక హోటల్లో ఛెఫ్‌ని'' ఛెఫ్ అన్నమాట నేను వెతుక్కున్నది. ఆ రోజుల్లో విజయవాడలో కనీసం ఆ ప్రాంతంలో స్టార్ హోటళ్ళు లేవు. చెఫ్ అన్నమాట చాలామందికి తెలీదు. నేను వెదుక్కుని నా వృత్తికి గౌరవాన్ని పొదగడానికి తెచ్చిపెట్టుకున్నమాట. చుట్టుపక్కలవాళ్ళు, హోటల్లో పనిచేసేవాళ్ళూ పిలిచేది 'మాస్టర్' అని.

''ఛెఫ్ అంటే?''

నాకు అర్థమయింది - ఆమెకి అర్థంకాని మాట చెప్పానని. ఇప్పుడిక విజయవాడ స్థాయికంటే కిందకి రాకపోతే ఆమెకి అర్థంకాదు. ''హోటల్లో వంటలు చేస్తాను'' అన్నాను అలా చెప్తున్నందుకే ఇబ్బంది పడుతూ.

నవ్వింది. ''నాకంటా బాగా చేస్తారా? నేను రొయ్యల వేపుడు స్పెషల్''

నన్ను మించి గర్వపడే మరో అందం ఆ క్షణంలో ఆమె సొంతం చేసుకుంది. మొదటిది? ఆమె యవ్వనం. మొదటిసారిగా ఆమె ముందు ఓడిపోవడానికి సిగ్గుపడలేదు. నన్ను అర్థం చేసుకున్నట్టుంది. నా భుజం తట్టి ''ఒక్కసారి మీ వంట తినడానికి విజయవాడ వస్తాను'' అంది.

అప్పుడు గుర్తొచ్చింది. భోజనం మాట. ''ఇద్దరికీ భోజనం చెప్పి వస్తాను'' అని లేవబోయాను. నన్ను భుజం పట్టుకు లాగి కూర్చోపెట్టింది. ''ఈ లైనులో భోజనం ఇచ్చే స్టేషన్లు లేవు. మా అమ్మమ్మ పెరుగన్నం, వాము మిరపకాయలు, బిరియానీ ఇచ్చింది. మనిద్దరికీ చాలు'' అంది.

మళ్ళీ రైలు కదిలింది. మళ్ళీ ముద్దుపెట్టుకునేదా? ఇలాంటి చర్యలకి ఆవేశం ప్రాతిపదిక. కేవలం ఆలోచన చాలదు.

"మీరెందుకు గుంతకల్లు వచ్చారు?"

"చెనక్కాయ పచ్చడి ఎలా చెయ్యాలో నేర్చుకోడానికి"

ఆపకుండా నవ్వింది. నవ్వుతున్నప్పుడు చీర పైట జారిపోయింది. లేక జారిపోయేలాగా నవ్వుతోందా? బయట అందరికీ వినిపించేలాగా ఉంది ఆ నవ్వు. ఆపడానికి ప్రయత్నించాను. కానీ నా చేతిని తన చేతిలోకి తీసుకుని మరీ నవ్వుతోంది. చేతిని భుజం మీద ఆప్యాయంగా తిప్పుకుంది.

కాస్సేపటికి ఆగి - "ఇంతోటిదానికి ఇంత దూరం రావాలా?" అంది.

చేతివంట కళ కాగలదన్న దృష్టి స్త్రీకి తక్కువ. చిన్నప్పటినుంచీ ఒక 'అలవాటు'లాగ ఆ ప్రక్రియ లొంగిపోతుంది వారికి. జీవితమంతా సాగిపోతుంది. కానీ ప్రపంచంలో గొప్ప వంటవాళ్ళంతా మగవారు. మన సంస్కృతిలో కూడా. వంటకి భీముడిని చెప్తాం. ద్రౌపదిని కాదు. నలుడిని చెప్తాం. దమయంతిని కాదు. ప్రపంచంలో గొప్ప వంటగాళ్ళందరూ మగవాళ్ళే. గార్డె రామ్స్, పాల్ బోకూసే, ఎమిరిల్ లగాస్సీ, ఆంథోనీ బోర్డాయిన్ - ఇలా ఎందరయినా. విజయవాడ వంటవాడికి ఇంత పెద్ద పేర్లు ఎలా తెలుసు? ఓ ఇంగ్లీషు దొరగారు నా చేపల కూరకి మురిసి నా కూరని విదేశీ కూరలతో పోల్చి చెప్పాడు. అప్పుడే ఈ పేర్లు తెలిశాయి. నేను కాగితం మీద వాటిని రాయించుకున్నాను. మరీ గొప్పవారు హోటల్లో దిగినప్పుడు నా తెలివి తేటల్ని ప్రదర్శించడానికి ఆ పేర్లు వాడతాను. అయితే చినపాప ముందు ఎందుకు? ఆమెకి తెలియని గొప్ప ప్రపంచం నాకు తెలుసునని ఊరించడానికి. ఇది హనుమంతుడి కుప్పిగంతు.

చెప్పాను. "రాయలసీమలో చెనక్కాయల పంట ఎక్కువ. చెనక్కాయలతో ఎన్ని రకాల ఐటమ్స్ చెయ్యవచ్చునో చాలామందికి తెలీదు. శాంసన్‌పురంలో మా ఎర్ర మైసయ్య నాయనమ్మ ఉంది. కుంచమ్మ. ఆవిడకి 87 ఏళ్ళు. మైసయ్య ఓసారి విజయవాడ వచ్చి రొట్టెల్లో ఓ విచిత్రమైన కూర పెట్టి నా మతి పోగొట్టాడు. ఏమిట్రా యిది - అంటే చెప్పడు. బెల్లించి బెల్లించి వాడి నాయనమ్మ చేసిందని చెప్పాడు. అప్పటినుంచీ ఆ 'రుచి' పట్టుకోవాలని తాపత్రయం. ఇన్నాళ్ళకి కుదిరింది"

"ఎలా చేస్తావు ఆ కూర?" దగ్గరకి జరిగింది.

నేను నవ్వాను. "రెండేళ్ళు కష్టపడి ఆర్జించిన విద్య అది. అంత సుళువుగా చెప్తానా? విజయవాడ రా. చేసి తినిపిస్తాను" తల్లి కుర్రాడిని బెల్లించినట్టు చూశాను. నా చెయ్యి తీసుకుని తన చేతిలో పెట్టుకుని "ఒట్టు?" అంది.

నేను అనలేదు. ముద్దు పెట్టుకున్నాను.

"ఒకటికాదు. ఆరు రకాల వంటకాలు నేర్పింది ఆవిడ. వాటికి కాస్త పట్నం పద్ధతులు జతచేశానంటే కేవలం చెనక్కాయ వంటకాలు కారణంగా జీతం మరో వెయ్యి పుచ్చుకుంటాను. ధనియాలు, తిరగమోత, ఉల్లిపాయ ముక్కలు వేసిన పచ్చడి మామూలు వంటకం. చెనక్కాయని కచ్చాపచ్చాగా ముక్కలు చేసి ముద్దకాకుండా ఉడికించి మైదాపిండి" ఒక్కసారి వ్యాపార దక్షత ఉన్న వంటవాడినయిపోయాను. ఆమె మనఃపూర్వకంగా బురద పూసుకుంటున్న కుర్రాడి ఆటని ఆనందంగా గమనిస్తున్నట్టు నన్ను చూస్తోంది. ఆమె చూపులో వింటున్న శ్రద్ధకాక, చూస్తున్న ఆసక్తి తెలుస్తోంది. నేను చెపుతున్న విషయం మీద ఆమె శ్రద్ధలేదని అర్థమయి అంతలోనే ఆగిపోయాను.

ఇద్దరం ఒకరినొకరు గమనిస్తూ కొన్ని క్షణాలు నిలిచిపోయాం. చెనక్కాయ వంటకాలు అటకెక్కిపోయాయి. తర్వాత ఏం జరిగేది? ఏమో?

తలుపు చప్పుడయింది. ఇద్దరం తుళ్ళిపడ్డాం. వెళ్ళి గొళ్ళెం తీశాను. టీటీయీ రహస్యం చెప్తున్నట్టు అన్నాడు: "పెద్ద స్టేషన్ వస్తోంది. మీరు బయట ఉంటే మంచిది" ఈ మాటని రహస్యంగా చెప్పనక్కరలేదు. కాని అతనిమాట ఆర్డరులాగా లేదు. సూచనలాగా ఉంది. పోలీసు దొంగతనాన్ని ప్రోత్సహించినట్టు ఉంది.

అవకాశం, మద్దతు, ఇటు పక్క పూర్తి సహకారం శరీరం క్రమంగా వేడెక్కుతోంది. అయినా బయటకి వచ్చాను. తీరా అది రైలు ఆగే ఊరుకాదు. గుడిమెట్ట. ఏదో క్రాసింగు ఉందట. రైలు దిగి అటూ యిటూ దిక్కుతోచనట్టు నడిచాను. కిటికీలోంచి పాప చూస్తోంది. అక్కరలేకపోయినా, అలవాటు లేకపోయినా సిగరెట్టుకొని కాల్చాను. పొగకి గుక్కతిరగక ఉక్కిరిబిక్కిరి కావడం పాప గమనించింది. కోరిక తీర్చుకోవడం తెలీని వ్యక్తిని చూసి ఆటపట్టించినట్టు నవ్వుతోంది. మేమిద్దరం ఒకరినొకరు చూసుకుంటూండడం టీటీయీకి తెలుస్తోంది. భుజం మీద చెయ్యి వేశాడు.

"ఓ ఫార్టీ ఉందా?" అన్నాడు. అప్పు అడిగినట్టు కాదు. అదేదో తన హక్కులాగా అడిగాడు. ఏమిటా హక్కు? స్లీపరు కంపార్టుమెంటులో ఆడవాళ్ళ పెట్టెకు లోపలి గడియ ఖరీదు.

ఇవ్వనన్నాను. గమనించాలి. లేదనలేదు. మా దగ్గరతనాన్ని గుర్తించినందుకు ఆనాడు అతను ఏర్పరచుకున్న రుసుమది. మరొకరెవరయినా సులువుగా ఇచ్చేవారేమో. ఇది 42 ఏళ్ళ కిందటి నలభై రూపాయలు. నిజానికి అంత డబ్బు ఆనాడు నా దగ్గర లేదు. ఉంచుకునే అవసరమూ లేదు.

అతను ఆశ్చర్యపోయాడు. నిష్కర్షగా చెప్పిన నా ధోరణికి షాక్ అయాడు. దూరంగా జరిగిపోయాడు. ఒక అపశృతిని సమర్ధించడానికి రుసుము చెల్లించాలనే యావలేని రోజులవి. ప్రతీ సౌకర్యానికి విలువకట్టి రాబట్టుకునే ఉద్యోగం అతనిది. ఇద్దరికీ ఆ క్షణంలో పొంతన కుదరలేదు. కానీ అందువల్ల జరిగిన నష్టాన్ని చాలాకాలం మరిచిపోలేకపోయాను.

రైలు కదిలింది. ఈసారి స్వేచ్ఛగా పాప పెట్టెలోకి వెళ్ళలేకపోయాను. కారణం - టీటీయీ ఈ కంపార్టుమెంటులోనే ఉండడం, అతని కోరికని కాదన్న నిర్మొహమాటం నాకు ఆ క్షణంలో బంధువయింది. మించిపోయింది లేదు. అయితే ఇవ్వాలన్నా అంత డబ్బు నా దగ్గరలేదు. మునుమాక దాటాక మెల్లగా కంపార్టుమెంటు దాటాడు పక్క పెట్టెలోకి. అంతే. వెంటనే పాప దగ్గరికి దూకాను. నా కోసమే ఎదురుచూస్తున్నట్టు కూర్చుని ఉంది. 'ఎందుకింత ఆలశ్యం?' అన్నట్టు చూసింది.

దొంగలకి దొంగ భాష అర్ధమవుతుంది. లేదా ఆర్తులకి ఎదుటి వ్యక్తి ఆర్తి గుర్తు తెలుస్తుంది. "టీటీయీ" అన్నాను క్లుప్తంగా.

ఈసారి మరీ దగ్గరగా కూర్చున్నాను. ఎలా కలిసింది ఈ చొరవ? లాజిక్ లేదు. గుంతకల్లు నుంచి సంఘటనలన్నీ అలా తోసుకొచ్చాయి.

ఈసారి ప్రయత్నం లేదు పాపని నా కౌగిట్లోకి తీసుకున్నాను. నా హక్కులాగ. రైలువేగానికి పాత కంపార్టుమెంటు మమ్మల్ని ఉయ్యాల ఊగిస్తోంది. పాప క్రమంగా నన్ను అల్లుకుంటోంది. అలా ఎంతసేపు? అప్పటికి నేను మరిచిపోయిన విషయం ఏమిటంటే ఈ ఆడవాళ్ళ పెట్టె తలుపు గొళ్ళెం వేయలేదు. న్యాయంగా ఎవరయినా తలుపు తోసుకు లోపలికి రావచ్చు. వచ్చే ప్రయత్నం జరిగింది. కానీ రాలేదు. ఎవరు? టీటీయీ.

పక్కపెట్టెలోంచి ఒక ముసలావిడని వెంటబెట్టుకు వచ్చాడు. మేమిద్దరం తుళ్ళిపడ్డాం. మా యిద్దరి వేపూ చూడకుండా కార్య దక్షతతో నిమగ్నమైన ఉద్యోగిలాగా చార్టుని చూసుకుంటూ "ఈ క్రింది బెర్తులో పడుకోండి" అన్నాడు.

"రాత్రంతా నేలమీద దొర్లాలేమోనని బెంగెట్టుకున్నాను. నెత్తిన పాలుపోశావు కొడుకా" అంది ముసలావిడ.

అంటే రిజర్వేషన్ చేయించుకున్న పాసింజరుకాదు. పూనుకుని, వెతికి పట్టుకుని తీసుకొచ్చిన శాల్తీ ఈ పాసింజరు.

"మీలాంటి వాళ్ళకి సేవచేస్తే పుణ్యం మామ్మగారూ. పడుకోండి" అని తలుపుదాకా వెళ్ళి "నాకేం ఇవ్వనక్కరలేదు" అన్నాడు నన్ను చూస్తూ.

కావాలని, కసిగా చేసిన పని అని అర్థమవుతోంది. నన్ను చూసి "ఆవిడకి తోడున్నారు. మీరు మీ బెర్తుకి వెళ్ళి కూర్చోవచ్చు" అనేసి తలుపు దగ్గరికి లాగేసి మాయమయాడు.

ఇక అక్కడ కూర్చున్నా ఒరిగేదేమీ లేదు - కబుర్లు చెప్పుకోవడం తప్ప. అయినా మమ్మల్ని మాట్లాడనివ్వలేదు ముసిలావిడ. "నీకేమవుతుంది ఈ బొట్టి?" అంది. ఏమీ కాదన్నాను.

"అయితే నువ్విక్కడ కూర్చోవడం తప్పుకదా?"

కొందరికి లేని చొరవ ఉంటుంది. ఎక్కువగా తమిళులకి అది జన్మహక్కు. రోడ్డుమీద సైకిలు మీద వెళ్తున్నవాడు పార్కులో పువ్వులు కోస్తూంటే గుర్రుగా చూస్తాడు సైకిలు ఆపి. Righteous monitering మంచి జబ్బే. అది జాతికంతా ఉంటే వ్యవస్థ సంస్కారం. కొందరికే ఉంటే అది వ్యక్తి వికారంగా సరిపెట్టుకుంటాం.

లేచాను. చినపాపకూడా నిరుత్సాహపడినట్టు తెలుస్తోంది. అయినా చేసేదేమీలేదు. వెళ్తున్న నన్ను చూసి "గంటలో రా. భోజనం చేద్దాం" అంది. ఇది అతి చిన్న సౌకర్యం.

కాలుకాలిన పిల్లిలాగా కంపార్టుమెంటు అంతా తిరిగాను. అప్పటికి నా జేబులో నలభై రూపాయలు ఉంటే వెదికి పట్టుకుని టీటీయీకి సమర్పించేవాడిని. అది నా శక్తికి మించిన పైకం అప్పటికి. బెర్తు మీద కూర్చున్నాను. శరీరం అలసిపోయినప్పుడూ, మనస్సు అలసిపోయినప్పుడూ ఓ ఆటవిడుపు ఉంది - నిద్ర. నాకు తెలియకుండానే నిద్రపట్టేసింది. ఉన్నట్టుండి ఎవరో భుజం మీద చెయ్యివేస్తే తుళ్ళిపడి లేచాను. చీకటి పడింది. చేతిలో భోజనం పాకెట్‌తో వచ్చి నా పక్కన కూర్చుంది. అప్పటికి కంపార్టుమెంటులో ఉన్న నలుగుతూ నిద్రపోతున్నారు. నా పక్కన కూర్చుంది.

'నువ్వొస్తావేమోనని ఎదురు చూశాను' అంటూ.

"ఆ ముసలి దెయ్యం?"

"ఇంకా పడుకోలేదు. 'నాకేం భయంలేదు. హాయిగా పడుకో' మంటోంది. తనకి రాత్రుళ్ళు నిద్ర సరిగా పట్టదట."

నిరుత్సాహం గుండెలకి ఎగదన్నింది. ఆమె స్వయంగా పాకెట్‌లోంచి అన్నం నోటికి అందించింది. ఆకలి లేదు. అయినా నోరు తెరిచాను.

నా కళ్ళల్లో నిరుత్సాహం ఆమెకి అర్థమవుతోంది. ఆ క్షణంలో అర్థం చేసుకున్న అమ్మ అయింది. లేచి వెళ్తున్న ఆమె చీర పట్టుకుని ఆపాను. వెనక్కి తిరిగి ఎంగిలి పెదాలను ముద్దు పెట్టుకుని వెళ్ళిపోయింది.

అంతే ఆ రాత్రి కథ.

గుంటూరు రైల్వే స్టేషన్లో తుళ్ళిపడి లేచాను. అప్పటికే రైలు ఆగి చాలా సేపయినట్టుంది. హడావుడిగా కంపార్టుమెంటు దిగాను. ఎక్కడ చినపాప? చుట్టూ తప్పిపోయిన పసివాడిలాగా కళ్ళు వెదికాయి. అప్పుడు కనిపించింది ఎదుటి ప్లాట్‌ఫారం మీద నాదృష్టిని పడడానికి ఎదురుచూస్తోంది. నేను చూడగానే చెయ్యి ఊపింది.

స్టేషన్లో నన్ను లేపలేదేం? వెళ్తున్నట్టు చెప్పలేదేం? ఇంత సులువా విడిపోవడం? అటుపక్క ప్లాట్‌ఫారం మీద డూప్లికేట్ రైలు ఉంది. నాలుగడుగులు వేశాక జనం మధ్య కలిసిపోయింది చినపాప. మరి కనిపించలేదు.